
ఆంధ్రప్రదేశ్

ఆగస్టు 1971 ప్రత్యేక సంచిక 50 పైసలు





ఆంధ్ర ప్రదేశ్

ఆగస్టు, 1971

(శ్రావణం-భాద్రపదం 1893 శా. శ)

సచిత్ర మాస పత్రిక

సంపుటి: 15 సంచిక: 7

ప్రధాన సంపాదకులు : **పెండ్యాల వామనరావు**

సంపాదకులు : **కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి**

ముఖచిత్రం:
ఆగను పదిహేను

రెండో అట్ట:
నిర్మల్ చిత్రకళ

చివరి అట్ట:
ప్రాణిలోకంలో ప్రారంభ జీవితం

వెల : 50 పైసలు

సాలు చందా: 6 రూపాయలు

రిజిస్టర్డ్ నెం. 133

ఈ సంచికలో

పేజీ

వీర బంగ్లా దేశ్

మానవ చరిత్రలో కనీ వినీ ఎరుగని మిలిటరీ రాక్షస దౌర్జన్య చర్యలకు గురి అయిన ఒక జాతి ప్రజల ధైర్య సాహసాలకూ, స్వాతంత్ర్య దీక్షకూ పర్యాయపదంగా భాసిస్తున్నది నేడు వీర "బంగ్లాదేశ్". అమానుష సైనిక పైశాచిక శక్తులకు ఎదురొడ్డి నిలిచిన ఆ దేశ ప్రజల ధైర్య సాహసాలు ప్రాచ్య పాశ్చాత్య దేశాలలోని యావత్ ప్రజల, పత్రికల ప్రశంసల నందుకున్నవి. ఆధునిక ఆయుధ సంపన్నమైన సైనిక శక్తులు అతికౄర విధానాలను అమలు పరచి ప్రజాభీష్టాన్ని అణచివేసే ఉద్దేశంతో తలపెట్టిన అమానుష చర్యలను బట్టబయలు చేయడంలో పత్రికా ప్రపంచం ప్రధాన పాత్ర వహించింది. సుమారు కోటి మంది ప్రజలను వేశతో పెళగించిన యింతటి ఘోర దారుణం మానవ జాతి చరిత్రలో "అపూర్వము".

ఇటీవల మన ముఖ్య మంత్రి ఒక ఆకాశవాణి జాతీయ కార్యక్రమ ప్రసంగంలో ప్రస్తావించినట్లు మన ఆర్థిక వ్యవస్థకూ, ప్రణాళికా పథకాలకూ కలిగే కష్ట నష్టాలను కూడా లెక్క చేయకుండా భారత ప్రభుత్వం మానవ కారుణ్య దృక్పథంతో, హృదయ పూర్వకంగా బంగ్లాదేశ్ శరణార్థులను ఆదుకుంటున్నది. "అయినప్పటికీ శాశ్వత స్థాయిలో యీ శరణార్థులందరికీ మన దేశంలో ఆశ్రయం యివ్వడం సాధ్యం కాదు. విశాల హృదయంతో, దీక్షతో, పట్టుదలతో యీ సవాలును ఎదుర్కొనడం తప్ప మరో మార్గం మన దేశానికి లేదు. ఈ విధంగా ఆశ్రయం యివ్వడమే భారతీయ సంస్కృతి ప్రధాన లక్షణం" అని కూడా ముఖ్యమంత్రి పేర్కొన్నారు.


భారత దేశ భుజ స్కంధాల మీద నేడు పడిన భారం అపారం. ఏ మాత్రం తప్పటడుగు వేసినా పరిస్థితి విషమించేటట్లున్న యీ సమస్యా పరిష్కారంలో జాగ్రత్తగా, అప్రమత్తమైన విధానాలను అనుసరిస్తున్న ఘనత మన ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరా గాంధీకి దక్కుతుంది. ఆమె విధానాలకు దేశ ప్రజల, అనేక ప్రపంచ దేశాల ఆమోదం లభించింది. బంగ్లాదేశ్‌లో పరిస్థితులు కుదుట బడి, గౌరవనీయమైన రాజకీయ పరిష్కారం కుదిరి, శరణార్థులు తమ యిండ్లకు తిరిగి వెళ్ళే లోగా, ప్రస్తుతానికి భారత సరిహద్దుకు ఆనుకుని వున్న బంగ్లాదేశ్ భూభాగంలో, అంతర్జాతీయ ఆధ్వర్యంలో శరణార్థులకు పునరావాసం కల్పించడానికై కొన్ని ప్రాంతాలు నిర్దేశించవలసిందిగా ప్రపంచ ప్రజాభిప్రాయం ద్వారా, ముఖ్యంగా అగ్రరాజ్యాల ద్వారా పాకిస్తాన్ మీద ఒత్తిడి తేగలిగితేనే మన భారం కొంత వరకు తగ్గుతుందని ముఖ్య మంత్రి సూచించారు. కాని యిది అనుకున్నంత తొందరగా అయ్యే పనిగా కనిపించడం లేదు. అదైనా మిత్రరాజ్య సమితీ, యింకా యితర అంతరాతీయ సంస్థల ద్వారా భారీ ఎత్తున సహాయం అందితేనే గాని సాధ్యం కాదు.

ప్రపంచ ప్రజాభిప్రాయం పొంగు లెత్తి, బంగ్లాదేశ్‌లో పాకిస్తాన్ అనుసరిస్తున్న మూక ఉమ్మడి హత్యాకాండ విధానాన్ని విడనాడుకునేట్లు చేయడం, జనరల్ యాహ్యాఖాన్ ప్రభుత్వమే ఏర్పాటు చేసిన ఎన్నికల్లో గెలుపొందిన ప్రజా ప్రతినిధులకు అధికారం అప్పగించేటట్లు చేయడం జరుగక పోయినప్పటికీ, ప్రపంచ పౌరులలో వివేకోదయం కలిగించి, వారు న్యాయం వైపు, సత్యం వైపు మొగ్గేట్లు చేయగలిగింది.

ఈ సమస్య తీవ్రతను గుర్తించడం ప్రతి భారతీయుని కర్తవ్యం; ఇది చాల పెద్ద సమస్య మన జాతి శ్రేయస్సుకూ, ఆత్మగౌరవానికీ అనుగుణంగా దీనిని ధైర్యంగా ఎదుర్కోవడంలో ప్రజలందరూ సహకరించడం ధర్మం. మానవ జాతి కోసం, మానవతా దృక్పథం కోసం మనం పెద్ద పెద్ద త్యాగాలు చేయవలసి రావచ్చు. ప్రవాహంగా వచ్చి పడుతున్న శరణార్థులను ఆటంక పరచడానికి సరిహద్దు పొడవునా అడ్డు గోడలు నిర్మించడం సాధ్యమా? ఇళ్లూ, వాకిళ్లూ వదలి పెట్టి మిలిటరీ దౌర్జన్యానికి గురియై ప్రాణ భీతితో పరుగెత్తుకు వస్తున్న శరణార్థుల మానవ మహాసముద్ర తరంగాలను చేతులు అడ్డు పెట్టి ఆపగలమా? బలవంతాన వారిని వెనుక్కు నెట్టి వేయడం న్యాయమేనా? ఏ వైపు నుండి వచ్చే వారికైనా అత్యంత ఆదరణతో ఆతిథ్యమిచ్చే భారత దేశం—యిటీవల చైనా బెడద పడలేక టిబెట్ నుండి కూడా శరణార్థులు వచ్చారు—ప్రస్తుత పరిస్థితుల్లో ఇంత కంటే అధికము చేయడం సాధ్యం కాక పోవచ్చు.

ఆగస్టు నెల పేరు వినగానే త్యాగాలూ, స్వాతంత్ర్యమూ మరియు ఆశావహమైన భవిష్యత్తూ జ్ఞాపకానికి వస్తాయి. అలాగే యీ ఆగస్టు నెల, యుద్ధంతో సతమత మవుతున్న బంగ్లాదేశానికి శాంతి పరిస్థితులనూ, స్వాతంత్ర్య వీరులకు విజయాన్నీ ప్రసాదించు గాక!

— పి. వి. ఆర్.



ఆర్థిక, సాంఘిక వ్యత్యాసాల తొలగింపు

కలెక్టర్ల సమావేశంలో గవర్నరు ఉద్బోధ


జూలై 9వ తేదీన హైదరాబాదులో జరిగిన జిల్లా లెక్టర్ల సమావేశంలో ప్రారంభోపన్యాసంచేస్తూ, ఆంధ్రప్రదేశ్ గవర్నరు శ్రీ ఖండుభాయ్ దేశాయ్ యిలా అన్నారు.

జిల్లాకలెక్టర్ల సమావేశానికి ప్రారంభోత్సవం చేయడం యిది నాకు రెండవసారి. మళ్ళీ మరొకసారి మీమధ్యకు రావడం నాకు చాలా సంతోషంగా వుంది. మొదటిసారి మనం కలుసుకున్న తర్వాత నేను అనేక జిల్లాలను పర్యటించాను. అక్కడ జిల్లాకలెక్టర్లు, వారి సహచరులు చేస్తున్న కృషిని గురించి తెలుసుకొనే అవకాశం నాకు కలిగింది. గత కొన్నేళ్ళుగా మన రాష్ట్రం తుఫానులు, వరదలు ఒకదాని తర్వాత ఒకటి వచ్చి చాలా యిబ్బందులకు గురైంది. అలాటి సందర్భంలో యీవిపత్తును తగువిధంగా ఎదుర్కోవడంలో జిల్లా కలెక్టర్లు, వారి అధికార్ల బృందాలు అమోఘంగా పనిచేసిన తీరు చూసి నిజంగా నాకెంతో గర్వంగా వుంది. అనుకోకుండా వచ్చిపడ్డ యీ ప్రకృతి వైపరీత్యాలకు గురైన బాధితులకు తగుసమయంలో సహాయపడడంలో జిల్లాకలెక్టర్లూ, వారి సిబ్బందీ ఎంతో చొరవను ప్రదర్శించి సహాయ కార్యక్రమాలకు అంకితమై పనిచేయడమేగాక ఆ బాధితులకు శాశ్వత పునరావాస సౌకర్యాలను కల్పించేందుకు కూడా దీక్షతో కృషిచేయడం నిజంగా అభినందించదగ్గది. రాష్ట్రంలో, ముఖ్యంగా కొన్ని ప్రాంతాలలో, అప్పుడప్పుడు శాంతిభద్రతలకు ముప్పు వాటిల్లిన సందర్భాలలో కూడా మన జిల్లా యంత్రాంగం వాటివి సమర్థవంతంగా అదుపులోకి తేవడం మెచ్చుకోదగ్గది. ఇటీవలి పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగానూ, క్రమబద్ధంగానూ జరిగాయంటే, జనాభా లెక్కల సేకరణ విజయవంతంగా ముగిసిందంటే యిందుకు చాలా వరకు జిల్లా కలెక్టర్లు, వారి సహచరులే కారణం.

దేశంలో ఆదర్శవంతమైన ప్రజాస్వామ్య సంక్షేమ రాజ్యాన్ని నెలకొల్పుకోవాలని మనం లక్షించాం. జాతి ఉద్దేశించిన ఈ లక్ష్యాలను రాష్ట్రపరిపాలనా యంత్రాంగం వాస్తవ రూపకల్పన చేస్తేతప్ప ప్రజాస్వామ్యం మనలేదు. సంక్షేమరాజ్యం సుస్థిరం కాలేదు. ఇదే, పరిపాలనా యంత్రాంగం ప్రథమకర్తవ్యం. ఈ కర్తవ్య నిర్వహణలో జిల్లా కలెక్టర్లు ప్రముఖపాత్ర వహించవలసి వుంది.

అభివృద్ధి స్థాయిని పెంచడమేకాక దానితోపాటు సమాజంలో ఆర్థికంగా, సాంఘికంగావున్న వ్యత్యాసాల్ని తొలిగించేందుకు కూడా కృషిచేయడం అవసరమని గత రెండు దాశాబ్దాల మన అనుభవం తెలియజేస్తున్నది. మన సమాజంలోని బలహీన వర్గాలకు ప్రత్యేకంగా లాభించే కార్యక్రమాలను ఎక్కువగా చేపట్టాల్సిన అవసరం గత కొలది నెలలుగా మరింత ఎక్కువగా గుర్తించబడింది. ఈ వర్గాలవారికి సహాయం చేయాలనే లక్ష్యం యొక్క ప్రాధాన్యాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటూ, మన కార్యక్రమాలన్నిటి మీద యీ లక్ష్యప్రభావం పడడం చాలా అవసరం.

పరిపాలనా కార్యక్రమాలలో జరుగుతున్న జాప్యాన్నిగురించి తరచుగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ జాప్యాలను తొలగించడానికి, అవసరమైన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ కార్యాలయాలు అత్యవసర సమయాలలో తప్ప మిగతా సమయాలలో మందకొడిగా పనిచేస్తాయనే భావం ప్రజలలో నాటుకుపోయింది. ఈభావాన్ని శాశ్వతంగా రూపుమాపివేయాలి.



బలహీన వర్గాలవారికి ప్రభుత్వ సహాయం

కాసు బ్రహ్మానందరెడ్డి

రాజకీయ స్వాతంత్ర్యం ఆర్థిక స్వాతంత్ర్యానికీ, న్యాయ సమ్మతమైన సమాజ స్థాపనకూ మార్గదర్శకం కావాలి. భారత దేశం స్వాతంత్ర్యం సంపాదించినప్పటినుంచీ సామాన్యుల జీవన స్థితిగతులను మెరుగుపరచడానికి కృషి జరుగుతూనే వున్నప్పటికీ సమాజంలోని బలహీన వర్గాల సంక్షేమానికి తీసుకొనేచర్యలను మరింత ఎక్కువగానూ, శీఘ్రంగానూ అమలుపరచేందుకు ఇటీవలే అత్యధిక ప్రాధాన్యం యివ్వబడింది. సమాజంలోని అట్టడుగు ప్రజానీకం అభ్యుదయానికి మన రాజ్యాంగం అంకితమై వున్నందువల్లా, సోషలిస్టు సమాజాన్ని స్థాపించుకోవాలని మనం లక్ష్యాన్ని పెట్టుకోవడంవల్లా మన సమాజంలోని బలహీనవర్గాల సంక్షేమానికి తగు చర్యలు తీసుకోవలసిన గురుతర బాధ్యత ప్రభుత్వంమీద మరింత ఎక్కువయింది.

ఆంధ్రప్రదేశ్‌లో గడచిన రెండేళ్ళలోనూ అనేక ముఖ్యమైన చర్యల్ని తీసుకోవడం జరిగింది. ప్రభుత్వ భూములను షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులవారికి ప్రాధాన్యం యిచ్చే పద్ధతిలో భూములులేనివారికి పంపిణీచేసే తీవ్రతర కార్యక్రమం అమలు జరిగింది. ఈ కార్యక్రమంక్రింద సుమారు ఒక ఏడాది కాలంలో పది లక్షల ఎకరాల్ని పంపిణీ చేశారు (దీనితో మొత్తం మన రాష్ట్రంలో భూముల్లేని బీదలకు పంపిణీఅయిన భూమి ఇరవై లక్షల ఎకరాలకు పెరిగింది) ఇదేలక్ష్యంతో తీసుకున్న యితర చర్యలు–భూకమతాల గరిష్ట పరిమితి విషయంలో యిచ్చిన మినహాయింపులను తొలగించడం, కౌలుదారీ చట్టంక్రింద కౌలురేట్లను బాగా తగ్గించడం, గిరిజన కార్యక్రమాలకు ప్రణాళికలో పదింతలు ఎక్కువ కేటాయించడం, హరిజనుల సంక్షేమానికి ప్రణాళికా కేటాయింపులను అయిదు రెట్లు ఎక్కువ చేయడం, కొన్ని గిరిజన ప్రాంతాల అభివృద్ధికిగాను ఏటా రు. 1.5 కోట్ల ఖర్చుకాగల ఒక బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టడం, అత్యధిక సంఖ్యలో ఆశ్రమ పాఠశాలల్ని నెలకొల్పడం, గిరిజన ప్రాంతాల్లోనూ, మురికివాడల్లోనూ వున్న పిల్లలకు పౌష్ఠికాహారాన్ని అందజేసే పథకాన్ని తీవ్ర కార్యక్రమంగా విజయవంతంగా అమలుపరచడం మొదలగునవి.

గిరిజన ప్రజల హక్కుల రక్షణ

గిరిజన ప్రాంతాలలో గిరిజనుల, గిరిజనేతరుల అధీనంలో వున్న భూములను గిరిజనేతరులకు బదిలీ చేయడం పూర్తిగా నిషేధిస్తూ చట్టబద్ధమైన గట్టి రక్షణ చర్యలను కూడా ప్రభుత్వం తీసుకుంది. అలాగే గిరిజనేతరుల అధీనంలోవున్న భూమి న్యాయశాస్త్ర రీత్యా తమదేనని ఋజువు చేసుకునే బాధ్యత కూడా వారికి కల్పించబడింది. ఋణ విమోచన చట్టం ఒకటి ప్రవేశపెట్టబడింది. దీనిక్రింద ప్రస్తుతంవున్న ఋణాలమొత్తం మొదట్లో తీసుకున్న అసలు మొత్తానికి తగ్గిస్తారు. వడ్డీ ప్రసక్తే వుండదు. ఆ తగ్గించిన ఋణాన్ని తిరిగి చెల్లించి వేయడానికి రెండేళ్ళ గడువు లభిస్తుంది. గిరిజన రైతులకు 1970–71లో యాభై లక్షల రూపాయల మేరకు గిరిజన సహకార కార్పొరేషన్ స్వల్పకాలిక ఋణాలను మంజూరు చేసింది. గిరిజన రైతులకు, హరిజన రైతులకు భూమి తనఖా బ్యాంకులు భూమి అభివృద్ధి ఋణాలను మంజూరు చేయడానికి వీలుగా ఆ బ్యాంకులకు హామీ యివ్వబడింది.

ఋణాలకు సంబంధించి మరో ముఖ్యమైన విజయాన్ని సాధించాం. రాష్ట్ర సహకార సంఘాల చట్టాన్ని సవరించడంద్వారా ప్రాథమిక పరపతి సంఘాలు యిచ్చే మొత్తం ఋణంలో సన్నకారు రైతుల ప్రయోజనాలకై కొంత శాతాన్ని ప్రత్యేకించేందుకు ప్రభుత్వానికి అధికారం లభించింది. దీని క్రింద మొత్తం ఋణంలో 90 శాతం చిన్నరైతుల ప్రయోజనాలకు ప్రత్యేకించాలని సంకల్పం. ఈ ఏడాది అంటే 1971–72 లో– అనేక కొత్త పథకాలను ప్రవేశపెట్టాలని అనుకుంటున్నాం. రు. 2 కోట్ల ఖర్చుతో ఇళ్ళ

స్థలాల పంపిణీకి సంబంధించిన తీవ్రతర కార్యక్రమం యిందులో ఒకటి. ఎల్. ఐ. సి సహకారంతో డబ్బైవేల కుటుంబాలకు లాభించే విధంగా 12 కోట్ల రూపాయల ఖర్చుతో కూడిన బృహత్తర గృహనిర్మాణ కార్యక్రమం—మరొకటి

ప్రత్యేక శ్రద్ధ

ఇంతవరకూ సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు ఎక్కువగా షెడ్యూలు కులాలవారికీ, షెడ్యూలు జాతులవారికీ పరిమితమౌతూ వచ్చాయి. ఉద్యోగాలు, ఆర్థిక అభివృద్ధి, విద్య మొదలగు విషయాలలో ప్రత్యేక సౌకర్యాలను గురించి రాజ్యాంగంలో పేర్కొనబడిన హక్కుగల యీ షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులవారేగాక మనం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవలసినవారు యింకా కొందరు కూడా వున్నారు. అటువంటివారిలో ముందుగా చెప్పుకోవలసినవారు, వూరూరా తిరిగే దేశద్రిమ్మరి వలస జాతులవారు వీరి ఆర్థిక స్థితిగతులూ, సంఘంలో వీరి స్థానమూ షెడ్యూలు జాతులవారికంటె మెరుగుగా లేదు.

ఇంతేగాక మత్స్యపారిశ్రామికులు, రాళ్ళు కొట్టేవారు, చేనేతపనివారు యింకా రకరకాల గ్రామీణ వృత్తిపనివారూ, ఆర్థికంగా వెనుకబడిన వృత్తులకు చెందిన వర్గాలవారూ సమాజంలో వున్నారు ఇటువంటి వారి ప్రత్యేక అవసరాలను తీర్చవలసివుంది. మన రాష్ట్రంలో యిటువంటివారు లైసెన్సుఫీజులు, వృత్తిపన్నులు కట్టనక్కరలేకుండా మినహాయించడం జరిగింది. మనం చేపట్టే సంక్షేమకార్యక్రమాలు ఈ వర్గాల వారందరికీ కూడా వర్తించే విధంగా విస్తృతపరిస్తేనే తప్ప వీటి ఫలితాలు పాక్షికంగానే వుంటాయి. అందువల్ల యీ బలహీన వర్గాలవారిని ప్రత్యేకంగా గుర్తించి ప్రత్యేకమైన సహాయం పొందడానికి వీరు అర్హులనే విషయాన్ని నిర్ధారణ చేయడం అవసరం. అంటే సాంఘిక సంక్షేమానికి సంబంధించిన సమస్యకు పూర్తిగా కొత్త నిర్వచనం యివ్వవలసి వుంటుంది అదేవిధంగా సాంఘిక సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యకలాపాల పరిధిని కూడా కొత్తగా నిర్వచించవలసి వుంటుంది.

షెడ్యూలు జాతుల జాబితాలో కొన్ని కులాలవారిని చేర్చేందుకు ఉద్దేశించిన బిల్లు లోక్‌సభ రద్దుకావడంతో ఆగిపోయింది ఇప్పుడు మళ్ళీదాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం వుందని నా అభిప్రాయం. అంతవరకు ఆంధ్రప్రదేశ్‌లోని ఆంధ్ర ప్రాంతంలో సుగాలీలు, ఎరుకలు, బంజారాలు మొదలైన కొన్ని జాతులు షెడ్యూలు జాతులుగానే గుర్తించబడుతూ తెలంగాణా ప్రాంతంలో మాత్రం అలా గుర్తింపు లేకుండా వుండే వ్యత్యాసం తొలగిపోదు. వారి అభివృద్ధికి అంతరాయం కలుగుతూనే వుంటుంది.

వెనుకబడిన తరగతుల వారికి మన రాజ్యాంగంలో కొన్ని ప్రత్యేక సౌకర్యాలు కల్పించినప్పటికీ వీటిని అమలు పరచడంలో చాలా యిబ్బందులు వున్నట్టు మనకు అనుభవం ద్వారా తెలిసింది. మనం వెనుకబడిన తరగతుల కమిషన్‌ను ఏర్పాటుచేసుకున్నాం. ఇది మన రాష్ట్రంలో వున్న వెనుకబడిన తరగతుల జాబితాను రూపొందించింది. ఈ జాబితాలో పేర్కొనబడిన తరగతుల వారికి ఉద్యోగాలలోనూ విద్యా సంస్థలలోనూ కొన్ని సీట్లు, ఉద్యోగాలు ప్రత్యేకించ వలసిందిగా మనం ఉత్తర్వులను కూడా జారీ చేశాం. ఆ ఉత్తర్వును హైకోర్టు కొట్టి వేసింది. వెనుకబడిన తరగతుల వారికి కల్పించే సౌకర్యాలు చట్టరీత్యా కొట్టివేయడానికి వీలులేకుండా వెనుకబడిన వర్గం అంటేఏమిటి అనే విషయం నిర్ద్వంద్వంగా నిర్వచిస్తూ శాసనపరమైన చర్యతీసుకోవడం అవసరమని నాకు అనిపిస్తున్నది.

ఆంధ్రప్రదేశ్‌లో ఒక్క ఏడాదిలోనే గిరిజన సంక్షేమానికి ప్రణాళికలో పదిరెట్లు ఎక్కువా, హరిజన సంక్షేమానికి అయిదు రెట్లు ఎక్కువా కేటాయింపు జరిగింది. షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులు, తదితర వెనుకబడిన కులాల వారికి సరియైన గృహవసతి కల్పించడంకన్న ముఖ్యమైన సంక్షేమచర్య మరొకటి లేదు దీనివల్ల వారు జీవనస్థాయిని మెరుగు పరచుకోవడానికి వీలుకలగడమేగాక సాంఘిక ప్రతిపత్తికూడా పెరుగుతుంది గడచిన పదేళ్ళలోను రాష్ట్ర ప్రభుత్వం యీ వర్గాలవారికి ఇళ్ళ స్థలాల్ని కేటాయిస్తూ యీ సమస్యను కొంతవరకు పరిష్కరించడానికి ప్రయత్నించింది అయితే అలా యిచ్చిన స్థలాల్లో యిళ్ళు నిర్మించుకొనే స్తోమత చాలామందికి లేనట్టు అనుభవంవల్ల తెలియవచ్చింది. దీన్నిబట్టి ఇళ్ళస్థలాల్ని కేటాయించినవారికి, యిల్లు కట్టుకోడానికి ఆర్థిక సహాయాన్నికూడా అందజేసినప్పుడే యీ పథకాన్ని శక్తివంతంగా అమలు పరచగలం.

గృహనిర్మాణ కార్యక్రమం

అందువల్ల ఒక బృహత్తర గృహనిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది. దీనిక్రింద, జీవిత భీమా సంస్థ సహాయంతో ప్రత్యేక సహకార సంస్థల ద్వారా ఋణాలను అందజేస్తారు ఇళ్ళను నిర్మించే పని ప్రభుత్వమే ప్రభుత్వశాఖా పరంగా చేపట్టుతుంది.

తొలి సంవత్సరం 12 కోట్ల రూపాయల ఖర్చుతో 70,000 కుటుంబాలకు యీ సౌకర్యాన్ని కలిగించాలనుకుంటున్నాం. అయితే యీ వర్గాల ఆర్థికస్థితినిబట్టి ఈ గృహనిర్మాణ పథకంలో చాలా భాగం సబ్సిడీ పద్ధతిలో అందజేయడం అవసరం అవుతుంది. భారతప్రభుత్వం అఖిల భారతస్థాయిలో యీ వర్గాల సంక్షేమానికి బృహత్తర గృహనిర్మాణ కార్యక్రమాన్ని పెద్దఎత్తున ప్రవేశపెట్టే విధానం అనుసరిస్తే తప్ప ఇది సాధ్యంకాదు.

షెడ్యూలు ప్రాంతాలను వెనువెంటనే అభివృద్ధిపరచే ఒక బృహత్తర కార్యక్రమం కూడా చాలా అవసరం. ఈ విషయాన్ని దృష్టిలో వుంచుకుని ఏటా సుమారు రూ. 16 కోట్ల ఖర్చుతో కూడిన అభివృద్ధి కార్యక్రమాన్నొకదానిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించింది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా, వ్యవసాయ రిఫైనాన్స్ కార్పొరేషన్, జీవితభీమా సంస్థ, జాతీయం చేయబడిన బ్యాంకులు మొదలైన వాటితో సహా అనుమతింపబడిన అన్ని పరపతి సంస్థలూ ఋణ సహాయాన్ని కల్పించడంలో బలహీన వర్గాలవారికి

ప్రాధాన్యాన్నిచ్చే నిశ్చితమైన విధానాన్నొకదానిని రూపొందించి అమలు పరచడం చాలా అవసరం. ఈ వర్గాలవారికి యిచ్చే ప్రాధాన్యత రెండురకాలుగా వుండాలి. ఒకటి–నిధుల్ని ప్రత్యేకించడం రెండు–వడ్డీరేటును తక్కువ చేయడం.

ఇండ్ల స్థలాలు

షెడ్యూలు కులాలు, షెడ్యూలు తరగతులవారి సంక్షేమానికై ప్రభుత్వం తీసుకున్న మరొకచర్య ఏమిటంటే వారికి ఉచితంగా యిళ్ళస్థలాల్ని మంజూరు చేయడం. దీనివల్ల హరిజనవాడల్లో అపరిశుభ్ర పరిస్థితులను, మురికి వాతావరణాన్ని నిర్మూలించడానికి వీలవుతుంది. ఏడాదికి 3,500 రూపాయలు మించని ఆదాయంగల ప్రతి హరిజన కుటుంబానికి 5 సెంట్లు చొప్పున ఇళ్ళ స్థలాల్ని మంజూరు చేయవచ్చు. వీటిని మంజూరు చేయడంలో జరుగుతున్న ఆలస్యాన్ని, నిర్వహణలో ఆటంకాలనూ తొలగించేందుకై ఇటీవలే ప్రభుత్వం ఒక శీఘ్రతర కార్యక్రమాన్ని ప్రకటించింది. ఇందులో, వ్యక్తిగతంగా ఆసాములతో బేరంచేసి 10 వేల రూపాయలమేరకు మాగాణీ భూముల్నీ, 5 వేల రూపాయలమేరకు మెట్ట భూములను సేకరించడానికి ఏర్పాటు చేయబడింది.

హరిజనులకు ఇళ్ళ స్థలాల్ని పంపిణీ చేయడానికై 1960–61 లో రూ. 8.75 లక్షల ఖర్చుతో చిన్న ఎత్తున ప్రారంభించబడిన కార్యక్రమం 1970–71 లో రూ. 86 లక్షల ఖర్చుఅయ్యే బృహత్తర కార్యక్రమంగా మారింది. ఇళ్ళ స్థలాల పంపిణీకై ప్రభుత్వం ప్రారంభించిన ప్రత్యేక క్రాష్‌ప్రోగ్రాంలో ఒక భాగం–అక్రమంగా ప్రభుత్వ భూములను ఆక్రమించిన ధనవంతులు, భూస్వాములవద్ద నుండి ఆ భూములను తిరిగి తీసుకోవడం. ఇంతవరకు యీ విధంగా తీసుకున్న భూములు లక్ష ఎకరాలు వున్నాయి. భూములు లేని బీదవారికి పంపిణీ చేయడానికి యివి పనికి వచ్చాయి. వచ్చే కొద్ది నెలల్లోనే యీ విధమైన అక్రమ ఆక్రమణ దారుల నుండి భూములను తీసుకొనే కార్యక్రమం పూర్తవుతుంది.

భూకమతాలు

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ కమతాలపై పరిమితిని విధించే చట్టం 1961 లో ప్రవేశపెట్టబడింది. అప్పుడు చేయబడిన ఆ చట్టంలో పళ్ళ తోటలు, పశువులు మేత మేసే పొలాలు, పంచదార మిల్లుల క్రింద వున్న చెఱకు తోటలు మొదలైన కొన్ని భూములకు యీ చట్టం వర్తించకుండా మినహాయించడమైంది. ఆ తర్వాత 1970 ఆఖర్లో మరోసారి రాష్ట్ర ప్రభుత్వం యీ విషయాన్ని పరిశీలించి యీ మినహాయింపులను యించుమించు పూర్తిగా తొలగిస్తూ చట్టాన్ని సవరించింది. దీని ఫలితంగా, భూములులేని బీద ప్రజానీకానికి పంపిణీ చేసేందుకై పెద్ద మొత్తంలో భూమి లభిస్తుందని ప్రభుత్వం భావిస్తున్నది. ఎక్కువగావున్న భూములను పంపిణీచేసే విషయంలో ముందుగా షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులవారికి ప్రాధాన్యం యివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిశ్చయించింది.

మన రాష్ట్రంలోని ఆంధ్ర ప్రాంతంలో 1956 నుంచి అమలులోవున్న కౌలుదారీ చట్టంవల్ల నికరోత్పత్తిలో 50–శాతం గరిష్ఠ రేటువరకు కౌలు వసూలు చేయడానికి వీలయ్యేది. 1970 లో ప్రభుత్వం యీ చట్టాన్ని సవరించి యీ రేట్లను 25–30 శాతానికి తగ్గించింది. ప్రస్తుతం దీనికి రాష్ట్రపతి ఆమోదం రావలసివుంది. ఈ సవరణవల్ల బీద రైతులకు కౌలు భారం చాలావరకు తగ్గుతుంది. కౌలుదార్లకు యీ చట్టం సౌకర్యాలను సాధ్యమైనంత విశాల పరిధిలో లభించడానికి వీలుగా కౌలు భూమి పరిమితిని రెండు కుటుంబ కమతాలుగా విధించేందుకు యీ చట్టం వీలు కల్పిస్తున్నది.

షెడ్యూలు ప్రాంతాల్లోనే కాకుండా యితర చోట్లవుండే గిరిజనులు, బలహీనవర్గాల ఆర్థికాభివృద్ధికి పరిమిత పరిధిలో పథకాలనుకూడా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఈపథకాలు ముఖ్యంగా కుటుంబ అవసరాలకు సంబంధించి వుంటాయి. పొలం దున్నడానికి ఎద్దుల్ని సరఫరా చేయడం, వృత్తిపనులను చేపట్టేట్టు చేయడం మొదలైన అవసరాలకు సంబంధించి యీ పథకాలు వుంటాయి.

విద్యాసంస్థలలో

రాష్ట్ర ప్రభుత్వ విద్యా సంస్థలన్నిటిలోనూ షెడ్యూలు కులాలవారికి 14 శాతం, షెడ్యూలు జాతులవారికి 4 శాతం సీట్లు ప్రత్యేకించబడ్డాయి. ఇతర వెనుకబడిన కులాలవారికి 25 శాతం సీట్లను కేటాయించాలని ఉత్తర్వులనుకూడా యివ్వడం జరిగింది. ఈ వర్గాలకుచెందిన విద్యార్థులందరికి ప్రాథమిక విద్యాస్థాయిలోనూ, సెకండరీ విద్యా స్థాయిలోనూ ఫీజు చెల్లించనక్కరలేకుండా మినహాయించడమైంది. విశ్వ విద్యాలయ స్థాయిలోకూడా వార్షికాదాయం 3,600 కు మించని కుటుంబాలకు చెందిన షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతుల విద్యార్థులకు పూర్తి మినహాయింపు సౌకర్యం వుంది. మెట్రిక్యులేషన్‌కుముందు, ఆ తర్వాత స్థాయిలలో కూడా షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులు మొదలైన విద్యార్థులకు ఉపకార వేతనాలు యివ్వబడుతున్నాయి. 1970–71 లో యీ పథకాలక్రింద రూ. 2 24 కోట్ల రూపాయల ఖర్చుతో 1,64,180 మంది విద్యార్థులకు యీ విధమైన సౌకర్యం కల్పించబడింది.

వసతిగృహాలు

షెడ్యూలు కులాలు, షెడ్యూలు తరగతులు మొదలైన వర్గాల విద్యార్థుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహాలను నెలకొల్పి, నిర్వహిస్తున్నది వీటిలో యీ వర్గాల విద్యార్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పించబడుతున్నాయి. ఈ విధమైన వసతి గృహాలు యిప్పటికి 583 వరకు వున్నాయి. వీటిలో 27,000 మంది విద్యార్థులు వుంటున్నారు. ఇదికాక రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్లను యిచ్చి 1,305 ప్రయివేటు వసతి గృహాలకు సహాయపడుతున్నది. వీటిలో 55,000 మందికి పైగా విద్యార్థులు వుంటున్నారు.

ఆశ్రమ పాఠశాలలు

గిరిజన ప్రాంతాలలో ఆశ్రమ పాఠశాలల్ని నెలకొల్పడం ప్రత్యేకించి చెప్పుకోవాలి. అక్కడేవుండి చదువునే ఈ రకమైన పాఠశాలలు గిరిజనుల్ని బాగా ఆకర్షించాయి. ఈ పాఠశాలల్లో మామూలు పాఠ్యాంశాలతోపాటు వ్యవసాయానికి సంబంధించిన వృత్తులు, నేత, వడ్రంగం మొదలైన విషయాలనుకూడా ప్రత్యేకంగా నేర్పుతారు. విద్యార్థులకు పుస్తకాలు, పలకలు మొదలైన వాటితోపాటు ఆహారం, వస్త్రాలుకూడా ఉచితంగా యిస్తారు. విద్యార్థుల్ని అప్పుడప్పుడు విహారయాత్రలకు తీసుకు వెళ్తారు. ఇందుకుకూడా యీ బడ్జెటులో కేటాయింపు వుంది. ఇప్పుడు 112 ఆశ్రమ పాఠశాలలు వున్నాయి. వీటిలో 35 పాఠశాలల్ని 1970–71లో స్థాపించారు. 6 వేలమంది విద్యార్థులు వీటిలో వుంటున్నారు. ముందుముందు యింకా ఎక్కువ ఆశ్రమ పాఠశాలల్ని ప్రభుత్వం నెలకొల్పదలచింది. సాంఘిక సంక్షేమ శాఖ కూడా హరిజన వాడలలో 500 లకు పైగా ప్రాథమిక పాఠశాలల్ని నడుపుతున్నది.

పౌష్టికాహారం

1970 కేంద్ర పౌష్టికాహారం 'శీఘ్రతర' కార్యక్రమాన్ని ప్రారంభించడం నిజంగా పిల్లల పౌష్టికాహార కార్యక్రమంలో ప్రత్యేకించి చెప్పుకోదగ్గది. ఈ కార్యక్రమం క్రింద మూడేళ్ళలోపు గిరిజన పిల్లలకు, మురికివాడల్లోని పిల్లలకు పౌష్టికాహారాన్ని అందజేస్తారు. ఈ కార్యక్రమం క్రింద ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన ప్రాంతాలలో 16,300 పిల్లలకు, మురికివాడలలో 25,750 మంది పిల్లలకు పౌష్టికాహారాన్ని అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 1970–71 సంవత్సరాంతానికి గిరిజన ప్రాంతాలలో 40,000 మంది పిల్లలకు, మురికి వాడలలో 39,000 పిల్లలకు యీ కార్యక్రమాన్ని వర్తింప జేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోగల గిరిజన ప్రాంతాలలో యిప్పుడు మొత్తం 590 ఆహార కేంద్రాలు పనిచేస్తున్నాయి. మురికివాడలకు సంబంధించి యింతవరకు జంట నగరాలకు పరిమితమైవున్న యీ కార్యక్రమాన్ని యిప్పుడు విజయవాడ, గుంటూరు, కర్నూలు, వరంగల్లు పట్టణాలకుకూడా విస్తరింప చేశారు. ఈ వర్తమాన సంవత్సరంలో మరో 10 వేలమంది పిల్లలకు వర్తింపచేస్తూ గిరిజన కార్యక్రమాన్ని విస్తరింప చేయడానికి మంజూరుకూడా లభించింది.

ఏటా కోటిరూపాయలు ఖర్చు అయ్యే వృద్ధాప్యపు పింఛనుల పథకాన్నికూడా రాష్ట్రప్రభుత్వం అమలుపరుస్తున్నది. వృద్ధులకు, వికలాంగులకు ఆశ్రయ గృహాలను, అనాథ శరణాలయాలనుగూడా నడుపుతున్నది. వృత్తిపనులకు సంబంధించిన కొన్ని బలహీన వర్గాలవారికి రాష్ట్ర సహకార శాఖద్వారా సహాయ పడడానికై ఆ వర్గాలవారిని గుర్తించేందుకు యిప్పుడు ప్రత్యేక ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఇటీవల 335 మంది సభ్యులతో టాక్సీడ్రైవర్ల సహకార సంఘం నమోదయింది. వీరికి అద్దెకొనుగోలు పద్ధతిమీద టాక్సీలు యిస్తారు. నలభై నెలల్లో వాయిదాల పద్ధతిని టాక్సీ డ్రైవర్లే ఆటాక్సీల యజమానులౌతారు.

బలహీనవర్గాల సంక్షేమానికై తీసుకొనే చర్యలను, ముఖ్యంగా గత రెండేళ్ళగా మరింత శ్రమం చేస్తున్నప్పటికీ యీ సమస్య చాలా తీవ్రమైనది గనుక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, మొత్తం దేశం యావత్తు గట్టిగా కృషిచేస్తేనేతప్ప పరిష్కారం కాజాలదు. తాత్కాలిక ఆర్థిక వనరుల కేటాయింపులనుబట్టి కార్యక్రమాలను రూపొందించుకొనే రోజులు గతించేపోయాయి. ముందుముందు స్పష్టంగా కొన్నికొన్ని లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని కొంత కాలవ్యవధిలో వాటిని సాధించడానికి వీలుగా కొన్ని కార్యక్రమాలను రూపొందించి అమలుపరచడానికి ప్రయత్నించడం చాలా అవసరం. ఇందుకు కావలసిన ఆర్థిక వనరులను, నిర్వహణ వనరులను ముందుగానే సిద్ధపరుచుకోవాలి. ఇందుకు మొత్తం సాంఘిక సంక్షేమానికి సంబంధించిన సమస్యనే కొత్తదృక్పథంతో పరిశీలించవలసి వుంటుంది. ఈపనిచేయడానికి యిదే తగిన సమయం అని నా దృఢవిశ్వాసం.

సోషలిజం

సోషలిజం అనేది మంచి లక్ష్యం. నాకు తెలిసినంతవరకు సోషలిస్టు వ్యవస్థలో సమాజంలోని వారందరూ సమానులే. ఒకరు ఎక్కువా కాదు, మరొకరు తక్కువా కాదు. శరీరంలో తల, పైభాగంలో వుంది. కాబట్టి ఎక్కువాకాదు, పాదాలు నేలకు తాకుతూ వుండడంవల్ల తక్కువా కాదు. శరీర అవయవాల లాగానే సమాజంలోని వ్యక్తులందరూ సమాన ప్రాధాన్యం కలవారే. అదీ సోషలిజం అంటే.

— మహాత్మాగాంధీ

జాతీయ విస్తరణ సేవాపథకమునుండి ...

... పంచాయతీ రాజ్యంవరకు

వి. రాధాకృష్ణమూర్తి

రెండు వందల సంవత్సరములపాటు పరదాస్య శృంఖలాల్లో బానిసలుగా క్రుగ్గిన మనకు, చివరకు భారతజాతిపిత, పూజ్య బాపూజీ, తదితర జాతీయ నాయకుల అఖండ దీక్ష, కృషి ఫలితముగా స్వాతంత్ర్యము లభించినది. కాని స్వాతంత్ర్యము సిద్ధించిననాటికి దేశము నలుమూలలా దారిద్ర్యము, అనారోగ్యము, అవిద్య అనే మూడు పిశాచాలు విలయతాండవము చేస్తున్నాయి. అపుడు పూజ్యబాపూజీకి; భారతజాతికి స్వాతంత్ర్యము లభించిందనే సంతోషమున్నా, జాతి అఖండ ప్రజానీకాన్ని వారి భవిష్యత్తును ఈ పిశాచాలబారినుండి ఎలా రక్షించడమా అనే జిజ్ఞాస, బాధ, ఆందోళనలే ఎక్కువైనాయి. మన దేశములో నూటికి ఎనభై వంతులు పల్లెసీమలే కాబట్టి, అచట నివసించే బీద వ్యవసాయ రైతుకుటుంబాల జీవితాలను తీర్చిదిద్దినట్లయితే భారతజాతి భవిష్యత్తే ఆనందదాయకంగా మారుతుందని కృతనిశ్చయుడైనాడు మన పూజ్య బాపూజీ. వెంటనే నిర్మాణ కార్యక్రమాన్ని తలపెట్టి, దేశం నలుమూలలనుండి అఖండ విద్యాపారంగతులు, మేధాసంపన్నులు, ధనవంతులు ఐన అనుచర బృందాన్ని, ఈ గ్రామాభ్యుదయ కదనరంగంలోనికి ఉరికించాడు. గ్రామాభ్యుదయమే దేశాభ్యుదయమని, పల్లెసీమలలోని ప్రజలు బాగుపడిననాడే దేశము సస్యశ్యామలమై కళకళలాడుతుందని దేశము నలుమూలలా చాటాడు. రామరాజ్యం నెలకొల్పాలని తలపెట్టాడు కాని మన భారతజాతి దురదృష్టం వలన, ఆయన తాను తలపెట్టిన కార్యక్రమాలు పూర్తిగా అమలుపరచక ముందే, తాను కలలుగన్న రామరాజ్యానికి ఒక నిజరూపము కల్పించకముందే కన్నుమూశాడు. ఆయన అడుగు జాడలలో నడచిన నెహ్రూజీ కూడ గ్రామాభ్యుదయమే దేశాభ్యుదయమని పల్లె ప్రజల భవిష్యత్తును తీర్చిదిద్దాలని, బద్ధ కంకణులైనారు.

1. ఫిర్కా డెవలెప్‌మెంట్ స్కీము:— మొట్టమొదటగా మన రాష్ట్రములో 1848 ప్రాంతములో ఫిర్కా డెవలెప్‌మెంట్ స్కీము అనే పేరుతో కొన్ని ప్రాంతములు యెన్నుకోబడి, ఆయా ఫిర్కాలలోని గ్రామాలలో అభ్యుదయ కార్యక్రమాలు నడపడానికి కార్యకర్తలుగా "గ్రామసేవకులు" అనే పేరుతో కొందరు జాతీయ దృక్పథంగల ఉద్యోగస్థులు నియమింపబడినారు. నాటి గ్రామ సేవకులే నేటి "గ్రామస్థాయీ కార్యకర్తలు" విలేజి లెవెల్ వర్కర్లుగా మారారు.

2. రూరల్ వెల్ఫేరు స్కీము:— ఆ పథకము అలా జరుగుతూ ఉండగా కొద్దిరోజులకు ఈ గ్రామాభ్యుదయ కార్యక్రమాన్ని పటిష్టంచేసే ఉద్దేశ్యముతో, అప్పటి మన రాష్ట్ర ముఖ్యమంత్రులయిన శ్రీ టంగుటూరి ప్రకాశము పంతులుగారు "రూరల్ వెల్ఫేర్ స్కీము" అని నెలకొల్పి రూరల్ వెల్ఫేర్ ఆఫీసర్లను, గ్రామ సేవకులను నియమించి నిజముగా చెప్పుకోదగిన గ్రామాభ్యుదయ కార్యక్రమములను ప్రవేశపెట్టారు గ్రామాలలో వయోజన విద్యా కేంద్రములు, సామాజిక కేంద్రములు, యువజన సంఘాలు నెలకొల్పబడ్డాయి. నిరాడంబరులు, నిస్వార్థపరులు అయిన గ్రామ సేవకులు గ్రామాభ్యుదయ కార్యక్రమములను చేపట్టి చెప్పుకోదగ్గ అభివృద్ధిని సాధించారు.

3 జాతీయ విస్తరణ సేవా పథకము:— National Extension Service Scheme Blocks ఇది ఇలా ఉండగా 1952వ సంవత్సరములో దేశములో ఒక మారు మూల ప్రాంతమైన "నీలఖ్హేరి" అనేచోట కాందిశీకుల పునరావాసానికిగాను శ్రీ S. K. దే గారిచే తలపెట్టబడిన పునరావాస కార్యక్రమము, క్రమేపి జాతీయ విస్తరణ సేవా పథకంగామారి, దేశంలోని కొన్ని రాష్ట్రాలలో కమ్యూనిటీ ప్రాజెక్టులు యేర్పరుపబడ్డాయి. మన రాష్ట్రములో అప్పట్లో మూడు ప్రాంతములలో కమ్యూనిటీ ప్రాజెక్టులు స్థాపింపబడ్డాయి. తదుపరి ఒక్కొక్క కమ్యూనిటీ ప్రాజెక్టు మూడు నాలుగు N.E.S. బ్లాకులుగా విభజించబడినవి. మన రాష్ట్రములో (1) కె. సి. కెనాల్ ప్రాజెక్టు (2) వాయల్పాడు ప్రాజెక్టు (3) తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడ పెద్దాపురం ప్రాజెక్టు యేర్పాటు చేయబడి, పి. ఇ. ఓ.ల అజమాయిషీ క్రింద అభివృద్ధి కార్యక్రమాలు నడుపబడ్డాయి. ఆ ప్రాజెక్టులలోనే N.E.S. బ్లాకులు యేర్పరచి B.D.O. లను ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లను, వియల్‌డబ్ల్యులను నియమించి దేశవ్యాప్తమైన కార్యక్రమాన్ని సాగించారు.

ఈ జాతీయ విస్తరణ సేవాబ్లాకులను యేర్పాటు చేయడం ఒక్కసారిగా జరుపబడలేదు. అది ఒక ఫేజ్‌డ్ ప్రోగ్రాంగా ప్రవేశపెట్టబడినది. ప్రతి సంవత్సరం ప్రతి జిల్లాలోని కొన్ని వెనుకబడిన ప్రాంతాలను యెన్నుకొని వాటిని బ్లాకులుగా మార్చారు. ఈ N.E.S. బ్లాకులను స్థాపించడానికి 100 గ్రామములుగాని 66 వేల జనాభాగాని ప్రాతిపదిగా యేర్పాటు చేయబడింది. ఒక్కొక్క బ్లాకుకు మొదట్లో 5 సంవత్సరములకు $7\frac{1}{2}$ లక్షల రూపాయల చొప్పున గ్రాంటు యివ్వబడినది. అప్పట్లో ఒక్కొక్క బ్లాకులో యీ క్రింది సిబ్బంది వుండేవారు.

1) బ్లాక్ డెవలెప్‌మెంట్ ఆఫీసర్— 1
2) వ్యవసాయ విస్తరణాధికారి— 1
3) పశుగణాభివృద్ధి విస్తరణాధికారి—1
4) ఇంజనీరింగ్ సూపర్‌వైజరు— 1
5) సాంఘిక విద్యా ప్రచారకుడు— 1
6) సాంఘిక విద్యా ప్రచారకురాలు— 1
7) సహకార విస్తరణ అధికారి— 1
8) విలేజిలెవల్ వర్కర్లు— 10

ప్రతి బ్లాకును పది గ్రూపులుగా విభజించి ఒక్కొక్క గ్రూపులో ఒక్కొక్క వి యల్ డబ్ల్యును నియమించారు. బ్లాకులో వివిధ రకములైన వ్యవసాయము, పశుపోషణ, రహదారులు, మంచినీటి బావులు, సాంఘిక విద్యా కార్యక్రమాలు, వయోజనవిద్యా కేంద్రాలు యువజన సంఘాలు, మహిళామండలులు, బాల్వాడీలు, సహకార సంఘములు నెలకొల్పబడ్డాయి. అభ్యుదయ కార్యక్రమములో గ్రామ ప్రజలు ప్రతిదానికి కొంత విరాళమునిచ్చు పద్ధతిని అమలు పరుపబడ్డాయి. ప్రజలు ప్రతి పనికి కొంత విరాళము యిచ్చినట్లయితే అది వారిపని అనే భావన వారిలో కలుగుతుందనీ ఈ కార్యక్రమాల నిర్వహణలో ప్రజలు తమ పనిని తామే చేసుకునే కొంత ఉత్సాహము, తృప్తి ఉంటుందనే ఉద్దేశంతో ఈ ప్రజావిరాళముల పద్ధతిని యేర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గూడా ప్రజలు పాల్గొనిన గ్రామాల్లో అభ్యుదయ కార్యక్రమాలు బాగానే జరుగుతూ వచ్చాయి ఈ కార్యక్రమ నిర్వహణలో ప్రజా ప్రతినిధులు గూడా బ్లాకు అభివృద్ధి సంఘాల ద్వారా ఈ కార్యక్రమ నిర్వహణలో ఉద్యోగస్థులకు సలహాలిస్తూ నడిపించారు.

4 సమాజాభివృద్ధి కేంద్రాలు:— Community Development Blocks:-- కొన్ని రోజులకు ఈ N.E.S. బ్లాకులు సమాజాభివృద్ధి బ్లాకులుగా మార్చబడ్డాయి ఆ పాటికి దేశం నలుమూలలా ఈ అభ్యుదయ కార్యక్రమాల యొక్క ఉపయోగము తెలుసుకోబడి, అన్ని రాష్ట్రాలలోను ఈ సమాజాభివృద్ధి కేంద్రాలు యేర్పాటు చేయబడ్డాయి. N.E.S. బ్లాకులకునూ, సమాజాభివృద్ధి బ్లాకులకునూ, కార్యక్రమాల నిర్వహణలో యెక్కువ మార్పులేదు ప్రభుత్వముచే కేటాయింపబడిన నిధులలో తప్ప కొన్నాళ్ళు ఒక్కొక్క బ్లాకుకు 5 సంవత్సరములకు 12 లక్షలు, తర్వాత 7 లక్షలు, తర్వాత 4 లక్షలూ ఇస్తూ వచ్చారు. తర్వాత కొలది సంవత్సరములకు ఈ సమాజాభివృద్ధి బ్లాకులను మూడు రకములుగా పరిగణించారు అవి (1) Stage I Blocks, (2) Stage II Blocks, (3) Post-Stage Blocks గా యేర్పరుపబడ్డాయి ఈ పరిగణనను బట్టి నిధుల కేటాయింపు కూడా మార్చబడింది. 1958 వ సంవత్సరమునాటికి రాష్ట్రములోని వివిధ ప్రాంతములు కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బ్లాకుల క్రింద యేర్పాటు చేయబడ్డాయి. ఇప్పటి వరకు ఈ కార్యక్రమము ఉద్యోగస్థులచే నడుపబడుతూ, ప్రజలు పాల్గొంటూ వచ్చారు.

ఈ గ్రామాభ్యుదయ కార్యక్రమములు వలపెట్టక ముందు ప్రజలకు—ఉద్యోగులకు మధ్య అంత యెక్కువ సంబంధం ఉండేది కాదు ఈ ఉద్యోగస్థులు, తమ రూల్సు ప్రకారం తమ విధులను నిర్వహించుకుంటూపోయేవారు. కాని ఈ కార్యక్రమాలు తలపెట్టిన తర్వాత, పైన జిల్లా కలెక్టరునుండి, క్రింది గ్రామస్థాయీ కార్యకర్తవరకు గ్రామాలకువెళ్ళి గ్రామప్రజల కష్ట నిష్ఠూరాలను తెలుసుకొని వారితో సంప్రదించి వారి సహాయసహకారాలతో గ్రామ ప్రజల అవసరములనుబట్టి అచటి అభివృద్ధి కార్యక్రమాలనుచేపట్టి ఆయా గ్రామాల ముఖ్య అవసరములను తీర్చడము అనేది ప్రారంభం అయినది. గ్రామాలలో వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలు, పశువైద్య కేంద్రాలు సహకార సంఘాలు, పాఠశాలా భవనములు, చెరువుల మరమ్మతులు, మంచినీటి బావుల త్రవ్వకము, విద్యావయోజన, సాంఘిక విద్యా కార్యక్రమములను, లఘుపరిశ్రమ అభివృద్ధి మొదలగు గ్రామాభ్యుదయ కార్యక్రమాలు చేపట్టబడి, ప్రజా సహకారంతో అమలు పరుపబడ్డాయి

5 ప్రజాపరిపాలనా వికేంద్రీకరణ లేక పంచాయతీరాజ్ :— 1958 వ సంవత్సరము వరకు పైన వివరించబడినట్లు ఈ గ్రామాభ్యుదయ కార్యక్రమాలన్ని ఉద్యోగస్థులచే నిర్వహించబడి, ప్రజలు పాల్గొనడంతో అమలుపరచబడ్డాయి ఈ విధమైన కార్యక్రమ నిర్వహణలో కొన్ని యిబ్బందులు కన్పించినవి ఉద్యోగస్థులు కార్యక్రమాలు నిర్వహించడము వలన ప్రజలలో ఆశించినంత ఉత్సాహము సహకారము పాల్గొనడము కనుపించలేదు. ప్రజలలో ఈ కార్యక్రమాలను గురించి విమర్శించడము యెక్కువైనది. కొందరు ఉద్యోగులలో కూడ నిరుత్సాహము బయలుదేరింది. కొందరు ప్రజలలో, తాము నిర్వహించే కార్యక్రమాలు కావుగాబట్టి, నిరుత్సాహము నైరాశ్యము యేర్పడినవి కార్యక్రమం నడక కొంత కుంటుపడింది. ఆశించిన లక్ష్యములు ఫలితములు సాధింపబడలేదు

ఆ సమయంలో, జాతీయస్థాయిలో ఈ కార్యక్రమ నిర్వహణలో బలవత్తరమైన, పటిష్ఠమైన మార్పులు తీసుకురావలయునని ఆశించబడింది ప్రజాస్వామ్యంలో అభ్యుదయ కార్యక్రమ నిర్వహణ ప్రజా ప్రతినిధులచేతనే చేయించబడినట్లయితే ఈ నిరుత్సాహము, ఈ నైరాశ్యము పోయి, అభ్యుదయ కార్యక్రమాలు పటిష్ఠంచేయబడతాయని, ఫలితములు తృప్తికరముగా వుండి ఈ కార్యక్రమాలను ప్రజలు తమంతటతామే తమ ప్రతినిధులద్వారా

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలు

—జె. వీరాస్వామి

భారత దేశములో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉనికి. వాటి సంబంధాలు, పరిశీలింపవలసి వచ్చినప్పుడు మనకు మొదట గుర్తుకు వచ్చేది. భారత రాజ్యాంగములోని 1వ అనుచ్ఛేదము ఇండియా అనగా 'భారత్' రాష్ట్రముల యూనియన్, అని అనుచ్ఛేదములో పేర్కొనబడియున్నది. కాబట్టి, భారత దేశమును అమెరికాలో మాదిరిగా కేవలం ఒక ఫెడరేషనుగా భావించడానికి వీలు లేదు.

అమెరికా రాష్ట్రాలవారు 1787లో జరిపిన ఫిలడెల్ఫియా సమావేశములో, తమ దేశ రాజ్యాంగాన్ని ఆమోదించారు. తరువాత, వివిధ రాష్ట్ర శాసనసభలవారు ఆ రాజ్యాంగాన్ని, ధృవీకరించారు ఇది రాజీ సిద్ధాంతము(Principle of Compromise) ననుసరించి రూపొందింపబడినది. భారత రాజ్యాంగము అలా కాక, కేంద్రరాజ్యాంగ నిర్మాణ సభచే రూపొందించబడినది. ప్రత్యేకముగా రాష్ట్రాల ఆమోదం తీసుకొనబడలేదు భారత దేశమునకు, మరియు అమెరికా సంయుక్త రాష్ట్రములకు మధ్య ఈ సునిశితమైన వ్యత్యాసం కలదు

భారత రాజ్యాంగములోని అధికార విభజనను బట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలు, మూడు భాగములుగా విభజింపవచ్చును. (1)శాసన సంబంధాలు. (2) పరిపాలన సంబంధాలు. 3. ఆర్థిక సంబంధాలు

శాసన సంబంధాలు

మనరాజ్యాంగములోని 7వ షెడ్యూలులో కేంద్రజాబితా రాష్ట్రజాబితా, మరియు ఉమ్మడి జాబితా నిర్దేశింపబడినవి, కేంద్ర పార్లమెంటుకు 97 అంశములలోను, రాష్ట్ర శాసన మండలులకు 66 అంశములలోను. ఉమ్మడిగా 47 అంశములలోను శాసన నిర్మాణ అధికారము ఇవ్వబడినది కేంద్ర జాబితాలో నిర్దేశించబడిన అంశములలో పార్లమెంటుకు మాత్రమే శాసన నిర్మాణ అధికారము కలదు. అదేరీతిగా, రాష్ట్ర జాబితా అంశములలో రాష్ట్రశాసనమండలులకు మాత్రమే అధికారము కలదు. ఉమ్మడి జాబితాలోని అంశములపై మండలులకు పార్లమెంటు రాష్ట్ర శాసన మండలులు కూడ శాసననిర్మాణము చేయవచ్చును. కాని 249వ అనుచ్ఛేదము ప్రకారము రాజ్య సభలో 2/3వ వంతు మెజారిటీతో తీర్మానము ఆమోదించిన యెడల రాష్ట్ర శాసన. పరిధిలోని అంశములపై కూడ దేశ క్షేమము దృష్ట్యా. శాసన నిర్మాణము చేయుటకు పార్లమెంటుకు తాత్కాలికముగా అధికారము లభించును. అయితే ఆ తీర్మానము ఒక సంవత్సరమునకు మించకుండ అందులో పేర్కొబడిన కాలముపాటు అమలులో ఉండును. అట్లు అమలు కలిగియుండు కాలపరిమితిని రాజ్యసభలో తిరిగి తీర్మానముద్వారా మరియొక సంవత్సరముపాటు పొడిగించవచ్చును అట్లు చేయబడిన శాసనం, తీర్మాన కాలపరిమితి దాటి ఆరు నెలల వరకు అమలులో ఉండును. దేశములో అత్యవసర పరిస్థితి ప్రకటించినపుడు కూడ రాష్ట్ర జాబితాలోని అంశాలపై శాసననిర్మాణము చేయు అధికారము పార్లమెంటుకు 250వ అనుచ్ఛేదము క్రింద ఇవ్వబడినది రెండు లేక అంతకన్న ఎక్కువ రాష్ట్ర శాసన మండలులలో. తీర్మానములు ఆమోదించబడిన యెడల, 252వ అనుచ్ఛేదము ననుసరించి, ఆ యా రాష్ట్రములకు వర్తించు శాసనములను పార్లమెంటు చేయవచ్చును. అట్టి శాసనములను సవరించుటకు, ఉపసంహరించుటకు, పార్లమెంటుకు మాత్రమే అధికారము గలదు. అంతర్జాతీయ ఒప్పందములు, అంతర్జాతీయ తీర్మానములు, అమలు జరుపుటకు సంబంధించిన శాసనములను చేయుటకు 253వ అనుచ్ఛేదముక్రింద. పార్లమెంటుకు మాత్రమే అధికారము గలదు 254వ అనుచ్ఛేదము క్రింద రాష్ట్ర శాసనములలో, కేంద్ర శాసనములకు అనుగుణముగా లేనట్టి, భాగములు చెల్లనేరవు అయితే, ఉమ్మడి జాబితాలోని అంశములకు సంబంధించిన కేంద్ర శాసనములకు విరుద్ధముగా, ఏదైనా శాసనము రాష్ట్రము తనకు సంబంధించినంత వరకు చేయవలసి వచ్చిన యెడల అట్టి శాసనము రాష్ట్రపతి ఆమోదము పొందవలసి ఉండును. శాసనము సవరించు అధికారం గూడా పార్లమెంటుకు ఉన్నది. రాష్ట్ర జాబితాలోగాని, ఉమ్మడి జాబితాలోగాని ప్రత్యేకముగా పేర్కొనబడని విషయములలోను ఆ జాబితాలలో లేని, పన్ను విధింపు విషయములలోను, శాసన నిర్మాణాధికారం పార్లమెంటుకు ఉన్నది దేశ భద్రత దృష్ట్యా, అత్యవసర పరిస్థితి ప్రకటించినప్పుడు పార్లమెంటుకు, రాష్ట్ర శాసన పరిధిలోని అంశములపై గూడా శాసన నిర్మాణాధికారము లభించును అయితే అలా చేసిన శాసనాలు, అత్యవసర పరిస్థితి పోయిన తరువాత ఆరు మాసములవరకే అమలులో ఉండును. రాజ్యాంగ సూత్రముల ప్రకారము, రాష్ట్రప్రభుత్వము పరిపాలన చేయలేని పరిస్థితి, రాష్ట్రములలో వచ్చినప్పుడు గూడా పార్లమెంటుకు, ఆ రాష్ట్ర శాసన మండలుల అధికారాలు సంక్రమించగలవు. ఆ పరిస్థితిలో చేసిన శాసనాలు అట్టి పరిస్థితి గతించిన సంవత్సరము వరకు

అమలులో ఉండును. కాని రాష్ట్ర శాసన మండలులు వాటిని ఆ సంవత్సర కాలములో మార్పు చేసికొనవచ్చును.

పరిపాలనా సంబంధాలు

2. రాష్ట్ర ప్రభుత్వ కార్య పాలనాధికారమును పార్లమెంటు చేసిన శాసనములను అమలు జరుపుటకు అనుగుణముగా వినియోగించవలెను. అట్టి సందర్భములలో తగిన ఆదేశములిచ్చు అధికారము 256వ అనుచ్ఛేదము క్రింద కేంద్ర ప్రభుత్వమునకు గలదు. ఇదిగాక, రాష్ట్ర ప్రభుత్వ కార్యపాలనాధికారము కేంద్ర ప్రభుత్వ కార్యపాలనాధికారమునకు భంగము కలుగకుండునట్లుగా వినియోగించబడవలెను. కేంద్ర ప్రభుత్వము, ఏవైనా రహదారి మార్గములను, నీటి మార్గములను జాతీయ మార్గములుగా పరిగణింప వచ్చును. దేశ రక్షణకు సంబంధించిన నౌక, వాయుయాన విషయములలో అవసరమైన నిర్మాణములుచేయు అధికారము, కేంద్రమునకు ఇవ్వబడినది. రైల్వేలను సంరక్షించుటకు తీసుకొనవలసిన చర్యలకై రాష్ట్ర ప్రభుత్వములకు ఆదేశములనిచ్చుటకు, కేంద్ర ప్రభుత్వమునకు అధికారముగలదు. 258వ అనుచ్ఛేదము ప్రకారము రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వ కార్యపాలనాధికారము విస్తరించునట్టి ఏ విషయమునకైనను సంబంధించిన పనులను రాష్ట్ర ప్రభుత్వముయొక్క సమ్మతితో ఆ రాష్ట్ర ప్రభుత్వమునకుగాని ఆ ప్రభుత్వపు ఉద్యోగులకుగాని అప్పగించవచ్చును. అదేవిధముగా, 258వ అనుచ్ఛేదము ప్రకారము రాష్ట్ర గవర్నరు, రాష్ట్ర ప్రభుత్వ కార్య పాలనాధికారము విస్తరించునట్టి ఏ విషయమునకైనను సంబంధించిన పనులను కేంద్రప్రభుత్వమువారి సమ్మతితో కేంద్ర ప్రభుత్వమునకుగాని కేంద్ర ప్రభుత్వపు ఉద్యోగులకుగాని అప్పగించవచ్చును.

రాష్ట్రప్రభుత్వాలమధ్య అంతర్రాష్ట్ర నదీ వివాదములను పరిష్కరించుటకు తగిన యంత్రాంగమును రూపొందించుటకు అవసరమైన శాసనముచేయు అధికారము పార్లమెంటుకు 262వ అనుచ్ఛేదము క్రింద కలదు. దీని నాధారముగా చేసికొని 1956లో "అంతర్రాష్ట్ర నీటి తగాదాలచట్టం" రూపొందింప బడినది. ఈ చట్టము ప్రకారమే ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మైసూరు రాష్ట్రములమధ్య గోదావరి కృష్ణా జలాల తగాదా పరిష్కరింపబడుతూ ఉన్నది. ఆదే విధముగ 263వ అనుచ్ఛేదముననుసరించి రాష్ట్రపతి ప్రజాక్షేమము దృష్టిలో నుంచుకొని రాష్ట్రములమధ్య తలయెత్తిన తగాదాలను పరిశీలించి సలహాలనిచ్చుటకు సంఘములను ఏర్పాటు చేయవచ్చును.

ఆర్థిక సంబంధాలు

131. :—భారత రాజ్యాంగం ననుసరించి కొన్నివిధములైన పన్నులు వేయు అధికారము కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేకముగా ఇవ్వబడినది. అట్లే, కొన్ని నిర్ణీత పన్నులు వేయు అధికారము రాష్ట్రప్రభుత్వములకు నేరుగా ఇవ్వ బడినది. ఆదాయపుపన్ను, కంపెనీలపైన వ్యక్తుల ఆస్తులపైన, ఎగుమతి దిగుమతి, వ్యాపారములపైన పొగాకు మొదలగువాటి పైన పన్నులువేయు అధికారము కేంద్ర ప్రభుత్వమునకుగలదు. భూమి శిస్తు, వ్యవసాయ ఆదాయములపై పన్ను, వ్యవసాయ భూముల సంక్రమణ హక్కులపై పన్ను ఇండ్లపైన, గనుల పైన మత్తు పదార్థములు, విద్యుచ్ఛక్తి, మోటారు ప్రయాణీకుల పైన, రవాణా చేయు వస్తువులపైన, మోటారు శకటములపైన రాష్ట్రములో జరుగు వ్యాపారపు అమ్మకము పైన పన్నులు వసూలు చేయు అధికారము ప్రత్యేకముగా రాష్ట్రప్రభుత్వమునకు ఇవ్వ బడినది. ఇదిగాక 269వ అనుచ్ఛేదముక్రింద, కేంద్రప్రభుత్వము విధించి వసూలుచేసిన వ్యవసాయేతర ఆస్తుల సంక్రమణపైపన్ను ఎస్టేటు డ్యూటి, రైల్వే విమానయానము, సముద్రయానముల పై పన్నులు వార్తాపత్రికలపైన స్టాక్ ఎక్ఛేంజిపైన పన్నులలో కొంత భాగము రాష్ట్ర ప్రభుత్వములకు ఇవ్వవలసి యున్నది. 270వ అనుచ్ఛేదముక్రింద రాబడిపన్ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వముల మధ్య పంపిణి చేయవలెను. 272వ అనుచ్ఛేదముక్రింద ఎక్సైజు సుంకములవల్ల వచ్చిన మొత్తము శాసనబద్ధమైన పంపిణీ విధానముపై వివిధ రాష్ట్రప్రభుత్వములకు ఇవ్వవలయును. జనపనార, నారవస్తువులపై విధించిన పన్నులసానే అస్సాము, బీహారు, పశ్చిమ బెంగాలు ప్రభుత్వములకు 273వ అనుచ్ఛేదము ప్రకారము కేంద్ర ప్రభుత్వము, సొమ్ము, కేటాయించ వలసియున్నది. షెడ్యూలు జాతులు షెడ్యూలు ప్రాంతముల యొక్క అభివృద్ధికి 275వ అనుచ్ఛేదముక్రింద కేంద్ర సంచితనిధి అంటే (Consolidated Fund) నుండి చెల్లింపవలయును. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆదేశానుసారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ వ్యయ పట్టికలను తయారుచేయవలయును. ఈ విధముగ ఆర్థిక సంబంధములను చూచినచో రాష్ట్ర ప్రభుత్వ అదాయ వ్యయములు చాలవరకు కేంద్ర ప్రభుత్వ ఆధీనములో ఉన్నట్లు గోచరించును.

భారతదేశపు రాజ్యాంగపు నిర్మాతలు, భారతదేశపు గత చరిత్రలో, భిన్న ప్రవృత్తులు, వైషమ్యాలతో చిన్న చిన్న రాజులు, వారి రాజ్యాలు పతనమైనతీరు, పరదేశముల దాడికి, బానిసత్వానికి దేశము లొంగిపోయిన తెన్నులు, గుర్తుంచుకొని, దేశ సమైక్యత దృష్ట్యాను ఇరుగు పొరుగు శత్రుదేశాల పీడ నివారణ కొరకును, అనేక భాషలకు, ఎన్నో సంస్కృతులకు, నిలయమైన భారత దేశంలో విచ్ఛిన్నకర శక్తులు విజృంభించకుండా చేయడానికినీ, పటిష్టమైన కేంద్ర ప్రభుత్వమును రూపొందించిరి. ఈ విషయమును అవగాహన చేసుకొన్నప్పుడు, మన రాజ్యాంగములో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలు పొందుపరచిన విధానము బోధపడగలదు.

ప్రజాస్వామ్య మార్గంలో సోషలిస్టు సమాజం మన ధ్యేయం

సమాజంలో నేటి యువతరం బాధ్యత

తాతపూడి బ్రహ్మానంద శాస్త్రి

సంఘంలో నేటియువతరం బాధ్యత ఎంతయినావుంది. వారి భుజస్కంధాలపై భావి భారతదేశ కీర్తిప్రతిష్టలు కాపాడే బాధ్యత వుంది. నేటి యువకులే భావిభారత భాగ్యోదయ పౌరులు. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపిగరీయసీ।' మనజన్మ భూమియే భూతల స్వర్గం. అలాటి స్వర్గాన్ని నందనవనంలా చేసేబాధ్యత ప్రతీభారత పౌరునికీ వుంది।

కాలంమారుతున్న కొద్దీ— కాలంతోటి మనుషులు—మనుషుల తోటివిజ్ఞానం— విజ్ఞానంతోటి వివేకం—వివేకంతో వ్యక్తిత్వం మార్పులు రావాలి. ఆమార్పు తమ హృదయానికి దోహదం చెయ్యాలి గాని అధఃపతనానికి దారితియ్యకూడదు. తెలివితేటలుండి, చదువూ సంస్కారం సముపార్జనచేసి దేశానికీ సంఘానికీ నిష్కళంక ప్రేమతో సేవ చేసే యువతరానికి చేయూత నివ్వాలిగాని నిరుత్సాహ పరచకూడదు. కాని ఉడుకు రక్తం పురకలువేసి పరుగులుతీసి విజ్ఞానం పెంపొందించుకుని విద్యారంగంలో ఆదర్శ విద్యార్థిగా మేధావంతుడుగా తయారయే తరుణంలో తన బాధ్యతలను విస్మరించి జీవితానికి పునాది రాయివంటి చదువుకు స్వస్తి చెప్పి వాతావరణాన్ని గొడ్డలి పెట్టులా కలుషితం చేస్తున్నారు కొందరు యువకులు.

ఇది కేవలం రాజకీయాల ప్రభావం. నిరాహార దీక్షల వాతావరణం. మాట్లాడితే నేటి యువకులు సమ్మెలనీ, నిరాహార దీక్షలనీ, రిలేదీక్షలనీ—తమచదువును సర్వనాశనం చేసుకుంటున్నారు.

అందుకుబాధ్యు లెవరు?

గతచరిత్ర పుటలు తిరగేస్తే గురుకులంలోతల్లి దండ్రులను విడిచి ఎన్నో సంవత్సరాలు చదువుకునే వారు. ఆ కాలంలో సమ్మెలు లేవు సమస్యలూ లేవు. సమస్త విద్యలూ పూర్తయిన తర్వాత గురు దక్షిణ ఏమడిగితే అది యిచ్చేవారు. మహా భారతగాథను మననం చేసుకుంటే అర్జునుడు తన గురువైన ద్రోణాచార్యునికి గురుదక్షిణగా ద్రుపదుని రథానికి కట్టి తెచ్చిచ్చాడు. గురువు లేకుండా నమ్మికతో విలువిద్య నేర్చుకున్న ఏకలవ్యుడు నిజముగానే ద్రోణుడు బొటన వ్రేలుని గురు దక్షిణ కోరితే వెనుకముందులు ఆలోచించకుండా యిచ్చాడు. అంటే ఆ కాలంలో విద్యకు అంత విలువ యిచ్చారు.

అవి వెనుకటి రోజులు—

ఇప్పుడు విద్యకు విలువలేదా? యువకులు విద్యా విజ్ఞాన రంగాల్లో రాణించటం లేదా? అప్పటికంటె విద్యలోనూ, విజ్ఞానం లోనూ యువతరం ముందంజవేసిందనడం నిర్వివాదాంశం.

కాని సమ్మెలనీ, నిరాహారదీక్షలనీ యువకులు రాజకీయాల్లో తల దూర్చి కొంతవరకు తమ చదువుకు న్యాయంచేకూర్చడం లేదేమోఅని అనుకోవలసివస్తోంది.

ఆనాడు ఉప్పు సత్యాగ్రహోద్యమంలో మహాత్మా గాంధీ కూడా సమ్మెచేశాడు. ఎన్నో లాఠీ దెబ్బలుతిన్నాడు రవి అస్తమించని బ్రిటిషు సామ్రాజ్యాన్ని రాట్నంమీద నూలు వడకుతూ గడగడ వణికించాడు. ఆనాడు శృంఖలాబద్ధయైన ఆంధ్రమాత కొరకై అనేకులు సమ్మెలు చేశారు. నిరాహార దీక్షలు చేశారు. జైళ్లలో మగ్గారు. స్వర్గీయ పొట్టిశ్రీరాములు ఆంధ్రరాష్ట్రావతరణకోసం నిరాహారదీక్ష చేసి సాధించినా, అదంతా శాంతియుతంగానే జరిగింది. అందులో విప్లవాత్మకత లేదు అప్పుడు యువతరం ముందడుగు వేసింది. విజయం సాధించింది.

కాలం మారుతున్న కొద్దీ ప్రతిచిన్న విషయం గురించీ సమ్మెలు చేస్తున్నారు. 1966 లో విశాఖ ఉక్కుఫ్యాక్టరీ గురించి పెద్ద రివల్యూషన్—సంచలనం కలిగింది. అప్పుడు యువకులూ—కార్మికులూ పాల్గొన్నారు. ఎందరో అమాయకులు ఆహుతై పోయారు. కాని సాధించినదేముంది? ఆవేశాలకులోనై మనవస్తువులనే మనమే పాడుచేసుకున్నాము. సౌభాగ్యవంతంగా ఏకతాటిమీద పోతున్న తెలుగునాడును రెండుగా విడదీయమని నిన్న మొన్నటి వరకూ కొందరు పోరాడారు. అందుకు యువతరం ఎంతో మంది బలై పోయారు. ఎందుచేతనంటారు? సంఘంలో వుండే దుష్ట శక్తుల ప్రేరణతో రాజకీయాల్లో దిగడంవల్లనే! మనయువతరంలో విద్యార్థిగా తెలివి తేటలు వున్నాయి. విద్యాధికుడుగా పేరు ప్రతిష్టలు వున్నాయి. వినయ సంపన్నుడిగా నిలిచాము. మనం భారతదేశ కీర్తి ప్రతిష్టలు నిలుపగల బద్ధ కంకణ దీక్షా పరతంత్రులం. మనకు రాజకీయాల గొడవలు అక్కర్లేదు. అదంతా నాయకులు, పరిపాలకులు చూసుకుంటారు.

నాయకుడు నాయకుడుగా ఎంత వరకు న్యాయం కలిగిస్తున్నాడు? తన స్వార్థం కోసం విద్యార్థిలోకాన్ని అండ దండలుగా చేసుకుంటున్నాడు. అలా కాకుండా నిష్కళంక హృదయంతో అవినీతిని పారద్రోలి నాయకులు పరిపాలకులకు మేరు పర్వతంలా నిలబడితే మన దేశ సౌభాగ్యం ఏనాటికీ తరగదు. తెలంగాణా ఉద్యమంలో చూడండి. కొందరు విద్యార్థులను రెచ్చగొట్టి రైళ్లను ఆపించి వేశారు. బస్సులను కాల్పించారు. యువకుల మీద రాజకీయ ప్రభావం పులిమి చడీ చప్పుడు కాకుండా చూస్తూ వూరు కున్నారు. అలా ఎందుకు చెయ్యాలి. ఎవరి విధి నిర్వహణలు వారు సరిగా చూసుకుంటే అరాచకానికి తావివ్వదుకదా!

లాల్‌బహదూర్ శాస్త్రి "జై జవాన్ జై కిసాన్" అనే నినాదాన్ని యువకులలో ఉడుకు రక్తంలో కలిపి శాశ్వతంగా ముద్ర వేయించారు.

భారతదేశ ప్రతిష్ఠ పూర్తిగా కిసాన్ మీద ఆధారపడి వుంది. రైతు నాగలి పట్టి భూమాతను నమ్మి బంగరు పంటలను పండిస్తున్నాడు. వ్యవసాయదారుడు దేశానికి జీవ గర్ర. బీడు వారిన భూములను కూడా సస్యశ్యామల మైన భూమిగా చేసి సదా ధాన్య లక్ష్మిని నమ్ముకొని కావలసినది గాదెలండా నింపుకుని కావలసినంత ఆహారధాన్యాలను విదేశాలకు కూడా సరఫరాచేసి సదా కీర్తికాముకుడవుతున్నాడు. రోజులు మారుతున్న కొద్ది ఎన్నోకొత్త వ్యవసాయ పరికరాలు—మరనాగళ్లు—ట్రాక్టర్లు అనేకం ఉత్పత్తి అయ్యాయి. చక్కటి I.R. వరివంగడాలు: జపాన్ వరిసాగు మొదలైన వన్నీవచ్చాయి. అందుచేత ఆదర్శ కిసాన్‌గావాలంటే మంచివిజ్ఞానం సంపాదించాలి. బాగుగాచదువుకున్న యువకులు వ్యవసాయ రంగంలోకి నడుముబిగించి దిగారంటే నందనవనం నూరు రెట్లు ఎదిగిపోతుంది మనజాతికి ఘనత దక్కుతుంది. అందుచేత మన యువతరం మంచివిజ్ఞానవంతులై కిసాన్‌కి చేయూతనిస్తే మనకిక లోటేముంది? మనది గోదావరి, కృష్ణా మొదలైన గొప్పగొప్ప మహానదులు ప్రవహించే మహోత్తర దేశం. మనకి తిండికి గుడ్డకు లోటులేదు.

నాయకీ నాగమ్మ, మల్లమాంబా మొల్ల-ఝాన్సీలక్ష్మీబాయి మొదలైన వీరనారులకు-తళతళల కత్తి మెరిసే తాండ్రపాపయ్య-కదనరంగంలో వీరవిహారంచేసిన బాలచంద్రుడు, భారతమహాసంగ్రామంలో పౌరుషము చూపిన పాండవులు—మొదలైన మహావీరులు జన్మించిన పుణ్యభూమి మనది. అట్టిభారత దేశంలో వీరజవానుల కృషి వర్ణనాతీతం-

సంగనాచి కబుర్లుచెప్పి తీపిగా భుజంమీద చెయ్యివేసిన చైనావాళ్లు మనమీద విరుచుకు పడ్డారు. కాని జవహర్‌లాల్ నెహ్రూజీ తెలివితేటల ధాటికి వీరజవానుల విలయతాండవానికి క్షణం నిలబడలేకపోయారు. భారత దేశానికి వేసవి విడిది లాంటి కాశ్మీర్ అంద చందాలకు దురాశకలిగిన పాకిస్తాన్ నాయకులు కబళిద్దామనిచూశారు కాని ఏం సాధించారు ఎందుకు సాధించలేకంటారు? అదంతా మనలాల్‌బహదూర్ శాస్త్రిగారి పాలనాశక్తి, మన వీర జవానుల మహోజ్వల కృషి. ఎముకలు కొరికే చలికాలంలో తమవిలువైన ప్రాణాలను కూడా లెక్కచెయ్యకుండా ప్రంటుమీద గస్తీ కాసి శత్రువులను రాకుండా బలపరాక్రమ సంపన్నులై భారతాంబకీర్తిప్రతిష్ఠలు కాపాడారు వారు ఎవరు! యువకులు. దేశం కోసం పాటుపడే వీరజవానులు. ఎనలేని దేశసేవచేసే భారతాంబ భక్తులు.

ఉద్యోగస్తుడిగా నేటియువతరం ప్రభుత్వ యంత్రాంగం నడుపుట, జీవమయి దేశాన్ని ఒక తాటిమీద నడుపుతూ భారత మాత భావికీర్తికి పాటు పడుతున్నది. అందుచేత ఉద్యోగస్తుని కృషిని ప్రభుత్వంగుర్తించి మరింత చేయూతనిచ్చి కీర్తి కాములను చేయాలి.

అందుకే ఆఖరికి నేను చెప్పేది కృషితో నాస్తిదుర్భిక్షం-జపతో నాస్తి పాతకం అన్నట్లు నేటి యువతరం బద్ధకంకణ దీక్షా పరతంత్రులై, డిప్లమసీ తంత్రజ్ఞులు కాకుండా విద్యార్థిగా, నాయకుడుగా, పరిపాలకుడుగా, కిసాన్‌గా, జవాన్‌గా దేశానికి ఎంతో పాటుపడాలి. అవినీతి రాక్షసిని నిర్మూలించాలి!

భావిభారత భాగ్యోదయ బాధ్యతలన్నీ మనవే; మనమంతా యువకులం—మనదంతా యువతరం-మనదేశక్షేమమే మనదేహాక్షేమం! మనమంతా ఒక్కటే! మనమాట ఒక్కటే! మనబాట ఒక్కటే—మనభావంకూడా ఒక్కటే.

నా జీవితానుభవాలు

చెప్పినది : కోలవెన్ను రామకోటేశ్వరరావు ★ వ్రాసినది : అక్కిరాజు రమాపతిరావు

జాతీయ కళాశాలలో పనిచేసిన నాలుగు సంవత్సరాలు నా జీవితం సంతోషపూర్ణంగా గడిచిపోయింది. ఎంతో విజ్ఞానాభివృద్ధిచేసుకొనేందుకు కూడా నాకక్కడ అవకాశం కలిగింది. సహాయ నిరాకరణోద్యమ ఫలితంగా హైస్కూలు చదువులు మానేసినవారు, జాతీయ కళాశాలలోచేరి చదువుకొన్నారు. కాలేజీ తరగతుల స్థాయిలో చరిత్ర, రాజనీతి, అర్థశాస్త్రం నేను విద్యార్థులకు బోధించేవాణ్ణి. అక్కడ బోధన తెలుగులో జరిగేది. అయితే ఇంగ్లీషు గ్రంథాలు లెస్సగా చదివేవారు విద్యార్థులు. విద్యార్థులలో జ్ఞాన తృష్ణను, ఉన్నత ప్రమాణాలను నెలకొల్పడానికి అధ్యాపక వర్గం కృషిచేసేవారు. విద్యార్థులకు ఇంగ్లీషు సాహిత్యం బోధించటం, ప్రామాణికమైన గ్రంథాలను ఎన్నిక చేసి వాళ్ళతో చదివించే బాధ్యతకూడా నేను స్వీకరించాను. అప్పుడు కళాశాలలో శ్రీ బెజవాడ గోపాల రెడ్డి ఒక సంవత్సరం విద్యార్థిగా వున్నారు. ఒక సంవత్సరం గడవగానే ఆయన శాంతి నికేతన్ వెళ్ళిపోయారు. జాతీయ కళాశాలలో ప్రమోదకుమార్ ఛటర్జీ చిత్రలేఖనం తరగతులు నిర్వహించేవారు. శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు తెలుగు చెప్పేవారు. ఆ రోజుల్లోనే విశ్వనాథవారు ఆంధ్ర ప్రశస్తి, నర్తనశాల, గిరికుమారుని ప్రేమ గీతాలు మొదలైన కావ్యాలు రచిస్తూ వచ్చారు. బాపిరాజుగారు భీమవరంలో వుండేవారప్పుడు. 1921 వ సంవత్సరంలో జైలుకు వెళ్ళివచ్చిన తరువాత, జాతీయ కళాశాలకువచ్చి ప్రమోదకుమార ఛటర్జీవద్ద తమ చిత్రలేఖన నైపుణ్యానికి మెరుగులు దిద్దుకునే ప్రయత్నంలో వుండేవారు. 1923 వ సంవత్సరంలో కౌతా శ్రీరామ శాస్త్రిగారు 'శారద' మాస పత్రికను ప్రారంభించారు. 'శారద' ఆనాటి చక్కని సాహిత్య పత్రిక. బాపిరాజుగారు 'శారద' లో అప్పుడు రచనలు చేస్తుండేవారు. మంచి ప్రమాణాలతో 'శారద' ఉత్తమ కళా సాహిత్య పత్రికగా రూపొందింది. కౌతా శ్రీరామశాస్త్రి గారు ఉత్తమ దేశభక్తుడు. లలిత కళల్లో, అందునా ముఖ్యంగా చిత్రకళలో విశేషించి గొప్ప అభిరుచి కలవారు. వీరి కొమారులు ఆనందమోహన్, రామమోహన్‌లు ప్రమోదకుమార్ ఛటర్జీ గారి వద్ద చిత్రకళను అభ్యసిస్తూండేవాళ్ళు. మాచర్ల వాస్తవ్యులు శ్రీ గుర్రం మల్లయ్యగారు కూడా అప్పుడు చిత్రకళను అభ్యసించారు. కౌతా శ్రీరామశాస్త్రి గారిది చాలా గొప్ప సంస్కారం గల కుటుంబం. కళాశాల ఆవరణలో ఒక పాకలో మేము కాపురం వుండేవాళ్ళం. నెలకు ఎనభై రూపాయలు గౌరవ భృతిగా ఇచ్చేవారు. అప్పుడు జాతీయ కళాశాలకు చిల్లరిగె శ్రీనివాసరావుగారు ప్రిన్సిపాల్‌గా వుండేవారు. వీరు హైస్కూలు తరగతులకు చరిత్ర చెప్పేవారు. సుసర్ల సుబ్బారావుగారు, సుసర్ల రాజుగారు మొదలైనవారు అప్పటి ఉపాధ్యాయ వర్గంలో వుండేవారు. ఆ రోజుల్లో విశ్వనాథ వారితో నాకు చాలా సన్నిహిత మైత్రి వుండేది. విశ్వనాథ వారు ఏ రచన చేసినా ముందుగా నాకూ, బాపిరాజు గారికే, చదివి వినిపించేవారు. ఆ రోజుల్లో మాకిది పరిపాటి అయిపోయింది. ఆంధ్రప్రశస్తి, కిన్నెరసాని పాటలు, ఏకవీర మేమిట్లా వారు వినిపించగా ఆరోజుల్లో విన్నాము. నర్తనశాల కూడా ఆ రోజుల్లోనే విశ్వనాథ రచించారు. విశ్వనాథ మహాకవి అవుతాడనీ, ఆంధ్రదేశం ఆయన్ను ఆకాశానికెత్తుతుందనీ మాకు ఆయన రచనలు విన్నప్పుడు అనిపించేది. ఆ రచనల్లో సౌందర్యానికి, వారి ప్రతిభా సంపదకూ ముగ్ధులమైపోతూవుండేవాళ్ళం. కళాశాల ఆవరణలో పచ్చిక బయళ్ళలో వెన్నెల రాత్రుళ్ళు స్నేహితులం తరుచుగా సమావేశమై సాహిత్య గోష్ఠులు జరుపుతూవుండేవాళ్ళం. అప్పుడప్పుడు మా సమావేశాలకు శివశంకరశాస్త్రి గారు, కృష్ణశాస్త్రిగారు, నండూరి, నాయని, బెల్లంకొండ రాఘవరావు గారూ, కళాశాలలకు అతిథులుగా వచ్చి పాల్గొంటూ వుండేవాళ్ళు. ఊళ్ళో సాహిత్య సభలు జరుగుతూ వుండేవి. మొత్తం మీద అక్కడి వాతావరణమంతా పరమోల్లాసకరంగా కలకల్లాడుతూ, సాహిత్యమయంగానూ, కళామయంగానూ వుండేది. జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి అప్పుడు చిట్టిగూడూరు సంస్కృత కళాశాలలో విద్యార్థిగా వుండేవాడు. పింగళి నాగేంద్రరావు శారద పత్రికకు సహాయ సంపాదకుడిగా వుంటూ, డి.వి. సుబ్బారావుగారి నాటక సమాజానికి వ్యవహర్తగా వుండేవారు. ఆయన కూడా జాతీయ కళాశాలలో చదివిన వారే. పూర్వ విద్యార్థి అన్నమాట. గొప్ప కళాభిమాని. సాహిత్య ప్రియుడు. ఈయన నాటకం వింధ్యారాణి ఆ రోజుల్లో చాలా ప్రసిద్ధిని పొందింది. ఆ రోజుల్లోనే విశ్వనాథ నర్తనశాలను, తెనాలి కంపెనీ వారు మినర్వా హాలులో ప్రదర్శించారు. విశ్వనాథ, బాపిరాజు, నేను, ముట్నూరి కృష్ణారావు గారు, పురాణం సూరిశాస్త్రి గారు, అంతా కలసి దర్శించాం. ఆ నాటి నాటక ప్రదర్శన మమ్మల్ని తన్మయులిని గావించింది.

ఆవాళ మాధవపెద్ది వేంకట్రామయ్యా గారు కీచక పాత్రను ధరించారు. పారుపల్లి సుబ్బారావుగారు ద్రౌపది పాత్రను ధరించారు. నర్తనశాల రచనా ప్రమాణాలను బట్టి చూసినా, ప్రదర్శన యోగ్యతను బట్టి చూసినా ఉత్తమ శ్రేణికి చెందిన నాటకమైనా ఎందువల్లనో నాటక రంగస్థలం మీద తరువాత తరువాత అంత ఎక్కువగా రాణించలేదు. ఆ రోజుల్లోనే శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు కళాశాలకు వచ్చి శాతవాహన యుగంపైన ఉపన్యాసాలిచ్చారు. డా. కజిన్సు వచ్చి చిత్రలేఖనంపై ఉపన్యసించారొకసారి. జాతీయ కళాశాలలో సాహిత్యోపన్యాసాలు నిర్వహించటమేగాక ఇతర ప్రదేశాలలో సాహిత్య సమావేశాలు జరిగితే మేమంతా పాల్గొంటూ వుండేవాళ్ళం. 1925 వ సంవత్సరంలో నూజివీడులో నండూరి సుబ్బారావు గారు సాహిత్య సభ నొకదాన్ని ఏర్పాటు చేశారు. విశ్వనాథ, బాపిరాజు, నేనూ, బెల్లంకొండ రాఘవరావుగారూ ఆ సభలో పాల్గొన్నాం. ఆ సభకు వేదం వేంకట్రాయశాస్త్రి గారు అధ్యక్షులు. నండూరి ఎంకి పాటలను అద్భుతంగా పాడేవాడు. ఆ సభలో వేంకట్రాయశాస్త్రి గారు ఎంకి పాటలను ప్రశంసించారు. ఇంకోసారి భీమవరంలో బాపిరాజు సాహిత్య సమావేశం ఏర్పాటు చేశారు. దానిలో మేమంతా పాల్గొన్నాం. తరుచు బెల్లంకొండ రాఘవరావు గారి గ్రామం. మా నరసారావుపేట దగ్గరేవున్న పమిడిపాడు వెళ్ళి మేమంతా మూడు నాలుగు రోజులుండి, కులాసాగా సాహిత్యగోష్ఠులతో కాలక్షేపం చేసేవాళ్ళం. విశ్వనాథ తమ పద్యాలేకాక, ఇతర మిత్రుల పద్యాలు కూడా శ్రావ్యంగా, ఉత్తేజితులు మయ్యేట్లు చదివి వినిపించేవారు.

గిడుగు రామమూర్తి పంతులుగారు ఆంధ్రదేశ మంతా తిరిగి భాషోద్యమాన్ని తీవ్రతరం చేసి వ్యాపింప చేస్తూవుండే వారు. నవ్య వ్యవహారిక సాహిత్యోద్యమం బాగా వ్యాప్తి నందుతూ వచ్చింది. స్వామీ శివశంకరులు నవ్యసాహిత్యానికి పట్టుగొమ్మగా, నూతన రచయితలను ప్రోత్సహించి, నూత్నరచయితలను వెలికితెచ్చేవారు. సాహిత్య సమావేశాలకు హాజరై, కావ్య పఠనం పట్ల అత్యంతాసక్తిని కనపరచేవారు సాహితీప్రియులు. 1925 వ సంవత్సరం గూడూరులో నాయని సుబ్బారావు గారి వివాహం జరిగింది. ఈ వివాహానికి నోరి నరసింహశాస్త్రి, శివశంకరస్వామి, నండూరి సుబ్బారావు, విశ్వనాధ, బాపిరాజు, నేను, హాజరైనాము అప్పటికే నాయని సౌభద్రుని ప్రణయ యాత్రను ప్రకటించారు. సౌభద్రుని ప్రణయ యాత్రకు ఫలశ్రుతిగా వివాహమని మేమంతా ఆనందించాం. పెండ్లిలో కూడా కవితా గోష్ఠులు జరిగాయి. అప్పుడే నండూరి కొత్తగా రచించిన గోవుమాలచ్చిమికి ...... అన్నపాట వినిపించారు. అంటే వారి కవిత్వం మానవుణ్ణి అధిగమించి విలక్షణమైన మరో జగత్తులో ప్రవేశించిందని అనుకొన్నాం. భావకవిత్వం ఇటు బరంపురంనుంచి బళ్ళారివరకూ స్వైరవిహారంచేసిన రోజులవి. సఖి సాహితీ, మొదలైన మాస పత్రికలు వెలువడి కథానికా, ఖండకావ్యం మొదలైన నూత్న ప్రక్రియలు బాగా రూపురేఖలు దిద్దుకోవడానికి సహాయం చేసాయి. 1924వ సంవత్సరంలో 'భారతి' ప్రారంభమైంది.

బందరులో మొత్తానికి ఆనందంగా కాలంగడిచిపోతున్న రోజుల్లో అనుకోకుండా, జీవితంవొక క్రొత్తమలుపుతిరగ వలసి వచ్చింది. నెమ్మదిగా, సాఫీగా, ఒడిదుడుకులు లేకుండా సాగుతున్న జీవితంలో ఒక అవరోధం వచ్చిపడింది. జాతీయ కళాశాల సహాయ నిరాకరణోద్యమ సంస్థగా నిర్వహించాల్సిందిపోయి, అంతకుపూర్వంవలె మళ్ళీ ప్రభుత్వసహాయం పొందడానికి కళాశాల కార్యనిర్వాహక వర్గంవారు నిర్ణయించారు. ఇది నాకు అయిష్టం, అనంగీకారమూ కావటంవలన, జాతీయకళాశాలను విడిచిపెట్టి, మళ్ళీ చెన్నపట్నం చేరుకున్నాను, అక్కడే 1927వ సంవత్సరాంతాన 'త్రివేణి' పత్రికను ప్రారంభించాను.

మద్రాసుచేరి త్రివేణి పత్రికను ప్రారంభించేముందే 'జయంతి' అన్న తెలుగు పత్రికను కొన్నాళ్ళు నడిపాను. బందరు విడిచిపెడుతున్న చివరిరోజుల్లోనే 'జయంతి'ని నడపాలన్న సంకల్పం కలిగింది. ముట్నూరి కృష్ణారావుగారి దర్బారుకు బందరులో వున్నప్పుడు మిత్రులందరమూ వెళ్ళుతూవుండేవాళ్ళం. అంతా దర్బారీయులమే. ఎప్పుడూ దర్బారులో కళాసాహిత్య రాజకీయ చర్చలు జరుగుతూ వుండేవి. కృష్ణారావుగారు గురుస్థానీయులందరికీ, వారిసాన్నిధ్యం పవిత్రంగావుండి, అందరినీ ఉత్తేజితులనుచేసేది. చెరుకువాడ నరసింహంగారు, గొట్టిపాటి బ్రహ్మయ్యాగారు, కృష్ణారావుగారి దర్బారులో మాతో పాల్గొనేవారు. బహుశా ఆ ఉత్సాహ పూరితమైన రోజుల్లోనే సర్వాంగసుందరంగా, నవ్యసాహిత్యానికి ప్రోత్సాహమిస్తూ, జయంతి పత్రికను నడపాలన్న కోరిక బలపడి వుంటుంది. మద్రాసునుంచి పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు, అచ్చువేసేవారు జయంతిని. ఈ పత్రికకు విశ్వనాథ, నేను ప్రధాన సంపాదకులుగా వుండేవాళ్ళము. ఈ పత్రికనుగూర్చి ఆసక్తి కలిగించేందుకు, సాహితీపరులందరినీ సంప్రతించేందుకు, విశ్వనాథ, నేనూ కలిసి, మద్రాసు, బరంపురం, పర్లాకిమిడి, విజయనగరం, మొదలైన ప్రాంతాలు పర్యటించాము. సాహితీపరులందరినీ కలిసి వారి సహాయాన్ని అర్థించాము. ఉత్తమరచనలు, అందమైన రూపురేఖలూ, ఉండేపత్రికగా నడపాలని మాఆశయం. 1920, 21, ప్రాంతాల్లో చెన్నపట్నం వెళుతూవుండగా మల్లంపల్లి పరిచయం కలిగింది. మల్లంపల్లీ, బాపిరాజు, కృష్ణశాస్త్రిగారలందరూ జయంతిని అభిమానించారు. రచనలు వెలయించారు. అయితే ద్విమాస పత్రికగా ఒక సంవంత్సరంమాత్రమే జయంతిని నడపగలిగాము. జయంతిలో కిన్నెరసాని పాటలు, ఆంధ్రప్రశస్తిలో కొన్ని ఘట్టాలూవచ్చాయి. బాపిరాజుగారి బొమ్మలు వచ్చాయి. చరిత్రకు సంబంధించిన వ్యాసాలు మల్లంపల్లి వ్రాసేవారు. పత్రిక బాగానే వచ్చింది కాని, తగినంత అమ్మకాలు లేకపోయినందువల్లా, వ్యాప్తీ, ప్రచారమూలేకపోయినందువల్లా. పెట్టిన ఖర్చుకూడారాలేదు. అందువల్ల పత్రిక నిలబడలేకపోయింది. ఉన్నవలక్ష్మీనారాయణగారు, కృష్ణరాయబారంగూర్చి ఈ పత్రికలో ఒకవ్యాసం వ్రాశారు. ఏమైనా ఆ ప్రయత్నం ఫలించలేదు. జాతీయ కళాశాలను విడిచిపెట్టినతరువాత, ఎటువంటి నిర్బంధాలులేకుండా, స్వేచ్ఛగా, కళాసాహిత్యరంగాలలో కృషిచేయవచ్చుకదా అన్న ఆనందం కలిగింది. కాని 'జయంతి' మాత్రం ఆ ఉత్సాహాన్ని కొంత భంగంచేసింది. అయితే ఇంగ్లీషులో నడిపేటట్లయితే యావద్భారత దేశంనుండి ప్రోత్సాహం లభిస్తుంది కనుక, త్రివేణిని ఇంగ్లీషులో నడపాలన్న కోర్కెకలిగింది.

దురదృష్టకరమైన కారణాలవల్ల బందరు జాతీయకళాశాలలో అధ్యాపకత్వం వదులుకోవాల్సిరావటంవలన మళ్ళీఏంచేయాలన్న ప్రశ్నరావడం సహజమే. మనస్సుకి తృప్తీ, సంతోషమూ, కొత్త ప్రయత్నానికి గొప్పసార్థకతా కొనితేగల పత్రికను నిర్వహించాలన్న సంకల్పం అప్పుడే కలిగింది. ఆ సంకల్పమే 'త్రివేణి' ఆవిర్భావంగా రూపొందింది.

భారతదేశంలోని వివిధప్రాంతాల, వివిధభాషలలోని, సుసంపన్నతను, మేలిమిని, పరస్పరం అవగాహనచేసుకొనేట్లు చేయాలన్న అభిలాషవలన త్రివేణి ఇంగ్లీషులో వెలువడింది. భారతీయ భాషలన్నిటా,నాడొక పునరుజ్జీవనమూ నూత్నదీప్తి, క్రమవికాసమూ కలుగుతూ వున్నాయి. పాశ్చాత్య వాఙ్మయ ప్రభావంవలనా, స్వాతంత్ర్య సముపార్జనోత్సుకత్వంవలనా, సారస్వత మతసాంఘిక కీయరంగాలలో గాఢమైన కృషీ, అభినివేశమూ, చిత్తశుద్ధీ, తీయులలో ఉద్బుద్ధమైనాయి. అంతకుపూర్వమే ప్రాచీనమైన భారతీయ సంస్కృతి వైభవాన్ని పునరుద్ధరించుకోవాలన్న ప్రబోధమూ, ఉత్కంఠ, భారతీయులపై కొంత పని చేయకపోలేదు.

ఈ తీవ్రమైన అభినివేశంతో, కార్యోత్సాహంతో, భారతీయ సంస్కారాన్ని, పరమౌన్నత్య శిఖరాలకు తీసుకపోవలెనని బ్రహ్మ సమాజం, దివ్యజ్ఞాన సమాజం, కృషి చేశాయి ఇంత కన్నా కూడా వైవిధ్య దృష్టితో భారతీయ సంస్కృతిలో ఉన్న ఏకత్వంలోని భిన్నత్వాన్ని, భిన్నత్వంలోని ఏకత్వాన్ని వివిధ ప్రాంతాల, వివిధ భాషలలో వికసిస్తోన్న జ్ఞాన తృష్ణను, సారస్వత పునరుజ్జీవనాన్ని జిజ్ఞాసువులందరూ దర్శించుటమే త్రివేణి పరమాదర్శం, పరమధ్యేయమూను. ఏ రాజకీయ పక్షానికీ సంబంధం లేని ఉన్నత స్థాయి రాజకీయాలతోనూ, కళ,సాహిత్యం వివిధప్రాంతాల సాహిత్య రీతులు సమన్వయ దృష్టితో పరిశీలించటం జాతీయ సమైక్యతా దృష్టిని అలవరచటంతో సమగ్రమైన భారతీయ సంస్కృతికి దర్పణప్రాయంగా త్రివేణిని నిర్వహించాలన్న సంకల్పం కలిగింది. 1927 వ సంవత్సరం డిసెంబరులో చెన్నపట్నంలో కాంగ్రెసు మహాసభ జరుగుతున్నది. ఆ డిసెంబరు నెలలోనే త్రివేణికి ప్రారంభోత్సవం జరిగింది చెన్నపట్నంలో ప్రముఖ సాహిత్యప్రియులంతా తమిళులూ, తెలుగులూ ఉత్సవ సభకు వేంచేశారు. కాంగ్రెస్ సభకు విచ్చేసిన వారు కూడా కొందరు వచ్చారు. ఆ ప్రారంభోత్సవ సభకు చావలి కృష్ణయ్యగారు అధ్యక్షత వహించారు. వీరు అత్యంత ప్రతిభాశాలి. గొప్ప వక్త. చిన్న వయస్సునే చనిపోయారు. నరసారావుపేటలోని ప్రముఖ వ్యక్తుల్లో ఒకరు.

స్వరాజ్యలో పనిచేస్తున్న నా పాత మిత్రులందరూ ఆ సభలో పాల్గొన్నారు. కృష్ణశాస్త్రి, విశ్వనాథ, మల్లవరపు విశ్వేశ్వరావు, బాపిరాజు, మల్లంపల్లి మొదలైన ప్రముఖ కవులు, కళాకారులు, సాహితీపరులు ఆ సభను అలంకరించారు 'త్రివేణి' ప్రథమ సంచిక 1927 వ డిసెంబరులో వెలువడింది. అప్పటినుంచి ఏడెనిమిది సంవత్సరాల దాకా ద్వైమాస పత్రికగా వెలువడు తుండేది. తరువాత నాలుగు సంవత్సరాలు మాస పత్రికగా వెలువడింది. అటు తరువాత త్రైమాస పత్రికగా ఇప్పటిదాకా వెలువడుతూనేవున్నది. త్రివేణిలో మొట్టమొదటి వ్యాసం జినరాజాదాసా వ్రాశారు. వీరు సింహళ దేశీయులు. బహుభాషా కోవిదులు చెన్నపట్నంలో ఆ రోజుల్లో ప్రముఖ వ్యక్తి. దివ్యజ్ఞాన సమాజానికి కొన్నాళ్ళు ఉపాధ్యక్షులుగా ఉండి, అటు పిమ్మట అధ్యక్షులై మానవసేవ, జ్ఞాన ప్రబోధం గావించారు. వీరు గొప్ప ప్రతిభావంతులు; వ్యుత్పన్నులు. త్రివేణి ప్రారంభించినప్పటినుండీ, దానిపట్ల విశేషమైన ఆదరాభిమానాలు చూపుతూ, చాలా సహకారం నెరపుతూ, త్రివేణిలో ఎన్నో రచనలు గావించారు. మొదటి రోజుల్లో మోచర్ల రామచంద్రరావుగారు, పట్టాభి సీతారామయ్యగారు, వేమవరపు రామదాసు పంతులుగారు, పి. యస్. శివస్వామయ్యగారు త్రివేణిలో రచనలు చేస్తుండేవారు. సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారు కూడా శంకరాద్వైతం పైన ఇంకా వేదాంత రీతుల పైనా త్రివేణిలో కొన్ని వ్యాసాలు వ్రాశారు. జినరాజాదాసా, వివిధ విషయాలపైన వ్రాశారు భావరాజు కృష్ణారావు, బాపిరాజు మొదటి దశలో గౌరవ సహసంపాదకులుగా వుండే వారు. ఆ రోజుల్లో చెన్నపట్నం నుండి ఎమ్. శేషాచలపతిగారి సంపాదకత్వాన " న్యూఎరా " అనే మాస పత్రిక వెలువడుతుండేది. రాధాకృష్ణన్‌గారి ప్రోత్సాహం యీ పత్రికకు ఎక్కువగా వుండేది. కేసరీ కుటీరం అధిపతులు కె. యన్. కేసరిగారు, ఈ పత్రికకు ప్రచురణ కర్తలుగా వుండేవారు. ఈ పత్రికకు సలహా సమితి సభ్యులుగా రాధాకృష్ణన్, కె.టి షా, ప్రభృతులుండేవారు. అప్పుడు రాధాకృష్ణన్‌గారు ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంలో ఆచార్య పదవి నలంకరించి వున్నారు. ఒక సంవత్సరం నడిచిన తరువాత, పత్రిక ప్రచురణ ఉత్సాహదాయకంగా లేకపోయినందున, నిలిపివేశారు. ఆ పత్రికను నిలిపి వేస్తూ, త్రివేణి పత్రికలో ఆ పత్రికను అంతర్భాగంగా చేస్తున్నామంటూ వీరు ప్రకటించారు. అప్పుడు ఆ పత్రిక సలహా సంఘసభ్యులలో కొందరినీ, త్రివేణి పక్షాన కొందరినీ కలిపి త్రివేణికి కూడ ఒక సంపాదక సంబంధమైన సలహా సంఘం ఏర్పాటైంది. రాధాకృష్ణన్‌గారూ, శేషాచలపతిగారూ, పట్టాభి, జినరాజాదాసా మొదలైన వారు త్రివేణికి సలహా సంఘ సభ్యులైనారప్పుడు. త్రివేణిని ప్రారంభించిన కొద్ది కాలానికి నేను పైల్స్‌తో బాధ పడ్డాను. ఆపరేషన్ జరిగి కొంతకాలం లేవలేని పరిస్థితిలో వుండవలసి వచ్చింది. ఇందువల్ల దేశంలోని వివిధ ప్రాంతాలూ పర్యటించి, చందాదారులను చేర్పించటం మొదలైన కార్యక్రమాలు జరగలేదు ధనాభావం ఎదురైంది. తరచుగా అప్పులు చేయవలసి రావటం, విరాళాలు సేకరించటం, అనివార్యాలైనాయి. ఆస్తిని విక్రయించవలసి వచ్చింది ఇన్ని అవాంతరాలు వచ్చినా పత్రిక లక్ష్యించిన ఉన్నతాశయాలు ప్రచురణా, ఒక్కొకప్పుడు పత్రిక వెలువడటం కొంత ఆలస్యమైనా యధారీతిని కొనసాగాయి. ప్రకటితమైన ప్రతి సంచిక రూపురేఖలూ, స్థాయి ఉత్తమంగా, ఉన్నతంగా ఉండేవి సలహా సంఘం వారి సభలూ, సమావేశాలూ ఎప్పుడూ జరిగేవి కావు.

(సశేషం)

అభ్యుదయ కవిత్వం ఆధునిక పరిణామాలు

ఎస్.ఏ. రామశాస్త్రి

భారత దేశంలో ప్రాచీనకాలం నుంచీ ఒకే సంప్రదాయబద్ధమైన కవిత్వం వెలువడుతూ వచ్చింది. వాల్మీకి భావాల్నే ఆ తరువాత వచ్చిన కవులు, భావాన్ని ప్రకటించే పద్ధతిలోను, ఆ శబ్దాన్ని ప్రయోగించటంలోను కొత్త కొత్త పద్ధతులను నిర్వహిస్తూవచ్చారు. అందువల్లే వాల్మీకికన్నా వారిలో నూతనత్వం భాసిస్తూ వచ్చింది. ఈ విధంగా కవిత్వాన్ని కొత్తగా చెప్పే పద్ధతినే గ్రథనకౌశలం అంటారు. ఈ విషయాన్నే వివరిస్తూ ఒక పూర్వ లాక్షణికుడు ఇట్లా అన్నాడు.

"త ఏవ శబ్ద విన్యాసాః
తా ఏవార్థ విభూతయః
తథాపి నవ్యం భవతి
కావ్యం గ్రథన కౌశలాత్" అని

అందువల్లే రామాయణ కథ ప్రాచీనమైందే ఐనా రామాయణకథనే ఇతివృత్తంగా తీసికొని రాసిన నాటకాల్నీ, కావ్యాల్నీ చదివి ఆనందిస్తుంటారు. ఇటువంటి కవిత్వంలో సాంప్రదాయికత్వం అనేటటువంటి దొకటి ముఖ్యగుణంగా ఉంటూవచ్చింది. ఈ సాంప్రదాయికతలేని కవిత్వాన్ని పూర్వులు నిరసిస్తూ వచ్చారు. ఈ సాంప్రదాయ కవిత్వానికి భిన్నమైందే ఆంధ్రసాహిత్యంలో భావ కవిత్వం తర్వాత ఉద్ధృతంగా వచ్చిన అభ్యుదయ కవిత్వం. అభ్యుదయ కవులు భాషలోనూ, భావంలోనూ, శిల్పంలోనూ భావుకుల్ని ఎదిరించి విశిష్టమూ, విస్పష్టమూ అయిన ఒకానొక సాహిత్య మహాయుగానికి స్వాగతం పలికారు ఒక్క మాటలో చెప్పాలంటే సమస్తమైన మానవులకు సమానత్వం కల్పిస్తూ వసుధైక కుటుంబ నిర్మాణం చేయాలంటారు వీరు. మడికట్టుకొన్న సమాజంలోని పాత రీతులను సమూలంగా పెళ్ళగించి వేయాలనే సంకల్పం వీళ్ళది. అలాంటి ప్రయత్నం తెలుగులో చేయటం వల్ల అధివాస్తవికత, సెక్సు ప్రాధాన్య కవిత, సింబాలిజం, నగర జీవన చిత్రణ, వైచిత్రీ ప్రియత్వం, నిరాశావాదం మొదలైన వింత ధోరణులు ఏర్పడ్డాయి. ఇందులో ఏదీ కూడా తెలుగు దేశంలో పుట్టింది కాదు. పాశ్చాత్య కవుల్లో అతి నవ్యులు జరిపిన ప్రయోగాలన్నిటిని తెలుగులోకి తీసుకరావడానికి శ్రీశ్రీ, నారాయణబాబు, ఆరుద్ర, పఠాభి ప్రభృతులు ప్రయత్నం చేశారు. ఈ అభ్యుదయ కవులు ముఖ్యంగా వస్తువులోనే కాకుండా, భాషలో ఛందస్సులో భావవైఖరిలో కొత్త ప్రయోగాలు చేశారు.

కవితారంగంలో యీ ఉద్యమాలు ప్రత్యక్షంగా వెలవడక పోయినప్పటికీ పరోక్షంగా వీటి ప్రభావం నవ్యకవులపై ప్రసరించిందనే చెప్పాలి. ఎందుకంటే ఫ్రాయిడ్ అనే మనస్తత్వ శాస్త్రవేత్త ప్రతిపాదించిన మనోవిశ్లేషణ సిద్ధాంతమే కళారంగంలో అధివాస్తవిక కవితకు దారితీసింది. ఈ సిద్ధాంతం మానవునిలోని తీరని కోరికలకు, అణగారిన భయాలకు, తమితానుభూతులకు, ఒక నూతన వ్యాఖ్యానం. దీనికి లక్ష్యరూపం కాక లక్షణాన్ని ఒక విధంగా పాఠకులకు అందిస్తూ శ్రీశ్రీ ఏమన్నాడంటే :

"జీబ్రాకి. Algebra చిహ్నాల
లాంకోటూ, పాంకోళ్ళూ తొడిగి
సాహిత్య పౌరోహిత్యం యిస్తే
వెర్రికాదు, Sur-realism రా సోదరా"

ఇంకొక రచనలో ఈ ధోరణికి నిదర్శనంగా

"5, 3, 2 ఆముక్త మాల్యద
ఆటవెలది ద్విపదకర్తగారు"అని.

దీన్నిబట్టి అసంబద్ధత, హాస్యం, శబ్ద చమత్కారం, విశృంఖల ప్రయోగం అధివాస్తవికతకు లక్షణాలని తెలుస్తున్నది. సెక్సు కవితకు మూలం ఫ్రాయిడ్ సిద్ధాంతం. ఫ్రాయిడ్ మానవుల్లో ఉన్న కాంక్షలన్నిటికి కామవాంఛే మూలమంటూ ప్రతిపాదిస్తాడు. ఈ సిద్ధాంతాన్ని అనుసరించి తెలుగులో నారాయణబాబు 'లెండోయ్ ఋషులు' అనే గేయంలో ఇలా అంటాడు.

"కనురెప్పల సెజ్జమీద కళ్ళజోడు ముక్కుతోడ వ్యభిచరించె
నట్టింట్లో చిల్లువడిన మజ్జిగకుండా కవ్వం, చీకటి తప్పే చేశాయ్—"

ఇట్లాంటి కామోద్రేకానికి దారితీసిన ధోరణి తెలుగు కవితలో పఠాభితో అస్తమించింది.

ఇకపోతే సింబాలిజం. దీన్నే తెలుగులో ప్రతీక కవిత్వం అంటారు. కళల ప్రధాన లక్ష్యం తగిన వాతావరణాన్ని కల్పించటమే అని శబ్దానికి వట్టి భావప్రకటనే కాకుండా సూచనే ప్రధాన లక్ష్యంగా అభ్యుదయ కవులు భావిస్తారు. దీనికి ఆంగ్లంలో టి. యస్. ఇలియట్ మార్గదర్శకుడు. ఈ ప్రభావానికి లోనైన వాడు ఆరుద్ర. ఈ ప్రతీకలను 'త్వమేవాహం'లో పైథాగరస్ థీరమును సామ్యవాదాని కనుగుణంగా అన్వయింప చేస్తాడు. ఉదాహరణకు—

"చిన్న చిన్న చీమలూ వగైరా
అడుగు భుజం అనుకోండి
బలవంతమైన సర్పం
గట్రా ఎట్ సెట్రా
అడుగుభుజం ఉత్పత్తి చేసే
ఆహారంమీద ఆధారపడ్డం వల్ల
లంబం అవదామరి?"......

ఇట్లా చమత్కారంతో బూర్జువావ్యవస్థను సింబాలిక్‌గా చిత్రిస్తాడు. తెలుగు ప్రబంధాలలో పురవర్ణన ఉన్నా అది ప్రజాజీవితాన్ని సమగ్రంగా ప్రతిబింబించినట్లుగా కన్పించదు. ఒక్క ఆముక్త మాల్యదలో తప్ప. ఆధునిక కవులలో పఠాభి, నారాయణబాబు కవితల్లో ఈ నగర జీవన చిత్రణం విస్తారంగా కన్పిస్తుంది. ఉదాహరణకు పఠాభి మహానగరంపై వానకురిసే దృశ్యాన్ని వర్ణిస్తూ—

"మహానగరముమీద మబ్బుగమి గర్జిస్తున్నది
దేవుని ఏరోప్లేనుల్ భువికి దిగుచున్నటుల" అని వర్ణించాడు. మేఘ గర్జన పర్జన్యుని రథచక్రాల శబ్దం అని ప్రాచీనులు వర్ణిస్తే ఇందులో పఠాభి దేవుని ఏరోప్లేనులు దిగేటప్పటి శబ్దంతో పోల్చి ఆధునికతను ప్రదర్శించారు.

ఈ నవ్యులకు వైచిత్రి ధ్వనిలాంటిది. వీరి కవిత్వంలో హృదయంకంటె మెదడుయొక్క వికాసానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. భావం కంటే ఊహకే అగ్రస్థానం. అందువల్లే కొత్తదేదో చెప్పి చదివేవాళ్ళను ఆశ్చర్య చకితులను చేయాలనే కోరిక వీరి రచనల్లో అంతటా కన్పిస్తుంది. కనుక వస్తు స్వీకరణలోను, భావ వ్యక్తీకరణంలోను, పదప్రయోగంలోను, ఛందస్సులోను, వైచిత్రి కోసమే పాకులాడుతూ వచ్చారు. కవిత్వంలో లిపిని క్లుప్తీకరించటానికే ప్రయత్నం చేశారు. కవిత్వ నిర్వచనంలో కూడా తమ చమత్కార దృష్టిని కేంద్రీకరింప చేశారు. ఆరుద్ర మంచి రచన ఎట్లా ఉండాలో తన అభిప్రాయాన్ని ఇట్లా చెప్పాడు.

"మంచి రచన చదివాక బాగా భోంచేసి నట్టుండాలి
కొంచెం బాధ పడాలి చించుకొన్నట్టుండాలి
మనస్సుకి జ్వరంరావాలి, ఒళ్లు తిరగాలి
ఈ బాధలోంచి తేరుకొని బాగుపడాలి" అని.

ఈ వైచిత్రి వ్యక్తీకరణ వైచిత్రి అని, శబ్దవైచిత్రిఅని, ఛందోవైచిత్రి అని మూడు రీతులుగా ఉంది. వీటిల్లో యీరచయితలు చూపిన పద్ధతులు వింత వింతగా కన్పిస్తుంటాయి. ఉదహరణకు

"అడ్డము తిరిగెను అవనీస్థలి

తలక్రిందైనది ధరణితలమ్ము — అనేచోట 'అవనీస్థలి'— అనేలిపి అడ్డంగా పండబెట్టి వ్రాశారు. ఇట్లాగే 'తలక్రిందైనది ధరణి తలమ్ము అనేచోట 'ధరణి తలమ్ము' అనేలిపిని బోర్లించి వ్రాశారు. ఇంతేకాకుండా కొన్నిచోట్ల ప్లస్‌లు, మైనస్‌లు వాడారు. 'ఏడుస్తూ' అనడానికి ఏడంకెవేసి 'స్తూ' అని ప్రక్కన వ్రాశారు. ఈవిధంగాఉండే చేష్టలన్నీ పసి పిల్లల పనులవలె ఒక విధంగా ఆనందాన్నికూడ కలిగిస్తూనే ఉంటాయి. వీటన్నిటిని చిత్రించడానికి వచనగేయ రూపాన్ని స్వీకరించారు.

వచనగేయం

తెలుగులో ఈ వచన గేయం వీరిచేతుల్లో విశ్వరూపం దాల్చిందనే చెప్పాలి. నియమిత మాత్రలతో నడిచే ఛందః ప్రక్రియను గేయం అంటారు. గేయానికి ప్రాణం లయ. వృత్తాలలో ఉండే నిర్బంధాన్ని తొలగించుకొని ఇది నూతన రూపాన్ని తాల్చింది. ఈమాత్రానియమాల్ని త్రోసివేసి, చరణ నియమాన్ని తీసివేసి భావాని కనుగుణంగా పదాలను ప్రయోగించ వలసిన అవసరం వచ్చింది. ఇదేవచన గేయసృష్టికి ముఖ్యకారణం. సామాన్యంగా గేయానికి లయ ఎంత ప్రధానమో యీవచన గేయానికికూడా లయ అంతే ప్రధానం ఈలయలేని వచన గేయం జీవకళలేని చిత్రం లాంటిది. దీనినే ఆంగ్లంలో "ఫ్రీవర్సు" అంటారు. ఇది తెలుగులో శ్రీ శ్రీ "కవితా! ఓకవితా" తో ప్రారంభమై కుందుర్తి 'తెలంగాణా' అనే కావ్యంలో సమగ్రస్వరూపాన్ని పొందింది.

ఈవిధంగా ఉండే అభ్యుదయ కవిత్వం పాశ్చాత్య సాహిత్యసంపర్కం వల్లనే పెంపొంది ప్రకాశించిందనడంలో సందేహంలేదు. కాని ఇటువంటి కవిత్వం పూర్వం మనదేశంలో కూడా కొంత మంది అక్కడక్కడ రాస్తూనే వచ్చారు. ఉదహరణకు ఆరుద్ర వ్రాసిన 'త్వమేవాహంలో'

"బ్రెయిన్‌లో బ్రెన్‌గన్
రెయిన్‌లా ఆలోచనల ట్రయిన్
గ్లూమీతిమిరాలు చెరిషించి
సైతాన్ మసల్ని పెరిషించినప్పుడు—

అనేగేయం అపూర్వ పద్ధతిలో అవతరించి నట్లే మనకు కనబడుతుంది. కాని పరిశీలనతో చూస్తే ఇది పూర్తిగా కొత్తదికాదు. ఎందుకంటే.

"తండులాని గృహమందు నసంతి
తిండికైతే పదిమంది వసంతి
కుండలెల్ల గృహమందు లుఠంతి
రండనాః కొడుకు లెల్లహసంతి"—

ఈ పద్యం వినడంతోనే పై చెప్పిన ఆరుద్ర రచనల్లాంటివి మనకేం కొత్త కాదని తెలుస్తుంది. మణి ప్రవాళశైలి అనే పేర ఈ పద్ధతి మన భారతీయ సాహిత్యాలయందు చిరకాలంగా ఉన్నదే. అయితే చెప్పుకోదగ్గ విశేషమేమంటే సూత్ర ప్రాయంగా మన సాహిత్యంలో పూర్వం ఉన్న పద్ధతికే పాశ్చాత్య దేశాల్లో సాగిన రచనలవల్ల చిలవలు పలవలు ఏర్పడ్డాయి. అంతే. ఈ రచనలవల్ల పొందే ఆనందం లోకంలో, కొంత కొంత మంది కోపావేశంలో గాని సంతోష పారవశ్యంలోగాని, దుఃఖంలోగాని పలికే మాటలు వినేప్పుడు ఏ అనుభూతిని పొందుతామో అటువంటి అనుభూతుల్నే పొందగలుగుతాము. ఈ అనుభూతిలో ఉదాత్తత శూన్యం, కేవలం ఆహ్లాదం మాత్రమే మిగులుతుంది

నారాయణ బాబురచన ఐన ఈ క్రింది పంక్తులు గమనించండి:

"తాగి చనిపోయిన ఒక పుండాకోరుని
డాక్టరు శవ పరీక్ష చేసినప్పుడు:
అతని కడుపులో అరగకుండా
పైకి ఒలికిన సారా చుక్కను."

ఇట్లా అభ్యుదయ కవిత్వం అనేక పరిణామాల్ని చెంది గత నాలుగు దశాబ్దాలనుంచీ ఆంధ్ర సాహిత్యాన్ని ప్రభావితంచేసిన తరువాత దిగంబర కవిత తెలుగు సాహిత్యంలో అభ్యుదయ కవిత్వంపై తిరుగుబాటు చేసి మరొక సాహిత్య ఉద్యమాన్ని లేవదీసింది. అభ్యుదయ కవిత్వంలో వర్గ సంఘర్షణయే ప్రాణంగా ఉన్న ఒకానొక రాజకీయ సిద్ధాంత ప్రాబల్యం ఎక్కువగా గోచరిస్తుంది. కాని దిగంబర కవిత్వమనేది దీనిమీద తిరుగుబాటు లాంటిది. ఇది ఏ రాజకీయ సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నట్లు కన్పించదు సమాజంలో ఉన్న కుళ్లను కడిగివేయాలని, వ్యక్తిగతాభివృద్ధినే ప్రధానంగా భావించే ఒక మహత్తర వ్యవస్థకై పడే తపన యీ కవిత్వంలో అధికంగా కన్పిస్తూంది. వాళ్లు తమ మనస్సులో ఉన్న నూత్న భావాలను ఆవిష్కరించేందుకు పదాల్నికూడా నూత్నంగా సృష్టించారా అన్నట్లు కన్పిస్తూంది. వారి భాషే వేరు పద ప్రయోగ వైఖరే వేరు. అది ఒక ప్రక్రియకు అనుకరణ కాదు. ఇదొక స్వేచ్ఛా ప్రక్రియ. ఏది ఎట్లా ఉన్నా ఇదికూడా పాత వ్యవస్థమీద తిరుగుబాటుగానే తన ప్రత్యేకతను నిలుపుకోటానికి ప్రయత్నం చేస్తుంది. ఈ తిరుగుబాటనేది ఒక మన దేశంలోనే కాకుండా అమెరికా, ఇంగ్లండు, హంగేరి, బెంగాలులలో వేరు వేరు రూపాల్లో పెంపొందింది. ఆ ప్రభావమే దిగంబర కవులమీద ఉన్నట్లు తోస్తుంది. వాళ్ళ కవిత్వంలో ఎక్కువ భాగం ఉద్రేకం, జుగుప్స కొట్టవచ్చినట్టుగా కన్పిస్తుంది

చదివే వాళ్ళకు ఏవగింపు కలగడమే కాకుండా అంతకు పూర్వం ఉన్న అనుభూతికూడా మిగలకుండా పోతుంది. వీళ్ళకు భాషమీద సంపూర్ణ అధికారం ఉన్నట్లుగా గోచరించదు.

ఈ రకం కవిత్వం-అది అభ్యుదయ కవిత్వం కానీండి! దిగంబర కవిత్వం కానీండి, మరొకటి కానీండి: ఇవి ప్రాచీన కవిత్వంలో లా కాక మానవుడిలోని అనాగరిక ప్రవృత్తులను ప్రకోపింప చేస్తాయి. సాంప్రదాయిక కవిత్వం ఇలాకాక మానవునిలోని ఉదాత్త ప్రవృత్తులను ఉద్బోధిస్తుంది. దీన్ని వ్యవహారంలోని ఉదాహరణల్లో చెప్పాలంటే బిచ్చంకోసం వచ్చిన యాచకులలో వాళ్ళ వాళ్ళ సాంస్కారాన్ని బట్టి ఒకడు—

"శ్రీ రామచంద్ర పరబ్రహ్మణేనమః"—కాస్త ఉపాదానం పెట్టండమ్మ అని, ఇంకొకడు—

"అమ్మా! కడుపు మండిపోతుంది కాస్త బిచ్చం పెట్టండమ్మా' అని మరొకడు—

అమాంతంగా కేకవేసుకుంటూ వాకిట్లో ఊడిపడి గోళ్ళతో వళ్లు చీల్చుకొని రక్తం కార్చు కుంటూ ఉమ్మివేసుకొని మొహాన పూసుకుంటూ కేకవేస్తూ గుమ్మంలోనే నిలబడతాడు. వీడేం బిచ్చం పెట్టమని నోటితో చెప్పక పోయినా బిచ్చంకోసం వచ్చాడని తెలిసికొని వీడికీ బిచ్చం పెటూనే ఉంటాము. వీళ్ళందరి ధ్యేయమూ బిచ్చం పెట్టించుకోవడమే. అట్లానే నేడు అభినవంగా కన్పడుతున్న కవుల తీరు తెన్నులిటువంటివే. దాని కుదాహరణగా ఈ క్రింది పంక్తులను గమనించండి!

"కొడి గట్టిన చుట్ట నుసిలా
ముసుగేసుకున్న విధవలా
అలముకుంది వెన్నెల"

"ఎండిన స్తనాలమీదికి ఎగబడ్డ బిడ్డల్ని ఓదార్చలేని శోకం నీది," ఒక విధంగా ఆలోచిస్తే ఇటువంటి రచనలుకూడా మనకు కొంతవరకవసరమేమో ననిపిస్తుంది. ఎంతోకాలాన్నించి సాంప్రదాయికమైన పద్ధతుల్లో చదివే పాఠకులకు ఇదో విధంగా చిత్తవిశ్రాంతి నిచ్చి కొంతవరకు ఒక విధమైన ఆహ్లాదాన్నే కలిగిస్తున్న దనవచ్చు. ఎక్కువగా మధుర పదార్థాన్ని తినే వ్యక్తికి పులుపుమీద కూడ బుద్ధిపోవటం సహజమనటం వింత కాదుగదా! కాబట్టి ఏ ప్రక్రియ అయినా సరే, దాన్లో జీవమే ఉంటే విషయ ప్రధానం కాకుండా సాహిత్య ప్రధానంగా కాలాన్ని జయించి నిలుస్తుంది. రసం, ధ్వని ప్రాచీన లాక్షణికుల సిద్ధాంత మనుకుంటే ఆధునిక కవిత్వానికి కొలమానం ఏమిటో ఆధునికులు నిర్వచించవలసిన అవసరం ఉంది ఛందస్సు ప్రాచీనమైనా, నవీనమైనా చెప్పే విషయంలో, తీరులో సాహిత్యపు విలువ దిగజారకూడదు. కవి యైనవాడు ప్రాచీనత మీదగాని నవీనతపై గాని దురభిప్రాయాన్ని కలిగించకూడదు. ఆస్వాదయోగ్యమైన కవిత్వం ఏ రూపంలో ఉన్నా అంగీకరించ వలసిందే. ప్రాపంచిక సత్యాన్వేషణ, విశ్వ శ్రేయస్సు కావ్యముయొక్క పరమార్థాలు. కసిత్వం మాత్రం కవిత్వం కాకూడదు సుమా! ★

తెలుగులో విద్యాప్రమాణము ఎట్లు మెరుగు పరుపవచ్చును?

—గుత్తికొండ సీతారామయ్య

ప్రాథమిక విద్యపునాదిపైననే ఉన్నత విద్యాసౌధము నిర్మింపబడునుగదా! ఉచ్చారణా సౌష్ఠవము, చక్కని దస్తూరి, ఉక్తలేఖనాదుల యెడ ఒజ్జ అత్యంత శ్రద్ధవహింపవలెను. బాలుర అనుకరణశక్తి మెండు. ఎల్ల విషయములలో బోధకుడాదర్శప్రాయముగనుండవలెను. నాడు సుమతిశతకమందలి పద్యములు రాని బాలుడు లేడు. నేడు వచ్చిన బాలుడు లేడు. అలనాటి విద్యార్థి అనేక నీతి శతకముల నుండి అలవోకగా అసంఖ్యాక పద్యములను వంతపము చేసెడివాడు. ఇది విద్యార్థి ధారణాశక్తిని, గ్రహణ శక్తిని ప్రోదిసేయును.

అప్పరు ప్రయిమరీ స్కూలులో 5, 6, 7, తరగతులలో తెలుగును బోధించుటకు భాషాపండితులను నియమించినచో విద్యాస్థాయి పెరుగగలదు.

1 వ తరగతి నుండి నాలుగవ తరగతి వరకు కేవలము మాతృభాషా బోధనమునకు ప్రాధాన్యమీయవలెను.

ఈ నాటి విద్యాస్థాయి దిగజారుటకు గల కొన్నికారణములు,

(1) విద్యాభ్యాసమునందు నేటి విద్యార్థికి తగిన ఆసక్తి లేక పోవుట.

(2) వారు కేవలము పరీక్షలలో నుత్తీర్ణులై సర్టిఫికేటు సంపాదించుట కొఱకే విద్యాలయములకరుదెంచుట

(3) తల్లి దండ్రుల మనోభావముకూడ నిదియే యగుట

(4) ఉపాధ్యాయులు కూడ నిస్సహాయులై క్రమశిక్షణములను కూడ విధింపక యా మార్గములనే యనుసరించుట.

(5) ఈ నాటి విద్యావిధానమువలన అక్షరజ్ఞానము కలుగుచున్నదేకాని విషయ పరిజ్ఞానము శూన్యమగుట.

(6) విద్యార్థిలో విజ్ఞాన తృష్ణను పెంపొందించుటకు తగిన కృషి లుప్తమగుట.

(7) విజ్ఞాన జిజ్ఞాసయున్న వారికి తగిన ప్రోత్సాహము లభింపకుండుట.

(8) విద్యార్థి ప్రగతికి పరీక్షలలో నతడు సముపార్జించిన మార్కులే కొలబద్దలగుట.

(9) ప్రాథమిక దశమొదలు కళాశాల వరకు గురుశిష్యుల దృష్టి పరీక్షలపైననే కేంద్రీకరింపబడుట.

(10) విషయనిర్ణయము సైతము ఈ దృష్టితోడనే సాగి విజయము ప్రధానమై జ్ఞాన మానుషంగికమగుట.

(11) పరీక్షకులు (సెట్టర్సు) ఏ తరగతిని పరీక్షించు చుందిరో దానికి బోధకులుగాకుండుట.

(12) ఈ నాడమలునందున్న పరీక్షలు విద్యార్థుల జ్ఞాపకశక్తిని కొలుచునవియేకాని తెలివితేటలను తెలిసికొనునట్లు లేవను విమర్శకు గురియగుట.

(13) పరీక్షల కనుచిత ప్రాధాన్యమిచ్చి జ్ఞానమును వీడి కేవలము బట్టీ పెట్టుట.

(14) విద్య తన పాలిటికొక వరమనియు, అది గౌరవప్రదమైన ఒక కళయనియు, దాని ద్వారా ఉత్తమగుణ సంపన్నులము కాగలమనియు వారు తలపకుండుట.

(15) విద్యయనగ భయానకమైన భూతమనియు. దానితో పోరాడలేమనియు విద్యార్థులు భీతమనస్కులగుట.

(16) తరగతిలో ఏబదిమంది విద్యార్థులుంట వలన ప్రతి వెనుకబడిన విద్యార్థి నుండి సమాధానము రాబట్టుటకు తగిన వ్యవధి లేకుండుట.

(17) సిలబసు పూర్తియైనదను సంతుష్టి ఉపాధ్యాయునకు గాని, వచ్చినదను సంతసము విద్యార్థికిగాని లేకుండుట. సిలబసును ఆ యా తరగతుల స్థాయికనుగుణముగా రూపొందింపవలెను విద్యా ప్రణాళికలో అధికముగా పాఠముల సంఖ్య పెంచుటవలన సిలబసును తరుముకొని పూర్తి చేయవలసివచ్చుచున్నది.

పైన పేర్కొనబడినవానికి పరిష్కార మార్గములను కనుగొనుటయే విద్యా ప్రమాణములను మెరుగు పరచుటకు కారణములగును. నూరు శాతము ఫలితము సాధించిన తావుల విద్యా ప్రమాణము లెస్సగా నున్నదనుటకుగాని, విద్యా ప్రమాణములున్నచోట్ల నూరు శాతము ఫలితము వచ్చుననుటకుగాని, అధికమైన మార్కులు సంపాదించిన తావుల విద్యాస్థాయి పెరిగినదనుటకుగాని వీలుగాకున్నది. ఒకొకప్పుడు విద్యాప్రమాణములున్న విద్యార్థులకంటె బట్టీపెట్టిన విద్యార్థులకే యెక్కువ మార్కులు వచ్చుచున్నవి. కావున సగటుమార్కులే విద్యాప్రమాణపు విలువని అనుకొనుటకు వీలులేదు.

కాకతాళీయ న్యాయముగ విద్యా ప్రమాణము కొందరకు పెరుగ వచ్చును.

స్థాయిని మెరుగు పరచుటకు కారణములు.

1. కంఠస్థ పద్యమునకు రెండు మార్కులు మాత్రమే నిర్ణయింప బడినవి. ఇందువలన విద్యార్థులకు కంఠస్థ పద్యముల పై ఆసక్తి సన్నగిల్లు చున్నది. భాషలో పటుత్వ మేర్పడ వలెనవిన కొన్ని వందల పద్యములను వల్లె వేయుట యెంతయో అవసరము కదా. ఇది సాహిత్యాభి రుచిని, సాహితీ సంపదను పెంపుచేయును.

2. సాధారణముగా విద్యార్థులు వ్రాయు దోషములను ఉపాధ్యాయులు ఆయా తరగతి గదులలో వారికి తెల్పి నివారణా మార్గములను సూచించినచో వారి స్థాయి పెరుగ గలదు.

3. తెలుగు బోధనమునకు పీరియడులను పెంచవలెను.

4. సిలబసును ఆయా తరగతుల స్థాయికి అనుగుణముగ రూపొందింప వలెను.

5. పరీక్షా విధానములో విషయమున కంటె [సబ్జక్టు మేటరు] భాషకు ప్రాధాన్య మీయవలెను.

6. భాషాబోధనలో వ్యాకరణపు స్థాయిని పెంచవలెను.

7. వలసిన బోధనోపకరణములు, తగినంత మంది బోధకులున్నచో విద్యా ప్రమాణములను మెరుగ పరుపవచ్చును.

8. చర్చా సంఘములు, పత్రికా నిర్వహణము, రేడియో, గ్రంథాలయము, వ్యాస రచనలో పోటీలు విద్యార్థుల సర్వతో ముఖాభి వృద్ధికి పూలబాట లగును.

9. ఉక్త లేఖనమున కధిక ప్రాధాన్య మీయవలెను.

10. వ్యాకరణ బోధనలో గమనార్హమైన విషయములు. ఉదాహరణములు స్థిరమనియు, సూత్రములు వానికి వివరణ మనియు, వ్యాకరణము పాఠ్య భాగములో నొక భాగమే కాని అది వేరుగాదనియు, పరిచితములగు ఉదాహరణములతో వ్యాకరణము బోధించిన యిది "కొఱకరాని కొయ్య" యను భీతి విద్యార్థుల మనస్సున నుండి తొలగును.

ఈ విధముగ విద్యలో అభిరుచిని, విజ్ఞాన సముపార్జనములో ఆసక్తిని, వివిధ విషయములను తనంతట తాను స్వయం కృషిద్వారా నేర్చు కొనవలెననెడి యుత్సాహము కల్గించుట విద్యా బోధనలో ప్రధాన లక్ష్యములుగా నుండవలెను. పండు రాలి భూమి మీద పడుట అతి సామాన్య విషయము. కాని యదిపైకి నెందులకు నెగురలేదను జిజ్ఞాస జనించుట వలననే కదా న్యూటను భూమ్యాకర్షణ శక్తిని కనుగొన్నది.

విద్యార్థుల హృదయాంతరముల నిద్రాణమైన యిట్టి జిజ్ఞాసనే, ఇట్టి విషయ పరిశీలనాసక్తినే ఒజ్జ వెలికి తేవలెను. అపుడే విద్యా ప్రమాణము, విలువ, లక్ష్యములు నెఱవేర గలవు.

తమ బిడ్డలను పాఠశాలకు పంపుటతోడనే తమ బాధ్యత తీరినట్లుగ తల్లిదండ్రులు భావింపరాదు.

బడికి వచ్చుట తోడనే తమ పని నెఱవేరినదని విద్యార్థులును తలపోయరాదు. పాఠముచెప్పుట తోడనే తమకర్తవ్య మీడేరినదని ఉపాధ్యాయుడును తలపోయరాదు.

ప్రభుత్వము విద్యా ప్రణాళికను రూపొందించుట తోడనే తనపని ముగిసినట్లు ఊహింపరాదు.

పైన పేర్కొనబడిన నలువురు సమాన బాధ్యత వహించినచో ఈ నాటి తెలుగు విద్యా ప్రమాణము "మూడు పూవులారు కాయలతో విరాజిల్లగలదు.

1971 జనాభా

ఇటీవల మన దేశంలో జరిగిన జనాభా లెక్కల ననుసరించి, దేశజనాభా: 54,69,55,945. మనరాష్ట్ర జనాభా 4,33,49 951 (7.93 శాతం) జనాభా ననుసరించి మనరాష్ట్రం దేశం మొత్తంమీద 5వ స్థానంలోవుంది. ఉత్తరప్రదేశ్ (8.83 కోట్లు), బీహార్ (5.64 కోట్లు), మహరాష్ట్ర (5.03 కోట్లు), పశ్చిమ బెంగాలు (4 44 కోట్లు) మనకంటే పెద్ద రాష్ట్రాలు. 1961 లో కంటే యిప్పుడు మన జనాభా 20.60 శాతం పెరిగింది. 1971 లో మన రాష్ట్రంలో అక్షరాస్యుల శాతం 24 56; 1961 లో 21.19 శాతం మన రాష్ట్రంలో యిప్పుడు లక్ష జనాభాకు మించి నగరాలుగా పరిగణించబడే పట్టణాలు :

హైదరాబాదు, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, వరంగల్లు, రాజమండ్రి, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఏలూరు, నిజామాబాదు, మచిలీపట్నం, తెనాలి.





(1)



(2)

(3)





(4)

వార్తా చిత్రాలు

1. అనంతపురంలో శ్రీ సత్యశాయి ఆర్ట్స్ అండ్ సైన్సు స్త్రీల కళాశాల కొత్త భవనానికి రాష్ట్రపతి శ్రీ వి. వి గిరి జులై 8వ తేదీన ప్రారంభోత్సవం చేశారు.
2. ప్రారంభోత్సవానికి హాజరైన ప్రజాసమూహంలో ఒక భాగం.
3. కళాశాల భవన దృశ్యం
4. జులై 8వ తేదీన రాష్ట్రపతి అనంతపురంలోని నూనె విషయాల సాంకేతిక పరిశోధన సంస్థలోని పైలట్ ప్లాంట్‌కు ప్రారంభోత్సవం చేశారు.
5. మైసూరు గవర్నరు శ్రీ ధర్మవీరతో ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్న దృశ్యం.

(5)



మహాభారతము

తెప్పగంటుల లక్ష్మణశాస్త్రి

47

హనుమంతుడు భీమసేనునకు ధర్మోపదేశము చేసి తన విశ్వరూపమును ఉపసంహరించుకొని సాధారణ వానర **రూపముతో** భీమసేనుని ఆలింగనము చేసికొనెను. దానితో భీముని పరిశ్రమమంతయు నశించి హాయిగానుండెను. అన్నియు నతనికి అనుకూలములయ్యెను. అతనికి పూర్వముకన్న ఎక్కువ బలము కలిగినట్లు అనిపించెను. అతడు తనకన్న అధికుడు మరియొకడు లేడనుకొనెను. అప్పుడు హనుమంతుడు కన్నుల నీరుపెట్టుకొని గద్గద స్వరముతో భీమసేనునితో నిట్లనెను :—

''పాండవ వీరా ! నీ విప్పుడు నీ నివాసమునకు పొమ్ము. నన్ను మరవకుము. నేనిక్కడ నున్నట్లు ఎవరికిని చెప్పకుము. ఇప్పుడు కుబేరుని నగరమునుండి దేవాంగనలు, గంధర్వ స్త్రీలు ఇక్కడికివచ్చు సమయము. నిన్ను చూచినందువలన నాకు **గూడ** ఆనందమైనది. నీతో మాట్లాడి, నీ మానవ శరీరమును ఆలింగనము చేసుకొనుటచేత నాకు సాక్షాత్ శ్రీ రామచంద్రమూర్తితో ఆలింగనముచేసికొనినంత ఆనందమైనది. కుంతీనందనా ! నీవు నా దర్శనము చేసితివి. అది వ్యర్థము కాగూడదు. కనుక నీకు అన్ననగు నన్ను ఒక వరము కోరుము. నీవు కోరినట్లైతే ఇప్పుడే నేను హస్తినాపురమునకు పోయి తుచ్ఛులగు దుర్యోధనాదులను సంహరించి వచ్చెదను. లేదా, పాషాణ వర్షముచేత హస్తిపురిని ధ్వంసము చేసెదను. అథవా, దుర్యోధనుని బంధించితెచ్చి యిప్పుడే నీ పాదములపైన వేసెదను. నీకు ఏది యిష్టమో చెప్పుము."

ఆ మాటలకు భీమసేనుడు సంతసించి యిట్లనెను : "వానరశ్రేష్ఠా ! ఇప్పుడు నీవుచెప్పిన యీ కార్యములన్నియు నీవు నాకు చేసినట్లే భావించెదను,

నా యెడల నీ వెల్లప్పుడును ప్రసన్నుడవై నన్ను అనుగ్రహించుచుండుము. నాకు ఏ కొదువయు నుండదు. ఇదియే నా కోరిక. పాండవులకు నీవే దిక్కు. నీ తేజస్సు చేతనే మేము శత్రువులను జయించగలము". ఆ మాటలు విని హనుమంతుడు భీమసేనునితో నిట్లనెను :—

''నాయనా ! నీ యెడల నాకుగల సోదర భావము చేతను, స్నేహభావము చేతను నీకొక హితము చేసెదను. ఆయుధముల దెబ్బచేత వ్యాకులమైన శత్రు సేనలోదూరి నీవు సింహనాదము చేసినప్పుడు అది విని నేను గూడ గర్జన చేసెదను. దానిచేత నీ నాదము ద్విగుణీకృతమై శత్రువులకు మిక్కిలి భయము కలిగించును. అదిగాక, నేను అర్జునుని ధ్వజములో కూర్చొని గర్జించుచు శత్రువులకు సులభముగా ప్రాణభయము గలిగించుచుండెదను. దాని వలన మీరు శత్రువులను సులభముగా సంహరించ గలుగుదురు.'' అని చెప్పి భీమసేనునకు ఆజ్ఞయిచ్చి పంపి హనుమంతుడు అంతర్ధానము చెందెను.

హనుమంతుడు పోయిన తరువాత భీముడు ఆ గంధమాదన పర్వత ప్రదేశమంతయు తిరుగుచు హనుమంతుని శక్తిని, శ్రీరామ చంద్రుని మాహాత్మ్యమును పలుసార్లు స్మరించుకొనుచుండెను. అతడు అనేక వనములను, సుందర పుష్పవృక్షములను మనోహర సరస్సులను చూచుచు ఆనందించుచుండెను. బురదచేత లిప్తములగు మదపుటేనుగులు వర్షించు నీల మేఘములవలె అతనికి కనపడెను. అనేక మృగములుగల గంధమాదమును నిర్భయముగా ప్రవేశించి భీముడు ముందుకు సాగిపోవుచుండెను. కుసుమ గంధములచేత సువాసితములగు కోమల పల్లవ హస్తములు వాయువుచేత కదలాడుచుండగా వృక్షములు చేతులాడించుచు భీముని యనుగ్రహమును యాచించుచున్నవా యనునట్లుండెను. వికసితకమలములచేత శోభిల్లు సరస్సులు భీముని యెదుట అంజలి బంధించి నిలుచున్నట్లుండెను. ద్రౌపది మాటలను తలచుకొనుచు నతడు త్వరగా పోవుచు సాయంకాలమునందు మార్గములో నొక నదిని చూచెను. హంసాది పక్షమాలలచేత శోభిల్లుచున్న ఆ నది గంధమాదన పర్వతమునకు అలంకరింపబడిన పుష్పమాల వలె ప్రకాశించుచుండెను. ఆ నదిలో బాలసూర్యునివలె తేజరిల్లుచున్న సౌగంధిక వనమును భీముడు చూచెను. దానిని చూచి భీమసేనుడు పరమానందమునుపొంది వనవాస క్లేశము ననుభవించుచున్న తన ప్రియురాలిని తలచుకొనెను.

అట్లుపోయి భీమసేనుడు కైలాస శిఖర సమీపమునందు రాక్షస రక్షితమైయున్న యొక కమల సరసును చూచెను. అది కుబేరుని యింటి సమీపమున నుండెను. హరిత వర్ణముగల కమలములచేత అది కప్పబడియుండెను. అందులో బంగారు కమలములు, అనేక పక్షులు స్వచ్ఛోదకము గలిగి బురదలేకయుండెను

అతి మనోహరమైన ఆ సరోవరములోని శీతల మధురజలమును భీమసేనుడు పానము చేసెను. దానిని కుబేరుడు, అప్సరసలు, గంధర్వులు సేవించుచుందురు.

ఆ సరస్సును కుబేరుని యాజ్ఞచేత 'క్రోధవశులు' అను ననేక రాక్షసులు వివిధాయుధములను ధరించి రక్షించుచుండిరి. ఆయుధ ధారియై పుష్పములను గ్రహించుటకు వచ్చిన భీమసేనుని వారు జూచి, అతనిని సమీపించి, "మునివేషముతో దానికి విపరీతముగా ఆయుధములను ధరించి యిచటికేల వచ్చితివి ?" అని యడిగిరి. ఆ మాటలు విని భీమసేనుడు వారితో నిట్లనెను :—

"నేను పాండుకుమారుడను. భీమసేనుడను. మేమైదుగురు సోదరులము. పత్నితో పాటు బదరికాశ్రమమునకు వచ్చియుండగా వాయు వశాత్తు ఒక సౌగంధిక పుష్పము వచ్చి మా యాశ్రమములో పడెను. దానిని చూచి నా ప్రియ పత్ని అట్టివే మరికొన్ని పువ్వులను తెచ్చియిమ్మని నన్ను కోరగా నేను ఆమెకు ప్రియము చేయదలచి యీ పుష్పములను తీసికొని పోవుట కిచటికి వచ్చితిని." ఆ మాటలు విని యా రాక్షసులిట్లనిరి :—

"మానవోత్తమా ! ఈ సరోవరము కుబేరునకు ప్రియమైన క్రీడాస్థానము. ఇక్కడికి మనుష్యులు రాజాలరు. దేవతలు, ఋషులు, యక్షాదులు ఇక్కడికి వచ్చి కుబేరుని యాజ్ఞగొని యీ నీరు త్రాగి యిచట క్రీడింతురు. కుబేరుని అవమానపరచి అన్యాయముగా వచ్చి యిచ్చట విహరించదలచిన వాడు తప్పక నశించును. నీవు కుబేరుని తిరస్కరించి అధర్మముగా ఈ పువ్వులను తీసికొన దలచుచున్నావు. ధర్మపుత్రుడు నీకు సోదరుడంటివి. ఈ యధర్మము నెట్లు చేయుచుంటివి ? కనుక నీవు కుబేరుని యాజ్ఞగొని యీ నీరు త్రాగి యీ పువ్వులను తీసికొనుము. లేకున్నచో నిందలి ఒక పద్మమును గూడ నీవు కన్నెత్తియైన చూడజాలవు సుమా !"

అప్పుడు భీమసేనుడిట్లనెను :—

"ఓయీ ! నాకు కుబేరుడు కనబడుటలేదు. ఒకవేళ అతనిని నేనిచట చూచినను పువ్వునకై నేను యాచించను. యాచించుట రాజధర్మముగాదు క్షాత్ర ధర్మమును వీడను. ఈ సరస్సు పర్వతపు సెలయేళ్లలో పుట్టినది కాని కుబేరుని యింటిలో పుట్టలేదు కనుక దీనియందు కుబేరునకు వలెనే అందరికి గూడ సమానాధికారము గలదు ఇట్టి సార్వజనిక వస్తువును వాడుటకుగాను ఒకరు మరియొకరిని అడుగవలసిన అవసరములేదు. నాకు గూడ దీని పైన అధికారము కలదు. నేను తీసికొనెదను."

అని చెప్పి భీముడు సరస్సులో జొరబడెను రాక్షసులు ముందుకువచ్చి భీముని కొట్టబోయిరి. అతడు గదా దండమును జళిపించుచు వారినందరిని కొట్టుచు చెల్లా చెదురు చేసెను. వారు పారిపోయి కుబేరునకు తెలిపిరి. కుబేరుడు "భీమసేనుడు ద్రౌపదికొరకు సౌగంధికము తీసుకొని పోవుటకు వచ్చినాడు యథేచ్ఛగా కొనిపోనిండు" అని నవ్వుచూ వారితోననెను అప్పుడు వారు తిరిగి సరోవరమువద్దకువచ్చి చూచుసరికి భీముడు అందులో స్నానపానాదులుచేసి యథేష్టముగా పువ్వులు కోసికొనుచుండుటను చూచి ఊరకుండిరి.

భీమసేనుడు దివ్యములైన ఆ పుష్పములను అనేకములను తీసికొనెను. అప్పుడు గొప్ప సుడిగాలి భయంకరముగా వీచెను. తోక చుక్కలు, పిడుగులు పడజొచ్చెను సూర్యప్రభ తగ్గెను. భూమి కంపింపసాగెను. దుమ్ము రేగెను దిక్కులు ఎఱ్ఱబారెను మృగములు పక్షులు హాహాకారములు చేయసాగెను. ప్రపంచమంతయు అంధకారబంధురమై యేమియు కనపడకపోయెను. ఇతరములగు నుత్పాతములనేకములు సంభవించెను. అట్టి యద్భుతమునుచూచి ధర్మరాజు, మనను అవమానపరచుటకిట్లు ఎవడో ఉత్పాతములను కల్పించుచున్నాడు. మన మందరము దీని నెదుర్కొనుటకు సిద్ధముగా నుండవలెను" అని చెప్పుచు నలువైపుల దృష్టి సారించి చూచెను భీముడు ఎక్కడను కనపడకుండుటను చూచి యతడు ద్రౌపదితోను నకుల సహదేవులతోను నిట్లనెను—

''భీమునకేమైన అపాయము కలిగి యుండునా ? అతడు సాహసకార్యములేమైన చేసి యుండవచ్చును లేకున్నచో ఇట్టి ఉత్పాతములు సంభవించి యుండవు వీటివలన అత్యంత భయము కలుగుచున్నది.'' ఆ మాటలకు ద్రౌపది యిట్లనెను—

''రాజా నేడొక సౌగంధిక పుష్పము వాయు వశముచేత వచ్చి నా వద్ద పడెను అది చాలా సుందరముగాను, సుగంధముగా నుండుటనుచూచి యట్టివే మరికొన్ని పుష్పములను తెచ్చి యిమ్మని నేను భీమసేనుని కోరగా నతడు వెంటనే యీశాన్య దిక్కుగా బయలుదేరి ఆ పువ్వులను తెచ్చుటకు పోయెను.''

ఆ మాట వినగానే ధర్మరాజు తమ్ములతో 'మనము భీమునకు సహాయముగా పోవుదము' అని చెప్పి ఋషులను ఎత్తుకొని నడుచుటకు రాక్షసులను, ద్రౌపదిని ఎత్తుకొనుటకు ఘటోత్కచుని ఆజ్ఞాపించి ముందు నడవసాగెను. నడుచుచు నతడు "భీముడు పోయి చాలకాలమైనది అతడు చాలా వేగముగా వాయువువలె నడవగలడు కనుక చాల దూరముపోయి వుండవచ్చును. అతడు బ్రహ్మవాదులగు సిద్ధులకు ఏమైన అపరాధము చేయగలడేమో; ఆలోపలనే మనము వానిని చేరుదము" అని రాక్షసులతోననెను.

'అట్లేయగుగాక' యని ఘటోత్కచాది రాక్షసులు చెప్పిరి. వారికి కుబేరుని ప్రదేశము, సౌగంధిక సరస్సుగలచోటు పూర్వమే తెలియును గనుక వారు పాండవులను బ్రాహ్మణులను మోయుచు త్వరగా పోయి ఆ కొలను చేరిరి. అచట భీమసేనుని చూచిరి. అతడు మహాభయంకరముగా ప్రళయకాల రుద్రునివలె కూర్చొని యుండెను. అనేక యక్షరాక్షసుల శవములచట పడియుండెను. భీముడు క్రోధముచేత ఎఱ్ఱబారిన నేత్రములు గలవాడై పండ్లు, పెదవులు కొరకుచు గదను పైకెత్తి కూర్చొని యుండెను. అట్లున్న భీముని చూచి ధర్మరాజు సమీపించి యతనిని ఆలింగనము చేసికొని ''నాయనా ! యేమి యిది ? దేవతలకు అప్రియమైన యిట్టి సాహసకృత్యమేల చేసితివి ? ఇక నెప్పుడు గూడ ఇట్టి కార్యమును చేయకుము" అని యతనిని శాసించెను వారందరు ఆ సరస్సులో స్నానాదులుచేసి విశ్రాంతి తీసుకొను

చుండిరి. యక్ష రాక్షసులు వచ్చి ధర్మజాదులకు నమస్కరించిరి. కుబేరునకు ఈ సంగతి తెలిసి వచ్చి పాండవులను ఆదరించెను. పాండవులచటనే కొలది కాలముదాక అర్జునుని రాకకు ఎదురు చూచుచు విశ్రమించి యుండిరి.

అప్పుడు యుధిష్ఠిరుడు తమ్ములతోను భార్యతోను నిట్లనెను:— "మన మనేక తీర్థములను, పుణ్యాశ్రమములను, వనములను దర్శించితిమి. పుణ్యాత్ముల చరిత్రలు వింటిమి. పుణ్య తీర్థములలో స్నానము చేసితిమి. వివిధ పుష్ప ఫలములచేత అనేక దేవతలను అర్చించితిమి. అనేక పర్వతములను దాటి వచ్చితిమి. సముద్రములందు స్నానము చేసితిమి. నదులను సేవించితిమి. హరిద్వారములను దాటి హిమవత్పర్వతమును చేరితిమి. నరనారాయణాశ్రమమైన బదరిని చూచితిమి. ఇవన్నియు లోమశుడు మొదలగు ఋషులతో సేవించితిమి. కాని, యీ కుబేరుని నివాస స్థానమును చేరజాలకున్నాము. భీమసేనా! దీనికి మార్గమును కనుగొనుము."

ఇట్లతడు అనుచుండగనే వారికి ఆకాశము నుండి యొక అశరీర వాణి యిట్లు వినపడెను.— 'రాజేంద్రా! ఇచటి నుండి కుబేరుని నివాసమునకు మీరు పోవజాలరు. ఇది మానవులకు దుర్గమమగు మార్గము. కనుక మీరు వచ్చిన త్రోవనే తిరిగి పొండు. బదరికాశ్రమము నుండి బహు పుష్ప ఫల వృక్ష శోభితమైన 'వృషపర్వుని' ఆశ్రమమునకు పోవగలరు. దానిని గూడ దాటి 'ఆర్ష్టిషేణుని' ఆశ్రమమునకు పోయి యచట నివసింపుడు. అచటి నుండి మీరు కుబేరుని ఆశ్రమమును చూడగలరు" వారిట్లు అశరీరవాణి మాటలు వినుచుండగనే సుగంధయుక్తమగు చల్లని గాలి మెల్లగా వీచెను. వారిపైన పుష్పవర్షము కురిసెను. వారందరు ఆకాశవాణి మాటలకు విస్మయమందిరి. అప్పుడు ధౌమ్యాచార్యులు, 'మనము తిరిగి పోవుదము' అని చెప్పెను. ఆ మాట ప్రకారమే వారందరు తిరిగి బదరికాశ్రమమునకు పోయి యచట సుఖముగ నుండిరి.

జటాసుర వధ

వారు అట్లు గంధమాదన పర్వతముపైన అర్జునుని కొరకు ఎదురు చూచుచుండిరి. వారి వెంట వచ్చిన రాక్షసులు, ఘటోత్కచుడు తిరిగి వెడలిపోయిరి.

ఇట్లుండగా, ఒకనాడు భీమసేనుడు లేనిసమయమునుచూచి, ఒక రాక్షసుడు ధర్మరాజును, ద్రౌపదిని, నకుల సహదేవులను అపహరించుకొని పోయెను. ఆ రాక్షసుడు బ్రాహ్మణ వేషములో పాండవులకడ నివసించుచు "తాను వేద శాస్త్రములను తెలిసిన బ్రాహ్మణుడను" అని చెప్పికొనుచు కపటముగా వ్యవహరించుచుండెను. సమయము చూచి వారిని అపహరించదలచుచుండెను. ఆ దుష్ట రాక్షసుని పేరు 'జటాసురుడు'

ధర్మాత్ముడైన యుధిష్ఠిరుడు, ఇతర బ్రాహ్మణులతోపాటు, అతనిని కూడా ఆదరించుచు, పోషించు చుండెను. కాని, నివురు గప్పిన నిప్పువలెనున్న అతని స్వరూపమును తెలియజాలకుండెను. ఆ రాక్షసుడు, భీమసేనుడు వేటకుపోయియుండుటను, ఘటోత్కచాది రాక్షసులు వెడలిపోయి యుండుటను, లోమశుడు మొదలగు మహామునులు స్నానార్థము వెడలి యుండుటను చూచి, తన భయంకరమగు రూపము నుదాల్చి పాండవులయొక్క సమస్త శస్త్రాస్త్రములను, ద్రౌపదిని, పాండవులను రెండు చేతులతో కరుచుకొని పోవుటకు బయలుదేరెను. అప్పుడు సహదేవుడు అతి ప్రయత్నముతో రాక్షసుని పట్టు విడిపించుకొని, ఒరనుండి జారుచున్న తన కత్తిని లాగుకొని బిగ్గరగా అరచుచు, భీముడు పోయిన మార్గమునుబట్టి భీమసేనుని పిలుచు చుండెను.

అట్లు ఆ రాక్షసుని బాహువులలో బంధింపబడి పోవుచున్న ధర్మరాజు అతనితో నిట్లనెను:— 'మూర్ఖుడా! నీ విట్లు విశ్వాస ఘాతము చేసినందు వలన నీ ధర్మము నశించుచున్నది. దాని వైపు ఒకమారు దృష్టి సారించి చూడుము. మనుష్యులు, పశు పక్షి మృగాదులు కూడ ధర్మముపైన దృష్టియుంచుదురు. రాక్షసులు ఆ ప్రాణులకన్న ఎక్కువగా ధర్మవిచారము చేయుచుందురు. వారు ధర్మమునకు మూలము. ధర్మజ్ఞాన సంపన్నులై యుందురు. ఈ విషయమును దృష్టిలోనుంచుకొని నీవు మావద్దనే యుండవలెను. రాక్షసా! దేవతలు, ఋషులు, ఇతరులు, రాక్షసులు, పశుపక్షులు మొదలైన ప్రాణులందరు మాత్రమే గాక, పురుగులు, చీమలు మొదలైన అల్పప్రాణులు కూడా మనుష్యులను ఆశ్రయించియే జీవించుచున్నవి. ఈ విధముగానే నీవుకూడా మనుష్యులను ఆశ్రయించియే జీవించుచున్నావు. మానవ లోక సంపద చేతనే మీ యందరి లోకములు సంపన్నములగుచున్నవి. ఇట్టి యీ మనుష్య లోకము శోకములో పడినచో దేవతలుకూడ శోకమున పడుదురు. ఎందుకనగా, మనుష్యులు హోమములద్వారా, తర్పణాదులద్వారా దేవతలను పూజించినపుడే వారు వృద్ధిపొందెదరు. మేము దేశమును పాలించుచు, రక్షించుచు నుండెదము. మేము రక్షించని యెడల దేశమునకు సుఖశాంతులు లభించవు. రాక్షసులు నిరాపరాధులైన రాజులను అవమానపరచకూడదు. ఓ రాక్షసా! నీకు మేము అణుమాత్రముకూడా అపరాధము చేసియుండలేదు. మేము దేవతలకు మునులకు నివేదన చేయగా మిగిలిన ప్రసాదరూపమైన అన్నమును (విఘసాన్నము) గురువులకు, బ్రాహ్మణులకు పెట్టెదము. ఎల్లప్పుడు పెద్దలకు నమస్కరించుచుందుము. ఎప్పుడుగూడా మిత్రద్రోహము కాని, విశ్వాసఘాతము కాని చేయలేదు. ఎవరి యన్నము తిని, ఎవరి యాశ్రయములో సుఖముగా నుంటివో వారికే ద్రోహము తలపెట్టుచున్నావు. ఇది తగినపని కాదు. నీవంటి వ్యర్థుడు, మూర్ఖుడు మరియొకడు లేడు. నీవె మృత్యువును ఎదుర్కొనుచున్నావు. నీవు ధర్మమునే నమ్మియున్నచో మా ఆయుధములను మాకు ఇచ్చి మాతో యుద్ధముచేసి, మమ్ము గెలిచి ద్రౌపదిని తీసుకొని పొమ్ము. అట్లు చేయనిచో ప్రపంచములో నీకు అధర్మము, అపకీర్తి మాత్రమే వచ్చు. నీవు ఈ పతివ్రతా స్త్రీని తాకుటవలన గొప్ప పాపమును ఒడిగట్టుకొంటివి. అది భయంకరమైన విషము. దానిని కడవెడు త్రాగితివి.''

ఈ విధముగా చెప్పి యుధిష్ఠిరుడు తన మహిమచేత ఆ రాక్షసునకు తాను అతి భారభూతుడుగా నయ్యెను. దానితో నా రాక్షసుడు మోయజాలక పోవుచుండెను. అది చూచి ధర్మరాజు ద్రౌపదీ నకులులతో "మీరు ఈ మూర్ఖరాక్షసునకు భయపడ కూడదు. ఇతని బలమును నేను లాగుకొంటిని. అందుచేత నితడు మందగమనుడయ్యెను. మనకు కొలది దూరములోనే భీమసేనుడు ఉన్నాడు అతడు ఈ రాక్షసుని జీవితము ఒక క్షణములో హతమార్చును" అని చెప్పెను.

అప్పుడు సహదేవుడు ఆ రాక్షసుని చూచి యుధిష్ఠిరునితో "రాజా! క్షత్రియుడు శత్రువుతో ద్వంద్వ యుద్ధముచేసి తానైనను ఓడవలెను లేక శత్రువునైనను ఓడించవలెను. ఇదియే క్షత్ర ధర్మము. నేడు సూర్యాస్తమయములోపల మనమితనిని సజీవముగా విడిచినచో నేను క్షత్రియుడను కాను" అని ఒట్టుపెట్టుకొనెను.

పిదప సహదేవుడు 'రాక్షసాధమా! నన్ను చంపి ద్రౌపదిని తీసుకొని పొమ్ము. లేదా నీవైన నాచేత నేడు చావుము' అని చెప్పుచుండగనే భీమసేనుడు గదాధారియై హఠాత్తుగా నచటకు వచ్చెను. అతడపుడు వజ్రాయుధమును ధరించిన యింద్రునివలె భయంకరుడుగా నుండెను. అన్నదమ్ములను ద్రౌపదిని తీసికొని అటు నిటు సహదేవునిముందు నడయాడుచున్న రాక్షసుని జూచి క్రోధోద్దీపితుడైన భీముడు ఆ జటాసురునితో "పాపిష్ఠుడా! నీవు మా యాశ్రమములో బ్రాహ్మణవేషములో నున్నప్పుడు నీవు మా శస్త్రాస్త్రములను పరీక్షించుచున్నప్పుడే చూచి నిన్ను అనుమానించితిని. నీపైన నాకు విశ్వాసము లేకుండినను నీవు బ్రాహ్మణ వేషములో నుండుటచేతను, నిన్ను గూర్చి మావారెవ్వరు చెడ్డగా మాట్లాడకుండుటచేతను నిన్ను ఆనాడే చంపనైతిని. నీవు మా శరీరములను ప్రేమతో చూచుచుంటివి. మాకు ప్రియమైన పనులను చేయుచుంటివి. బ్రాహ్మణానిధి రూపములోనుండి యెప్పుడు గూడ ఏ యపరాధమును నీవు చేయకుంటివి. అట్లున్న నిన్ను రాక్షసుడవని తెలిసి కూడ నిరపరాధిని చంపుట నరకహేతువని నిన్ను చంపకుంటిని నేటిదాక నీ పాపము పండకుండెను. నేడు నిశ్చయముగా నీ పాపము పండి నీ యాయుష్యముమూడినది నీవు కాలబోధితుడవై ద్రౌపదిని అపహరించు దుర్బుద్ధిగలవాడవైతివి. కాలసూత్రముచే కట్టబడిన గాలమును నీవు మింగితివి. నీ ముఖము మత్స్యమువలె ఆ గాలములో తగుల్కొనినది. ఇక నీవు జీవించజాలవు. నీవు బకాసుర హిడింబాసురుల మార్గమును బట్టి పోవలెను.'' అని చెప్పెను.

అప్పుడు ఆ రాక్షసుడు ధర్మరాజాదులను విడిచి భీమునితో యుద్ధమునకు సన్నద్ధుడయ్యెను. ''భీమునితో మూర్ఖా! నీ కొరకే యిచట వేచియున్నాను. నీవు చంపిన రాక్షసులకు నేడు నీ నెత్తుటితో తర్పణము చేసెదను.' అని యనెను ఆ మాటతో భీముడు కోపోద్రిక్తుడై బాహువులప్పళించుచు వానిపై దూకెను. ఆ యిరువురకు ఘోరముగా బాహుయుద్ధము సాగెను. అప్పుడు నకుల సహదేవులు భీమసేనునకు బాసటగావచ్చిరి. వారిని భీముడు వారించి తా నొక్కడే రాక్షసుని హతమార్చెదనని చెప్పెను.

ఇట్లా యిరువురు కొంతసేపు దేవ దానవులవలె బాహు యుద్ధము చేసి, మరికొంతసేపు అచటి వృక్షములను పెరికి వృక్ష యుద్ధము చేసిరి. దానితో నచటి వృక్షములన్నియు నిర్మూలములయ్యెను. వాలి సుగ్రీవులవలె వృక్షయుద్ధము చేసి వారు అచట నున్న పాషాణములతో యుద్ధము నారంభించిరి అప్పుడు రెండు పర్వతములు మేఘ ఖండములను పట్టుకొని పోరాడుచున్నట్లుండెను. తరువాత వారు రెండు గజములు తొండములను లాగుకొనుచున్నట్లు ఒండొరుల బాహువులను లాగుకొనుచు యుద్ధము చేసిరి. తరువాత పిడికిళ్లతో కొట్టుకొనుచుండిరి. సర్పము యొక్క ఐదు పడగల తలవంటి తన ముష్టితో భీమసేనుడు అతని మెడపై నొక గుద్దు గుద్దెను దానితో నతడు మిగుల పరిశ్రాంతుడయ్యెను. అప్పుడు భీముడు ఆ రాక్షసుని తన చేతులతో పైకెత్తి నేలపై పడవేసి ముష్టి ప్రహారములతో అతని సర్వావయవములు చూర్ణముచేసి ఒక్క దెబ్బతో తలవిరిచెను. చెట్టునుండి పండువలె రాక్షసుని శరీరమునుండి తల క్రింద పడెను భీముడు యుధిష్ఠిరునికడకు పోయెను. ఋషులతనిని పొగడిరి.

యక్షయుద్ధము

జటాసుర వధానంతరము ధర్మరాజు తిరిగి నరనారాయణాశ్రమమునకు పోయి తమ్ములను ద్రౌపదిని చేరబిలుచుకొని 'మన అర్జునుడు పోయి యిప్పటికి అయిదేండ్ల కాలము గడచుచున్నది. అయిదవ యేడు తిరిగివచ్చెదనని అతడనియుండెను ఈ యైదేండ్లు దేవలోకములో అస్త్రవిద్య నేర్చుకొని వచ్చెదననెను.'అని చెప్పెను.

పిదప మునీశ్వరుల నందరను పిలిపించి వారికి నమస్కారము చేయగా వారు పాండవులకు సర్వశుభములు కలుగునట్లు ఆశీర్వదించిరి. తరువాత ధర్మరాజు సపరివారముగా నుత్తర దిక్కునకు బయలుదేరి పోయెను కొంత దూరము నడచుచు, మరికొంత దూరము ఘటోత్కచాదులపైన ఎక్కియు పోవుచుండిరి. అనేక నదులను, పర్వతములను దాటిపోయి పదునేడవనాడు హిమాలయ పృష్ఠభాగమును చేరిరి. అచ్చట అతి పవిత్రమైన 'వృషపర్వుని' ఆశ్రమముచేరి పాండవులు వృష పర్వ మహామునిచేత సన్మానితులై యచట ఏడుదినములుండిరి ఎనిమిదవనాడు ఆ రాజర్షి యాజ్ఞ ప్రకారము పాండవులు అక్కడినుండి ముందు ప్రయాణము సాగించిరి వారిని వృష పర్వుడు సాగనంపిపోయెను. ఆయన చూపిన మార్గమునుబట్టి పోయి వారు నాల్గవనాడు హిమాలయమును చేరిరి. అచటినుండి మాల్యవంతమును దాటి గంధమాదన పర్వతమును సమీపించుచు నా పర్వత సానువులపైనగల వివిధ పుష్ప ఫల వృక్షములను, మృగ పక్షికులమును పవిత్ర జలయగు గంగానదిని భీమునకు జూపించుచు ధర్మరాజు వాటిని వర్ణించుచు ముందుకు సాగిపోయి యా సమీపముననున్న ఆర్ష్టిషేణుడు అను రాజర్షి యాశ్రమముచేరి వారు ఆ మహామునికి నమస్కరించిరి.

ఆర్ష్టిషేణ మహాముని, వారు పాండవులని తెలిసికొని వారికి తగిన అతిథి సత్కారముచేసి ఆ ప్రాంతపు విశేషములను గూర్చి తెలిపెను ''ధర్మరాజా! ఈ పైనున్న మార్గమును మీరు

నడవజాలరు. అచట కైలాసము గలదు దానిని వాయు-జల భక్షణముచేయుచు మహా తపశ్చర్య చేసిన సిద్ధులు మాత్రమే చేర జాలుదురు. సామాన్యులు పోయినచో వారిని అచటి యక్షరాక్షసులు ఇనుప గుదియలతో పొడిచి చంపుదురు. అచట అప్సరఃస్త్రీలచే పరివృతుడై కుబేరుడు ఉండును అచట పర్వసంధులయందు (పున్నమ పాడ్యముల మధ్యకాలము) దేవదానవాదులు విహరించు చుందురు. చపలచిత్తు లచట నివసించజాలరు. కనుక ధర్మరాజా! ఈచోట శ్రద్ధా నియమములతో నివసించినవారు పృథివిని జయించి పాలించగలరు.'' అనిచెప్పెను.

ఆర్ష్టిషేణుని యుపదేశము ప్రకారము పాండవులా యాశ్రమమునందు ముని యోగ్యములగు కంద మూల ఫలాదులను భుజించుచు నివసించుచుండిరి. అచ్చట వారుండిన ఐదు సంవత్సరముల కాలములో అనేక మునులు, చారణులు వారిని చూచుటకు వచ్చిరి. ఒకనాడా సమీపమునందున్న కొలనిలో నున్న బుద్ధిమంతుడు. అను మహా సర్పమును గరుత్మంతుడు నోట కరచికొని యెగిరిపోయెను అప్పుడా గంధమాదన పర్వతముతో పాటు స్థావర జంగమము లన్నియు నదరిపోయెను గరుత్మంతుని రెక్కల వాయువుతో ప్రేరితములైన వివిధ సుగంధి పుష్పమాలలు ఆ గిరి శిఖరమునుండి పాండవులకడ రాలెను వాసిలో పంచవర్ణముల పూవులుండుటను చూచి ఆ పుష్ప సౌందర్యమునకు మోహితయై ద్రౌపది భీమసేనునితో నిట్లనెను:—

"నీ తమ్ముడు అర్జునుడు పూర్వము ఖాండవ దహన సమయమునందు సర్పములను, రాక్షసులను, చివరకు దేవరాజగు నింద్రుని గూడ నిగ్రహించి ఓడించి గాండీవమును సంపాదించెను. నీ పరాక్రమముగూడ నింద్రపరాక్రమతుల్యము. నీ బలము శత్రువులకు దుస్సహముగా నుండును. కనుక నీ బాహుబలోద్దేశమునకు భయపడి యీ పర్వత వాసులైన రాక్షసులుగూడ దశ దిక్కులకు పారిపోవునట్లు చేయుము. ఆ తరువాత మన మందరము గూడా నిర్భయముగా విచిత్రమాలాధారియైన పరమ శివునివలెనున్న యీ గిరి శిఖరము సందర్శింతుముగాక. నీ బాహుబల రక్షణము నాశ్రయముగా గొని యీ పర్వత శిఖరమును చూడవలెనని నాకు చిరకాలమునుండి ఆకాంక్ష కలదు."

ద్రౌపది మాటలు విని భీమసేనుడు నవ్వుచు ఆ మాటలచే ద్రౌపది తన పై సవాలు చేసినట్లుగా భావించి, అది తన బల పరీక్షకొరకు విసిరిన ఒక పెద్ద పెట్టుగా తలచి, ఆ యాక్షేపమును సహించజాలక వెంటనే సింహమువలె గర్జిల్లుచు ఆ గిరి పైకి ప్రాకబూనెను. అప్పుడచటి ప్రాణులన్నియూ నతని నూరక చూచుచుండెను. అతడట్లే బాహుబల దర్పముతో గిరి శిఖరమునకు పోయి యిచటనున్న కుబేరుని మందరమును చూచెను. అది వివిధ రత్నకాంచనమయమై ప్రకాశిల్లు చుండెను. వివిధ వృక్షశోభితోద్యానములతో ఆ మందిరము విరాజిల్లు చుండెను. దాని నాల్గు ప్రాకారములు ఆ పర్వతముకన్నను నున్నతములుగా నుండెను. అనేక యక్ష కన్యకలచట నృత్యము చేయుచుండిరి. అట్టి ఆపుర వైభవమును భీమసేనుడు తన వింటికొనను పూనుకొని వక్రముగా నిలుచుండి తిలకించు చుండెను. సుగంధివాయువు అనుకూలముగా నతని పైన వీచెను. ఆపురమునందతనికి వివిధవర్ణమను మమంజరీ సుశోభితము, రత్నరాజ విరాజితమునైన కుబేరుని నివాసస్థానము కనబడెను,

అట్లు భీముడు కొంత సేపు అచంచలముగ నిలుచుండి, పిదప శంఖనాదముచేసి యచటి వారికి గగురుపాటును. ధనుష్టంకారము చేసి యచటి ప్రాణాలకు భయోత్పాతమును కలిగించెను. ఆ శంఖనాదమును విని యక్షరాక్షస గంధర్వులు వివిధాయుధధారులై భీమునివైపునకు పరుగెత్తుచు వచ్చిరి. వారికిని భీమునకు ఘోర యుద్ధము జరిగెను. భీముని గదా ఘాతములచేత గాయపడిన యక్షరాక్షసాదుల శరీరములనుండి స్రవించిన రక్తధారలచే నెత్తుటి వాన కురిసినట్లుండెను. వారి యవయవములు తెగిపడుచుండెను. వారిచేత చుట్టబడిన భీమసేనుడు మేఘావృతుడగు సూర్యునివలె ప్రకాశించుచుండెను. సూర్య కిరణములు ప్రపంచమును కప్పినట్లు, అతని బాణములు అంతటను వ్యాపించి యుండెను. వారు గర్జిల్లుచు, అరచుచు బెదరించుచున్నప్పటికిని భీమసేనుడు కొంచెము గూడ భయపడక వారిని కొట్టుచుండెను వారు హా హా కారములు చేయుచు భయపడి ఆయుధములచటనే విడిచి దక్షిణ దిక్కునకు పారిపోయిరి.

అట్లు పోవుచున్న వారిని కుబేర మిత్రుడగు 'మణిమంతుడు' అను రాక్షసుడు చూచి వారికి రోషము గొలిపి తిరిగి యుద్ధమునకు మరలించెను. వారినందరిని గగ్గోలు పరచుచు భీముడు మణిమంతునితో ఘోరముగా ద్వంద్వ యుద్ధముచేసి యతనిని ఆ బోతును సింహమువలె నేల గూల్చెను. అట్లు పడిపోయిన మణిమంతుని జూచి హతశేషులగు యక్ష రాక్షసులు ఆర్త స్వరము చేయుచు తూర్పు దిక్కుగా పారిపోయిరి.

అనేక విధములైన ధ్వనులచే శబ్దించుచున్న గుహలో భీమసేనుడు కనపడనందువలన వారందరు విచారపడిరి. అప్పుడు వారు ద్రౌపదిని ఆర్ష్టిషేణుని సంరక్షణలో ఉంచి ఆయుధధారులై ఆ పర్వతముపైకి పోయిరి. ఆ శైలాగ్రమునందు భీమసేనుని అతనిచేత చంపబడిన మహాబలులైన రాక్షసులను చూచిరి. భీముడు రాక్షస సంహర్తయైన ఇంద్రునివలె ప్రకాశించుచుండెను. సోదరులు అతనిని కౌగలించుకొని సంతోషించిరి. ఇంద్రాది లోకపాలకుల చేత స్వర్గము శోభిల్లినట్లు వారిచేత ఆగిరిశృంగము శోభిల్లెను. కుబేర స్థానమును అచట చచ్చి పడియున్న రాక్షసులను చూచి యుధిష్ఠిరుడు భీమసేనునితో నిట్లనెను,—

"నాయనా నీవు సాహసముతోనో, మోహముతోనో ఈ పాప కర్మమును చేసితివి ముని వృత్తిలోనున్న నీకు యిది తగిన పని కాదు. వ్యర్థముగా ఈ రాక్షసులను సంహరించితివి. రాజద్రోహము చేయకూడదని ధర్మజ్ఞులు అనెదరు. కాని నీవు ఇపుడు రాజద్రోహమే కాక దేవతలకుకూడ ద్రోహము చేసితివి. ధర్మార్థములను తిరస్కరించి పాపకర్మాచరణమునందు ఇష్టము గలవానికి ఆ కర్మ ఫలము తప్పక అంటుకొనును. నా కిష్టమైన పని నీవు చేయదలచినచో నేటి నుండి మరి యెపుడు కూడ ఇట్టి పనిని చేయకుము." అనిచెప్పెను. (సశేషము)

మన అణువిద్యుత్ కేంద్రములు

** బులుసు రాధాకృష్ణమూర్తి **

మన ప్రధానమంత్రి తారాపూర్ అణువిద్యుత్ కేంద్రమును గత సంవత్సరం జనవరి పందొమ్మిదవ తేదీన దేశమునకంకితము గావించుటతో మన శక్త్యుత్పాదక చరిత్రలో నూతన శకమారంభ మైనదని చెప్పవచ్చును.

నేడు విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయు సాధనములలో అణుశక్తి ప్రముఖస్థానము వహించినది. అనేక దేశములు ఈ అణుశక్తి నుండి విద్యుచ్ఛక్తిని పొంది, పారిశ్రామికీకరణమునకెక్కువగా వినియోగించుకొనుచున్నారు. మనదేశములో ఈ అణుశక్తి పరిశోధన 1948 వ సంవత్సరములో అణుశక్తి సంఘమును స్థాపించుటతో ప్రారంభమైనది. 1954వ సంవత్సరముతో విడిగా ఒక అణుశక్తి శాఖ, డాక్టరు విక్రమ శరాభాయ్ అధ్యక్షతన ఏర్పాటు గావింపబడినది. పిమ్మట బొంబాయికి సమీపముగానున్న ట్రాంబేలో అణు పరిశోధనాకేంద్రము నెలకొల్పబడినది. నేడు ఈ కేంద్రమున కొన్ని వేలమంది ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు అణుశక్తిపై నిరంతర పరిశోధనాకృషి సల్పుచున్నారు. దీని అభివృద్ధికి మూలకారకుడు ప్రపంచ ప్రఖ్యాత విజ్ఞాన శాస్త్రవేత్త కీర్తిశేషులు శ్రీ హోమీ జె బాబా. ఈ పరిశోధనాకేంద్రము అణుశక్తి రంగములో అనేక అద్భుత విజయాలను సాధించి, రేడియో ఐసొటోప్స్‌ను పెక్కు విదేశాలకెగుమతి చేసి తద్వారా మన దేశమునకెంతో విదేశీమారక ద్రవ్యము నార్జించినది. ఈ విధముగా మనదేశములో అణు విజ్ఞానశాస్త్ర మభివృద్ధినొందెను. ఆసియాలో కెల్ల పెద్దదైన అణువిద్యుత్ కేంద్రము తారాపూర్‌లో వెలసినది.

విద్యుచ్ఛక్తిని ముఖ్యముగా మూడు విధముల నుత్పత్తి చేయవచ్చును. సహజ ప్రకృతిసంపదయైన జలపాతముల నుండి విద్యుచ్ఛక్తిని పొందవచ్చును లేక బొగ్గు, ఆయిల్ మున్నగు ఇంధన పదార్థముల నుండి ఉష్ణమును పొంది తద్వారా విద్యుచ్ఛక్తినుత్పత్తి చేయవచ్చును. పై విధముగా విద్యుచ్ఛక్తి నుత్పత్తి చేయునవి జలవిద్యుత్కేంద్రములు, థర్మల్ విద్యుత్ కేంద్రములు. మూడవది, ఆధునికమైనది అణుశక్తి నుండి ఉత్పత్తిచేయు విధానము. ఈ పద్ధతులన్నిటిలోను చౌకైనది సులువైనది జలవిద్యుత్తే అయినప్పటికీ, విద్యుచ్ఛక్తి ఎక్కువగా నవసరమగు పారిశ్రామిక ప్రదేశములలో అణువిద్యుచ్ఛక్తిని చౌకగా నుత్పత్తి చేయవచ్చును. ఈ అణువిద్యుత్ కేంద్రముల వలన మరియొక ప్రయోజనముకూడ కలదు. ఏ దేశమునందైనను బొగ్గు ఆయిల్ మున్నగు పదార్థములు పరిమితముగా నుండును కాబట్టి ఈ పరిమిత సంపదను పరిశ్రమలలో నుపయోగించి ఎక్కువ లాభమును పొందవచ్చును. 2700 టన్నుల బొగ్గు ఉత్పత్తిచేయు ఉష్ణమును కేవలము 1 కి. గ్రా. అణుపదార్థము ఉత్పత్తిచేయగలదు. సహజ ప్రకృతి శక్తియైన జలపాతములు విద్యుచ్ఛక్తి అవసరమయే ప్రాంతమునకు దూరముగ నున్న యెడల విద్యుచ్ఛక్తిని ఆ ప్రాంతమునకు పంపుటకెక్కువ ఖర్చు కాగలదు. ఈ కారణముల వలన, మన దేశము ఈ అణువిద్యుత్ కేంద్రములను నిర్మించుటలో ముందంజవేయుచున్నది.

ప్రస్తుతము మన దేశములో తారాపూర్ అణువిద్యుత్ కేంద్రముగాక, మరియొక రెండు అణువిద్యుత్కేంద్రములు నిర్మాణ దశలో నున్నవి. ఈ తారాపూర్ అణువిద్యుత్కేంద్రము బొంబాయికి సుమారు 100 కి మీ. దూరములో నిర్మింపబడినది. దీని విద్యుదుత్పాదక శక్తి 400,000 కిలోవాట్లు. ఇది పూర్తిగా అమెరికాచే సప్లయిచేయబడిన ప్రాజెక్టు. ఆసియా ఖండములోని అణువిద్యుత్ కేంద్రములన్నిటిలో నిది పెద్దది. ఈ ప్రాజెక్టు వలన గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రములు విద్యుచ్ఛక్తిని పొందగలుగుచున్నాయి. రెండవది రాజస్థాన్‌లో రాణా ప్రతాప్‌సాగర్ వద్ద నిర్మాణదశలో నున్నది. ఇది కెనడా వారి సహాయముతో నిర్మింపబడుచున్నది. దీని ఉత్పాదకశక్తి 400,000 కిలోవాట్లు. మూడవది తమిళనాడులో మద్రాసుకు సుమారు 70 కి మీ. దూరములోనున్న కల్పకం వద్ద నిర్మించుచున్నారు. ప్రారంభములో దీని విద్యుదుత్పాదకశక్తి 200,000 కిలోవాట్లు.

అణుశక్తి నుండి విద్యుచ్ఛక్తిని రూపొందించు పద్ధతి సంగ్రహముగ తెలిసికొనుట సందర్భోచితము కాగలదు. ఏదేని ఒక పరమాణువు ఒక న్యూట్రానును (న్యూక్లియస్‌లోని అంతర్భాగము) తనలో ఇముడ్చుకొనునప్పుడు స్థిరత్వమును గోల్పోయి చీలిపోవును. ఈ విధముగ చీలినప్పుడు ఆ అణువులోని కొంత పదార్థము ఉష్ణశక్తిగా మారును. ఈ ఉష్ణశక్తి నుండియే విద్యుచ్ఛక్తినుత్పత్తి చేయుదురు. అణువు పై విధముగా చీలిపోవు పద్ధతిని 'ఫిషన్' అందురు. అయితే అన్ని పదార్థములు ఈ పద్ధతిని చీలిపోవుటకు అనువుగా నుండవు. ప్రకృతిలో ఈ విధముగా చీలిపోవుటకనుగుణమైన పదార్థము ఒక యురేనియము మాత్రమే పైన పేర్కొనబడిన మూడు అణువిద్యుత్ కేంద్రములలో ఒక

తారాపూర్ అణువిద్యుత్ కేంద్రము తప్ప మిగిలినవి సహజముగా లభ్యమగు యురేనియము నుపయోగించగలవు. ఈ విధముగ స్థానికముగా పొందబడిన యురేనియము నుపయోగించు రియాక్టరు రాణా ప్రతాప్‌సాగర్ వద్ద నిర్మింప బడుతున్నది ఇది కెనడాలోని మిక్కిలి పెద్దదైన డగ్లస్ విద్యుదుత్పాదక కేంద్రము మాదిరిగా నెలకొల్పబడుచున్నది.

అణు విచ్ఛేదము జరుగు భాగమును రియాక్టరు అందురు ఈ అణువిద్యుత్ కేంద్రములో మొదటి రియాక్టరులో నుపయోగించు ఇంధన పదార్థములో సగము భాగమును హైదరాబాదులో నెలకొల్పబడిన న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ సరఫరా చేయగలదు. మిగిలిన సగభాగమును కెనడా సరఫరా చేయగలదు.

ఈ అణువిద్యుత్ కేంద్రమును నిర్మించుటలో కొంత వరకు మనదేశములో తయారు కాబడిన పరికరములనే వాడుచున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు క్రేన్లు మున్నగునవి మనదేశములో తయారుచేయబడినవే. ఉక్కును దుర్గాపూర్ ఉక్కు కర్మాగారము సరఫరా చేయుచున్నది. తమిళనాడులో కల్పకం వద్ద నిర్మింపబడు అణువిద్యుత్ కేంద్రము మాత్రము నూటికి ఎనభై వంతుల వరకు మనదేశములో తయారుకాబడిన సామాగ్రితోనే నిర్మించుటకు కృషి చేయుచున్నారు.

మొత్తము ఈ మూడు అణువిద్యుత్ కేంద్రముల నిర్మాణము పూర్తయి ఉత్పత్తి ప్రారంభించినపుడు భారతదేశము ఒక వెయ్యి మెగావాట్ల విద్యుచ్ఛక్తి నుత్పత్తిచేయగలదు.

అణుశక్త్యుత్పాదక కేంద్రములకవసరమయే యురేనియం, థోరియం మున్నగు ఖనిజ సంపదలను కనుగొనుటకై ఒక అణు పదార్థాలశాఖ వేరుగా నున్నది. దీని ముఖ్యకేంద్రము న్యూఢిల్లీలో నున్నది. ప్రస్తుతమీశాఖ బీహారు రాష్ట్రములోని రెండు యురేనియము ఖనిజసందలను అభివృద్ధిపరచుటకై కృషిచేయుచున్నది.

కీర్తిశేషులు శ్రీ హోమి జె బాబాగారి ప్రణాళిక ప్రకారము 1972వ సంవత్సరము తరువాత ప్రతి సంవత్సరము ఒక 500 మెగావాట్ల అణువిద్యుత్ కేంద్రమును నెలకొల్పవలెనని ఆశయము. జల విద్యుత్ కేంద్రములు, థెర్మల్ విద్యుత్ కేంద్రములు నిర్మింపబడినచో ఈ అణువిద్యుత్ కేంద్రములను కూడ హెచ్చు సంఖ్యలో, భారతదేశం సర్వత్ర పారిశ్రామికీకరణ పొందుటకు, నిర్మింపవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది. ముఖ్యముగా విద్యుచ్ఛక్తి కొరతగానున్న రాష్ట్రములలో ఈ అణువిద్యుత్ కేంద్రములను నెలకొల్పవలసిన అవసరం వుంది. పై మూడు అణువిద్యుత్ కేంద్రములనేకాక, మరి కొన్ని విద్యుత్ కేంద్రములను కూడ, మన ప్రభుత్వము నిర్మించుటకు యోచించుచున్నది. హర్యానా, ఉత్తరప్రదేశ్, సౌరాష్ట్ర రాష్ట్రములలో నెలకొల్పుటకు కేంద్రప్రభుత్వము పరిశీలించుచున్నట్లు పత్రికా ప్రకటన కావింపబడినది. విద్యుచ్ఛక్తి కొరతగానున్న మన ఆంధ్రప్రదేశ్‌లో ఈ అణువిద్యుత్ కేంద్రమును నెలకొల్పుట ఎంతయో అవసరము పారిశ్రామికముగా కూడ మన రాష్ట్రము వెనుకబడియున్న తరుణములో కేంద్రప్రభుత్వము మన ఆంధ్రలో ఒక అణువిద్యుత్ కేంద్రమును నిర్మించుటకంగీకరింతురని ఆశించెదము.

సర్వీసుల సమీకరణ ప్రభుత్వ ఉత్తర్వుల జారీ

సర్వీసుల సమీకరణ విషయంలో ప్రభుత్వం కల్పించిన ప్రత్యేక సౌకర్యాన్ని వినియోగించుకుని 1969 మార్చి నుండి గజిటెడ్ అధికారుల నుండి 872, నాన్ గజిటెడ్ అధికారుల నుండి 2,722 ఫిర్యాదులు అందాయి. ఆయా సందర్భాలను అనుసరించి కేంద్ర సలహా సంఘం, రాష్ట్ర సలహా సంఘాలు యీ ఫిర్యాదులను పరిశీలించాయి. కేంద్ర, రాష్ట్ర, సలహా సంఘాల సలహాలను పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం తమ నిర్ణయాలను తెలియజేసింది.

గజిటెడ్ అధికారుల 117 కేసులు, నాన్ గజిటెడ్ అధికారుల 456 కేసులకు సంబంధించి ఫిర్యాదులను పూర్తిగానో లేదా కొంత భాగాన్నో అంగీకరించటం జరిగింది. 108 గజెటెడ్ అధికారుల కేసులు, 412 నాన్‌గజిటెడ్ అధికారుల కేసుల విషయంలో ప్రభుత్వం ఉత్తర్వులను లాంఛనంగా జారీచేయటం జరిగింది.

రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన 1 [illegible]88 కేసుల విషయంలో కేంద్రప్రభుత్వ సంయుక్త కార్యదర్శుల బృందం తమ తుది సలహాను అందజేసింది 48[illegible] కేసుల విషయంలో వారు పూర్తిగానో, లేదా కొంత భాగాన్నో రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం నిమిత్తం సిఫార్సు చేశారు. 147 కేసులకు సంబంధించి సిఫార్సులు పరిశీలనలో ఉన్నాయి. లాంఛన ప్రాయంగా ఉత్తర్వులు జారీచేసి అన్ని కేసుల విషయంలోనూ ఒక ప్రతిని ఫిర్యాదు అందజేసి సంబంధిత వ్యక్తికి పంపారు.

ప్రభుత్వ ఉత్తర్వులు జారీచేయబడినప్పటికీ, వాస్తవంగా దాని ఫలితాలు సంబంధిత వ్యక్తి అనుభవంలోనికి రాలేదని కొన్నివర్గాలలో ఆరోపణ ప్రబలింది. ప్రభుత్వ ఉత్తర్వులను పూర్తిగా అమలు జరిపిన విషయాన్ని నివేదిక ద్వారా తెల్పాల్సిందిగా ప్రభుత్వం సచివాలయ శాఖలను కోరింది.

నువు లేని నీ పాట

—కశింకోట ప్రభాకరదేవ్

అమ్మా !
నువు నాకు సుదూరంలో వున్నావని తెలుసు
కాలం మనల్ని విడదీసినా
నాముందు నువు నిలబడి నవ్వుతున్నట్లేవుంది!
నిరంతర జీవన సంరంభంలో
చిక్కుకుని నేను అలసినప్పుడు
నీ చల్లని, అమృతమయి హస్తం
నన్నుతాకి పులకరింప చేస్తుంది.
నీ వొడిలో పెరిగిన నన్ను
క్రూరంగా నీప్రేమకు దూరంచేసి
ఈలోకంలో-మహారణ్యంలో
విడచిపెట్టి వెళ్ళిపోయావ్.
యింకా నాకు గతం గుర్తుందమ్మా!
అప్పుడు నేనీ ప్రపంచాన్ని చూసి
ఎంతో ఆశ్చర్యపడుతుండేవాడిని
నీ విచ్చే గోరుముద్దలు తింటూ
నువుపాడిన జాబిల్లి పాటను వింటూ
నాకున్న సందేహాలను అడుగుతుండేవాడిని
వాటికి నువ్విచ్చే జవాబులు
నాకింకా గుర్తున్నాయి సుమా!
వాటినన్నింటిని నాహృదయంలో
భద్రంగా దాచుకున్నాను
అవునమ్మా! నువు నన్ను విడిచి వెళ్ళిన తరువాత
నేనెంతగా ఏడ్చానో తెలుసా!
తెలిస్తే వెంటనే వచ్చేసే దానివి.
వెన్నెలలో కూర్చుని నీగురించి ఆలోచిస్తుంటే
ఆవెన్నెలకన్నా చల్లనైన నీమందహాసం
నా మనోగగనంలో తళుక్కుమనేది
నాదగ్గర నువ్వున్నంతకాలం
నాకీలోకం గురించి అసలేం తెలియనేలేదు.
నువు దూరం అయిన తరువాత
నాచుట్టూవున్న లోకాన్ని పరీక్షగా చూసి
భయపడుతుండే వాడిని.
ఏ ఒక్కరూ నీలాగ నన్ను ప్రేమతో పల్కరించడంలేదు.
అసలు నీలా మరింకెవ్వరూ చిర్నవ్వును కూడా చిందించడంలేదు
ఎంతో ఆశపడేవాడిని ...
ఎవరైనా నీలాగ పాటపడగలరని.
అయినా, కోయిలలా కాకులెలా పాడగలవ్?
అమ్మా! ఈలోకంలోని రోదనలు వినివిని.
నాప్రాణం విసిగెత్తిపోతుంది
నాహృదయంలో పేరుకున్న చెత్తాచెదారన్నంతా తుడిచేసి
పదేళ్ళు వెనక్కి జరిగెత్తి, బాల్యాన్ని చేరుకుంటే
అప్పుడు నీపాట వినగలుగుతాను కదూ !
కాని— అలాజరగదు
కాలం వెనక్కు తిరగదు
అందుకనే నేను...
నిశ్శబ్దంలో కనులు మూసుకుని
గతకాలపు స్మృతులను ఆహ్వానిస్తూ
నా మనోపేటికను తెరచి
నీ పాట వింటున్నాను.

(రవీంద్రుడు చూపిన మార్గంలో)

విద్యార్థులు—క్రమశిక్షణ

—పి. వి. ఎస్. ఎ. ప్రసాద్

మన దేశంలో ఏ మూల చూసినా క్రమశిక్షణా రాహిత్యము కనిపిస్తోందని చెప్పటంలో తప్పులేదనుకుంటున్నాను దీనితోడు ప్రతిమనిషి అధికారులను, ప్రభుత్వాన్ని విమర్శించటము పనిగా పెట్టుకుంటున్నారు ప్రభుత్వ అధికారులు తప్పు చేస్తున్నారనుకొందాము. మరి వారు చేస్తున్నారని మనం కూడా చేయడమేనా? గుడ్డిఎద్దు చేలోపడినట్లు మనము కూడా వారిని అనుసరించటమేనా? మనము నీతిగా, నిజాయితీగా ఉండటానికి అస్కారం లేదా? మన పనులను మనం సక్రమంగా నిర్వర్తించలేనప్పుడు మన హక్కుల కోసము ఎందుకు పోరాడాలి? మనకు పోరాడే హక్కెక్కడది?

మొదట గ్రంథాలయాల సంగతి తీసుకొందాము. అనేక పాఠశాలలకు గ్రంథాలయాలు లేవని చెప్పడం నగ్నసత్యము. కొన్ని పాఠశాలలకు, దాదాపు అన్ని కళాశాలలకు గ్రంథాలయాలు రీడింగ్ రూములు ఉన్నవికదా! మరి విద్యార్థులు చేసే పని ఏమిటి? వారు, చదువుకోడానికే గ్రంథాలయాలలోకి రావాలని మర్చే పోతున్నారు. వచ్చిన కొత్త కొత్త మాగజైన్సును—రాగానే, వాటికున్న అట్టలు, మంచిబొమ్మలు, వింతవిషయాలున్న, పేజీలు మరునాటికి మాయమగుతున్నాయి. ఇట్టి సంకుచితమైన మనస్తత్వము ఉన్న విద్యార్థులు హక్కులకోసం పోరాడుతున్నారని చెప్పుకోవడం సిగ్గుచేటు. మన విద్యార్థులు కొందరు, పత్రికలకు పత్రికలే ఇంటికి తీసుకొనిపోతున్నారు. గ్రంథాలయాలు రీడింగ్ రూములు, వారొక్కరి కోసమే స్థాపించారా? మిగిలిన విద్యార్థులు ఆ పత్రికలు చదవటానికి అర్హులు కారా? ఇట్టి విద్యార్థులకు క్రమశిక్షణ ఎలా వస్తుంది? ఇలాంటి విద్యార్థులు ఇంకా ఇంకా గ్రంథాలయాలు స్థాపించాలని ఎలా అనగలుగుతున్నారు. [తస్కరులను గురించి మాత్రమే నేననేది] కావున ఇట్టి మనస్తత్వము మారితే కాని, విద్యార్థులు కోరికలు కోరరాదు.

రెండవది, జీతం కన్సెషన్లు, పేదబాలుర సహాయ నిధులు తీసుకొందాము. అనర్హులకు ఇవి అందుతున్నాయని వేరే చెప్పనక్కరలేదు. విద్యార్థులకు, ఈ అవినీతిలో చాలా పెద్దచేయి ఉంది. లక్షాధికారుల కుమారులకు, కోటీశ్వరుల ముద్దుకొమరులకే పైన చెప్పబడిన మినహాయింపులు లభిస్తున్నాయి. మరి విద్యార్థులు దీనిని ఆపలేకపోతున్నారు. అందరికి ధనాశ! మరి ఇలాంటి విద్యార్థులు ఎక్కువగా, ఉపకార వేతనములుండాలని ఎలా కోరగలరు? ఈ సంకుచితమైన మనస్తత్వము పోయిననాడే, ఎక్కువ మినహాయింపులు ఉపకారవేతనాలు పెట్టిన ఉపయోగము. అప్పుడే క్రమశిక్షణారాహిత్యము తొలగగలదు.


పరీక్షలలో "కాపీ" చేయటమనే అంటువ్యాధి మనలో చాలా మందికి ఉంది. పరీక్షల ముఖ్యోద్దేశము. విద్యార్థులు చదివిన విషయాలను వారు ఎంత వరకు అర్థం చేసుకొన్నారని పరీక్షించటము మరి కాపీవల్ల ప్రయోజనమేమి? నేడు కాపీకొట్టినవిద్యార్థియే రేపటి ఉపాధ్యాయుడుగదా! కాపీకొట్టినందువల్ల విద్యార్థికి, తొంబదితొమ్మిది మార్కులు రావచ్చును. నిజముగా అతనికి వచ్చు మార్కులు "సున్న"గదా! ఇటువంటి పనులుచేయు మనము, మన హక్కుల కోసము ఎటుల పోరాడగలుగుదుము? ఇటువంటి ఉపాధ్యాయుడు విద్యార్థులకేమి చెప్పగలడు క్రమశిక్షణనెట్లు పెంపొందించగలడు. కావున విద్యార్థులు ఈ జాడ్యమును తొలగించుకొని బాధ్యతారహితులుగా ప్రవర్తించరాదు. అప్పుడే క్రమశిక్షణ నెలకొనగలదు అప్పుడే మనకు, మన కోరికలు కోరటానికి హక్కేర్పడుతుంది. పిన్నలే, పెద్దలకు బుద్ధులుచెప్పాలి? మనమే అధికారుల, ఉపాధ్యాయుల కనులు తెరిపించాలి. కావున, మనము మన నడవడికను మనమే తీర్చిదిద్దుకోవాలి.

విధ్వంసకచర్యలు చేయటము, ముఖ్యముగా విద్యార్థులకు ఒక ఆటగా పరిణమించింది. అయిన దానికి, కాని దానికి సమ్మెలుచేయుట గర్హనీయము. శాంతిదూతలు నివసించిన భారతదేశంలో అశాంతి కనిపిస్తోంది. సమ్మెలు చేయుట మహాత్మా గాంధి గర్హించారు. సమస్యలు ఉత్పన్నమవటము సహజము. మరి వానిని తీర్చుకొను తరుణోపాయము ఒక సమ్మెలేనా? శాంతి పద్ధతులు లేవా? గాంధీ జయంతులు చేయటమే తప్ప. వారిబోధనలు వినటము ఆచరించటము మనకు పడదా? హింసకు ఎక్కువ ఆకర్షణ ఉంటుంది. కాని ఇది తారాజువ్వవలె ఒక్కసారి విజృంభించి చల్లబడుతుంది. ఫలితము శూన్యము. కావున సమస్యలను సాధ్యమైనంతవరకు శాంతియుత పద్ధతులద్వారా సరిచేసుకొనవలెను. సమ్మెలవలన ఏమియు లాభములేదు. సమ్మెలవలన విద్యార్థులు సాధించిన దానికన్న సాధించనిది ఎక్కువ. "విశాఖ ఉక్కు" "ఆంధ్రులహక్కు" అని చేసిన సమ్మెలు ఆత్మ దానములు నిష్ఫలములు. వానివల్లనే ఉక్కు కర్మాగారము స్థాపించబడుతోందని అనుకోవడం పొరపాటు. ప్రభుత్వము వీలు చూసుకొని కర్మాగారాలను స్థాపిస్తోంది. అటులనే "తెలంగాణ" "హిందీ వ్యతిరేక సమ్మెలు, నిష్ఫలములు, అసర్థకములు. దీనివలన కోట్లకొలది రూప్యములు బూడిదపాలయినవి. పేద భారతదేశమునకు ఇది గట్టి దెబ్బ. దేశాభ్యుదయాన్ని తమచేతులారా నాశనము చేసుకొనుట క్రమశిక్షణా? ఇటువంటి పరిస్థితులలో మన హక్కుల కోసము ఎట్లు పోరాడగలము?

కావున విద్యార్థులు సమ్మెలకు స్వస్తిచెప్పి తమ నడవడికను తామే తీర్చిదిద్దుకోవాలి. రాజకీయ కాములకు, అవినీతిపరులకు విద్యార్థులే బుద్ధిచెప్పాలి. దీనిని తమ నడత ద్వారా చూపించవలెను అవినీతిని ప్రోత్సహించేవారు తమ తల్లిదండ్రులయినను విద్యార్థులు గర్హించవలెను. ఆనాడే విద్యార్థి క్రమశిక్షణ నేర్చుకొన్నవాడగును. చిన్నచిన్న విషయములందు సైతము విద్యార్థి తన మంచి నడతను చూపించవలెను. అదే అతనికి దేశానికి శ్రీరామ రక్ష। ఆనాడే మనహక్కులకోసము పోరాడే హక్కొస్తుంది మనకు. అప్పుడే మనము హక్కులకోసము పోరాడాలి.

[లోగడ ఆంధ్రప్రదేశ్‌లో ప్రచురించిన
శ్రీ హనుమత్ ప్రసాద్‌గారి వ్యాసం పురస్కరించుకుని]

ప్రజలకే




ట్రాఫిక్ సంచార దళం

పోలీసు పౌరులకు ఒక మంచి స్నేహితుడు. అత్యవసర పరిస్థితిలో శాంతిభద్రతలను పరిరక్షిస్తాడు. మామూలు పరిస్థితుల్లో సమాజంలోకి ఆపదలు దూరి రాకుండా సమాజ సౌధానికి కావలి కాస్తుంటాడు. అందుకే మన సాంఘిక వ్యవస్థలో పోలీసుల పాత్ర అత్యంత ప్రధానమైనదీ, ప్రాముఖ్యమైనదీనూ.


వెనకటి ఆంధ్రరాష్ట్ర పోలీసు బలగం, తెలంగాణాలోని వెనకటి హైదరాబాదు రాష్ట్ర పోలీసుబలగం విలీనమై ఆంధ్రప్రదేశ్ పోలీసు ఫోర్సు ఏర్పడింది మన రాష్ట్రంలో మొత్తం 819 పోలీసు స్టేషన్లూ, 232 అవుట్ పోస్టులూ వున్నాయి 74 పోలీసు సబ్ డివిజన్లూ, 186 పోలీసు సర్కిళ్ళూ వున్నాయి. రాష్ట్రంలో సివిల్, రిజర్వ్ పోలీసు బలగం మొత్తం 51,333 వుంది. అంటే మన జనాభాలో ప్రతి 899 మందికి ఒక పోలీసు వున్నాడు. విస్తీర్ణంలో చెప్పాలంటే 100 చ. కిలో మీటర్లకు 19 మంది చొప్పున పోలీసువాళ్ళున్నారు. జంటనగరాల్లోని ప్రజల్లో శాంతి భద్రతల పట్ల విశ్వాసాన్ని కలిగించే వుద్దేశంతో సంచార పోలీసు కార్లను ప్రవేశపెట్టారు. వీటికి అధిక శక్తిగల వి. హెచ్. ఎఫ్ సెట్లను కూడా ఏర్పాటు చేశారు. ఇవి రాత్రింబగళ్ళు జంట నగరాల్లో తిరుగుతూనే వుంటాయి. అత్యాధునిక పరికరాలతో కూడిన సెంట్రల్ పోలీసు కంట్రోలు రూము ఆదేశాల మేరకు యీ కార్లు సంచరిస్తుంటాయి. అందువల్ల అల్లర్లు జరిగిన ప్రాంతానికి యీ కార్లు నిమిషాల మీద చేరుకోవానికి వీలవుతుంది. హైదరాబాదులోని సెంట్రల్ కంట్రోల్ రూము వద్ద పోలీసు కమ్యూనికేషన్ కంట్రోల్ కేంద్రాలు రెండువున్నాయి. జంట నగరాల్లో యిప్పుడు అత్యధిక శక్తివంతమైన వి. హెచ్. ఎఫ్ సెట్లతో 24 సంచార పెట్రోల్ కార్లు తిరుగుతున్నాయి.

నేరపరిశోధనలో ఆధునిక శాస్త్రవిజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం ప్రధానమైన పాత్రవహిస్తుంది. పోలీసుశాఖకు చెందిన నేరపరిశోధక విభాగం అత్యాధునికమైన శాస్త్రీయ పరికరాలు కలిగి వుంది. పోలీసు నేరపరిశోధక శాఖలో కొత్తగా చేరినవారికి పోలీసు శాఖ కార్యక్రమాలు క్షుణ్ణంగా అవగాహన కావడానికిగాను 1957 డిశంబరులో పోలీసు మ్యూజియం ఒకటి ప్రారంభించబడింది. నేరాన్ని కనుగొనడంలో శాస్త్రపరికరాలు ఏ విధంగా తోడ్పడతాయో వివరాలు నేరాల్లో వాడే ఆయుధాలు, వ్రేలిముద్రల చరిత్ర, వాటి ఉపయోగాలు పాద ముద్రల రకాలు, చెల్లని నాణాలు, నోట్లు, వాటిని తయారుచేయడానికి ఉపయోగించే బ్లాకులు, మోల్డులు, రకరకాల తుపాకులు, మందుగుండు సామగ్రి, ప్రేలుడు సామగ్రి

సి. ఐ. డి. శాస్త్రీయ మ్యూజియం లోపలి భాగం



హైదరాబాదులోని ...



ం పోలీసులు



ఫార్వర్డ్ కంట్రోలింగ్ జీపు

వంటి పోలీసులకు సంబంధించిన విధినిర్వహణలో తోడ్పడే పరికరాలు అనేకం యీ ఎగ్జిబిషన్లో ప్రదర్శించ బడుతున్నాయి.


శాంతి కాలంలోనూ, అత్యవసర పరిస్థితుల్లోనూ, పోలీసు వార్తాప్రసారాల పాత్రను గురించి ప్రత్యేకంగా పేర్కొనవలసివుంటుంది. పోలీసు రేడియో ఆర్గనైజేషన్ ఒకటి హైదరాబాదు హెడ్ క్వార్టర్సుగా పనిచేస్తోంది. వార్తా ప్రసారాలకు సంబంధించిన పోలీసు సూపరింటెండెంట్ నాయకత్వంలో యిది పనిచేస్తోంది. ఈ వార్తా ప్రసార విభాగంలో 140 హెచ్. ఎఫ్ సెట్లు, 107 సంచారిక వి.హెచ్.ఎఫ్ వైర్‌లెస్ సెట్లువున్నాయి. వరదలు తుఫానులు వంటి అత్యవసర సమయాలలో టెలిఫోన్, టెలిగ్రాఫ్ సౌకర్యాలు విచ్ఛిన్నమైనప్పుడు వార్తా సౌకర్యాల ఏకైక సాధనం యిదే. ఇటీవల శ్రీకాకుళం, నెల్లూరు, కరీంనగర్ ఏజన్సీ ఏరియాలలో నక్సలైట్లను అణచివేయడంలో పోలీసు బలం చేసిన అశేషకృషిలో రాష్ట్ర పోలీసు రేడియో వ్యవస్థ ఎంతగానో తోడ్పడింది. ఆ యా ప్రాంతాలలో అనేక సంచారిక రేడియో సెట్లను ప్రవేశపెట్టింది.

ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖకు ఒక స్వంత పోలీసు రవాణా వ్యవస్థవుంది. అన్నిరకాల పోలీసు శకటాలను మరమ్మతులు చేయడం, వాటిని నడిపించడం యిక్కడే యీ విభాగం చేస్తుంటుంది. ఈ విభాగం ప్రధాన కార్యాలయం హైదరాబాదులో వుంది. పోలీసు సూపరింటెండెంట్ హోదాగల పోలీసు ట్రాన్స్‌పోర్ట్ అధికారి ఆధ్వర్యంలో యీ విభాగం పనిచేస్తుంటుంది.


ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు ఉద్యోగులకూ, ప్రొబేషనరీ పోలీసు సబ్‌ఇన్స్పెక్టర్లకూ అనంతపురంలోని పోలీసు శిక్షణ కళాశాలలో శిక్షణ గరపబడుతుంది. పోలీసులకు అనంతపురం, హైదరాబాదు విజయనగరంలలోని పోలీసు రిక్రూట్ల స్కూళ్ళలో శిక్షణ గరపబడుతుంది.

రాష్ట్రంలో హోంగార్డ్సు ఆర్గనైజేషన్ అనే స్వచ్ఛంద దళం 1963 ఏప్రెల్‌లో చైనా దురాక్రమణ అనంతరం ప్రారంభించబడింది. ప్రస్తుతం మన రాష్ట్రంలో 7,700 మంది హోంగార్డులు వున్నారు. రాష్ట్ర జనాభా, విస్తీర్ణం దృష్ట్యా యీ బలం చాలదు. ఈ స్వచ్ఛంద సంస్థ శాంతి భద్రతల పరిరక్షణలో అమితంగా తోడ్పడుతుంది. ముఖ్యంగా జాతర్లు, సంతలు, పండుగ ఉత్సవాలప్పుడు, ప్రముఖులు వచ్చినప్పుడు, ట్రాఫిక్ డ్యూటీల్లోనూ, సమ్మె సమయాలలో ప్రధానమైన [illegible]ల నిర్వహణలోనూ యీ దళం అవసరం ఎంతైనావుంది.

క్రైమ్ స్టేషను భవనము



స్వాతంత్ర్య దినోత్సవ సన్నాహాలలో గుర్రపు దళం



విద్యారంగంలో పురోగతి

గుంటూరు జిల్లా పరిషత్ హైస్కూళ్ళ ఆదర్శం

మైనేని వెంకటరత్నం

విద్యారంగం ఇప్పుడున్నంత కల్లోలంగా ఎప్పుడూ లేదు ఏరోజు పత్రిక చూచినా విద్యార్థుల్లో వ్యాపించిన అశాంతి—వైరాగ్యం క్రమ శిక్షణా రాహిత్యానికి చెందిన అనేక వార్తలు వస్తున్నాయి పబ్లిక్ పరీక్షలన్ని బహిష్కరించడం, పేపర్లను చింపేయటం, వాచర్లను బెదిరించటం, బస్సుల్ని దగ్ధం చేయటం, ప్రభుత్వ ఆస్థిని ధ్వంసం చేయటం, ఎన్నో అవాంఛనీయ పరిస్థితులు బాహాటంగా సాగుతున్నయ్ పర పరిపాలనా ఫలితంగా సంక్రమించిన బానిస విద్యా విధాన దుష్ఫలితాలను జాతి జాతంతా యింకా అనుభవిస్తున్నది

స్వరాజ్యం వచ్చిన తర్వాత జాతీయ విద్యా విధానం రూపొందించటానికి అనేక ప్రయత్నాలు జరిగినయ్ విద్యా కమిషన్లు నియమింపబడినయ్ స్వయం వికాసం, వ్యక్తిత్వం, దేశభక్తి స్వావలంబ జీవనాలను ప్రోత్సహించే విద్యా విధానం కావాలని మొన్న మొన్న నియమింపబడిన కొఠారీ కమీషన్ కూడ అనేక సూచనలు చేసింది. కాని మెకాలే పుణ్యమా అని నర నరాల్లో జీర్ణించిన బానిస మనస్తత్వాల ప్రభావం మనల్నింకా పీడిస్తూనే ఉంది మూల కారణాల్ని వెతికి మందు వేస్తే తప్ప పైపై పూతలతో ఏమీ లాభం కనిపించటం లేదు.

ఆ నైరాశ్య పరిస్థితుల్లో కాఱు చీకట్లో కాంతి రేఖల్లా గుంటూరు జిల్లా పరిషత్ హైస్కూళ్ళలో కొన్ని ప్రయోగాలు సాగుతున్నాయి పంకంలో పుట్టే పద్మాల్ని వికసింపజేసే కృషి అక్కడ కొనసాగుతున్నది చీకట్లుల్ని తిడుతూ కూర్చోకుండా నిర్మాణయుతమైన ఆచరణ ద్వారా అక్కడ కొన్ని చిఱుదీపాల్ని వెలిగిస్తున్నారు. మట్టిలోనుండి మాణిక్యాల్ని వెతికితీయవచ్చనీ, ఆదర్శాలనేవి ఆకాశంలో నుండి ఊడి పడేవి కావనీ దృఢ సంకల్పమూ కార్య దీక్షా ఉంటే వాటిని సాధింపవచ్చనీ అక్కడి ఉపాధ్యాయులు ఆచరణ పూర్వకంగా నిరూపిస్తున్నారు గత పది సంవత్సరాలుగా ప్రయోగాత్మకంగా నడిపింపబడుతున్న సెకండరీ పాఠశాలలో పబ్లిక్ పరీక్షలలో అవి సాధిస్తున్న గణనీయ ఫలితాలే దీనికి ఉదాహరణగా చెప్పవచ్చును.

ఒక వైపు విద్యాశాఖాధికారులు విద్యాస్థాయిపడి పోతున్నదనీ, ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలనీ హెచ్చరిస్తూ ఉండగా మరో వైపు స్వయం ప్రభావితమైన గుంటూరు జిల్లా పరిషత్ ఉపాధ్యాయ వర్గం అపూర్వ ఫలితాలను సాధిస్తున్నది.

ఆ పురోగతి గమనించి అనుభవాన్ని స్వీకరించి గుణపాఠాలను నేర్చుకొని ముందుకు పోవాల్సిన బాధ్యత ఆ రంగంలో పని చేసే వారందరి పైనా ఉంది

పూర్వ రంగం

పై నిర్మాణ కృషికి 1960 లో కీ. శే. శ్రీ కొత్తరాజు బాబయ్య తెనాలి తాలూకా, సంగం జాగర్లమూడి పరిషత్ హైస్కూలులో బీజావ్యాప్తం చేశారు గుంటూరు జిల్లాలో ఆదర్శోపాధ్యాయుడుగా కేంద్రప్రభుత్వ అవార్డు నందుకొన్న ఘనత ఆయనకే దక్కింది

ఆయన సోదరోపాధ్యాయుల సహకారంతో నిర్విరామ కృషి సాగించి విద్యార్థులలో క్రమశిక్షణాభివృద్ధికి, నైతిక శక్తి ప్రదీప్తికి ఆత్మ విశ్వాసోన్మీలనకు ఎన్నో ప్రయోగాలు చేశాడు.

1 ఇన్విజిలేటర్లు లేకుండా పరీక్షలు జరుపుట

2 హానెస్ట్ స్టోర్సూ, పోస్టాఫీసూ నడుపుట

3 పాఠ్యేతరాంశాలలో అధిక శ్రద్ధ చూపుట

4 అనవసరమైన స్పెషల్ ఫీజుల వసూలు ఆపి ఆర్థిక భారాన్ని తగ్గించుట

5 పాఠ్యాంశ బోధనలో నూతన పద్ధతులవలంబించుట

6. ఉపాధ్యాయుల, తలిదండ్రుల, విద్యార్థుల సహకారాన్ని పొందుట

మొదలగు అంశాల మీద ఆయన తన కృషిని కేంద్రీకరించాడు ఫలితంగా పబ్లిక్ పరీక్షలలో అక్కడి విద్యార్థులు 100% ఫలితాన్ని సాధించడమే కాక స్కాలర్ షిప్‌లు పొందటం, ఉన్నత విద్యాభ్యాసంలో గడితేరటం జరిగింది

ఆయన నెలకొల్పిన సుసాంప్రదాయాల్ని ఆదర్శంగా పెట్టుకొని జిల్లాలో చాలా హైస్కూళ్ళు పోటీపడ సాగాయి ఉపాధ్యాయ వర్గం చేసిన అవిరళ కృషి ఫలితంగా గణనీయ ఫలితాలు వెలువడినాయి

సత్ఫలితాలు

1963 దాకా అమలులో ఉన్న ఎస్ ఎస్ ఎల్ సి లోనూ తర్వాత అమలులోనికి వచ్చిన ఎస్ ఎస్ సి లోనూ కని విని యెరుగని యీ క్రింది ఉదాహరణలు వెలుగులోకి వచ్చాయి

ఎస్.ఎస్.ఎల్.సి మరియు ఎస్. ఎస్.సి పబ్లిక్ పరీక్ష ఫలితాలు

1. సంగం జాగర్లమూడి (తెనాలి తాలూకా)

సంవత్సరం	1961	62	63	64	65	66	67	68	69	70
హాజరైన విద్యార్థులు	30	43	41	70	67	76	52	74	66	42
కృతార్థుల శాతం	100	100	100	96	97	96	98	100	99	71

2. కొల్లూరు (తెనాలి తాలూకా)

సంవత్సరం.	1963	64	65	66	67	68	69	70
హాజరైన విద్యార్థులు	36	68	65	65	63	67	87	68
కృతార్థుల శాతం	97	99	100	100	100	100	82	100

సంవత్సరం

3. దోనెపూడి (తెనాలి తాలూకా)

	1963	64	65	66	67	68	69	70
హాజరైన విద్యార్థులు	11	20	20	14	25	25	32	16
కృతార్థుల శాతం,	91	100	100	100	100	100	100	94

4. అబ్బినేని వారి పాలెం (గుంటూరు తాలూకా)

సంవత్సరం	1965	66	67	68	69	70
హాజరైన విద్యార్థులు:	26	20	36	29	53	22
కృతార్థుల శాతం	100	100	100	100	96	91

5. దొప్పలపూడి (బాపట్ల తాలూకా)

సంవత్సరం	68	69	70
కృతార్థుల శాతం	100	90	100

ఈ విధంగా 1968 ఎస్.ఎస్ ఎల్ సి స్కీము అంతమయ్యే నాటికి జిల్లాలో గల 146 పరిషత్ హైస్కూళ్ళలో 35 పాఠశాలలో 90% పైన ఫలితం సాధించగలిగింది.

1969-70 ఇంటిగ్రేటెడ్ సిలబస్ ప్రకారం జరిగిన ఎస్ ఎస్ సి లో రాష్ట్ర సగటు ఫలితానికి గుంటూరు జిల్లా పరిషత్ హైస్కూళ్ళ సగటు ఫలితానికీ ఎంతో తేడా కన్పిస్తున్నది.

1970 ఆంధ్రప్రదేశ్ ఎస్ ఎస్.సి.లో సగటు శాతం 18% గుంటూరు జిల్లా పరిషత్ హైస్కూళ్ళ సగటు శాతం 61 4% పై ఋజువుల్ని బట్టి ఇచటి హైస్కూళ్ళు గణనీయ ఫలితాల్ని సాధించినట్లు వెల్లడౌతున్నది.

పై ఫలితాలు ఎలా సాధింప బడినవి?

వాటి మూలకారణా లేమిటి?

వాటిని యీ క్రింది విధముగా విభజింపవచ్చును.

1. ఉపాధ్యాయుల ఆదర్శోత్సాహం
2. సమిష్టికృషి
3. పాఠ్యేతరాంశ శిక్షణ
4. విద్యాభిమానుల ప్రోత్సాహం
5. అధికారుల సహాయం

1. పై ప్రయోగాలకు చెందిన అనుభవాలను సమన్వయించి సెమినార్ల ద్వారా ఆ సత్కృషిని విద్యాశాఖాధి కారులు ప్రోత్సహించాలి.

2. ఆదర్శ కృషి సాగిస్తున్న ఉపాధ్యాయుల్ని బహుమతులు, షీల్డు ద్వారా గౌరవించాలి.

3. పరిషత్ ఆఫీసుల్లో ఉపాధ్యాయుల సమస్యలు త్వరత్వరగా పరిష్కరింపబడాలి.

4 సంవత్సరం మధ్యలో బదిలీలు ఆపేయాలి.

5. జీవనవ్యయం సూచికనుబట్టి వేతనాలు పెంచాలి.

అభివందనాలు

సోషలిష్టసమాజ నిర్మాణానికి. క్రొత్తగా పార్లమెంటు ఎన్నికలు జరిగిన యీతరుణంలో. జాతిచైతన్యాన్ని ప్రతిబింబించే విద్యారంగం నవనవోన్మేషంకావడానికి దోహదమిస్తున్న వేలాది ఉపాధ్యాయులకు అభినందనలు

ఆదర్శ పాఠశాలల విషయంలో ప్రత్యేక శ్రద్ధా సక్తులు ప్రదర్శిస్తున్న అధికారులకు, అనధికారులకు, విద్యాభిమానులందరికి జేజేలు!

★

శరన్మేఘాలు

పి.వి.యల్. నరసింహారావు

"ఏరులో యేముంది?" అన్న పెద్దలను "నా ప్రక్కనే పెద్ద కొండ వుండా లేదా?" అని పెనుకొండ సవాలు చేస్తే, దానికి దగ్గరలోనే వున్న పాలసముద్రం "మీకు కొండలా నేను అండగా వున్నాలెమ్మని," హామీ యిచ్చింది. పాలసముద్రంలో పాలు పొరచు వున్నందా అందులో కలిపేందుకు కావలసిన నీరు కూడా అంతంత మాత్రమే. రాయలనాడు మావీధుల్లో రత్నాలు రాసులుగా పోసి అమ్ముతూ వుండే వారని ప్రగల్భాలు పలికే ఆ వూరి వారు నేడు యింతై . . యింతింతై . . పెరిగి పోతున్నా పెంటకుప్పలను చూసీచూడనట్లుగా దాటిపోతూంటారు. 'రాజుల సొమ్ము రాళ్లపాలు' అన్న నానుడికి రూపకల్పనలా వాటి కళా వైభవానికి మచ్చుతునకల్లా పడకా నిలబడకా ఊగిసలాడుతూ కనిపిస్తుంటవి. వూరు చుట్టూ యేన్నోగుళ్లు గోపురాలూ, భవనాలూ ప్రాకారాలూ మల్ల యుద్ధ మందిరాలూను.

అయితే అదంతా గత చరిత్ర వర్తమానంలో పెనుకొండను పెనవేసికొన్న పరిస్థితులో నుండి భవిష్యత్తు తొంగిచూస్తున్నది.

ఊరి ప్రక్కనే పారుతూంటుంది ఒక పెద్ద (సెల)యేరు. దానిలో నీరు సంవత్సరానికి ముప్పై ఆరు గంటలు మాత్రమే వుంటుందని వయస్సు పండిన ఒక వృద్ధుని అంచనా.

ఆషాఢ మాసంలో ఆకాశంలో దోబూచులాడే మేఘ మాలికలు వుండీ వుండీ జోరున వీచే గాలి జోరుకు దూది పింజల్లా తేలిపోయేవి.

ఆ ప్రాంతంలో ప్రచారంలో వున్న చెవిటి మేఘం కథకు సార్థకత లేక పోలేదు. ఒకసారి వరుణదేవుడు మేఘాలనన్నింటినీ పిలిపించి "మీరు పాల సముద్రం పొలిమేరలకైనా వెళ్లవొద్దు జాగ్రత్త" అని గర్జించాడు. అది వినిపించని ఒక చెవిటి మేఘం పొలిమేరదాటి పూరినాలుగు వీధులూ పహార్లుచేసి చక్కా వచ్చేసింది. అది విన్న వరుణదేవుడు ఆ చెవిటి మేఘాన్ని సంజాయిషీ యివ్వవలసిందని ఆజ్ఞాపించాడు. "నేను ఒక సారి వెళ్లి చిట పట మని నాలుగు చినుకులు చిందించి రావడంతో రైతు వున్న ధాన్యమంతా భూమిలో కుమ్మరించేస్తాడు. ఆ తరువాత మే మెవ్వరము ఆ ప్రాంతాలకు వెళ్ళము వారిదగ్గర వున్న కొద్ది ధాన్యము కూడా గుటకాయ స్వాహా "అని చిరు నవ్వు నవ్వి సవినయంగా చేతులు కట్టుక నిలబడింది. "నీ తెలివి తేటలు అద్భుతం" అని వరుణదేవుడు దానికి ఒక చిన్న నజరానా కూడా యిచ్చేసాడట. ఇదీ కథ.

నింగిలో తొంగి చూసి. మరుక్షణం పరుగు పందెంలో పోటీగాళ్ల వలె పరుగెత్తిన పయోదాన్ని శపిస్తూ నిట్టూర్చిన వృద్ధ కర్షకుని సమీపించి—

"తాతా తాతా మన కష్టాలు గట్టెక్కుతున్నాయి. పెద్ద యేరుకు ఆనకట్ట కట్టి మన పొలాలకు నదీ జలాలు యిస్తారు." అని ఓదార్చ సాగాడు భవిష్యత్తులో నమ్మకం తొలగని నవయువకుడు.

"అవునయ్యా బాబూ, నాకు యివేమీ తెలీవని అనుకోవొద్దు అసలు నదిలో నీరుంటేగా పొలంలోకి వచ్చేది. పైననే మైసూరు వాళ్లు కట్టకట్టేస్తే మనదాకా వచ్చేదేమిటీ అంట" గతాన్ని నెమరు వేస్తూ గడ్డాన్ని దువ్వుకున్నాడు తాత.

"అవును జాతీయ సమగ్రత మరొక సమస్య!" అని అర్థాంగీకారాన్ని అందీయక తప్పలేదు, అతనికి. "అది సరేతాతా మీ తరం మారిపోతున్నది. ముందు బ్లాకులు, యిప్పుడు పంచాయతి సమితులు మన పల్లెలను మార్చి వేయటం లేదంటావా," అని మరో వాడిచూపును వదిలిచూసాడు.

"మారటం లేదని యెవరన్నారయ్యా. కాని, ప్రజలకు తమను తాము పాలించుకొనే హక్కు, తాహతు వచ్చాయా అనేదే ప్రశ్న" అని వర్తమానం మీద భాష్యాన్ని పలికాడు. జ్ఞాన వృద్ధుడూ, వయోవృద్ధుడూ అయిన తాత. "ప్రజలకు అంత బాధ్యత నిజంగానే తెలీదనుకో. అయినా, మన అమృతరావు గారి లాంటి అధికారుల ప్రోత్సాహంవుంటే . . "

"అవును, అవును అమృతరావుగారి సంగతి వేరు. కాని, అధికారులు అందరూ అమృతరావులు కాదుగా . . అంటూ మరొక సారి ఆకాశంవైపు చూసాడు తాత భావగర్భితంగా.

పాల సముద్రం బ్లాకుకు క్రొత్తగా డెవలప్ మెంటు ఆఫీసరుగా వచ్చిన అమృతరావు అనతి కాలంలోనే నలుగురి తలల్లో నాలుకలా మెలగసాగాడు. అతడు వాక్య శూరుడే గాక కార్య శూరుడు గావటం ఒక విశేషం.

అతనిని కార్య దీక్షకు పురికొల్పింది నెలకు లభించే అయిదు వందల వేతనం కాదు, అయిదున్నర లక్షల గ్రామాలలోరావణాసురుని తలల్లా పెరుగుతూ, తిండికీ బట్టకూ అల్లాడి పోతూన్న భారత ప్రజావాహిని బాధల గాధలు !

పాలసముద్ర ప్రాంతం కరువు బరువు క్రింద పడి అణిగి పోవటం యిది మొదటిసారి కాదు అయితే యీ సారి దాని విజృంభణకు దారీ తెన్నూలి తెలీక ప్రజలు విల విల లాడ సాగారు.

ప్రజలకు తిండి, పశువులకు గ్రాసం, నేలకు నీరు పట్టణం దుకాణాలలోని హార్లిక్సు సీసాలలా మాయమయి పోయాయి.

కోల్పోయిన ఆత్మ విశ్వాసాన్ని తిరిగి ప్రజల హృదయాల్లో ప్రతిష్ఠ జేయటం తన ప్రథమ కర్తవ్యమని అనిపించింది అమృతరావుకు. అందుకు అవసరమైన ప్రచార వుద్యమాన్ని ఒక్కుమ్మడి వుద్ధృతం జేసాడు తన సిబ్బంది సాయంతో. "ఆహార సమస్య అన్నపూర్ణ అయిన ఆంధ్రదేశంలోనే యింత తీవ్రంగా వుంటే బీహార్, ఉత్తరప్రదేశ్ లాటి రాష్ట్రాల్లో యెలావుందో ఆలోచించండి. మనం కలిసి ధైర్యంతో పని చేస్తే సాధించలేనిదంటూ వుండదని" స్వయం శక్తికి గల ప్రాభవాన్ని గురించి వుపన్యాసాలు చలన చిత్రాలు, పాటలు నాటకాల ద్వారా ప్రబోధింపసాగాడు.

అంతేగాక, పై అధికారులతో సంప్రదించి హుటాహుటిన ధాన్యాలు గ్రాసం తెప్పించడమూ, అందరికీ సమంగా పంచడమేగాక అనేక సత్వర ప్రయోజనసాధకాలైన పథకాలను ప్రారంభింప జేసాడు.

పాల సముద్రం సమితి అధ్యక్షుడు సూర్యప్రకాశం అనేక యుద్ధాల్లో ఆరితేరిన భీష్మాచార్యుడు. ప్రతి పనీ ముందూ వెనుకా ఆలోచించి చేయాలనే పట్టుదల గలవాడు పెద్దల పలుకుబడితో పెత్తనం చలాయిస్తూన్న పెద్ద మనిషి. అతనికి అమృతరావు పద్ధతులు నచ్చక పోవటంలో ఆశ్చర్యం లేదు. అయితే, ఆశ్చర్యం యేమంటే అనేక మంది ఆఫీసర్లను నిముషాలమీద బదిలీచేయించిన అతగాడు, అమృతరావును యేమీ చేయలేక పోవటమే అందుకు కారణం అమృతరావు పనులు చేసే తీరూ తెన్నూ. ప్రతి పనికి అతని సలహాలనడుగుతూనే, మనసు నొప్పించకుండా, సూర్యప్రకాశం మనసునే తనవైపు తిప్పుకొంటూ, చివరకు న్యాయమైన నిర్ణయాన్ని తీసికోవడంలో అమృతరావు ఆరితేరిన వాడైపోయాడు. అందుకనే సూర్యప్రకాశానికొక పెద్ద సమస్య అయిపోయాడు.

కంట్రాక్టులలో, కొనుబడులలో, అరువు మంజూర్లలో తనకు లభించే ప్రతి ఫలాలు జారిపోవటమే గాక వుపాధ్యాయుల బదిలీలలో, గ్రామాలకు, పనుల మంజూరులలో తన పథకాలు పారటం ఆగిపోయింది. స్వార్థ త్యాగి, ప్రజానురంజకుడైన అమృతరావును వదిలించుకోవటం కూడా తనకంత సులువుగా కనిపించలేదు.

ఆ రోజు వుదయం ఫైళ్లు తిరగేస్తూనే అమృతరావు గదిలోకి వచ్చిన సూర్య ప్రకాశాన్ని లేచి ఆహ్వానించాడు. ఇరువురు బ్లాకు అభివృద్ధి పనులను గురించి, బావుల త్రవ్వకానికి బోరింగు పరికరాలు త్వరగా రప్పించటాన్ని గురించి, తక్కావీ ఋణాలు యెక్కువగా మంజూరు చేయటాన్ని గురించీ వివరంగా చర్చించారు. పనులు యెంతో చక చకా సాగటమూ, ప్రజలో క్రొత్త చైతన్యం గరిగి భయాందోళనలు తొలగిపోవటమూ, అందుకు కృషిచేసిన అమృతరావును అభినందించక తప్పలేదు సూర్యప్రకాశానికి.

ప్రకాశంగారూ, ఒక ముఖ్య విషయంలో మీ సలహా కావాలి" అన్నాడు అమృతరావు పు[illegible]

"అలాగే, తప్పకుండా. యేమిటి చెప్పండి" అన్నాడు సూర్యప్రకాశం

"ఆఁ ఏమీలేదు. మన అరవిందాశ్రమాన్ని గురించి..."

"ఓహో ." అని నర్మ గర్భంగా నవ్వి, కొంచెం ఆగి అన్నాడు సూర్యప్రకాశం "ఆఁ ఏమి ఆశ్రమం సంగతి?" చూస్తూన్న ఫైలును మూసి బల్లమీద వుంచి తిరిగి మొదలెట్టాడు అమృతరావు.

"చూడండి ప్రకాశంగారూ, మనం ఆశ్రమానికి అనేక విధాల గ్రాంటుల రూపేణా సాయం చేస్తున్నాము. వారు చాలా చాలా పనులు చేస్తున్నామని అర్జీలు పెడుతున్నారు. నేను ఒకటి రెండు సార్లు చూసి వచ్చాననుకోండి. అయినా ఆశ్రమం స్వామీజీ మీద అనేక రకాలైన ఆకాశ రామన్న లేఖలు వస్తున్నాయి...

"ఆఁ ఏమంటారు, వారు?"

"ఒకటి స్వామీజీ ప్రవర్తన, రెండు ఆయన ప్రజాధనాన్ని వాడు తున్న తీరు...దీనిమీద మీకు తెలిసిందంతా చెప్పి నాకు తగిన సలహా యివ్వాలి"

కొంచెం తటపటాయించి సూర్యప్రకాశం మొదలెట్టాడు; "చూశారూ, నేనుకూడా యిలాటి పుకార్లు వింటునే వచ్చాను. తరువాత కొందరిద్వారా ఆచూకీ తీసాను స్వామీజీ చందాలు, గ్రాంటులు ఫలహారం చేస్తున్నాడనేది నిర్వివాదమని తేలిపోయింది. ఇక పోతే స్వామీజీ శీలం సంగతి—" అంటూ ఆగిపోయాడు సూర్యప్రకాశం.

"సందేహించక చెప్పండి" అని ఆత్రుతతో యెదురు చూసాడు అమృతరావు.

"ఒకనాటి సాయంకాలం నేను పక్క పల్లెనుండి సైకిలుమీద వస్తున్నాను. అంతలో వున్న పళంగా వురుములు మెరుపులూ ప్రారంభమై చీకటి క్రమ్ముకొన్నది. సైకిలుకు పంచరు పడి గాలిపోయింది. దగ్గరలోనే వున్న ఆశ్రమంలోకి వెళ్ళాను. స్వామీజీ గదితలుపు వోరగా వేసివుందేమో త్రోయటంతో కనిపించిన దృశ్యాన్ని చూసి......అలాగే మ్రాన్పడి పోయాను"

"ఆఁ ఏమిటండి అది?"

''స్వామీజీ శయ్యమీదనే ఒక అవివాహిత అయిన యువతి అతి సమీపంగా కూర్చొని ఆయనకు పాలు అందిస్తున్నది. ఇరువురూ నన్ను చూసి తుళ్ళిపడి లేచి నిల్చొన్నారు. అదీ సంగతి.''

అమృతరావు ఆశ్చర్యానికి అంతులేకపోయింది. ఎందువల్లనంటే స్వామీజీ వయస్సు నలభైలోపేనని అనిపిస్తుంది. "నిప్పు లేనిదే పొగ రాదుకదా?" అని నిట్టూర్చాడు అమృతరావు.

"ఇంతకూ ఆ యువతి యెవరనుకొన్నారు?"

"ఎవరు?"

"మన ముఖ్య సేవిక సుగుణ!" అంటూ పనివున్నది వస్తానని లేచివెళ్ళిపోయాడు సూర్యప్రకాశం.

అతను వెళ్ళిపోయిన ద్వారంవైపు అలాగేచూస్తూ నిశ్చేష్టుడై పోయాడు. స్వచ్ఛమైన సరస్సులాటి మనస్సులో రాళ్ళుపడి అలలు లేచిన రీతిగా కలతజెందుతూ. అసలు సుగుణ నివాసం కూడా ఆ ఆశ్రమమే. సూర్యప్రకాశం చెప్పింది, నిజమే. కాని, అది సగం నిజం మాత్రమే. అతను చెప్పింది, ఆకాశరామన్న లేఖలు వ్రాయించింది అతని పరివారమేనని...అంతకన్నా ముఖ్యంగా, ముఖ్యసేవిక సుగుణ అతనిచే బలాత్కరింపబడి యెదురు తిరగడంతో తన ప్రయత్నాన్ని యెవరికీ చెప్పవొద్దని హామీయిచ్చిందాకా ఆమె పాదాలుపట్టి వదల లేదనీ......

• • •

అరవిందాశ్రమం ఊరికి దూరంగా, పూలతోటలమధ్య అలజడులకు అవతలగా, మరో ప్రపంచంలా కళకళలాడుతూవుంటుంది. పరమ ప్రశాంత వాతావరణం అక్కడ పరిపాలిస్తున్నట్లు తోస్తుంది.

ఆశ్రమంలో ముఖ్యమైనవి మూడు అంగాలు :

వైద్యశాల, పాఠశాల, వృత్తిశాల.

రకరకాల రోగాలతో విసిగి వేసారి యెక్కడెక్కడనుండో వచ్చి చేరుతుంటారు రోగులు. వారికి అన్ని సౌకర్యాలు వుచితంగా లభించుతవి. ధనికులు ఆశ్రమానికి యేదన్నా యివ్వదలుచుకొంటే మందుల రూపంలోగాని, పరికరాలుగాగాని బహుమతిగా యివ్వవొచ్చు. వైద్యం స్వయంగా స్వామీజీయే చేస్తుంటారు. ప్రకృతివైద్యం హోమియో, ఆయుర్వేదం, అల్లోపతి... అన్ని రకాలు వ్యాధినిబట్టి ఆయనే నిర్ణయించి అమలు చేస్తుంటారు. ఈ సరికి ఆంధ్రదేశం నలుమూలలా స్వామీజీ హస్తవాసిని గురించి కథలు రకరకాలుగా ప్రచారంలోకి వచ్చాయి.

రెండవది పాఠశాల. ఇది ప్రాచీన గురుకులానికి ఆధునిక మాంటిసోరీ మార్గానికి మధ్యగా రెంటి మేలి కలయికగా రూపొందుతున్నది. బాలబాలికలకు సాహిత్యాంశాలతోపాటు విజ్ఞాన వినోద పూర్వకమైన ప్రదర్శనలు, ప్రయోగాలు చూపించుతూ చక్కని బోధనలు చేసే ఆచార్యులను నియమించటం జరిగింది.

మూడవది వృత్తిశాల. ఇందులో వితంతువులు, నిరుపేదలైన స్త్రీలకు కుట్టుపని, చేతిపని, బొమ్మలు చేయటంలాటి అనేక కుటీర పరిశ్రమలు నేర్పబడుతుంటవి. వీటిని నడపటంలో స్వామీజీ పడుతూన్న నిరంతర శ్రమ ఆశ్రమవాసులకు యెంతో ఆసక్తిదాయకంగా వుంటుంది. ఉద్యోగభారం లేనప్పుడు ఆయనకు అన్ని విధాలా చేదోడు వాదోడుగా వుండేది ముఖ్యసేవిక సుగుణ.

ఆశ్రమానికి ప్రక్కనే క్రొత్తగా ఆనకట్ట కట్టిన యేరు నుండి పెద్ద కాలువ త్రవ్వటం ప్రారంభమయింది. ప్రజలు పాల్గొంటేనే తప్ప యే వుద్యమం అయినా సఫలం కాదని అమృతరావు విశ్వాసం. అందుకు తనే దారి చూపటంలో యెన్నడూ వెనుదీయలేదు.

ఈ క్రొత్త కాలువ త్రవ్వకానికి అందరూ కలిసి శ్రమదానం చేయాలని అమృతరావు చేసిన సూచన సర్వజనాంగీకారం పొందింది.

దానికి తగిన సన్నాహాలు ప్రారంభమయ్యాయి. పురుషులు, స్త్రీలు వృద్ధులు, బాలురు...అందరు వుడతాభక్తిగా యెవరి వల్ల అయ్యే పని వారు చేయసాగారు.

"ఏం తాతా నువ్వూ వచ్చావే" అన్నాడు వయస్సు మళ్ళిన తాతను చూసి నవయువకుడు.

"ఏం, నేనేమీ పని చేయలేనా?'' తాత యెదురు ప్రశ్న.

''అందుకు గాదు''

''అవును నాకు తెలుసు. దేశం మారుతున్నదని. ఇదొక యజ్ఞం లాంటిది. అయితే ఇందులో నీర క్షీర న్యాయంగా మంచి చెడులు కలిసి వున్నాయి...''

"వాటిని వేరుచేసేందుకు అమృతరావుగారిలాటి రాయంచలు కావాలంటావు. అంతేనా?''

"ఏమిటోయ్, నా పేరు పలుకుతున్నావు?'' అంటూ దగ్గరికి వచ్చాడు చేతిలో గునపం వూపుకొంటూ అమృతరావు.

''ఇలా మనం నడుంనడుంకలిపి పనిచేస్తే, మనం పరాయివాడని అన్నంపెట్టమని అడుగవలసిన కర్మ యెందుకువస్తుంది. బాబూ, కాని మాలోనే యెందరో పందికొక్కులు లాటి వారు గాదెలో తొలచి ధాన్యాన్ని గుటకాయ స్వాహ చేస్తున్నారు. వారిని మనం వేరు పురుగులల్లా ఏరి వేయందే మనకు ముక్తి లేదు'' అంటూ వుద్రేకంతో వూగిపోయాడు.

''అదే తాతా నేడు మన కర్తవ్యం. అందుకే మనం చెడును నిర్దాక్షిణ్యంగా కడిగివేయాలి.''

''ఏమిటండీ కడిగివేయాలంటున్నారు'' అంటూ తలమీది మట్టితట్టను క్రిందకు దించుతూ దగ్గరగావచ్చి అడిగింది సుగుణ.

''చెడును తల్లీ'' అన్నాడు తాత.

''అవును తాతా. దేవుడైనా, దానవుడైనా మానవునిలోనే వున్నాడు. బాగుచేసుకున్నా పాడుచేసుకున్నా మనకు మనమే బాధ్యులము'' అంటూ శృతి కలిపింది సుగణ.

అమృతరావు భావాంబరవీధిలో అనుమానమనే మేఘ శకలాలు తెరలు తెరలుగా వస్తూపోతున్నవి. ''సుగణ!'' అయినా పేరులో యేముందిలే. యే మో. నిజం నిలకడమీద తెలీకమానుతుందా అనుకొంటూ తిరిగి పనిలోకి దిగాడు.

క్రమక్రమంగా అదొక మనోహర దృశ్యంగా, నవోజ్వల మహాభారత పర్వదినానికి తోరణంలా హృదయంగమంగా మారి పోతూన్నది ఆ పరిసరం.

ప్రతి యువకుడొక ధనుంజయుడై, ప్రతియువతి ఒక సత్యభామయై విజృంభించ సాగారు.

ఆశ్రమం నుండి దీన్ని అంతాచూస్తూన్న స్వామీజీ హృదయం ఆనందంతో పొంగి పోతూన్నది.

అంతలో అకస్మాత్తుగా ఒక అనుకోని ప్రమాదం జరిగింది. అమృతరావు ఉత్సాహంతో గునపాన్ని యెత్తి భూమిలో వేయబోయే సమయంలో, సరిగా సుగుణ మట్టి తట్టతో అచే వచ్చింది రావటమేమి గునపము భూమిలో బదులు సుగుణ కాలిలో దిగింది. ఒక్కసారి పని అంతా ఆగిపోయింది. సుగుణను నలుగు రయిదుగురు కలసి ప్రక్కనే వున్న ఆశ్రమంలోకి చేర్చారు ప్రథమ చికిత్సకు. అందరినీ తిరిగి పని ప్రారంభించమని చెప్పి అమృతరావు, సూర్యప్రకాశం, తాత మరి యిద్దరు, ముగ్గురతో కలసి ఆశ్రమం వైపు దారి తీసారు.

గాలిలేనప్పుడు వెలిగే దీపకళికలావుంది స్వామిజీ ముఖ వర్చస్సు. ఎల్లప్పుడూ తొంగిచూసే చిరునవ్వు ఆయన పెదవులను యిప్పుడు సైతమూ వదిలిపోలేదు. సుగుణకు ప్రథమ చికిత్స అయిపోయింది. గాయంకొంచెం పెద్దదేఅయినా ప్రమాదం యేమీ లేదనీ, కాకి పోతే కాలిమడమ కొంచెం వంకరపోవొచ్చుననీ అన్నారు స్వామీజీ.

''ఏమిటి బాబూ దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?'' స్వామిజీ అన్న పలుకులతో యీలోకంలోకి వచ్చాడు అమృతరావు.

''ఆఁ...ఏమీలేదు...'' అంటూ అర్థాంతరన్యాసంగా ఆగిపోయాడు.

''ఏమీలేదంటే యేమిలాభం. నీ మనస్సు చెట్టుమీదికోతిలా గెంతులువేస్తూ గోలచేస్తున్నది కదూ?'' అంటూ ఒకనవ్వు నవ్వాడు స్వామీజీ.

అమృతరావు ఒక నిశ్చయానికి వచ్చాడు.

"స్వామిజీ మీరు మరోలా అనుకోకుండా వుంటే ఒకటి అడుగుతాను. మీరు యెక్కడనుండి యిక్కడకు వచ్చారో ఎవరికీ తెలీదు. మీరు యెంతోసేవ చేస్తున్నారు ప్రజలకు ఇంతధనం మీకు యెక్కడనుండి వస్తున్నదో అని చాలామందికి ఆశ్చర్యంగా వుంది. మీ చరిత్ర మీకు అభ్యంతరం లేకపోతే వినాలని యెంతో కుతూహలంగా వుంది?" అంటూ ఒక్క గుక్కలో అప్పజెప్పాడు పాఠాన్ని అమృతరావు.

"అంతేనా నామీద చాలామందికి రకరకాల అనుమానాలు కూడా వున్నాయి కదూ? సరే మీరు అడిగారు. పెద్దలుకూడా యిక్కడ వున్నారు సమయానికి. చెబుతాను వినండి... "

తాత, సూర్యప్రకాశం, అమృతరావు ప్రక్కనే పడుకుని వున్న సుగుణ ఒక్కసారిగా సావధానులై వినసాగారు.

"నేను ఒకసామాన్య కుటుంబంలో జన్మించాను. తల్లి తండ్రీ చిన్నప్పుడే పోయారు. గాలికి తెగిన గాలిపటం అయింది నా బ్రతుకు. అది మహా శివరాత్రి. అప్పటికి నావయస్సు పదునాలుగు. అందరితోపాటు కోటప్పకొండ తిరునాళ్ళకు వెళ్ళాను. అంతులేని జనప్రవాహము, ప్రభలు, విద్యుద్దీపాలు, నాట్యాలు... రకరకాల రంగుల రాట్నాలు, విలువిద్యలు......అన్నీ నాకొక క్రొత్త అనుభూతిని కలిగించ సాగాయి...మీకు వివరాలన్ని చెప్పి విసిగించను. ముఖ్యమైన సంఘటనలే చెబుతాను"

"విసుగు యేమిలేదు. కానివ్వండి" అన్నాడు తాత.

"అప్పుడు ఒక పంజాబీ యువకుడు కొందరు పిల్లలను తీసికొని ఒక గుడారం లోకి వెళ్ళటం చూసాను. వారితో నేనూ వెళ్ళాను. అది ఒకరకమైన వృత్తి. నాకు అప్పట్లో ఆశ్చర్యం వేయలేదు. పైగా ఆకర్షణ కలిగింది. నీవు వస్తావా అన్నాడు. సరేనని వారితో చేరిపోయాను."

"ఏమిటా వృత్తి" అంటూ ప్రశ్నించాడు సూర్యప్రకాశం ఉత్సుకతతో.

"చెబుతాను. అది పిల్లలచేత అడక్కు తిననివ్వటం, ఆ ప్రతిఫలం యజమాని తీసికొని వారికి కూడూ గుడ్డా యివ్వటం"

"ఆ ... " అంటూ ఆశ్చర్యపోయాడు అమృతరావు.

"అంతేగాదు అందుకోసం పసర్లు పోసి పిల్లలను గుడ్డివాళ్ళను చేయటం, చేతులూ కాళ్ళూ విరిచి కుంటివాళ్ళను చేయటం. సరే పిల్లలను దొంగిలించటం ప్రధానమైన పని అనుకోండి. క్రమంగా భాగసుడనై, ఆ పంజాబీ యువకుడు మరణించటంతో యజమాని నైపోయాను. అప్పటినుండి చేసిన దురాగతాలకు, ఆర్జించిన డబ్బుకూ అంతం లేదు..." అంటూ ఆగిపోయాడు స్వామీజీ. శ్రోతల సంభ్రమం మిన్నుముట్టింది.

"అయితే మీరు స్వామీజీ యెలా అయ్యారు?" ముక్తకంఠంతో వచ్చింది ప్రశ్న.

"చెబుతాను భోగలాలసుడనై పోయిన నా పాప ఫలం పండింది భార్యా పిల్లలు అందరూ చనిపోయారు మిగిలింది ఒక్క కూతురు మాత్రమే. అది మరొక శివరాత్రి. ఈ సారి దర్పంతో దర్జాతో కారులో వెళ్ళాను. అయితే భగవల్లీల మానవ మాత్రులకు తెలీదు గదా? ఒక ప్రభ వూపుతో రావటం, చక్రం

క్రింద కాలుపడి నలగిపోవటం ఒకేసారి జరిగింది. కుంటివాణ్ణయిపోయాను. అదే నా జీవితంలో మార్పుకు నాంది. అమ్మాయిని అమ్మగారి దగ్గర వదిలి దేశదేశాలకు యాత్రలకు వెళ్ళాను. తిరగని దేవాలయమూ, చూడని పుణ్యక్షేత్రమూ లేదు కాని మనశ్శాంతి మాత్రం లభించలేదు తిరిగితిరిగి హృషీకేశం చేరుకొనేసరికి 'మానవ సేవను మించిన మాధవ సేవ లేదనే' జ్ఞానోదయం అయింది. ఆ తరువాత యిక్కడకు రావటం యీ ఆశ్రమం ప్రారంభించటమూ జరిగింది.

మంత్రముగ్ధుల్లా వింటూన్న శ్రోతలు ఒక్కసారి స్వామీజీ వైపు చూసారు. ఆయన ముఖంలో యిప్పుడు ప్రశాంతత కొట్టవచ్చినట్లు అనిపిస్తున్నది.

"వాటి బాలబాలికలే నేడు యీ ఆశ్రమంలో అనేక విధాల చదువుకొంటూ వృత్తులు నేర్చుకొంటూ కాలక్షేపం చేస్తున్నారు. డబ్బు కావలసినంత ఆర్జించానని చెప్పాను కదా? అయితే ఆ త్రోవ వేరు, యీ దారి వేరు"

ఇంతకూ, మీ అమ్మాయిగారు ఎక్కడ స్వామీజీ" అంటూ ప్రశ్నించాడు సూర్యప్రకాశం.

చిరునవ్వునవ్వుతూ "యిక్కడ!" అంటూ సుగుణ పడుకొన్న వైపు చూపాడు.

"ఆ" అంటూ అందరూ ఏకకంఠంతో ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు.

"నాన్నా" అంటూ లేచి కూర్చొన్నది సుగుణ యెంతో వుద్వేగంతో.

సూర్యప్రకాశం తనలో తాను కుంచించుకు పోయాడు. తన ప్రవర్తన చూసి తనకే సిగ్గువేసింది. ఆనాటి నుండి ఆయనా మారిపోయాడు.

ఈ నాడు సూర్యప్రకాశం. అంటే ప్రజలకు అందుకే అంతమక్కువ. మారిపోయిన సూర్య ప్రకాశం. మంచితనంతో ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకున్నాడు. *

అనాథస్త్రీల శరణాలయం

ప్రస్తుతం వాడుకలోనున్న సాంఘిక ఆచారములు, దౌర్భల్యమైన ఆర్థికపరిస్థితుల వల్ల ఎంతోమంది స్త్రీలు నిస్సహాయులై వున్నారు. నిరాశ్రయులై వున్నారు. జీవితంలో సుఖసంతోషాలు లేక, జీవితానికి ఒక ధ్యేయంలేక, ఎంతోమంది వితంతువులు, భర్తలచేత నిరాదరింపబడిన గృహిణులు దుర్భరజీవితము అనుభవిస్తున్నట్లు మనం కళ్లార చూస్తున్నాము. వీరిలో చాలామంది మధ్యతరగతి కుటుంబాలకు, అంతకంటే తక్కువైన కుటుంబాలకు చెందినవారు వారిజీవితం వారికే భారంగా వుంటున్నది. వారికి పిల్లలువున్నట్లయితే ఈ పరిస్థితి మరీ హృదయవిదారకమైనది.

మనదేశంలో సంఘ సంస్కరణలుచేపట్టిన మహానీయులు ఉద్భవించియుండటము మనదేశపుణ్యవిశేషము. రాజారాం మోహన్ రాయ్, కందుకూరి వీరేశలింగం పంతులు గారు అనాథస్త్రీల సంక్షేమానికి ఎనలేని కృషిచేసిన మహానీయులు. సంఘ సంస్కరణలు తీసుకొనివచ్చి సమాజములో చైతన్యమును తీసుకొని వచ్చిన మహాపురుషులు. శ్రేయోరాజ్యము పేరుకు తగినట్లుగా ఉండాలి. అబలలు, అనాథలు, నిస్సహాయలు, నిరాశ్రయులు అయిన స్త్రీలకు తగిన రక్షణ, ఆశ్రయము కల్పించవలసిన బాధ్యత శ్రేయోరాజ్యముపైన ఉన్నది ఈ విషయంలో నిర్విరామంగా కృషి చేసిన శ్రీ వీరేశలింగం పంతులు గారి కార్యదీక్షత, కార్యదక్షత మనకు మార్గదర్శకత్వం వహిస్తున్నాయి.

మహిళా సంక్షేమశాఖ; వితంతువులకు, అనాథస్త్రీలకు, భర్తల చేత విడువబడిన గృహిణుల జీవనోపాధికొరకు సేవాసంస్థలను ఏర్పాటు చేసింది. ఈ శాఖకు చెందిన కార్యకర్తలు గ్రామసేవికలు, ముఖ్య సేవికలు గ్రామీణ ప్రాంతాలలోవున్న సేవాసదనములను గురించిన సమాచారాన్ని ప్రజలకు తెలియజేయడమే కాకుండా వారు అనాథ స్త్రీలకు అట్టి సేవాసదనములలో ప్రవేశం కల్పించడానికి తగువిధంగా తోడ్పడతారు.


ఈ స్త్రీలు తమవెంట తమపిల్లలను తెచ్చుకొనడానికి అనుమతించ బడుతారు. వీరు ఈ సేవాసదనములలో సాధారణంగా మూడేండ్ల వరకు వుండవచ్చు. వారికి ఆశ్రయం భోజన, వసతి సౌకర్యములు కల్పించడమే కాకుండా విద్యకూడా గరపబడుతుంది. వారి యొక్క తెలివితేటలు, శక్తిసామర్థ్యాలకు తగినట్లు ఇ.యస్.యల్.సి. లేక యస్.యస్.యల్.సి. వరకు చదువు చెప్పించటం జరుగుతుంది సేవాసదనములలో చేర్చుకోబడిన స్త్రీలకు కుట్టుపని తోళ్లపరిశ్రమ, పుస్తకాలు బైండింగు చేయటము మున్నగు అనేక వృత్తిపనులలో తగిన శిక్షణ కూడా ఇవ్వబడుతుంది. ఉద్యోగాలు సంపాదించుకొనడానికి తగిన అర్హతలు వారికి కల్పించబడుతాయి ఆతరువాత వారిని ప్రభుత్వ సాంకేతిక పరీక్షలకు కూర్చోబెట్టడం జరుగుతుంది, మూడేండ్ల తరువాత గ్రామసేవికలు, నర్సులు, మంత్రసానులు మున్నగు పనులలో నియమించ బడుతారు కొంత మంది శిశుసంక్షేమ కేంద్రాలలో (బాలవాడీలలో) ఉపాధ్యాయినులుగా నియమించబడుతారు. మరికొంత మందికి ఇండ్లలో పనిమనిషి ఉద్యోగాలు చూపించడం జరుగుతున్నది

వీరి పిల్లలు బాలవాడీలలో తగువిధంగా పోషించ బడుతున్నారు. తల్లులకు పునరావాసం కల్పించబడిన తరువాత ఈ పిల్లలు తల్లులతోపాటు వెళ్లిపోతారు. లేదా ఈశాఖ నడుపుతున్న శిశుసంక్షేమ కేంద్రాలలో చేర్చుకోబడుతున్నారు.

రాష్ట్రంలో తూర్పుగోదావరి జిల్లా కన్నాపురంలోను విజయవాడ, వరంగల్లు, హైదరాబాదు అసంతపురంలోను మొత్తం 6 సేవాసంస్థలు వున్నాయి. కన్నాపురంలోని సేవాసంస్థకు ఒక ప్రత్యేకతఉన్నది. ఆగ్రామంలో స్త్రీలకు కనుమిల్లి వెంకట నరసమ్మ గారు ఉదారపూర్వకంగా 13 ఎకరాల భూమిని. 30 వేల రూపాయల రొఖ్ఖంమును విరాళంయిచ్చి ఈ సంస్థను స్థాపించారు. ఆమెపేరుతో ఈసేవాసదనము వెలసియున్నది.

హైదరాబాద్ధులోని మలక్‌పేటలోనున్న సేవాసంస్థ 1958 లో స్థాపించబడినది. ఇందు 150 మంది స్త్రీలు. 60 మంది పిల్లలు ఉన్నారు. ఇందులో చదువు సంధ్యలు సంపాదించుకున్న స్త్రీలకు నర్సులు, టీచర్లు, గ్రామసేవిక ఉద్యోగాలు లభించుచున్నవి. స్వయం శక్తిపై, ఆత్మవిశ్వాసంతో జీవనోపాధి సంపాదించుకోడానికి తగిన వసతిసౌకర్యాలు కల్పించిన తరువాత అనాథ స్త్రీలకు సేవాసంస్థల అధికారులు వివాహాలు ఏర్పాటు చేస్తారు. మహిళా సంక్షేమ శాఖ అధ్వర్యంలో ఇట్టి వివాహాలు జరుగుతాయి. మలకపేట సేవాసంస్థలో 1969–70 లో 3 వివాహాలు జరిగాయి. ఈ దంపతులు అందరూ సుఖంగాజీవితం గడుపుచున్నారు. మహిళా సంక్షేమయాత్రి విషయాల శాఖా మంత్రిణి శ్రీమతి రోడామిస్త్రి సమక్షంలో 1971 ఫిబ్రవరి 18 వ తేదీన సేవాసంస్థలో రెండు వివాహాలు జరిగాయి. ఈ వివాహమహోత్సవానికి చాలామంది అధికారులు హాజరైనారు.






జూన్ 19వ తేదీన విజయవాడ వెళ్తూ ఉపరాష్ట్రపతి శ్రీ జి యస్ పాఠక్ హైదరాబాదులో ఆగారు




ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ శ్రీ కె వి. యల్. నరసింహాం జూన్ 15వ తేదీన పదవీ ప్రమాణం చేశాడు


వార్తా చిత్రాలు




ఇటీవల హైదరాబాదులో అఖిలభారత తెలుగు రచయితల మహాసభకు డా. యస్. భగవంతం ప్రారంభోత్సవం చేశారు.



భారత ప్రభుత్వ సమాచార ప్రసార శాఖ స్టేట్ మంత్రిణి శ్రీమతి నందినీ శతపథి విజయవాడ వెళ్తూ జూన్ 26వ తేదీన హైదరాబాదులో ఆగారు.




హైదరాబాదు మలక్ పేటలోని అక్బర్‌బాగ్‌లోని హరిజనులకు జూన్ 22వ తేదీన ముఖ్యమంత్రి ఒక్కొక్కరికి రు. 100 సహాయం అందజేశారు.




మే 16వ తేదీన ముఖ్యమంత్రి హైదరాబాదులో ఎలెక్ట్రికల్ లామినేషన్స్ ఫ్యాక్టరీకి శంఖుస్థాపన చేశారు.

ఈ ఫ్యాక్టరీ మెసర్స్ సాహ్ని స్టీల్ అండ్ ప్రెస్ వర్క్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీవారి విభాగం దీనిపెట్టుబడి రూ.1.6కోట్లు 1971 చివరకు యీ ఫ్యాక్టరీలో ఉత్పత్తి ప్రారంభమవుతుంది.


వార్తా చిత్రాలు



హైదరాబాదులో జూన్ 19వ తేదీన శ్రీమతి ఆత్మా జయరామ్ వర్ణచిత్ర ప్రదర్శనకు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు.



టూరిజం అభివృద్ధి: వివిధ రాష్ట్రాలమధ్య సమన్వయం



యాత్రికులను ఆకర్షించే భారతీయ శిల్ప సంపద

టూరిజం వ్యవహారాలను ఎక్కడికక్కడ విడివిడిగా ఆలోచించి నిర్ణయించడానికి వీల్లేదు. ఈ విషయాల్లో ఇరుగుపొరుగు రాష్ట్రాలమధ్య ఎక్కువగా సన్నిహిత సంబంధం వుండడం చాలా అవసరం. ఒక రాష్ట్రం ఏ ప్రాంతానికి చెందినదో, ఆ ప్రాంతంలోని రాష్ట్రాలలోనే సంబంధం వుండాలనికాదు. ఇతర ప్రాంతాలలోని రాష్ట్రాలతోనైనా సంబంధం వుండితీరాలి. ఉదహరణకు హైదరాబాదుకు ఔరంగబాదు చాలా దగ్గరగా వున్నదృష్ట్యానూ, బొంబాయి–ఔరంగాబాదు–హైదరాబాదులను కలుపుతూ విమాన సర్వీసు నడపడంవల్లనూ, హైదరాబాదునుండి ఔరంగాబాదుకు, ఔరంగాబాదునుంచి, హైదరాబాదుకు పర్యాటకుల రాకపోకలు ఎక్కువ అవుతాయి గనుక ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ప్రభుత్వాల యాత్రిక శాఖలమధ్య సన్నిహిత సహకారం కావలిసి వుంటుంది.

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు, ఆంధ్రప్రదేశ్, మైసూరురాష్ట్రాలు చారిత్రకంగానూ, భౌగోళికంగానూ, సాంప్రదాయికంగానూ ఒకదానికొకటి అనేకవిధాలుగా కలిసిపోయివున్నాయి మద్రాసు బౌద్ధయాత్రికులనూ, ఆగ్నేయాషియా దేశాల యాత్రికులనూ నాగార్జునసాగర్‌కు మళ్ళించవచ్చు. అలాగే ఉత్తరాది యాత్రికులను ఆంధ్రప్రదేశ్ అటు మహాబలిపురానికి, మధురకూ మళ్ళించవచ్చు. అదేవిదంగా బెంగుళూరుకువచ్చే యాత్రికులను తిరుపతికో, హార్సిలీకొండలకో పంపించవచ్చు. ఇటువంటిది జరుగాలంటే యాత్రికుల రాకపోకలను అంచనా వేసికోవటమేకాక ఒక పథకంప్రకారం పనులు చేసుకోవలసి వుంటుంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము, హైదరాబాదు నగరమూ ఉత్తర దక్షిణ భారత దేశాలకు వారధివంటిది దక్షిణభారతానికి మన రాష్ట్రం సింహద్వారంవంటిది. దక్షిణ భారత దేశంలో పర్యటనల అభివృద్ధికి అత్యంత కీలకమైన పాత్రను మనరాష్ట్రం నిర్వహించవచ్చు.

యాత్రికులు—ముఖ్యంగా విదేశీ యాత్రికులు—కేవలం మనదేశపు సౌందర్యాన్ని తిలకించడానికో, ఇక్కడి సముద్రతీరాలనూ, కట్టడాలనూ దర్శించడానికోమాత్రమే భారతదేశానికిరారు. ఇక్కడి ప్రజల జీవన సరళిని పరికించడానికి వస్తారు. ఇది వారికి మరెక్కడా లభ్యంకాదుగదా. మన దేవాలయాలనూ, మన సంస్కృతినీ వాటి విశిష్టతనూ చూడాలనుకుంటారు వారు. మన జీవన సరళిలో వివిధరంగాలలోని వైశిష్ట్యాన్నీ వైవిధ్యాన్నీ వారికి తెలియ జేయడానికి మనం కృషిచేయాలి. మనం అటువంటి విషయాలమీదే, అలాటి యాత్రిక కేంద్రాలమీదే శ్రద్ధవహించాలి. మధుర మీనాక్షి దేవాలయం అపూర్వమైన నిర్మాణం. అటువంటి దానిని అత్యంతసుందరంగా తీర్చిదిద్దాలి. ఇంకా ఇతర నిర్మాణాల్ని చూద్దానికి వ్యవధిలేని యాత్రికులకుకూడా అక్కడికివెళ్ళి చూడనవసరం లేకుండా యిక్కడే వాటి శిల్పవైభవ విశేషాలు తెలిసేవిధంగా సమాచారం అందజేయడం అవసరం. విదేశీ యాత్రికుల పర్యటనకు సంబంధించి మొత్తం భారత దేశాన్నంతటినీ దృష్టిలో వుంచుకొని పథకాని రూపొందించాలి. అదే సమయంలో అన్నిప్రాంతాలకూ సమానంగా ప్రాతినిధ్యం యివ్వాలి. భారతదేశంలో చూడాల్సినవి బొంబాయి, ఢిల్లీ, ఆగ్రా, జైపూరు మాత్రమే అనే అభిప్రాయం విదేశీ యాత్రికుడికి కలగనివ్వకూడదు.

విదేశాల్లో రంగురంగుల స్లైడ్లు, డాక్యుమెంటరీలు మొదలైన వాటిద్వారా, విరివిగా ప్రచురించి పంపిణీచేసే ప్రచారక పత్రాల ద్వారా, రేడియో, టెలివిజన్‌ద్వారా మన యాత్రా కేంద్రాలన్నిటిని గురించి సరిగ్గా, సమానంగా ప్రచారం జరపడం అవసరం. అంతటితో అయిందిగదా అని దేశీయ యాత్రికుల పర్యటనలను అభివృద్ధి పరుచకుండా కూర్చోవడం కూడదు. ఎందుకంటే దేశీయ యాత్రిక అభివృద్ధి క్రమేణా విదేశీయులకూ ఆకర్షిస్తుంది. నిజానికి యీ రెండింటి మధ్యగల తేడా అతి స్వల్పమైనది. పైగా దేశీయ పర్యటనలు జాతీయ సమైక్యతకు దోహదంచేస్తాయి.

—పి. వి. ఆర్

సీరియల్

త్యాగరాజు కథ

టి. ఎ. పద్మనాభరావు



రామ వియోగము

త్యాగరాజు—సంసార బాధ్యత నెత్తిన వేసుకోవడం లేదనే నెపంతోను, తనమాట వినకుండా రాజాస్థానంలో గానంచేయ లేదని, యెప్పుడూ రుసరుసలాడు తుండేవాడు. అగ్నికి ఆజ్యం తోడైనట్లు జపేశయ్యకు భార్య కూడా తోడయింది. అన్న దమ్ములమధ్య వైరం సీతమ్మను కలవరపరచింది ఆమె మానసిక బాధతో మరణించింది. తల్లి మరణం త్యాగరాజును బాగా క్రుంగ దీసింది తల్లికి కుమారులిరువురు యథావిధిగా కర్మ క్రతువులు జరి పారు జపేశుని రుసరుసలు యెక్కువ కాసాగాయి. ఒకనాడు జపే శయ్య తెగించి మనం వేరుపోదాం అన్నాడు. భాగాలు పంచేస్తా నన్నాడు. ఈమాట ఆనోట యీనోట ప్రాకింది త్యాగరాజు ఎంత బ్రతిమాలినా వినలేదు. త్యాగరాజుకున్న స్వల్పంలోకూడా తస్కరిద్దామనుకొన్న బుద్ధిని జిల్లా తాసిల్దార్ శ్యామారావు వమ్ము చేశాడు త్యాగరాజుమీద గౌరవంకొద్ది. తాను మధ్యవర్తియై, యితర పెద్దల సహకారంతో న్యాయ పరిష్కారం చేశాడు. ఇల్లు రెండయింది

ఎవరి జీవితాలు వారు గడుపుకోవడం ప్రారంభించారు సాఫీగా గడచిపోతున్నాయి జీవితాలు. కాని దుష్టుల జీవితాలకు నిశ్చలత యెక్కడుంటుంది. ఎదుటివారి నాశనాన్ని కోరేవారి మనసులెప్పుడూ అల్లకల్లోల భావాలతో వుంటాయి. త్యాగరాజును ఎలా దెబ్బతీయడమని జపేశయ్య నిరంతరం ఆలోచించేవాడు.

భగవంతుడు భక్తులను పరీక్షించడం అలవాటు. నాగేటి పోటునకు నలగనిదే భూమి సస్యశ్యామలం కానట్లు భక్తులకుకూడా ఆటు పోటులు కల్గించడం జగన్నాథుని నాటక రచనలో ఒకభాగం. ధ్రువ, శిబి, బలి, ప్రహ్లాద భక్తాగ్రేసరు లందరిని పరీక్షించినట్లే త్యాగరాజును కూడా పరీక్ష చేయడం మొదలెట్టాడు.

అందుకే జపేశునికి దుర్బుద్ధి పుట్టింది. ఒకనాటి రాత్రికి రాత్రే త్యాగరాజు పూజచేసే శ్రీరామ పంచాయతన విగ్రహాలను దొంగలించి కావేరీ నదిలో పారవేశాడు.

శ్రీరాముడు సతి, సోదర, శిష్య సమేతంగా త్యాగరాజు యింటినుంచి కావేరీ గర్భంలోకి తన నివాసాన్ని మార్చు కొన్నాడు.

త్యాగరాజు మరునాడుదయమే మామూలుగా లేచి తన రామునికి మేలుకొలుపు పాడ నుద్యుక్తుడయ్యాడు. ఎడమకన్ను అదిరింది. విగ్రహాలకేసి చూశాడు. అచేతనుడయ్యాడు కంఠం మూగవోయింది. భర్తకన్న ముందేలేచి నిత్యకృత్యాలు చేస్తున్న కమలాంబకు నిత్యం వినిపించే మేలుకొలుపు వినిపించలేదు పూజా గృహంవైపు వెళ్ళింది. శిలావిగ్రహంవలె భర్త కనుపించాడు. దృష్టి విగ్రహాలవైపు వుంది. తానూ అటు చూసింది. విగ్రహాల పీఠం ఖాళీగావుంది

త్యాగరాజు కన్నీరు కమలాంబను కలవర పరిచింది. కుమార్తె సీతాలక్ష్మి అమ్మా, అమ్మా అని పిలుస్తూ దగ్గరకు వచ్చింది తల్లి దండ్రులు మౌనంగావుండడం, మూగగా యేడుస్తుండడం ఆమె కర్థం కాలేదు తానూ విగ్రహాలకేసి చూచింది అర్థం చేసుకో గల్గిన వయస్సు సీతాలక్ష్మిది.

కొంత సేపటికి తెప్పరిల్లుకున్నాడు త్యాగరాజు. "రామా యేమిటీ పరీక్ష నీ దివ్యరూపం యెవరికి కావలసి వచ్చింది. భక్తుల్ని పరీక్షించడం నీకు వేడుక. కాని భక్తుల కెంత కంట గింపో నీకు తెలియనిది గాదు భరింపరాని బాధ మ్రింగలేని మందుగుళిక.

"రామా ! నన్ను మోసం చేయకు నేను గొప్ప వాడినని గర్వించడం లేదు. నలుగురూ నన్ను ప్రశంసించాలని ఆశించడం లేదు చెడు తలంపులు దరికి రానీయడంలేదు మా యావులతో చేరి దుష్కార్యములు చేయుటలేదు బిడ్డలను తల్లి మందలించునట్లే నాయందు తప్పులున్న మందలించవచ్చు కాని నన్ను వదలి వెళ్ళడం నీకు న్యాయంగాదు. అంతటి శిక్ష నేను భరించలేను. నన్ను కరుణించు సాటిలేని సద్గుణరాశివి మనువంశ శ్రేష్ఠుడవు నీకన్న నన్ను రక్షించువారెవరు భూదేవికున్న ఓర్పు నీలోవున్నది, క్షమా గుణమున్నది రాజకులమునకు దీప్తి కాంతుడవు. కలలో కూడా నేను నిన్నే స్మరిస్తున్నాను నీ భక్తులందరిని రక్షించావు. నన్ను రక్షించు. నాఇంటిని విడనాడకు" (అనుపమ గుణాంబోధియని నిన్ను నెరనమ్మి యనుసరించిన వాడనైతి—అఠాణరాగం)

"ఎవరి మాటయినా విని వదలి వెళ్ళావేమో రామా ! నీవు ఋషి సాంప్రదాయమునకు జెందినవాడవు పురుషత్వము నీ సొమ్ము నీవు భక్తులకు సులువుగా వశమయ్యేవాడవు నన్నెందుకు ఆరడి పరుస్తావు పరమ భాగవతోత్తములు నీవు సకల జన రక్షకుడవని తెలిపియున్నారు. నన్ను అన్యాయముజేయకు ఆడి తప్పనివాడవు. భక్తులకు నీ ఆశీర్వాదం సదావుండి తీరవలె" (ఎవరి మాట విన్నావో యిందులేవో—కాంభోజిరాగం)

"ఇక్ష్వాకు వంశము శరణుయన్న వారిని రక్షించుటలో పేరెన్నికగన్నది. సూర్యవంశమునకు సాటి మరొకటియున్నదా ? నీ వంశ ప్రతిష్ట నిలుపుకో. సురభూసుర భక్త రక్షణ నీ నిత్య కృత్యం. నన్ను కష్టపెట్టకు" (కుల బిరుదును బ్రోచుకొమ్ము—దేవ మనోహరి రాగం)

"నేను నీవాడనుగానా ! నీ కెందులకు సందేహము. ముమ్మాటికి నేను నీ వాడను. నీ భక్తుడినే. సదా నీ స్మరణ చేయుచుంటినిగదా. నేను నిన్ను ఒక నిముసమయినా విడచి యుండగలనా? అట్టి స్థిరంగా ఉండే నీ దివ్య మోహన రూపం చూడకుండా యెలావుండేది. నీ గుణముల తెలియని లోకులవలె నిన్ను నేను తూలనాడను. సత్యము నీ ప్రథమ కర్తవ్యము సమరములో నీ కార్యమునకు మరొక పోలికలేదు. అట్టి నీవు నిత్య పూజనీయుడవు నీకు నేను నిజదాసుడను" (నీ వాడనే గాన నిఖిల లోక నిదాన — సారంగరాగం)

"నీవుగాక నన్నెవరు కాపాడుతారు? కావలసిన వరములిచ్చి బ్రోచే తల్లివి, తండ్రివి నీవే. మా పెద్దలార్జించిన ధనము నీ పూజయొక్కటే. నీ సేవకన్న నాకు వేరే ప్రియమయినదేమీలేదు. నిన్ను స్మరించిన సకల పుణ్యనదులలో గుర్రింకినట్లే. నీ కీర్తన నీ కన్న శుచి. రుచి యయినది మరొకటున్నదా? నన్ను ఎందులకు వేధిస్తావు. నన్ను కరుణించు" (నీవేగాని నన్నెవరు కాతురు—బిలహరి రాగం)

త్యాగరాజు అనేక రీతుల రాముని స్మరించాడు. భక్తులను పరీక్షింపనిదే దైవానికి తృప్తి కలుగదు. ధ్రువుడు, ప్రహ్లాదుడు మొదలయిన భక్తాగ్రగణ్యులు భగవంతుడు ప్రసాదించిన కష్టాలను చిరునవ్వుతో స్వీకరించి ధన్యులైనారు. త్యాగరాజుకూ యిట్టి బాధలు తప్పలేదు. త్యాగరాజు నిద్రాహారములు మాని పూజా గృహములోనే రాముని ధ్యానిస్తూ, గానం చేయసాగాడు శ్రీరాముని హృదయం కరుగలేదు దయామయుడు శ్రీరాముడు అని త్యాగరాజు పలికిన పలుకులకు తగిన ఫలితం కనిపించలేదు. త్యాగరాజు రామునిపై అలిగినాడు.

"రామా ! నీవు మహారాజువైనావని భ్రమిస్తున్నావేమో. నీ కీర్తి దశదిశల వ్యాపికావడానికి కారణం నీవు మా తల్లి జానకిని పాణిగ్రహణం చేసుకోబట్టే సుమా! రావణ సహారం నీచే చేయించినది ఎందుకు? ఆమెకు అతనిని చంపుటకు చేతగాకనా. కాదు నీ కీర్తి ఆచంద్రతారార్కము నిలబడడానికి నిన్ను రణ ధీరునిగా పన్నెకెక్కించడానికి. మా తల్లి నిన్ను నమ్మినట్లే నీవు నాభక్తిని నమ్మి నన్ను కరుణించు" [మా జానకిని చేబట్టగా మహరాజువైతివి—కాంబోజి] అని సీతమ్మపైగల మక్కువను ప్రకటించాడు

రామదాసు కూడా చెరసాల జీవితం అనుభవించేప్పుడు రాముని ధ్యానించి ధ్యానించి, తనను త్వరితంగా కాపాడలేదని అలిగి తల్లి సీతమ్మను వేడుకొంటూ నిందాస్తుతి జేశాడు.

శ్రీరామునిపైగల భక్తి నమ్మకం తరిగేది కాదు తండ్రి కోపగించుకొనినప్పుడు తల్లిచాటు చేరడం మరల తండ్రిని చేరడం బిడ్డ లక్షణం.

"రామా ! నిన్ను ఎంత కాలం వేడుకొనేది. నా హృదయమంతా నీవే. నీ స్మరణదప్ప నాకు మరొక చింతలేదు. అన్యము నాకు తృప్తినివ్వదు. నిన్ను నేను మనసార నమ్మియున్నాను. నిన్ను జూచు భాగ్యమే భాగ్యము. నన్ను కరుణించడానికి నీకు పంతమేల. సర్వత్రానిండియున్న నీ రూప ధ్యానతప్ప యితరము నాలోలేదు. (ఎంత వేడుకొందు ఓ రాఘవా—సరస్వతీ మనోహర రాగము) నీవు ఎక్కడున్నావని వెదికేది. చతుర్ముఖుడే తన జన్మస్థానాన్ని తెలుసుకోలేకపోయినాడు. పద్మనాభుని గనలేక దిగులందినాడు. వానికే దర్శనమియ్యని నీవు నన్ను కరుణిస్తావా? నేను అహంకారిని గాదు. నీవు నన్ను కరుణించవలె (హరి నేనెందు వెదకుదురా—కర్నాటక బేహాగ్ రాగము). సర్వత్రా వుండి లేనట్లు నటించే నిన్ను నేనెక్కడని వెదికేది. నీ యెడబాటు ఎట్లా సహించేది ? నీవు లేనిది నా జీవితం వృధా."

రాముని అనేక రీతుల స్తుతించాడు మంచి మనసుకు మంచి దినములు రాక తప్పుతాయా. శ్రీరాముని హృదయం కరిగింది. తల్లి హృదయమూ వెన్నెలా కరిగింది. పతిని దీనంగా జూచింది. శ్రీరాముడు మందహాసం జేసినాడు.

త్యాగరాజు హృదిలో యేదో మెరసినట్లయింది. ఆనంద రసం ఉత్పన్నమైనట్లు భ్రమించాడు. కండ్లు తెరచి నలుమూలలా పరికించాడు. గది నిశ్శబ్దంగావుంది. భార్య ఓ మూల, కుమార్తె మరో మూల విచారగ్రస్తులై వున్నారు. అంతలో త్యాగరాజు తనను కావేరి గర్భంలో వెదకి జూడన్నట్లు మదిలో యేదో భావన

తళుక్కుమని మెరిసింది. వెంటనే లేచి కావేరివైపు నడక సాగించాడు వడివడిగా. బయట అరుగుమీదవున్న శిష్యులు గురువుగారిని వెంటనే అనుసరించారు

కావేరి పొంగి ప్రవహిస్తున్నది ఎన్నడూ కావేరి అంత ఉధృతంగా వుండడం త్యాగరాజు చూడలేదు. నిట్టూరుస్తూ నిలబడిపోయినాడు ఈ అనంత జలరాశిలో నేనెక్కడని వెదికేది రామా ! ఈ అఖండ కావేరిలో నీ వెక్కడున్నావో. ఇది నాకు పరీక్ష__

స్వామి పరీక్షకు తల యొగ్గవలసిందే ! తల్లీ కావేరీ ! నేను నా స్వామిని వెదుకుతూ నీ దరికి వచ్చాను. నీ ఒడే నాకు సంగీత భిక్షకు ప్రథమ స్థానం. నీవే నాకు సంగీత మూలాధారమయిన నాదాన్ని అనుభవించేట్లు చేశావు. ఆనాడెలా నీ వద్దకు తలవని తలంపుగా వచ్చానో నేడు కూడా వచ్చాను కాని యీనాడు నీలో ఆ ప్రశాంతత లేదు కోపధారివై యున్నావు. నామీద ఎందుకు కోపం. నీ బిడ్డను నీవు కరుణించవా ? నాస్వామి యెక్కడున్నా నేను తెచ్చుకోవల్సిందే నీవు నన్ను నీ ఒడిలో చేర్చుకొన్నా, దరికి చేర్చినా ఆ భారం నీదే" అంటూ రామా, రామా యని ఉచ్చరిస్తూ కావేరిలోకి దిగాడు శిష్యులు హాహాకారాలు చేశారు

అఖండ కావేరిలో దిగిన త్యాగరాజుకు నదిలోని నీటి ప్రవాహపు జోరు తగులలేదు అంతేకాదు ఆ నీటి ఒరవడికి త్యాగరాజుకు యెలాంటి ఆపద కలుగనివ్వలేదు. రామా రామా యనిన త్యాగరాజు పిలుపు ప్రవాహశబ్దంలో మిళితమై కావేరి కూడా రామా రామాయని పిలిచినట్లుయింది ఉన్నట్టుండి విగ్రహాలు త్యాగరాజు వక్షస్థలాన్ని స్పృశించాయి. త్యాగరాజు రెండు చేతులతో విగ్రహాలను జవురుకొని గుండెలకు హత్తుకొన్నాడు. ఆనందాశ్రువులతో ఒడ్డుకు చేరాడు

శిష్యులు, ప్రజలు యెంతో ఉత్సాహంతో ఆ దృశ్యాన్ని తిలకించి ధన్యులైనారు. త్యాగరాజు ఒడ్డుకు విగ్రహాలతో రాగానే ఒక్కసారిగా త్యాగరాజుకు భక్తియుతంగా నమస్కరించి ఆయన పాదస్పర్శకోసం తహతహలాడారు. శిష్యగణం అప్పటికప్పుడే పల్లకి తయారు చేసేరు.

త్యాగరాజు రామపంచాయతన విగ్రహాలను పల్లకీలోవుంచి వేచడానికి చామరం అందుకొన్నారు శిష్యులు. పల్లకీ మోసారు. త్యాగరాజు, సవరించిన హృదయంతో రఘువీర! మా యింటి వరకు రమ్మీ. సుకుమార నీకు నేను మనసా నమస్కరిస్తున్నాను. నన్ను యిక విడనాడకు నేను తప్పుజేసిన బుద్ధి చెప్పవలసినవాడవు కాని విపరీతంగా యింత శిక్ష విధించిన నేనోర్వగలనా? నీకన్న నాకు దిక్కెవ్వరు నన్ను విడనాడకు (రారా మా యింటిదాక, రఘువీర__సుకుమార__అసావేరి)

అని ప్రార్థిస్తూ స్వామికి వింజామరం వీస్తూ యింటికి వచ్చాడు - భార్య వేమలాంబ, కుమార్తె సీతాలక్ష్మి హారతి పళ్ళెములతో స్వాగతమిచ్చారు త్యాగరాజు విగ్రహాలను పునః ప్రతిష్ఠ జేశాడు, శిష్యులు, ప్రజలు యెంతో సంతసించారు. పాపం జపేశుని పాచిక పారలేదు.

ఉప్పొంగిన హృదయముతో రాముని దివ్యనామాన్ని జపించాడు తినగ తినగ వేము తియ్యగనుండు నన్నట్లు నీ నామమును నిత్యము జపిస్తుంటే అందలి మధుర రుచి యిట్టిదని నేనెలా జెప్పేది. బంగారు పీతా ఒరము ధరించిన శ్రీరామా నీవు నేత్రానందంగా కనుపిస్తున్నావు. నీ సౌందర్యము మునివర్యుల నైతము ఆకర్షించినదిగదా! నా నేత్రాలకు నీ రూపం యెలా కనిపిస్తుందో ఆ వర్ణన చేయడానికి నాకు శక్తి గలదా? నిన్ను స్మరించవలెనన్న జన్మాంతర భాగ్యముండవలెగదా! బాలుగారు నీ చిన్ని మోము సౌందర్యము ప్రకృతిలోని రహస్యము సీతమ్మకు నీ ప్రౌఢ ఆనంద చందములుచూపి ధన్యురాలినిజేశావు ధృవ, ప్రహ్లాదాది భక్తులకు నీ దివ్యరూపములు చూపావు జటాయువుకు నీవే అగ్ని సంస్కారంజేసి కైవల్యం ప్రసాదించి పుణ్యాత్ముడిని జేసినావు పరమ భక్తుడు ఆంజనేయునికి ఆ పాద పద్మములవద్ద చోటిచ్చావు. రామా! తులసీవనంలో సీత నీరూపం చూడవలెనని యెంతటి వుత్సాహితయై వుండివదో అట్టి స్థితిలో నేనున్నాను. వీరందరితో నేను సమానుడనని గర్వించుటలేదు మనసారా వేడుకొనుచున్నాను. నారద, పరాశర, పురందర దాసాదుల అనుగ్రహించినట్లే నన్నూ అనుగ్రహించు నాకు వారు సాక్షులు. గురువులు నిత్యం నిన్ను స్మరించే నన్ను విడనాడకు. (కనకన రుచిరా__పంచరత్న కీర్తన__వరాళిరాగము)

సీతారాముల విగ్రహాలను పునః ప్రతిష్ట చేస్తుండగా వేద మంత్రోచ్చారణ చేశారు శ్రోత్రియులు. భక్తకోటి రామనామోచ్చారణతో త్యాగరాజు యిల్లు మారుమ్రోగింది.

త్యాగరాజు ఆనందాశ్రువులతో, రామా పరీక్షలతో యిక నన్ను హింసించకు. నా పాపాలకు ప్రాయశ్చితం జరిగిందని తలుస్తున్నాను. నన్ను బాధిస్తున్న వారిని బాగులపాల్జేయకు నీ ప్రియ భామినికన్న భక్తులే యెక్కువని నీవు పలుమార్లు పలికియున్నావు.


వసంతరాగంలో ''ఎట్లా దొరికితివో రామా చుట్టూరు గడియ దోవకు నాదుపట్ల అభిమానము లేకుండగ'' యనిగానం చేశారు. (సశేషం)


బ్రేకులు లేకుండా మీరు కారు నడపగలరా?


అది మీరు తీసుకునే భద్రతపై ఆధారపడి వుంటుంది. సర్క్యూట్ బ్రేకర్లు అంటే కారులో బ్రేకులవంటివి. విద్యుచ్ఛక్తి కంట్రోలు తప్పిపోయే పరిస్థితిలో సర్క్యూట్ బ్రేకర్లు తమ పని మొదలుపెడతాయి. సర్క్యూట్ వెంటనే పొరపాట్లు లేకుండా ఆగిపోతుంది. ఇందువల్ల, విలువైన విద్యుచ్ఛక్తి యంత్రాలకు, ట్రాన్స్మిటింగ్ సాధనాలకు ఏవిధమయిన ప్రమాదం వుండదు.


హైదరాబాదు BHEL వారు మినిమమ్ ఆయిల్ సర్క్యూట్ బ్రేకర్లు (25KV to 132KV), ఎయిర్ బ్లాస్ట్ సర్క్యూట్ బ్రేకర్లు (132KV to 400KV)ను తయారుచేస్తున్నారు.

నమ్మకంగా పనిచేయడానికి డిజైను చేయబడ్డ ఈ స్విచ్ గేర్లు చక్కగా పనిచేస్తున్నాయని ఋజువు చేయబడ్డాయి. ఇవి ఇండియాలోని ప్రతి రాష్ట్రంలోను చక్కగా పనిచేస్తున్నాయి. త్వరలోనే ఇవి విదేశాలకు కూడ ఎగుమతి అవుతాయి. మధ్య ఆఫ్రికాలోని మాలవి దేశంనుంచి వచ్చిన శుభవార్త — BHEL వారి మినిమమ్ ఆయిల్ సర్క్యూట్ బ్రేకర్లకు ఆర్డరు.









భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్
(గవర్నమెంట్ ఆఫ్ ఇండియావారి సంస్థ)
రామచంద్రపురం, హైదరాబాద్-32
రిజిష్టర్డ్ ఆఫీసు: 5, పార్లమెంటు స్ట్రీట్, న్యూఢిల్లీ-1

FDSBHEL1589TE B

కన్యాశుల్కంలో "మధురవాణి"

ముద్దసాని రాంరెడ్డి

స్వతంత్ర నాటక రచనా రంగంలో కన్యాశుల్కం అపూర్వ సృష్టి. ఆంధ్రసారస్వతంలో అనుపమానమగు అణిముత్యం. రచనా సంవిధానంలో, పాత్ర కల్పనలో, సంభాషణాచాతురిలో, భాషాపాటవంలో దాని కదియే సాటి. అందులోని పాత్రలు ముఖ్యంగా గిరీశం, మధురవాణి ఆంధ్రపాఠక జన మస్తిష్కాల్లో మరపురాని, చెరగిపోని ముద్రలువేశారు. గిరీశం విటనట హాస్యాగ్రేసరుడైతే, మధురవాణి హాస్యచతుర మధురోక్తుల ముద్దుబోణి. ఆమె వేశ్య అయినా కేవలం కామతృష్ణను తీర్చే యంత్రంకాదు. చతురత, చలాకీ సరసం సారస్వతం ఆమె సంభాషణలో, హావభావ చేష్టలలో తొణకిస లాడించు ప్రౌఢాంగన. ఆమెను చేపట్టిన వాళ్ళను సరసోక్తులతో చెర బట్టి, కనుసన్నలతో కనికరించి, క్రీగంటి చూడ్కులతో కైపెక్కించి, తాను ఆడించ వలసిన నాటకమంతా ఆడించి, సరసులచేత సెభాసనిపించుకున్న నెరజాణ. ఆవిడ హృదయంలో జాలి, నడవడిలో న్యాయం, సంభాషణాచాతురిలో నీతి నిబడమై ఉందని నాటకం చదివిన వాళ్ళకు ఇట్టేస్ఫురిస్తుంది. చతురోక్తులూ, హాస్యరస సంభాషణలే మధురవాణి ముంజేతికంకణాలు కన్యాశుల్కంలో ఆద్యంతాల వరకు. మధురవాణి యొక్క సుమధుర వాణి పాఠకుల హృదయాల్లో గిలిగింతలు పెడుతూ తన్మయత్వంలో నోలలాడిస్తుంది. మధురవాణియొక్క "మధురవాణి" లేని కన్యాశుల్కం పేలవంగా, నీరసంగా, చప్పగా ఉంటుందనుటలో అత్యుక్తి లేదు.

కన్యాశుల్కపు ప్రథమాంకంలో మధురవాణి తన ఇంట్లో వ్యాజ్యాల పక్షియగు రామప్పంతులుతో ప్రత్యక్షమవుతుంది. అప్పటికి గిరీశంతో మధురవాణికి గల సంబంధాలు తెగిపోలేదు. రామప్పంతులు మధురవాణిని ఉంచుకోవడానికి నిశ్చయించి, ఒప్పందాల ప్రకారం డబ్బు మధురవాణికి ముట్టజెప్పి సరసాలకు సమకడతాడు. గిరీశంతో తెగదెంపులయ్యేదాకా తనను తాకవద్దని తాకీదు చేస్తుంది. సానిదానికి మాత్రం నీతి ఉండొద్దా అని పృచ్ఛచేస్తుంది. ఉంచుకున్నవాడు వైదీకైనా, కిరస్తానీయైనా ఎలాంటి వాడైనా అతని యెడల విశ్వాసం ఉండాలని వక్కాణించు కుంటుంది. ఈలోగా గిరీశం ప్రవేశించి మధురవాణిని ముట్టుకోబోతె ఇప్పడే తొందర, తలంటుకు వస్తానని తప్పించుకుంటూ గిరీశంతో మీరు కిరస్తానీలటగా అని వెటకారం చేస్తుంది. అలా అనడానికి ఎవరికి దమ్ములున్నాయని గిరీశందబాయిస్తే మొగవాడే చెప్పాలా ఏం? ఆడదానికి దేవుడు నోరియ్యలేదా అని చమత్కరించి, మాట మార్చి పూటకూళ్ళమ్మ ప్రసక్తి తెచ్చి పరువైన మగవాడు సానిదానింటి కొచ్చినపుడు, పరువైన ఆడదివస్తే తప్పా? అని ప్రశ్నిస్తూ సంఘ దురాచారాలపై దుమ్మెత్తి పోస్తుంది గిరీశాన్ని ఎక్కడ దాచావని పూటకూళ్ళమ్మ పృచ్ఛచేస్తే దాచడం కర్మ నాకేమిటి నేను మొగనాలినీ కాను, వెధవముండనీ కానని బల్లగుద్ది గద్దిస్తుంది. నాటిమగవాళ్ళ, వెధవముండల రంకుతనాన్ని ధ్వన్యాత్మకంగా ప్రతిధ్వనింపజేస్తుంది మానవతి మధురవాణి.

మూడవ అంకంలో మధురవాణి స్వగతంలో రామప్పంతులు బండారం బయట పెడుతూ "ఆతడివ్యవహారం పైకి పటారం లోనలొటారంగా ఉందని వాపోతూ పెండలాడే చిక్కినంత సొమ్ము చేజిక్కించుకొని మరొక కొమ్మ పట్టుకోవాలనే పట్టుదలను ప్రకటిస్తూ పైకి మాత్రం తనకు డబ్బు ప్రధానం కాదనీ లోకంలో గల సానులపోలిక తనకు లేదనీ, మాతం ప్రమాణం రామప్పంతులు పాలుచేశానని ఆతన్ని నయవంచన చేస్తూనే, ముసలివాడగు లుబ్ధావధాన్లకు వయసు పిల్లతో పెళ్ళి ఎందుకు కుదిరించారని సవాలు చేస్తూ, ఆ ఎత్తంతా రామప్పంతులు సరసాల సరదా కోసమే నన్నట్లు సమస్యను పెడమరచి రామప్పంతులు ఓ చెణుకు విసరుతుంది. "ముసలి మగలతో వయసు మగువల పెళ్ళిళ్ళు తనకు సుతరామూ ఇష్టం లేదని మధురవాణి రామప్పంతులుతో చెప్పి, ఎల్లాగైనా ఆ కుదిరిన సంబంధాన్ని విచ్ఛిన్నం చేయమని లాలించి, బుజ్జగించి, వేధించి వేడుకున్నా రామప్ప పంతులు ససేమిరా దిగిరాకుంటె, ఇక లాభం లేదని ఆ వివాహాన్ని విచ్ఛిన్నం చేయడానికి తన దొడ్డి దారి ప్రయత్నాలు ప్రారంభిస్తుంది. రామప్పంతులు లౌక్యానికీ, ఇతరులు చేసే మోసానికీ తేడా ఏమిటని నిలదీస్తుంది. దళారీతనపు దగాకోరు కాసుల కాశపడి నైత్యానికి పాలు పడ్డావని రామప్పంతులుతో ఘర్షణకు దిగుతుంది. పాలకు నీళ్ళు తోడైనట్లు మధురవాణి సదాశయానికి కరటక శాస్త్రి తారసిల్లుతాడు. కరటక శాస్త్రి తనకోడలితో లుబ్ధావు దాన్లకు కుదిరిన పెళ్ళి సంబంధాన్ని తప్పించడానికి మధురవాణి సహాయాన్నపేక్షిస్తాడు. కరటక శాస్త్రి మారు వేశంలో తన శిష్యునికి స్త్రీ వేశం వేయించి, లుబ్ధావు దాన్లకు కుదిరిన పెళ్ళి సంబంధాన్ని ఒట్లించి తక్కువ బేరంలో తన శిష్యుడితో మనువు కుదిరిస్తే ఇరువై రూపాయిలిస్తానని మధురవాణిని వేడుకుంటాడు. కనికరమూ, కరుణా మూర్తీభవించిన మధురవాణి కరటక శాస్త్రితో "వృత్తి చేత వేశ్యని కనుక చెయ్యవలసిన చోట్ల ద్రవ్యాకర్షణ చేస్తాను గాని, మధురవాణికి దయా దాక్షిణ్యాలు సున్నయని తలచారా? మీ తోబుట్టువుకి ప్రమాదం వచ్చినప్పుడు నేను డబ్బుకి ఆశిస్తానా? యటుంచి ఏటొచ్చినా కాపాడతానని" వాగ్దానం చేసి మాట నిలబెట్టుకున్న దయగల సాని మధురవాణి ఇంత ధీమాగా చెబుతున్న మధురవాణి మాటలను శంకిస్తూ కరటక శాస్త్రి "రామప్పంతులు తనకు స్వాధీనుడేనా" యని అడుగుతే, ధీమాగా "గులామ్" అని జవాబు చెబుతుంది. ఇంత రంగమూ జరిపించిన మధురవాణి పైకి మాత్రం నంగ నాచిలా నటిస్తూ. రామప్పం

తులూ. కరటక శాస్త్రి మధ్య జరిగిన పెళ్ళి సంబంధం తాలూకు సంభాషణ అంతా వింటూ ఉంటుంది.

చతుర్థాంకంలో మధురవాణి మధురోక్తులు, చెణుకులు, సరస సంభాషణాచాతురి ముచ్చటగా ఉండి చదువరుల హృదయాలను రంజింప జేస్తుంది. రామప్పంతులు, మధురవాణి మధ్య జరిగిన హాస్య రస భరిత సంభాషణలో సంలీనం కాని సరసులు సకృత్తేనన వచ్చు. "తనకు ఇంగ్లీషు ముక్కలే గనక వస్తే, న్యాయమూర్తులనే ఫెళ ఫెళ లాడించే వాడిననీ, తన వాక్కులో బృహస్పతి ఉన్నాడనీ' అందువల్లే తన ప్రతిభ అలా వెలిగి పోతుందని కోతలు కోస్తున్న రామప్పంతులు నోటికి తాళం వేయాలనే ఉద్దేశంతో మధురవాణి "మాటలు నేర్చిన శునకం ఉసుకో అంటె ఉస్కో" అందని విసురుతుంది దాంతో రామప్పంతులు కోపంతో నేనాశునకాన్ని,అని గర్జిస్తే అబ్బే హాస్యానికన్నానని సవరిస్తూనే "మరి నీతో హాస్య మాడక పోతె ఉవందరితో హాస్యమాడనా? అని దబాయిస్తూ, "కుక్కన్నా నక్కన్నా మిమ్మల్నే అనాలి. అలా అనడానికి, నాకు హక్కుందని నెరజాణత్వాని నిరూపించుకుంటుంది. ఆ విదంగా వాళ్ళ సంభాషణా సరళి సాగుతూ గిరీశం పైకి మళ్ళుతుంది గిరీశం లుబ్ధావు ధాన్ల బంధువు కాబట్టి అతడు పెళ్ళికి వస్తే 'మపై హస్తలాఘవం తప్పదేమో నని" రామప్పంతులుకు పూర్వరంగ సంఘటనా సంస్కృతిని కలిగించి కలవర పెడుతుంది. దాంతో అతడు గాభరా పడి సాధనోపాయం చూడమని ప్రాధేయ పడితే, లుబ్ధావుధాన్ల గృహంలో పెండ్లి వంటలు చేయడానికి పూట కూళ్ళమ్మను పిలవమని, సమయోచిత సలహా ఇచ్చి బుద్ధి కౌశల్యంతో రామప్పంతులు మెప్పును చూరగొంటుంది

ఈ లోగా లుబ్ధావుధాన్లకు అతని పిన తండ్రి కొడుకైన గిరీశం ఉత్తరం రాస్తూ "అగ్నిహోత్రావు ధాన్ల కూతురిని యీ ముసలితనంలో పెళ్ళి చేసుకోవద్దని అవాకులూ చెవాకులూ రాస్తాడు. దాంతో లుబ్ధావు ధాన్లు అగ్గి మీద గుగ్గిలమై భుగ భుగ మంటూ రామప్పంతులుపై పరి ఏ చన శబ్దాలంకార ప్రయోగం చేస్తాడు. అది సహించక రామప్పంతులు ఎడా పెడా దులిపే సరికి, లుబ్ధావుధాన్లు క్రుద్ధుడై తానే స్వయంగా ఆలేఖను అగ్నిహోత్రావుధాన్లకు చూపించి యదార్ధం కనుగొంటానని వెళ్ళి పోతుంటే, ఆది తాను వ్రాసినదేమో ననే ధర్మ సందేహం కలిగి, లేఖ అగ్నిహోత్రావుధాన్ల చేత బడితే ఫోర్జరీ కేసు తనపై బడుతుందని రామప్పంతులు భయపడు తుంటాడు అతన్నికాపాడాలనే ఆతృతతో మధురవాణి మధురవచన సుమాలతో లుబ్ధావుధాన్లను బులిపించి తోడ్కొని వచ్చి. సయగారంతో లాలించి, లేఖను లాక్కొని రామప్పంతులు కిచ్చి నేర్పరి తనాన్ని సమయ స్ఫూర్తిని రుజువు చేసుకుంటూ. తెరవెనుక తతంగం నడిపిస్తూ లుబ్ధావు ధాన్లకు, అగ్నిహోత్రావుధాన్ల సంబంధాన్ని చిట్లించి గుంటూరు శాస్త్రి గారి ఆడ వేషపు శిష్యుడితో పెళ్ళి ఖాయ పరచి తన బంగారు కంటెను పిల్ల మెడలో వేయడానికి రామప్పంతులుకు ఎరువుగా యిచ్చి సహృదయతను, జాలిగుండెను రుజువు సేసుకుంటుంది.

ఇంతవరకు గడచిన మధురవాణి పాత్ర ఒక ఎత్తు ఇప్పటి నుండి మరొక ఎత్తుగా నడచింది లుబ్ధావుధాన్లకు పెళ్ళి జరిగినా మూడవ నాడే, ఆడవేశపు పిల్లడు, అనగా కరటకశాస్త్రి (గుంటూరు శాస్త్రి) శిష్యుడు మీనాక్షి గూబ గుద్దుల బాధ భరించలేక నిశిరాత్రి గోడ గెంతి లగెత్తుకు వచ్చి మధురవాణి కంటెను ఆవిడ కిచ్చి తిన్నగా అసలు వేషంలో గురువుగారిని కలుసుకుంటాడు. ఈ యదార్ధం తెలియక అటు లుబ్ధావుధాన్లు ఇటు రామప్పంతులు నీళ్ళు గారిపోతుంటారు తాను ఎరువుగా ఇచ్చిన కంటె తెమ్మని రామప్పంతులును మధురవాణి వేధిస్తుంటే విధిలే లుబ్ధావు ధాన్లపై ఖూనీ కేసు బనాయించాడు, అటు అగ్నిహోత్రావుధాన్లు కూతురు పెళ్ళి ఎగిరిపోయినందుకు లుబ్ధావు దాన్లపై క్రిమినల్ కేసు పెడతాడు ఈ విధంగా లుబ్ధావు దాన్లు గోటి మట్టు రోకటి పోటతో బాధ పడుతూ,పిల్లనూ ముల్లెనూ జారవిడుచుకుని బేజారై ఏదిక్కు తోచక సౌజన్యారావు వకీలుకు స్వంం నివేదించుకుని కుమిలి పోతుంటాడు.

ఇన్ని విధాలా ఇందరికి గుణపాఠం నేర్పడానికి మధురవాణి సంకల్పించి తన లక్ష్యాన్ని నేర్పుగా నెరవేర్చుకుంటుంది. మధ్య దళారీల ఆట కట్టించి డబ్బులాగి మోసాలు చేయకుండా చేయడానికి గాను మధురవాణి తన కంటె రహస్యంగా రాబట్టుకొని రామప్పంతులును వెంకశప్పాయిని చేసింది మీనాక్షిని పెళ్ళి చేసుకుంటానని మాటిచ్చి పుట్టి ముంచిన రామప్పంతులుతో" మీనాక్షికి కుంతకున్నావె? గుణం తక్కువా అని గద్దించి, భ్రష్టు చేసిన ఆమె బ్రతుకును పెళ్ళాడి తప్పు దిద్దు కొండని హితోపదేశం చేస్తుంది, లుబ్ధావు ధాన్లపై ఖూనీకేసు నేరారోపణ జరగడం వల్ల. నిష్కారణంగా తన మెడకు బ్రహ్మహత్యా పాతకం చుట్టు కుంటుందనుకున్న కరటకశాస్త్రి కలత జెంది ఏదిక్కూ తోచక మధురవాణి శరణు జొచ్చి కంటె ఇప్పించ వలసిందిగా కంటికి నీరెట్టుకు విలపించి వేడుకునేలా చేస్తుంది "అంగడివానికి మిఠాయి మీది ఆశ, సానిదానికి వలపూ మనస్సు రోనే అణగాలి. కొలదికాలం ఉండే యౌవనాన్ని జీవనాధారంగా చేసుకున్న సాని కులానికి వలపు బంగారం మీదేఉంటుంది, శృంగారం వన్నె చెడిన నాటినుండీ బంగారమే కదా తేటు తేవాలి. " అని కరకటశాస్త్రితో తర్కించి, తనకంటె ఇతరుల చేతిలోబడి అది ఎలాతిరిగి తన చేతికి వస్తుందని ప్రశ్నిస్తే, సౌజన్యారావు బహు న్యాయమైన మనిషీ కనుక అతను తప్పక తిరిగి ఇస్తాడని'' కరటకశాస్త్రి చెబుతాడు. అంత మంచి వాడిదగ్గరికి తనను తీసుక వెళ్ళమని మధురవాణి అర్థిస్తే, అతడు నూరు పాళ్ళు ఆంటీనాచీ కాబట్టి వేశ్యలను వీక్షించడని జవాబిస్తాడు. అందుకు మధురవాణి '' సృష్టిలోకల్ల వన్నె తెచ్చిన మధురవాణి, గిరీశం వంటి గ్రామ సింహాల సాపత్యానికేగాని సౌజన్యారావు లాంటి సత్పురుషుల చూడడానికైనా అర్హతకలిగియుండ లేదా? తమలాంటి పండితోత్తములు మాత్రం కార్యావసరం కలిగినపుడు మధురవాణి దగ్గర లాచారీ పడవచ్చునా యని సమాజపు సరళిని, మానవుల స్వభావాలను సోపత్తికంగా చూపెడుతుంది. డిప్టికలెక్టర్ లాంటి ఘరానా వ్యక్తులు కూడ తనకు రాయబారాలు పంపుతున్నారని కరటకశాస్త్రికి తెలియజేస్తూ, ఇకనుండి తాను గిరీశం లాంటి గ్రామ సింహాలకు డిప్టికలెక్టర్ లాంటి సీమ శునకాలకు దూరంగా ఉండాలనుకున్నానని తన దృఢ సంకల్పాన్ని సువ్యక్తం చేస్తుంది. హెడ్‌కాని

స్టేబుల్ లాంటి మనుషులను కార్యసాఫల్యత కొరకు నౌకరులా తిప్పుకున్నానని బాహాటంగా ప్రకటిస్తుంది కరటకశాస్త్రితో అతని శిష్యుడగు మహేశానికి కిచ్చిన మాట ప్రకారం తన కూతురునిచ్చి పెళ్ళిచేసి ఇక నుండి అతన్ని నాటకాలాడించి, ముండలిండ్లు తిప్పి చెడగొట్టవలదనీ: బ్రాహ్మణులలో ఉపదేశం ఎక్కువ, ఆచరణ తక్కువ అన్న నగ్న సత్యాని గుర్తుచేసి వాపోతుంది

ఇక సప్తమాంకంలో మధురవాణి పాత్ర అవ్యక్త మధుర పాత్ర పోషణకారమై పాఠకుల మనోరంజనకు ప్రతీక అవుతుంది సౌజన్యారావు ఇంటికి అసుర సంధ్యవేళ మధురవాణి పురుషవేషంలో ప్రవేశించినపుడక్కడ గిరీశం కూడ ఉంటాడు తాను సౌజన్యారావుతో జరూరు ప్రయోజనం ఉండి వచ్చాననీ వర్తమానం చేయకుండా వచ్చినందుకు క్షంతవ్యుడనని చెబుతుంది. కారణాంతరములచేత తన పేరు ప్రకటించడానికి వీలులేదని విన్నవించుకుంటుంది సంభాషణా సందర్భంలో తానిక్కడినుండి సౌజన్యారావుగారి మాటను పాటించి చెడువారితోకూడ మంచిగ ఉండడానికి ప్రయత్నిస్తానని అంటూ, లోకంలోని ప్రజలు లోకానికి తమ చెడును దాచి మంచిని చూపడానికే ప్రయత్నిస్తారు కాని గిరీశం లాంటి గోముఖాలు మాత్రం తమకులేని మంచిని ఆపాదించుకుని లోకాన్ని భ్రమింపచేస్తారని విన్నవిస్తుంది. స్వాభావికంగా మంచికి లోకం గ్రుడ్డికాని చెడును వెతకడానికి చారెడు కళ్ళు కనుక లోకం ఒకవ్యక్తిని సత్పురుషుడని నిర్ధారణ చేసింతరువాత వాళ్ళు మంచివాళ్ళే అవుతారు కాబట్టి సౌజన్యారావు సందర్శన భాగ్యంవల్ల తన జన్మకు సాఫల్యత చిక్కిందని ఉద్ఘాటిస్తూ విధవలను పెండ్లాడడానికి సంస్కారం. అభ్యుదయభావాలు గలవారు ముందడుగు వేస్తారేమోకాని వేశ్యలు వివాహం చేసుకోసంకల్పిస్తే వారికి కోరతగిన వరుడు లభించడమెలాగని సౌజన్యారావుకు మధురవాణి తిరుగులేని ప్రశ్నవేసి సముచితమగు జవాబు పొందలేకపోతుంది విద్యలు నేర్చిన వేశ్యలు సౌజన్యారావులాంటి వారిని పతులుగా పొందవచ్చునాయని అడిగితే 'తనెత్తు ధనం పోసినా తానీజన్మలో వేశ్యను ముట్టను, పెండ్లాడనని హేతువాదానికాస్కారంలేని పొల్లు సమాధానం పొందుతుంది. అతని పిడి వాదాన్ని కాదనడానికిగాను మధురవాణి ఒకయుక్తి పన్ని లుబ్ధావుధాన్లకేసులో గట్టి సహాయం చేయగలిగినవాళ్ళను తానెరుగుదుననీ, ఆవిడ ద్రవ్యానికి లోబడని వేశ్యయనీ, ఆమె సౌజన్యారావుపై మోజు కనబరుస్తున్నదని చెప్పి అతన్ని పరిపరివిధాలా పరీక్షిస్తుంది. సౌజన్యారావు ఆమె మాటలను విశ్వసించక, మీరు గిరీశం శిష్యులంటిరిగదా? అతనివలె మీరు ఆంటీనాచీకాదా? యని పృచ్ఛచేస్తె అందుకు మధురవాణి తాను అక్షరాలా ఆంటీనాచ్ నేనని చెబుతూ వివేకులైనవారంతా అంటీ నాచ్‌లేనని ప్రకటిస్తూ తలపాగ కోటు విప్పి రూన ఊరూ పేరు చెబుతుంది. "అనేక సంవత్సరాల నుండి తాను వేశ్యను చూడలేదు, మాట్లాడలేదు అలాంటి తనకీనాడు వ్రత భంగమైదని" సౌజన్యారావు విచారిస్తున్నానంటాడు. "తమరు ప్రాజ్ఞులు, వ్రత భంగమేది" యని అంటె" నిశిరాత్రి పడకటింట్లో వేశ్యతో మాట్లాడుట యని అనగానే, వేశ్యలు పార్టీలైతే వకీళ్ళు కేసులు పట్టరా యని సవాలుచేస్తే సరియైన సమాధానం సౌజన్యారావు ఇవ్వలేక నీళ్ళు నములుతుంటాడు

"వేశ్యలు దేవాలయంలో భగవంతున్ని చూడడానికి, నాట్యమాడడానికి అర్హత కలిగియున్నప్పుడు, సత్పురుషులను చూడలేమా ? అంటుంది, నీవు మంచిదానివైతే, లుబ్ధావుధాన్లకు కేసులో సాయం చేయమంటాడు. తాను మంచిదానిననే విశ్వాసం సౌజన్యరావుకుంటే ఒక చుంబనం ప్రసాదించమంటుంది. చుంబనానికి బదులు వేయి రూపాయలిస్తానని బులిపిస్తాడు. అయినా మధురవాణి అంగీకరించకపోతే విధిలేక చుంబనానికి అంగీకరిస్తాడు. ఇప్పుడు మధురవాణి కరటకశాస్త్రి లుబ్ధావుధాన్ల వివాహవిషయంలో పన్నిన పన్నాగమంతా విశదీకరించి, ముద్దునంగీకరించిన సౌజన్యారావుతో'' చెడనివారిని చెడగొట్టవలదని తన తల్లి తనకు చెప్పింది కాబట్టి అతని ముద్దును వద్దని వారిస్తుంది సౌజన్యారావు సమీపాన గల భగవద్గీతను తీసుకొని ఇది మంచివారు పఠించే పుస్తకమా అని పృచ్ఛ చేస్తుంది. శ్రీకృష్ణుడు సానిదానితో స్నేహం కడతాడా ? అతడు ఆంటీనాచ్ కాదా ? అనికొంటె ప్రశ్న వేసి సౌజన్యారావును క్రీగంట చూస్తుంది. భగవద్గీతను తనకు ప్రసాదిస్తే అది చదివి మంచి దాన్నవుతానని సౌజన్యారావు నర్థించి పుస్తకం పుచ్చుకుంటుంది. "నీవు మంచిదానవు వేశ్యావృత్తి విడిచిపెట్టమని సౌజన్యారావు అంటారు. సత్పురుషుల దయ సంప్రాప్తమైన తరువాత దుర్వృత్తి ఎందుకుంటుందని వ్యంగ్యోక్తి విసురుతుంది. ఇక నుండి తాను అడపా తడపా సౌజన్యరావు దర్శనం పొందవచ్చునా అని అడుగుతె వృత్తి మానుకుంటె నిరభ్యంతరంగా రావచ్చునని సమాధానం పొందుతుంది. ఈ విధం సౌజన్యరావు సోజన్యాన్నే సర్వవిధాలా వితర్కింపజేసి, అతడు కూడా పప్పులో కాలువేసిన వాడేనని పాఠకులకు నిరూపించి చూపుతుంది. నెపోలియన్ ఆఫ్ ది ఆంటీనాచ్‌గా సౌజన్యారావు ముందు ప్రకటించుకున్న గిరీశంగారి గోప్య ప్రేమ కలాపాన్ని సౌజన్యారావుతో చెప్పి అతని బండారం బయటపెట్టి బుచ్చమ్మ భవిష్యజ్జీవితాన్ని బాగుచేయడానికి సాయపడుతూ, గిరీశం పూర్వ ప్రేమాయణాన్ని వివరిస్తుంది.

ఈ విధంగా అప్పారావుగారు కన్యాశుల్కంలో అడుగడుగునా మధురవాణి పాత్రను పెంచుతూ సామాన్య వేశ్యగా పటితల ముందు ప్రవేశపెట్టి తుదకామెద్వారా సమాజంలోగల కుళ్ళను కళ్ళకు కట్టినట్టు చూపెట్టి, వాటిని క్షాళనం చేయడానికి సామాన్య వేశ్యనే సంఘ సంస్కర్తగా రూపొందిస్తాడు. గిరీశం ప్రేమాయణాన్ని, రామప్పవంతులు లౌక్యంలోగల నైచ్యాన్ని అగ్నిహోత్రావుధాన్ల ధన దాహాన్ని మూడుకాళ్ళ లుబ్ధావధాన్ల పెండ్లి సంబరాన్ని, ముక్కుపచ్చలారని ముదితల వైధవ్య జీవితాన్ని, సమాజంలో స్త్రీపట్లగల నిర్లక్ష్యభావాన్ని మధురవాణి ముచ్చటగా ముల్లోకాలకు చాటి చెబుతుంది. తుదకు సౌజన్యారావులాంటి సంఘ సంస్కరణాభిలాషులకు గూడ వేశ్యల యెడగల నూన్యభావాన్ని వేలెత్తి చూపుతుంది. ఈ విధంగా మధురవాణి సమాజాన్ని భగవద్గీతను చేబూని ఆదర్శప్రాయంగా తీర్చి దిద్దుకుంటూ తన పాత్రకొగ ఔన్నత్యాన్ని హుందాతనాన్ని చేకూర్చుకుంటూ, పటితల హృదయాల్లో అజరామరంగా నిలిచిపోతుంది.

మాచర్ల చెన్నకేశ్వరాలయం

మహేష్

ఆంధ్ర ప్రదేశ్ సంబంధి గుంటూరు జిల్లాలోని పల్నాడు తాలూకాకు చెందిన మాచర్లలో శిల్ప ప్రతిభలు వెదజల్లే ప్రాచీన దేవాలయం ఒకటి చెన్నకేశ్వర స్వామికి కైంకర్యం చేయబడి వుంది. ఇది విహార యాత్రికులకు, హిందువులకు చక్కని ఆకర్షణీయస్థావరంగా శతాబ్దాల దరిబడి వర్థిల్లుతూ వుంది. తాలూకా కేంద్రమగు, గురజాలకు మాచర్ల 24 కిలో మీటర్ల దూరంలో వుంది. గుంటూరు నగరం నుండి రైలు ద్వారా గాని, రోడ్డు మీదుగా గాని ప్రయాణం చేసి ఈ చారిత్రక స్థలానికి చేరుకొనవచ్చు.

కృష్ణా నదికి ఉప నది అయిన చంద్రవంక నదీ తీరంలో ప్రకృతి దన సౌందర్యంతో పసందు చేసే చోట ఈ చెన్నకేశ్వరాలయం నిర్మింప బడింది. చంద్రవంక యిక్కడే ఉత్తర దిశకు మరలటం మరింత శోభను చేకూర్చింది. తూర్పు దిశకు ప్రవహించే నది దేవాలయం నిర్మించిన చోట ఉత్తర దిశకు ప్రవహించుట ప్రారంభిస్తుంది. ప్రవాహ గమనం యిటువంటి మార్పు చెందేచోటు అత్యంత పవిత్రంగా భారతీయులు భావిస్తారు. దీనిని "ఉత్తర వాహిని"గా పిలుస్తారు. హైందవుల ముఖ్య పర్వ దినాలందు విష్ణూత్సవాలందు ఘనంగా యిక్కడ పూజలు జరుగుతాయి. మరీ ముఖ్యంగా వైశాఖ పౌర్ణమి (ఏప్రిల్-మే నెల) వైకుంఠ ఏకాదశి (జనవరి-ఫిబ్రవరి నెల) ఉత్సవాలు భారీ ఎత్తున జరుగుతాయి. ఈ పుణ్య సమయాలందు వచ్చే భక్తుల సంఖ్య కూడా చాలా ఎక్కువ. కాని సంవత్సరం పొడుగునా విహార యాత్రికులు మాచర్ల వస్తారు. కారణం ఇది చారిత్రిక ప్రాధాన్యతను పొందిన పట్టణం కావడం వలననే.

మాచర్లలో ప్రఖ్యాతి గాంచిన ఈ దేవాలయం చెన్నకేశ్వర స్వామికి కైంకర్యం చేయబడ్డ విష్ణు దేవాలయం. శిల్ప చాతుర్యం దృష్ట్యా మూల విరాటు సుందరమైంది. మూర్తికి చతుర్భుజాలు ఒక హస్తంలో శంఖు, ద్వితీయ హస్తంలో చక్రము, ముందున్న తృతీయ హస్తంలో గద, నాల్గవ చేయి అభయభంగిమలో రమ్యాతి రమ్యంగా వున్నాయి. విగ్రహంపై చెరగని చిరునవ్వు చోటు చేసుకుంది. ప్రాపంచిక లంపటాల్లో కొట్టు మిట్టాడుతున్న జన కోటపై దయా రసాన్ని ప్రసారిస్తున్నట్లు ద్యోతక మవుతుంది. ప్రతి భక్తుని మనస్సులో అనంత భక్తి దీప్తులు మూర్తిని చూచిన తడవుననే వెల్లువుకుతాయి.

దేవాలయం శిల్ప సంపదకే గాక నిర్మాణ రీతి దృష్ట్యా ప్రసిద్ధి గాంచింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హనుమకొండలోని వేయి స్థంభాల గుడి ప్రాభవ దీప్తంతో చెన్నకేశ్వరాలయాన్ని చరిత్ర కారుడైన ఫర్గూసన్ పోలుస్తాడు.

శ్రీ చెన్నకేశ్వరాలయ స్తంభాలు అనేకానేక శిల్ప సౌందర్య సంపదలను ఆలవాలం చేసుకున్నాయి. ఇందు ఒకే పోలికను కల్గిన జంట శిల్పాలు చూడ ముచ్చటగా వున్నాయి. దేవాలయ ద్వారాలు, ద్వారాలందు వినియోగించిన శిలలు, కన్పించిన పని తనం శ్లాఘనీయమైంది. గవాక్షాలందు వాడిన శిలా ఫలకాల కూర్పు అత్యంత చాకచక్యంతో అమర్చ బడింది. నాగ సంభంకు ఒక ప్రత్యేకత వుంది. దేవాలయ స్తంభాల్లో ఇదొక విశిష్టతను సంతరించుకుంది. దీని మీద ఒక చక్కని శాసనం వుంది. దీని వల్ల ఆ నాటి తెలుగు దేశ స్థితి గతులు వివరంగా తెలుస్తాయి. దేవాలయంలో చెప్పుకో దగిన పెక్కు శిల్పాలతో, అలంకరణలతో పాటు క్రీ. శ 12వ శతాబ్దికి చెందిన పల్నాటి విశిష్ట వ్యక్తులగు బ్రహ్మనాయుడు, నాగమ్మ నాయిక, ఇతర ముఖ్య వ్యక్తుల విగ్రహా యున్నాయి



చెన్నకేశ్వరాలయం

పుష్ప గుచ్ఛాలు, లతలు మొదలగు వలయ చిత్రాలంకారంతో ఒక చోట దేవాలయ కుడ్యంపై చక్కని శిల్ప ప్రతిమలున్నాయి. ఈ వరుస తెలుగు శిల్పియొక్క మేధా ప్రతిపత్తియొక్క పరమౌన్నత్య స్థితికి తార్కాణమైనిల్చింది.

ముచ్చటైన మూడు దేవాలయ శిఖరాలు గొప్పగా అనేకానేక సుందర విగ్రహాలతో అలంకరించబడి వున్నాయి. ఈ ప్రతిమలు రామాయణ, భారత గాథలనుండి ఎన్నుకొన బడినవి.

చరిత్ర దృష్ట్యా మనం పరిశీలిస్తే ఈ దేవాలయాన్ని 12వ శతాబ్దం ఉత్తర భాగంలో పల్నాడు సీమను పాలించిన "హైహయ వంశ రాజులకు ప్రధాన మంత్రి అయిన బ్రహ్మనాయకునిచే నిర్మితమైనట్లు తెలుస్తుంది. ఆయన ఆనాడు దేవాలయ పర్వాలకు, ఉత్సవాది కార్యకలాపాలకు, పోషణకు పెక్కు కానుకలు, భూములు యిచ్చినట్లు మనకు ఆధారాలున్నాయి. ఆయన దైవ భక్తికి ఈ నిర్మాణం ఒక చక్కని ఉదాహరణ.

మాచర్లలో మహనీయమైన చెన్న కేశ్వరాలయం గాక వివిధాలైన యితర చిన్న చిన్న దేవాలయా లున్నాయి. ఇవి కూడా ప్రాచీనమైనవె. అందు చాల వరకు శిథిలావస్థలో వున్నాయి. అందు శివాలయం, బ్రమరాంబాలయం, మొదలగునవి ముఖ్యమైనవి.

కర్కశ కాలాన్ని, పలు రకాల దండ యాత్రల వినాశనాన్ని తట్టుకొని నేటికి చెక్కు చెదరక నిల్చి వున్న వైభవోపేతమైన చెన్న కేశ్వరాలయం పల్నాటి పాలకుల ఔన్నత్యాన్ని ఘనంగా చాటుతుంది.

మత కేంద్రం దృష్ట్యా కాక మాచర్లకు చారిత్రికమైన ప్రాముఖ్యత వుంది. మాచర్ల పేరు వినగానే పల్నాటి వీరులకు సంబంధించిన వీర గాథలు మనస్మృతి పథంలో మెదలి హృదయ స్పందనాన్ని, ఉత్తేజాన్ని కలుగజేస్తాయి చెన్న కేశ్వరాలయం ఆ నాటి నిర్మాణమే కాకుండా, పల్నాటి చరిత్రలో ప్రముఖ పాత్రను నిర్వహించిన బ్రహ్మనాయని నిర్మిత మగుట వలన వారి సాహస కృత్యాలను మనకు జ్ఞప్తికి తెస్తుందనడంలో సందేహం లేదు

క్రీ. శ, 1176 నుండి 1182 మధ్యకాలంలో కారంపూడి గ్రామం వద్ద జరిగిన పల్నాటి యుద్ధం తెలుగు చరిత్రలో సువర్ణాక్షరాలతో వ్రాయబడింది. ఈ సమరంలో ముఖ్యమైన పల్నాటి వీరులు రెండు వైపుల అస్తమిస్తారు అందు యువ వీర సింహమైన బాలచంద్రుని సాహస సమరం తెలుగు జాతి కంతకు గర్వ కారణమైంది. ఇతడు బహ్మనాయని ఏకైక పుత్రుడు "అపర వీరాభిమన్యు" డనే బిరుదును సంపాదించుకొన్నాడు క్రీ. శ.16వ శతాబ్దానికి చెందిన కవి సార్వభౌముడు (శ్రీ) నాథ మహాకవిచే విరచితమైన "పల్నాటి వీర చరిత్రము" లో చంద్రవంక, మాచర్ల, కారంపూడి, గురజాల మొదలగున వన్నీ వర్ణింప బడ్డాయి. పల్నాటి సీమ యావత్తు మహోత్తమ స్థానాన్ని పొందింది అతని కవితలో

పల్నాటి వీరులు వాడిన ఖడ్గాలు, యితర ముఖ్య వస్తువులనేకం నేటికీ మాచర్లలో భద్రంచేయబడి వున్నాయి. మత కేంద్రం దృష్ట్యా గాక, చరిత్ర ప్రసిద్ధి పొందినది కావున వేలకు మించిన యాత్రికులు దేశం నలుమూలల నుంచి సంవత్సరం పొడుగునా మాచర్లకు వస్తూ వుంటారు. ఆంధ్రప్రదేశ్ నందే గాక భారత దేశం మొత్తంలో సందర్శనీయ స్థలాల్లో మాచర్లను ఒక ముఖ్య ప్రదేశంగా ఎన్నుకొన వచ్చు.

అంతర్వేదిలో లైట్ హౌస్

తూర్పుగోదావరి జిల్లా రాజోలు తాలుకాలోని అంతర్వేదిలో లైట్ హౌస్ టవర్, పవర్ హౌస్, ఇనస్పెక్షను భవనాలు. సిబ్బంది వసతి గృహాలు మున్నగువాటి నిర్మాణం యిటీవలనే పూర్తి అయింది. లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి $1\frac{1}{2}$ మైళ్ళ దూరంలో గోదావరి బంగాళఖాతంలో కలసినచోట లైట్ హౌస్ నిర్మించబడినది. భారత ప్రభుత్వ రవాణాశాఖ షిప్పింగ్ శాఖలోని లైట్ హౌస్ల విభాగం దీనిని నిర్మించింది.

ఆంధ్రప్రదేశ్‌లో ఇది భారీయెత్తున నిర్మించబడిన లైట్ హౌస్. విశాఖపట్నంలో డాల్ఫిన్స్‌నోస్‌వద్ద ఒక లైట్ హౌస్ ఇదివరకే నిర్మించబడినది దీనికి 1957 జూన్ నెలలో అప్పటి కేంద్ర రవాణాశాఖ మంత్రిగా వుండిన కీర్తిశేషులు శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి ప్రారంభోత్సవం చేసారు

అంతర్వేది లైట్ హౌస్‌కు ఉపముఖ్యమంత్రి శ్రీ జె. వి నరసింగరావు 1971 జూన్ 20వ తేదీ సాయంత్రం ప్రారంభోత్సవంచేశారు.

తూర్పు తీరంలో సాధారణ నౌకాయానాలకు ఈ లైట్ హౌస్ చాలా ఉపయోగకారిగా ఉంటుంది. దీని నిర్మణానికి సుమారు 15 లక్షల రూపాయలు ఖర్చుచేయబడినవి. క్లిష్టవాతావరణ పరిస్థితులలోకూడా దీని ప్రకాశం 17 మైళ్ళవరకు వ్యాపిస్తుంది. లైట్ హౌస్ టవర్ ఎత్తు 30 మీటర్లు. దీనిపై ఎరుపు, తెలుపు చారలు రంగులతో పూయబడినవి. దీని పునాది 10 మీటర్ల లోతు వున్నది ఇక్కడ నెలకొల్పబడిన పరికరాల నుంచి 1.5 మిలియను క్యాండిల్స్ ప్రకాశంగల వెలుతురు ప్రసారమవుతుంది స్థానిక విద్యుచ్ఛక్తి సరఫరాకు అంతరాయం కలిగే పక్షంలో లైట్ హౌస్ పనిచేయడానికి వీలుగా ఇక్కడ ఒక జనరేటర్ సెట్టు కూడా స్థాపించబడింది.

భారత ప్రభుత్వపు లైట్ హౌస్ శాఖ ఆంధ్రప్రదేశ్‌లో మరొక రెండు పెద్ద లైట్ హౌస్‌లను ఏర్పాటు చేయడానికి యోచిస్తున్నది. కృష్ణాజిల్లా దివితాలూకాలో పల్సదీవి పాయింటు వద్దను; నెల్లూరు జిల్లాలో కృష్ణపట్నము వద్దను ఇవి నెలకొల్పబడుతాయి. వీటి వెలుతురు కూడా 16 మైళ్ళ వరకు ప్రసరిస్తుంది. ఈ రెండింటికి కలిసి సుమారు 34 లక్షల రూపాయలు ఖర్చుఅవుతాయి, ఆక్కడ నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. త్వరలోనే వీటి నిర్మాణం పని పూర్తి కాగలదని ఆశించబడుతున్నది.

నా స్మృతిపథంలో

ఉన్నవ లక్ష్మీనారాయణగారు

—పండ్రంగి రాజేశ్వరరావు

సంస్థలు వ్యక్తులకంటె గొప్పవి. సంస్థనిర్మాతలు వాటికన్న మిన్న. కేవలంవాటిని నిర్మించివూరుకోక తమ సర్వస్వం ధారపోసి ఆ సంస్థలను విజయవంతంగా నిర్వహించే వారు ప్రజ్ఞా దురంధరులు. కరుణామయులు. ఆ సంస్థల ద్వారానే అట్టివ్యక్తులు భావితరాలకు జ్ఞాపకముంటారు. పిఠాపురం రాజావారి అనాధ శరణాలయం, కోపల్లి హనుమంతురావు గారి ఆంధ్ర జాతీయ కళాశాల, దువ్వూరి సుబ్బమ్మగారి కన్యాగురుకులం, దుర్గాబాయమ్మ గారి ఆంధ్ర మహిళాసభ, గొల్లపూడి శీతారామశాస్త్రుగారి వినయాశ్రమం, డాక్టరు బ్రహ్మజోశ్యుల సుబ్రహ్మణ్యం గారి సత్యాగ్రహాశ్రమం, తల్లాప్రగడ సూర్యనారాయణరావు గారి ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠం, యిందుకు తార్కాణములు ఉన్నవలక్ష్మీ నారాయణ దంపతులు స్థాపించి నిర్వహించిన శారదానికేతనం యీ కోవకుచెందినదె.

జాతీయోద్యమంలో ఆవేశంతో వురికిన వారు చాలమంది వేడి తగ్గగానే క్రమంగా జారిపోయి మామూలు జీవితంలో సర్దుకున్నారు. కొద్ది మంది నిర్మాణ కార్యక్రమాన్నిచేపట్టి సంస్థలను నిర్మించి నిర్వహించారు. ఇందుకు దేశభక్తితోపాటు ఆర్థికస్థోమతు కార్యదక్షత, దీక్ష, ఓర్పు అవసరం. ఉన్నవ వారు ఎన్ని యిబ్బందులు వచ్చినా లెక్కచేయక పురోగమించారు. జోలికట్టుకుని చందాలు వసూలుచేశారు, వదాన్యులనుండి భూవసతిని సేకరించారు. నిధులు సేకరించటం ఒక కళ. ఇది అందరకూ అబ్బదు. కాశీ హిందూ విశ్వవిద్యాలయానికి దరిదాపు కోటి రూపాయలు సేకరించిన పండిత మదనమోహన మాలవ్యాను "బిక్షుక చక్రవర్తి" అని మహాత్మగాంధీ ప్రస్తుతించారు. అట్లా ఉన్నవవారు సిద్ధహస్తులనిపించుకున్నారు.

బారిష్టరై వచ్చిన శ్రీలక్ష్మీనారాయణ సంపాదనకు మంచి వనరులున్నా దేశ సేవకేపూర్తిగా అంకితమయ్యారు. పదవులకెన్నడూ ఎగబడలేదు. వీరికి సతీమణియగు శ్రీమతి లక్ష్మీబాయమ్మగారి సహాయసానుభూతులు లభించడం పూర్వజన్మ సుకృతమనాలి. ఈశ్వరచంద్రవిద్యాసాగర్‌ను తల్లిప్రోత్సహించనిచో సంస్కర్త కాలేకపోయేవారు. వీరేశలింగంగారికి సతీమణి రాజ్యలక్ష్మమ్మ గారు అండదండలు అందచేశారు. ఉన్నవదంపతుల శారదానికేతనాన్ని, శతసంవత్సరములు జీవించి కొలదికాలంక్రితమే పరమపదించిన భారతరత్న ఆచార్యకార్వే పూనాలోస్థాపించిన మహిళా విశ్వవిద్యాలయంతో పోల్చవచ్చును. నేడు యిట్టి సంస్థలన్ని ప్రభుత్వముక్రింద చట్టబద్ధమగుటచేత వాటి ప్రత్యేకతను కోల్పోయి నేతి బీరకాయల్లా నిల్చివున్నాయి, ఉత్సాహము, త్యాగమునశించి, పదవీవ్యామోహము, కీర్తి కండూతి, స్వార్థము పెచ్చుపెరుగుచున్నాయి. దేశభక్తి, విజ్ఞానము, మృగ్యమవుతున్నాయి. ఈ పరిణామమునకు ప్రజలు పాంకులు సమానంగా బాధ్యులు

1928లో భీమవరమందు దివ్యజ్ఞాన సమాజ సభలు జరిగినపుడు శ్రీలక్ష్మీనారాయణగార్ని తొలుత అచట చూచాను. గాంధీజీ ప్రభావమును చూరగొన్నందున ముతకఖద్దరు దుస్తులతో ఇంగ్లీషు వాసనలేని గ్రామీణునిలా గోచరించారు. గాంధీజీ సనాతన విలువలను పునరుద్ధరించుటచేత గాంధేయులట్లు తయారగుటలో ఆశ్చర్యములేదు. 1950లో అనుకుంటాను శ్రీగాడిచర్ల హరిసర్వోత్తమరావుగారి ఆధ్యక్షతను గుంటూరులో ఆంధ్రమహాసభ జరిగింది. అపుడు శ్రీనార్ల వెంకటేశ్వరరావు పాత విలువలను చెండాడి హేతువాదాన్ని ఉగ్గడిస్తూ సుదీర్ఘంగా వుపన్యసించారు. ఆసభకు వచ్చిన శ్రీ లక్ష్మీనారాయణగారు తదుపరి శ్రీ నార్లకు సమాధానంగా ఘాటైన వుపన్యాసమిచ్చారు. వారితో ఏకీభవించని వారుసహితము వారిపాండిత్యాన్ని నిశ్చలమైనసమ్మకము సౌజన్యాన్ని గుర్తించి గౌరవించేవారు. ఆంధ్రలో సనాతన విలువలపై ధ్వజమెత్తిన శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరిగారు వీరి ఆప్తమిత్రులలో ముఖ్యులు, సహనమే విజ్ఞానానికి గీటురాయి. మనకు తెలిసింది స్వల్పము, తెలుసుకోవలసింది అనంతం.

మా బంధువు ఒకామె శారదానికేతనంలో పనిచేస్తూ వుండగా రాత్రి ఎనిమిది దాటాక చూడటానికి వెళ్లాను. ఉన్నవ దంపతులు నన్ను ముందుగా భోజనంచేసి తర్వాత విషయాలు మాట్లాడమన్నారు నేడు చాలామంది పాశ్చాత్య సంప్రదాయాన్ననుసరించి "ఎందుకు వచ్చారు." అనిఅడిగి ముక్తసరిగా మూడు నిమిషాలలో పంపివేస్తున్నారు ఇందు మానవత్వముకంటే యాంత్రికత పాలు హెచ్చు. కొందరి యిండ్లదగ్గర కుక్కలున్నాయి. జాగ్రత్త అనే బోర్డులు ప్రత్యక్షమౌతున్నాయి ఈ సందర్భమందు నాఢిల్లీ అనుభవం మరువలేను. 1956లో మన విదేశాంగ శాఖ కార్యదర్శిగానున్న శ్రీ రాఘవన్ పిళ్లేను చూడటానికి వెళ్లి యింటివద్ద లేనందున నేరెడు పళ్లు చెట్టుక్రిద గుట్టలుగా రాలిపడి వుండుటచేత నాలుపళ్లు చేతితో తీసుకుని గేటు దాటేసరికి నాగుండెల ఎత్తు వరకువచ్చే ఆల్‌శేషియనుకుక్క వెంటాడింది. దాన్ని చూడగానే పంచప్రాణాలలో నాలు ఆమాంతంగా ఎగిరిపోయాయి తమాయించి భయపడి పరుగెత్తితే కరుస్తుందని నెమ్మదిగా నడుస్తోంటే నా కాళ్లు వాసనచూడటం మొదలుపెట్టింది. కొంతదూరం సాగాక అపుడు సుప్రీముకోర్టు జడ్జిగావున్న శ్రీ బచ్చు జగన్నాథ దాసుగారి యిల్లు తగిలింది. లోగడవుండుకున్న పరిచయాన్ని పురస్కరించుకుని లోనికివెళ్ళాను. అదృష్టవశాత్తు ఆయనవున్నారు. కుక్క

నా ప్రక్కనున్న సోఫా నధిష్టించి కూర్చుంది. కాఫీ త్రాగి కుశల ప్రశ్నలయ్యాక "కుక్కమీదా" అన్నారు. జగన్నాథం దాసుగారు. "కాదండి దానివి వదల్చుకునేనందుకే మీయింట్లో జొరబడ్డాను." అని కథఅంతా యాకరుపెట్టాను. అప్పుడు ఆయన నవ్వి "అదృష్ట వంతులు యిదిచాలా ప్రమాదమైన కుక్క" అని పిళ్లేగారింటికి ఫోనుచెయ్యగా వారి మనిషివచ్చి గొలుసు తగిలించి కుక్కను లాక్కుపోయాడు. అంతటితో నా ప్రాణం కుదుటపడింది.

నేను తెలుగు నవలలు సకృతుగా చదువుతాను. కాని నా స్మృతి పథంలో శాశ్వతంగా నిల్చినది శ్రీ లక్ష్మీనారాయణగారి "మాలపల్లి" మాత్రమే. తొలుతదీనిని బిటిషుపాలకులు నిషేధించారు. నేటికి దీని యితివృత్తము నాహృదయంలో హత్తుకుపోతుంది. ఇందులో హరిజన సమస్యను చక్కగా చర్చించారు. ఒకసారి మనప్రాంతంలో కలెక్టరుగా పనిచేసిన తెలుగువచ్చిన దొర శ్రీ రూథరుఫర్డు, ప్రముఖ హరిజన సేవకుడైన శ్రీ గూడూరు రామచంద్రరావు గారితో అన్నారు. "ఏమిటి బ్రాహ్మణులకు మతి లేనట్టుంది, నీవు వేమూరి రామ్‌జీరావు స్వజనాన్ని విస్మరించి అస్పృశ్యుల కంకితమయ్యారు. చివరకు మిమ్మల్ని ఎవ్వరూ చూడరు." అందుకు ఆయన యిచ్చిన సమాధానం "మమ్మ హరిజనులే గుర్తుంచుకుంటారు. అవసరమైనపుడు సాయం చేస్తారు." నిజానికి చాలా సందర్భాలలో అట్లాగే జరిగింది, జరుగుతోంది. శ్రీ రామచంద్రరావును చరమదశలో శ్రీ సంజీవయ్య ఆదుకున్నారు. శ్రీ కాశీపట్నం కొండయ్యకు శ్రీ వేముల కూర్మయ్య సాయపడ్డారు.

శ్రీ లక్ష్మీనారాయణ తమ ఆంగ్లరచనవల్ల లేపిన గాలి దుమారం మరువరానిది. "కృష్ణాపత్రిక" సంపాదకీయాలు దేశభక్తిని పురికొల్పి బ్రిటిషుపాలననుఘాటుగ విమర్శించేవి ఇట్లాంటి విషయాలను తెలుగు దుభాషి ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలి. అపుడు శ్రీ చెన్నాప్రగడ భానుమూర్తిగారు ఆ పదవిలో వుండేవారు. ఆ రోజుల్లో ఆ పదవిస్థాయి వున్నతంగా వుండేది. వారపుడు మదరాసు విశ్వవిద్యాలయమందు తెలుగు పరీక్షలబోర్డు అధ్యక్షులు. జమీందార్లు, గవర్నర్లను వీరిద్వారానే చూడవలసి వచ్చేది. ఐ. సి. యస్. దొరలకు తెలుగు పరీక్షాధికారులగా వుండేవారు. వాఙ్మయ నిషేధం వీరి సలహాపై జరిగేది. అంతకుపూర్వము వీరు బందరునందు నోబిలు కళాశాలలో గణితము సంస్కృతము, బోధించేవారు. అందుకుతోడు అచట లాయరుగానుండిన "కృష్ణాపత్రిక" స్థాపకులైన దేశభక్త కొండా వెంకటప్పయ్య వీరి సహాధ్యాయి. అచట పట్టాభి శీతారామయ్య ముట్నూరి కృష్ణరావు, కోపల్లె హనుమంతరావు ప్రభృతులు వీరిశిష్యులు. మద్రాసులో పదవిలోనున్న మిత్రులు శిష్యులు వచ్చిపోతూ వుండేవారు,

ఇట్టి పరిస్థితులలో ఒక ఘాటైన "కృష్ణా పత్రిక" సంపాదకీయాన్ని ఉన్నవ వారు అనువదించి ఐర్లండు నుంచి ప్రచురితమయ్యే ఇంగ్లీషు పత్రికలో ప్రచురించారు. అది బ్రిటీషు ప్రభుత్వము దృష్టినాకర్షించింది ఏమి చర్య తీసుకున్నారని భారత ప్రభుత్వానికి ఇండియా కార్యదర్శి లండనునుంచి కేబిలు పంపారు. గవర్నరుజనరలు హుటాహుటిగా యిందును గురించి రిపోర్టు పంపమని మదరాసు గవర్నరుకు తంతినిచ్చారు. అందుపై యీ వ్యాసం ప్రభుత్వదృష్టికి రాలేదని తేలింది. బాధ్యతదుబాషిది. ప్రధాన కార్యదర్శి మండిపడ్డాడు. అందులో అతడు ప్రథమ ప్రపంచ యుద్ధంలో పాల్గొనియున్నవాడుకూడాను. శ్రీ భానుమూర్తికి వచ్చి మాట్లాడివెళ్ళమని కబురువచ్చింది. అపుడు సెక్రటరీ స్థాయిలో ప్రభుత్వ యంత్రాంగమందున్నవారంతా దొరలే. దివాను బహదూర్ ఆర్. రామచంద్రరావు సాహెబు అనే కన్నడిగ స్థానిక స్వపరిపాలనాశాఖ కార్యదర్శిగ నున్నందున కాస్త ముందుగా పసిగట్టి శ్రీ భానుమూర్తికి వుప్పు అందించి హెచ్చరించారు. అప్పటికే సి. ఐ. డి. రిపోర్డులు దశదిశలనుంచి వచ్చిపడ్డాయి.

శ్రీ భానుమూర్తి నామాలుదిద్ది తాపీగా వెళ్లేసరికి ప్రధాన కార్యదర్శి పళ్లుకొరుకుతూ, పచార్లు చేస్తున్నాడు. పట్టాభి, ముట్నూరి, కోపల్లె, వెంకటప్పయ్యగార్లను గురించి ప్రశ్నల వర్షం కురిపించాడు. అన్నిటికి యీయన తొణకక, బెణకక, యథార్థ విషయాలను యథాతథంగా వివరిస్తూ సమాధానమిచ్చారు. చేసేదేమీలేక యీ వ్యాసాన్ని ముందుగా తమదృష్టికి తీసుకురానందుకు కారణమడుగగా, ఇంతకన్న ఘాటైన వ్యాసాలను అనువదించినా లోగడ ఎట్టిచర్య తీసుకోనందున వూరుకున్నాననిచెప్పి తమఎడ ప్రభుత్వానికి నమ్మకంలేనిచో వైదొలుగుతానని రాజీనామా పత్రం యిచ్చారు. "అయితే నీకు యీ వుద్యోగం ఎట్లావచ్చింది." అని ప్రశ్న వేశారు. "నాకు తెలియకుండా శ్రీ కందుకూరి వీరేశలింగం మహామహోపాధ్యాయ శ్రీ కొక్కొండ వెంకటరత్నం పంతులుగార్లు ప్రభుత్వమునకు తనపేరుసూచింపగా ఆర్డరువచ్చింది" బందరు వదలటం యిష్టంలేకపోయినా పెద్దబ్బాయి వైద్యవిద్య నభ్యసిస్తానంటే వచ్చిచేరాను" అని సమాధానం యిచ్చారు. అంతట ప్రధాన కార్యదర్శి పరిస్థితినర్థంచేసుకుని కరచాలనంచేసి మొదట సి. ఐ. డి. రిపోర్డులుచూచి అపార్థంచేసుకుని నిన్ను నిలువునా చీరేద్దామనుకున్నాను. కాని నీవు చాలా పెద్దమనిషివి, నేను వున్నంతకాలము నీమీద యీగ వాలదు" అన్నారు.

నిర్భీతులైన ప్రతిభావంతులే వున్నతపదవులకు గౌరవ ప్రపత్తులు గలిగిస్తారు. తత్ప్రిపదవులకుగణ్యత వస్తుంది. స్వాతంత్ర్యం వచ్చాక సజీవంగావున్న ప్రథమ స్వాతంత్ర్యయోధుడైన శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావుగార్కి తగుమన్ననలభింపలేదు. ఇందుకు ముఖ్యకారణం విలువలస్థానాన్ని ధరలు ఆక్రమించటమే. ఆ మధ్య 'విశాలాంధ్ర' పుట్టుపూర్వోత్తరాలను గురించి కొంత తర్జనభర్జన జరిగింది. ఈ పదాన్ని తొలుత వుపయోగించింది. శ్రీకౌతా శ్రీరామశాస్త్రిగారనే సత్యం ఎవరికీ గుర్తురాలేదు. దర్మిలాను దీనిని గురించి శ్రీ అయ్యదేవరకాళేశ్వరరావుగారు కలలుకన్నారు. శ్రీ ఆవుటపల్లి నారాయణరావుగారు (బర్మాలో కార్మికనాయకులుగా నుండి అచట శాసనసభ్యులైరి.) ఆంధ్రతెలంగాణ ప్రాంతములకు చెందిన ప్రముఖుల జీవితాలను "విశాలాంధ్రము" అనే పుస్తకంగా ప్రచురించారు. అంతేగాని కమ్యూనిష్టులోకరే 'విశాలాంధ్ర' సృష్టికర్తలనటం సత్యదూరం.

వివిధ రంగాలలో నిష్కామంగా దీక్షతో ప్రజా సేవచేసిన ప్రముఖుల జీవితాలకు సంబంధించిన వివరాలు అడపాతడపా కాకుండా ఒక పథకం ప్రకారం సేకరించి ప్రచురిస్తే బాగుంటుంది.

సీరియల్ :

తిరస్కృతి

—వాసిరెడ్డి సీతాదేవి

జరిగిన కథ

సత్యం, సూర్యం అన్నదమ్ములు. మేనమామ కూతురు సరళకు తన తమ్ముడు సూర్యం అంటే ఇష్టమని తెలిసి సత్యం వూరు విడిచి వెళ్ళి శాంతినికేతనంలో చిత్రకళ అభ్యసించి హైద్రాబాద్ చేరుకున్నాడు. సూర్యం వివాహం సరళతో జరగ లేదు. హాస్పిటల్లో పరిచయమైన కమల అనే డబ్బున్నవాళ్ళ అమ్మాయిని సూర్యం పెళ్ళిచేసుకున్నాడు. కాని కమల సూర్యాన్నీ, సరళనూ అనుమానించి అగౌరవంగా మాట్లాడింది సరళ హైదాబ్రాదు టాన్స్ఫరుకు చేసిన ప్రయత్నాలు ఫలప్రదమయ్యాయి అక్కడకు చేరుకుంటే అక్కడ పెద్దబావ సత్యం కనిపించవచ్చని ఆమె ఆశ. చిత్రకళను నేర్చుకొచ్చిన తర్వాత సత్యానికి చిన్ననాటి గురువుగారి కుమార్తె విమలతో స్నేహం వృద్ధి అయ్యింది తనంటే ఆమెకు అభిమానమని తెలుసుకున్నాడు. అయితే తన మిత్రుడు మాధవరావుకు విమలంటే విపరీతమైన ప్రేమ, గౌరవం అని గుర్తించాడు.

గది గడపలో సందేహిస్తూ నిల్చున్న విమల్ని చూసి రాజమణీదేవి "రామ్మా! రా! అక్కడే నిల్చున్నావేం?" అని ఆదరణ ఉట్టిపడే స్వరంతో ఆప్యాయంగా ఆహ్వానించింది.

విమల యాంత్రికంగా వెళ్ళి రాజమణీదేవి పడుకొని వున్న మంచంపక్కగా వున్న కుర్చీ మీద కూర్చుంది.

"ఇలా వచ్చి కూర్చో తల్లీ!" రాజమణీ దేవి పక్కకు జరిగి పడుకొంది.

విమల ఆమె మంచంమీద వెళ్ళి కూర్చుంది.

రాజమణీదేవి విమల చేతిని తన చేతిలోకి తీసుకుంటూ "బాగున్నావా?" నాలుగ రోజుల్నుంచీ నిన్ను చూడక పోతే నాకు ఎలాగో వుంది." అన్నది.

విమల సిగ్గుపడి పోయింది. రాజమణీ దేవికి జబ్బుచేసింది. తను ఎలావుందని అడగలేదు.

"అమ్మా! మీ ఆరోగ్యం ఎలా ఉంది? మీకు బాగా లేదని నాకు తెలియదు." అంది తలవంచుకొని లోలోపల బాధపడుతూ.

"ఏదో కొద్దిగా జ్వరం వచ్చింది. బ్లడ్ ప్రషర్ కూడా వుందన్నాడు డాక్టరు. డ్రైవర్ రాకపోవడం వల్ల నీకోసం కారు పంపించ లేదు." అంది రాజమణీదేవి.

"వర్షం వల్ల రాలేక పోయాను."

"మాధవ్‌ను రోజూ వెళ్ళి నిన్ను తీసుకొని రమ్మంటూనే వున్నాను. ఇదుగో అదుగో అంటూ గడిపేశాడు"

విమల పూర్తిగా ఈ లోకంలోకి రాలేదు. ఇంకా పరధ్యానంగానేవుంది.

సత్యం గుండెలకు హత్తుకున్నప్పుడు కలిగిన అనుభూతి, మధుర గానంలా ఇంకా ఆమె హృదయంలో ధ్వనిస్తూనే వుంది.

ఆ మత్తునుంచి, ఆ మధుర స్వప్నం నుంచి ఆమెకు బయట పడాలని లేదు. ఒంటరిగా కూర్చొని దాన్నేమళ్ళీ మళ్ళీ మననం చేసుకోవాలని ఉంది.

"ఏమ్మా? పరధ్యానంగా వున్నావు?

విమల చివుక్కున తలెత్తి చూసింది. జవాబు ఎలా చెప్పాలో తోచలేదు.

"అబ్బే ఏంలేదమ్మా! డాక్టరు ఏమన్నాడు?' మాటమారుస్తూ అడిగింది విమల.

"పెద్దదాన్ని అయిపోయాను. డాక్టర్లు మాత్రం ఏంచెబుతారు." అన్నది రాజమణీదేవి పేలవంగా నవ్వుతూ.

"అవునమ్మా మీరు ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూనే ఉంటారు. అన్నది విమల పొడిపొడిగా అంతకంటే ఏమనాలో తోచక

"నా ఆలోచనంతా మాధవ్ గురించే తల్లీ. వాడు ఒక ఇంటి వాడు కావడం నేను బతికుండగా జరిగేట్టులేదు.' రాజమణీ దేవి అన్నది బాధగా.

అలా అనకండమ్మా! మీరు ఇంకా చాలా కాలం బతకాలి!" అంది విమల ఆర్ద్రకంఠంతో.

"ఎందుకు తల్లీ ఏంచూట్టానికి?"

"మా అందరికోసం అమ్మా! మీ చల్లని ఆదరణలో నేను నా తల్లిని కూడా మర్చిపోయాను."

రాజమణీదేవి విమల చేతిని గట్టిగా పట్టుకొంది.

"మాధవ్ ఇదివరకటిలా ఉండడంలేదు. ఎప్పుడూ దేన్ని గురించో బాధ పడుతూ వుంటాడు. వాడుపైకి ఎంత బోళాగా కన్పిస్తుడో అంతలోతుగా వుంటాడు, వాడు ఎంత నవ్వుతూ

తీరగటానికి ప్రయత్నిస్తున్నా. నాకళ్ళకు లోలోపల వాడు కుమిలి పోవడం కన్పిస్తూనే ఉంది. అడిగితే నవ్వుతూ తోసేస్తాడు. ఎన్ని జన్మల పాపమో, కూతుర్ని పోగొట్టు కున్నాను. వీడు ఏమయి పోతాడోనని భయంగా వుంది. ఎలాంటి అనర్థం చూడకుండా నాకు కళ్ళు మూయాలని వుంది '' రాజమణీదేవి కంఠం వణికింది.

విమలకు వెన్నెముకలో ఏదో జరజరా పాకి నట్లయింది. శరీరంలో వణుకు పుట్టింది.

మాధవ్ ఏదైనా అఘాయిత్యం చేసుకొంటాడా? ఒక వేళ అలా జరిగితే! రాజమణీదేవి ఏమైపోతుంది? దీనికి కారణం తనేనా కాదు...కాదు అలా జరగటానికి వీల్లేదు.

ఇప్పుడు తనేం చెయ్యాలి? తనేంచెయ్యాలి? హే భగవాన్!

సత్యం . మాధవ్!

సత్యానికి తానంటే ఇష్టంలేదా? అలా కానేకాదు. ఒక సారి దెబ్బ తిన్నాడు. తన అవిటితనాన్ని మర్చిపోలేక పోతున్నాడు. అందుకే తను అంత విముఖంగా వుంటున్నాడు. తనను ఎంత గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు! అతనిలో కలిగిన సంచలనాన్ని తను గమనించినది. క్షణంలో సగం సేపు అతని కళ్లలో మెది లిన మెరుపును కూడ తను చూసింది.

మాధవ్ బాధకు కారణం రాజమణీదేవికి తెలిస్తే? ఆమె తనను అర్థిస్తే? తను నిరాకరించగలదా? ఏమిటి తనకీ పరీక్ష?

మాధవ్‌ను చూస్తూంటే తన హృదయాన్నివరో రంపంతో కోస్తున్నట్లు బాధకలుగుతుంది.

"ఎందుకమ్మా మాగురించి అంత బాధపడుతావ్? ఏనాటి రుణం తల్లీ ఇది!" అన్నది రాజమణీదేవి.

"అమ్మా!" అంటూ ఏదో చెప్పబోయిన తనను తాను సంబాళించు కొంది విమల.

"ఏమ్మా! చెప్పు? ఎందుకు సందేహం."

"ఏం లేదమ్మా! మీరు బాధపడుతుంటేను" విమల చెప్పా లనుకున్న మాటల్ని మింగేసింది.

"చూడమ్మా! లక్ష్మిని కాఫీ పెట్టమని చెప్పు మాధవ్ క్రింద వున్నాడేమో చూడు. ఒక సారి నేను పిలుస్తున్నానని చెప్పు. సత్యాన్ని కూడా రమ్మని చెప్పు. డాక్టరు వచ్చినప్పుడు కన్పించటమే, పొద్దుటినుంచి మళ్ళీ మాధవ్ నాకు కనిపించనే లేదు." అన్నది రాజమణీదేవి.

విమల సత్యం గదికేసి నడిసింది. విమల గదిలోకి వచ్చే అప్పటికి సత్యం చేతి వేలుతో నొసలు నొక్కుకుంటూ కూర్చు న్నాడు.

విమల సత్యాని చూస్తూ కొంచెం సేపు అలాగే నిల్చుండి పోయింది.

సత్యం ఏమిటి ఆలోచిస్తున్నాడు? అంతకు ముందు జరిగిన సంఘటననే మననం చేసుకొంటున్నాడా? ఆ మూసిన కన్నుల్లో తన రూపాన్నే చూసుకొంటున్నాడా? ఆ మధురానుభూతిని మననం చేసుకొంటూ తన్మయత్వంలో వుండిపోయాడా?.

విమలకు ఒక్క ఉదుటున సత్యం ముందుకు వెళ్ళాలనీ, అతని చేతిని తన చేతిలోకి తీసుకొని "నేను నీకు అక్కరలేదా?" అని అడగాలనిపించింది.

చిన్నగా దగ్గింది. సత్యం ఒక్కసారిగా తలెత్తి చూశాడు తనను.

చూడగానే అతని కళ్ళలో ఏదో భయం చోటుచేసుకోవడం విమల చూసింది.

విమల సత్యం కళ్ళలోకి సూటిగా చూసింది. సత్యం కళ్ళు పక్కకు తిప్పుకున్నాడు.

"మిమ్మల్ని అమ్మ రమ్మంటూంది" అని చెప్పి విమల వెనక్కు తిరిగింది.

సత్యం నిట్టూర్చాడు. అదివిన్న విమల ఓ క్షణం ఆగింది. కాని వెనక్కు తిరిగి చూడలేదు. ముందుకు గబగబానడిచివెళ్ళి పోయింది.

కాఫీ పెట్టమని లక్ష్మికి చెప్పింది.

అమ్మ మాధవరావును పిలవమని చెప్పింది. కాని అతన్ని ఎలా ఎదుర్కోవడం తను ఏ పరిస్థితినుంచి తప్పించుకోవాలని ప్రయత్నిస్తుందో అదేఎదురైతే మాధవ్ తనను నిగ్గదీసి అడిగితే? తనేం జవాబిస్తుంది?.

తప్పదు. ఆక్షణం ఎప్పుడో ఒకప్పుడు తన ముందు బాంబులా ప్రేలక మానదు. అప్పుడు తను నిజంచెప్పక తప్పదు.

ఆలోచిస్తూనే విమల డ్రాయింగ్ రూంలో అడుగుపెట్టింది. అక్కడి దృశ్యాన్ని చూసి స్థాణువులా నిలబడిపోయింది.

కుర్చీలో వెనక్కు వాలి, రెండు కాళ్ళు ఎదురుగా వున్న డ్రాయింగ్ టేబుల్ మీదకు చాచి కూర్చొని వున్నాడు మాధవ్.

గదంతా పల్చటి పొగ మేఘాలు వ్యాపించివున్నాయి. మాధవ్ సిగరెట్ కాల్చే తీరూ, ముందున్న యాష్‌ట్రేనూ చూస్తే ఎంతో సేపుగా చైన్‌స్మోక్ చేస్తున్నట్లుగా ఇట్టే అర్థం అయిపోయింది విమలకు.

మాధవ్ కళ్ళు సుళ్ళుతిరుగుతున్న పొగలను చూస్తున్నాయి. కాదు ఆ పొగలలోదేన్నో తనకు దొరకని దాన్ని వెతుకుతున్నాయి.

బూట్లు కూడా విప్పలేదు బయటనుంచి వచ్చిన వాడు వచ్చి నట్టు అలాగే కూర్చున్నాడు.

ఎంతో అలసిపోయినట్టు, ఎంతో కాలంగా అలసి పోయి నట్టు వున్నాడు మాధవ్.

బయటనుంచి వస్తూనే సత్యం గదిముందుకు వచ్చాడా? తనను సత్యం గుండెలకు హత్తుకోవడం చూశాడా? చూసేవుంటాడు. అందుకేనేమో అంత బాధపడుతున్నాడు.

ఏదో బలమైన చెయ్యి హృదయాన్ని పిండి వేస్తున్నట్లు అనిపించింది విమలకు.

తను చూస్తున్నది మాధవ్‌నేనా? తను నవ్వుతూ తనచుట్టూ వున్న వాళ్ళను నవ్వించే మాధవేనా అతను.

మాధవ్ తనను అంత ప్రేమిస్తున్నాడా? తనకోసం అంత యాతన పడుతున్నాడా? అతనిలోని ఆ ఆర్తి అంత తీవ్రమైందా?

విమలకు బాధలోనే గర్వంగా గూడా అనిపించింది. తన వ్యక్తిత్వానికి ప్రత్యేకత లభించినట్లనిపించింది. తనను అంత ఆరితో ఆరాధించే వ్యక్తి ఒకరున్నారనే భావము ఆమెను ఉక్కిరి బిక్కిరి చేసింది. మళ్ళీ అంతలోనే ఏదోదిగులు ఆమెను చుట్టివేసింది.

విషాదం—ఆనందం—విచిత్ర సమ్మేళనం!

విమల మాధవ్‌ను పరీక్షగా చూసింది

ఆ క్షణంలో మాధవ్ ఆమె కళ్ళకు పసివాడిలా కన్పించాడు.

అతని తలను తన గుండెలకు హత్తుకొని బుజ్జగిస్తూ "ఎందుకింత బాధ పడుతున్నావ్? ఏంకావాలి?" అని అడగాలనిపించింది.

అడుగు ముందుకు వెయ్యబోయి ఆగిపోయింది. "నువ్వే కావాలి? ఈ నాబాధంతా నీకోసమే?'' అంటే తనేం జవాబిస్తుంది

"ఏమిటి విమలా! ఎందుకలా నిల్చున్నావ్? రా! కూర్చో" అన్నాడు విమల్ని చూసిన మాధవ్ కాళ్ళను టేబుల్ మీదనుంచి తీసి సర్దుకొని కూర్చుంటూ.

ఆ కంఠంలో అలక లేదు. కోపంలేదు. బాధలేదు. ఏదో విరక్తి నిర్లిప్తత ధ్వనించాయి.

"మిమ్మల్ని అమ్మగారు రమ్మంటున్నారు." మాటల్ని పెగల్చుకొని అన్నది విమల.

గిర్రున అక్కడనుంచి తిరిగి వెళ్ళిపోతున్న విమల్నే చూస్తూ ఉండిపోయాడు నిర్లిప్తంగా మాధవరావ్.

చేతిలో సిగరెట్టును యాష్‌ట్రే మీద నొక్కి ఆర్పి అందులో పడేశాడు మాధవ్. లేచి బట్టలు మార్చుకోవటానికి గదిలోకి వెళ్ళాడు.

విమల రాజమణీదేవి గదిలోకి వచ్చేప్పటికి సత్యం ఆమె మంచం పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుని వున్నాడు.

విమల రాకను గమనించీ గమనించనట్టే కూర్చున్నాడు సత్యం.

విమల మనస్సు చివుక్కుమంది.

ఏమిటీ సత్యం? ఎందుకిలా తననుంచి తప్పుకుతిరగటానికి ప్రయత్నిస్తాడు? అతని మనస్సు తన వైపుకు పరుగెత్తకపోతే ఈ తెచ్చిపెట్టుకొన్న నిర్లిప్తత ఎందుకు? తన కళ్ళలోకి చూట్టానికి ఎందుకంత బెదురు? సత్యం తనను మనస్సులోనే ఆరాధిస్తున్నాడు. సందేహంలేదు.

"ఏమ్మా! వాడేడీ?''

"వస్తున్నాడు." అని జవాబిచ్చింది విమల రాజమణీదేవికి.

దూరంగా వున్న కుర్చీలోకూర్చోబోతున్న విమలను దగ్గరకు పిల్చి తన మంచం మీదే కూర్చోపెట్టుకొంది రాజమణీదేవి.

సత్యం కుర్చీలో అశాంతిగా కదలటం గమనించింది విమల. అప్రయత్నంగా సత్యంకేసి చూసింది. సత్యం ముఖంలో కొంచెం చిరాకు కన్పించింది.

తను అక్కడ ఉండటం సత్యానికి ఇష్టంలేదా? ఏమయినాసరే తను అక్కడనుంచి కదలదు సత్యం సాన్నిధ్యంలో వున్నప్పుడు తనకు కలిగే మధుర అనుభూతిని తనెందుకు దూరంచేసుకోవాలి? తను అక్కడే వుంటుంది.

మొండిగా తనకు తనే జవాబిచ్చుకుంది. విమలకు తన ఆలోచనలకు నవ్వొచ్చింది.

అయినా తనను అక్కడనుంచి వెళ్ళమని ఎవరన్నారు?

"ఏమిటో సత్యం వాడు బొత్తిగా మారిపోయాడు. వాడి మనసులో ఏముందో ఆ భగవంతుడికే తెలియాలి. రోజు రోజుకూ చిక్కిపోతున్నాడు. కళ్ళ చుట్టు నల్లని రేకలు కూడా ఏర్పడ్డాయి.''

సత్యం మౌనంగా విమలకేసి చూశాడు. అప్పుడే సత్యం వైపు చూచిన విమల కళ్ళు సత్యం కళ్ళతో కలిశాయి.

సత్యం కళ్ళలో విమలకు ఏదో తిరస్కార భావం లాంటిది కనిపించింది. విమల కళ్ళను దించేసుకొంది.

"నీకైనా చెబుతాడేమో అడిగిచూడు సత్యం! ఇంత ఆస్థి వుంది. దాని మీద వాడికి ఏనాడూ వ్యామోహంలేదు. అందుకు నేను బాధపడను. గర్విస్తాను. వాడు జీవితాన్ని గౌరవిస్తాడనీ, ప్రేమిస్తాడనీ నాకు తెలుసు. కాని ఈమధ్య వాడివాలకంచూస్తుంటే వాడికి దేనిమీదా ఆసక్తి వున్నట్టు కన్పించటంలేదు." రాజమణీదేవి కంఠం జీరపోయింది.

"వాడి వివాహం గురించి ఈ మధ్య మీరు ఎప్పుడైనా అడిగి చూశారా?'' సత్యం అడిగాడు.

విమలకు అక్కడ నుంచి పారిపోవాలనివుంది.

"చాలాసార్లు అడిగాను బాబూ! పెళ్లిమాట ఎత్తితే అదోలా నవ్వి చేసుకుంటాలే తొందరేం అంటాడు"

"ఎవరికమ్మా పెళ్ళంటున్నావ్? సత్యానికేనా?" నవ్వుతూ మాధవరావు ప్రవేశించాడు.

ఐదునిముషాల క్రితం చూసిన మాధవరావుకూ, ఈ మాధవ రావుకూ ఎక్కడా పోలికలేదు అనుకొంది విమల.

ఎంత చిత్రమైన వ్యక్తిత్వం?

ఎంత బాధనైనా వంటరిగానే భరించగలడు! తన బాధను ఇతర్లకు పంచడు. కాని ఎదుటివారి బాధను తను పంచుకొంటాడు.

"లోకం బాధంతా శ్రీశ్రీ బాధ'' అన్న చలంమాటలు జ్ఞాపకం వచ్చాయి విమలకు.

"ఏడ్చావులేరా? అమ్మ నీ గురించే బాధపడుతుంది. అది తెలిసీ మాట దాటెయ్యకు.'' అన్నాడు సత్యం తీవ్రంగా.

విమల సత్యం ముఖంలోకి చూసింది. సత్యం అంత కరుగ్గా కూడా మాట్లాడగలడని విమల అనుకోలేదు. అతని ముఖం చాలా గంభీరంగా వుంది.

''నా గురించి అమ్మ బాధపడుతోందా? ఇప్పుడు నాకేమయిం దనీ" గొల్లున నవ్వాడు.

ఆ నవ్వులో విమలకు ఏదో అపశృతి వినిపించింది. గుండెలు దడదడలాడాయి.

''నా ఆరోగ్యం అంత బాగుండటంలేదు బాబూ! నువ్వు ఒక యింటివాడివైతే నా మనస్సుకు తృప్తిగా వుంటుంది. ప్రశాంతంగా కళ్ళుమూస్తాను.''

''అదేంటమ్మా అంత బాధపడతావు? ఇప్పుడు నావయస్సేం మించి పోయిందని ?'' అన్నాడు మాధవరావు.

''నీ వయస్సేమీ మించిపోలేదు బాబూ! నావయస్సేమించి పోతుంది. నా బిడ్డా, నా భర్తా నా జీవితంలోని సగభాగాన్ని తీసుకొని వెళ్ళిపోయారు. నువ్వు ఒక ఇంటివాడివైతే చూసి సంతృప్తిగా వెళ్ళిపోతాను.''

''అమ్మా! ఏమిటమ్మా ఆ మాటలు. నువ్వు నూరేళ్ళు బ్రతుకుతావు ''

''ఎందుకుబాబూ నూరేళ్ళు ఏం చూట్టానికి ?''

''అదేంటమ్మా అలా అంటావు? నన్నుచూడాలని లేదూ?''

''నిన్నేం చూస్తుందిరా అమ్మ ? అమ్మను నువ్వేం సుఖ పెడుతున్నావని ? నీకు వివాహం అయితే, నీకు బిడ్డలు కలిగితే మనవళ్ళతో ఆడుకుంటూ నూరేళ్లు కాదు మరో నూరేళ్ళయినా బ్రతకాలని కోరుకుంటుంది, కాని... నువ్వు ... నీ మనసులో ఏముందో చెప్పవ్, నువ్వు వివాహం చేసుకోకపోవటానికి కారణం ఏమిటి ?'' సత్యం నిలదీసినట్టు అడిగాడు ఉద్రేకంగా.

''ఏమిటి ఇవ్వాళ మీరంతా కలిసి నా మీద ఏదో కుట్రపన్ని నట్టున్నారు? అది సరేగాని ఢిల్లీలో జరగబోయే ఆర్ట్ ఎగ్జిబిషన్‌కు వెళుతున్నావా ?'' మాట మార్చాడు మాధవరావు.

''మాట మార్చకు. చెప్పు నువ్వెవ్వర్నయినా ప్రేమిస్తుంటే చెప్పు. అమ్మ నీకు అడ్డు చెప్పదని నాకు తెలుసు.'' అన్నాడు సత్యం మాధవ్ ముఖంలోకి పరిశీలనగా చూస్తూ.

మాధవరావూ, విమలా ఒకేసారి తలెత్తి సత్యంకేసి చూశారు.

మాధవరావు విమలకేసి చూశాడు విమల కళ్ళలో కదిలిన భయాన్ని పసిగట్టాడు.

మాధవ్ అదోలా నవ్వాడు ఆ నవ్వు ''భయపడుతున్నావా? విమలా ? నేను నీకు ఎలాంటి హానీ కల్గించను ''
అని చెబుతున్నట్టు అనిపించి విమల తలదించుకొంది

సత్యం ఇద్దర్నీ మార్చిమార్చి చూశాడు

సత్యం ఎవర్నయినా ప్రేమిస్తున్నాడా ? తనకు ఆ ఆలోచన ఎప్పుడూ రానేలేదు తన దగ్గర చెప్పటానికి సందేహిస్తున్నాడా? తను అంగీకరించ దేమోనని భయపడుతున్నాడా ?

"బాబూ..." ఏదో అనబోయి ఆగిపోయింది రాజమణీదేవి.

తల్లి ఉద్దేశాన్ని గ్రహించాడు మాధవరావు.

"అబ్బే అలాంటిదేమీ లేదమ్మా! నువ్వు నా మాట కాదనవని నాకు తెలియదా? సత్యం ఊరికే నన్ను తమాషా చేస్తున్నాడు." అన్నాడు మాధవరావు.

అంతవరకూ ఊపిరి బిగబట్టివున్న విమల నిట్టూర్చింది ఎదురుచూసిన ప్రమాదం ఏదో తప్పిపోయినట్టు.

అంతలోనే సత్యం తనను గమనిస్తున్నాడని గ్రహించి తలదించుకొంది అపరాధిలా

"నేనేం తమాషాగా అనడంలేదు నిజం మాట్లాడుతున్నాను. కాకపోతే పెళ్లికెందుకు ఒప్పుకోవు ? నువ్వెవర్ని ప్రేమిస్తున్నావో చెప్పనా ?"

విమలకు వీపుమీద ఎవరో చెళ్ళున కొట్టినట్టయి ఉలిక్కిపడి చూసింది.

మాధవరావు గాబరాగా సత్యంకేసి చూశాడు. అంతలోనే స్థిమితపడ్డాడు.

"ఏడ్చావులేరా! నేను ఎవర్నీ ప్రేమించటంలేదు. పెళ్లి చేసుకొంటే ఎన్నో బాధ్యతలు నెత్తిన పడతాయి కొంతకాలం సరదాగా కాలక్షేపం చేద్దామని. అంతే ?

"అంతేనా ?" సత్యం రెట్టించాడు.

"అంతే !" అన్నాడు మాధవరావు తనకు తాను చెప్పుకొంటున్నట్టు.

"అయితే అమ్మ కుదిర్చిన పిల్లను చేసుకుంటావా?" మాధవ రావు ఓ క్షణం సత్యం ముఖంలోకి చూస్తూవుండిపోయాడు.

(స శే షం)



పుష్కలమైన పంటలకు ఫాక్టమ్‌ఫాస్

అన్ని రకముల భూములకు, పైర్లకు, అనుకూలమై తన ఆధిక్యతను నిరూపించుకున్న, అద్భుత సంకీర్ణ ఎరువు. దక్షిణ ప్రాంత రాష్ట్రముల రైతులు విరివిగా వాడు ఎరువు. భారత దేశంలో రసాయన ఎరువుల ఉత్పత్తికే పునాది వేసిన బ్రహ్మాండమైన ప్రప్రథమ ఫాక్ట్ ఎరువుల ఫాక్టరీ ప్రతిష్ఠను చాటే ఎరువు.

వరి పైరుకు శిఫారసు చేయబడ్డ ఎరువుల మోతాదులు ఎకరాకు కిలోగ్రాములలో

	ఫాక్టమ్‌ఫాస్ 16 20	మ్యూరియేట్ ఆఫ్ పొటాష్	యూరియా
వరి :			
(ఎ) అధిక దిగుబడినిచ్చే రకాలు	180	50	58
(బి) దేశవాళీ రకాలు	135	26	12

FACT

ఫాక్ట్ కర్షక బంధు

ది ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కార్ లిమిటెడ్, ఉద్యోగమండల్-కేరళ

ఆంధ్రప్రదేశ్ ఏరియా ఆఫీసు షాపూర్ వాడి, హైద్రాబాద్ - 4

ప్రాంతీయ కార్యాలయాలు - నిజామాబాద్ వరంగల్ కర్నూలు, నెల్లూరు

aries EKM FT 152 TL

(జాతీయ విస్తరణ సేవా పథకం)

(11వ పుట నుండి)

కలెక్టరుకే కేటాయిస్తారు. ప్రతి జిల్లా పరిషత్‌కు ఒక జిల్లా పరిషత్ "సెక్రటరీ" మాధ్యమిక విద్యా నిర్వహణకు ఒక డిప్యూటి సెక్రటరీ (ఎడ్యుకేషన్) ఉంటారు. జిల్లా పరిషత్‌లో అకౌంట్లు చూడడానికి పంచాయితీ సమితుల లెక్కల అజమాయిషీకి ఒక గజిటెడ్ ఆఫీసరైన ఒక అకౌంట్స్ ఆఫీసరుంటాడు.

ప్రతిజిల్లా పరిషత్ క్రింద పంచాయతీ సమితులో మాదిరే 7 స్థాయీ సంఘాలుంటాయి. ఈ క్రింద విశదీకరించబడిన విధముగా ప్రతి స్థాయీ సంఘము దానికి యెదురుగా చూపబడిన కార్యకలాపములకు మంజూరు చేయడం నిధుల కేటాయింపు సమీక్ష జరుపుతాయి. పంచాయతి సమితి స్థాయీ సంఘములకు జిల్లా పరిషత్ స్థాయీ సంఘములకు భేదమేమంటే సమితి స్థాయీ సంఘములకు సమితి అధ్యక్షులే అధ్యక్షుడు-కాని జిల్లా పరిషత్ స్థాయీ సంఘములన్నిటికి, ఆ జిల్లా కలెక్టరు అధ్యక్షులుగా ఉంటారు.

జిల్లా పరిషత్ స్థాయీ సంఘములు

1వ స్థాయీ సంఘము:– ప్రణాళికలు, ఆహారము, వ్యవసాయము, సేద్యపు నీటిబావులు, పశుపోషణశాఖ, మత్స్య పరిశ్రమ, భూసార సంరక్షణ, అడవులు మొదలైనవి.

2వ స్థాయీ సంఘము:– సహకారము, చిన్న మొత్తాల పొదుపు, గ్రామీణ చిన్నతరహా పరిశ్రమలు, గ్రామీణ గృహ నిర్మాణము, స్టాటిస్టిక్స్, ప్రొహిబిషన్ మొదలగునవి.

3వ స్థాయీ సంఘము:– విద్య, సాంఘిక విద్య, వైద్యము, ప్రజారోగ్యము, పారిశుద్ధ్యము, విపత్కర పరిశ్రమల సహాయము, స్వయం సహాయ కార్యక్రమాలు

4వ స్థాయీ సంఘము:– స్త్రీల, పిల్లల సంక్షేమము.

5వ స్థాయీ సంఘము:– సాంఘిక సంక్షేమము.

6వ స్థాయీ సంఘము:– రహదార్లు, కమ్యూనికేషన్లు, గ్రామీణ మంచినీటి సరఫరా, విద్యుచ్ఛక్తి, సేద్యపు నీటిబావులతో సహా నీటి పారుదల.

7వ స్థాయీ సంఘము:– ఫైనాన్స్, పన్నుల విధింపు. గ్రామ పంచాయతీల, పంచాయతీ సమితుల, యెన్నికలు 1970వ సం॥ము మే, జూన్ నెలలలో జరుపబడ్డ తర్వాత, జిల్లా పరిషత్ ఎన్నికలు జరుగుతాయి. ఈ విధముగా ప్రప్రథమంలో ఫిర్కా-డెవలప్‌మెంట్ స్కీముగా యేర్పాటు గావింపబడిన, గ్రామాభ్యుదయ కార్యక్రమములు ఈ నాటికి, పంచాయతీ రాజ్యంలో పంచాయతీ సమితులుగా దేశం నలుమూలలా యేర్పాటు చేయబడి, అభివృద్ధి సాధింపబడింది.

సమీక్ష

షుమారు 22 సంవత్సరములనాడు, చిన్న కార్యక్రమముగా ప్రారంభింపబడిన, గ్రామాభ్యుదయ కార్యక్రమము నేటికి పంచాయతీ రాజ్యరూపములో, పంచాయతీ సమితులద్వారా దేశము నలుమూలలా వ్యాపించింది. కాని యీ 22 సంవత్సరములలో, మన పూజ్య బాపూజీ, మన ప్రియతమ నాయకుడు అయిన శ్రీ జవహర్లాల్ నెహ్రూ ఆశించి కలలుగన్న "రామరాజ్యం" గ్రామసీమలలో నెలకొల్పబడినదా? భారతదేశ పరిస్థితి మారి గ్రామాభ్యుదయం ఆశించినట్లుగా జరిగి, దేశప్రజలు ఆర్థిక సాంఘికాభివృద్ధిని సాధించారా–అంటే మనము అనుకున్నంత జరగకపోయినా, కొంతవరకు పల్లెప్రజలు జీవితాలు మారాయి. పల్లెల్లో వ్యవసాయరంగంలోను సాంఘిక ఆర్థిక రంగంలోను కొంత అభివృద్ధి తప్పకుండా కలిగింది. ఆశించినంత అభివృద్ధి యెందుకు సాధింపలేకపోయినామంటే కారణములనేకం ఉన్నాయి. వాటిని గురించి చర్చించడము మనకు ఇది సమయము గాదు.

ప్రజా పరిపాలనలో కేంద్రస్థాయినుండి, గ్రామ స్థాయివరకు పరిపాలనా వికేంద్రీకరణ జరుపబడి ప్రజాప్రతినిధులచే. వివిధ కార్యక్రమములు నిర్వహింపబడడము చాలా మంచిది. ప్రజలు తమ ప్రతినిధుల ద్వారా, గ్రామములలోను బ్లాకులలోను వివిధ కార్యక్రమాలను నిర్వహింపజేసుకొని సర్వతోముఖమైన అభ్యున్నతిని సంపాదించుకోవడము ప్రజా పరిపాలనలోని ముఖ్య ఉద్దేశ్యం. కాని ఈ కార్యక్రమములు గ్రామ, సమితి, జిల్లా స్థాయిలలో ఇప్పటికంటే సక్రమంగా నిర్వహింపబడి, ఆశించిన ఫలితములు పొందాలంటే యెక్కువ నిస్వార్థపరులు, ప్రజా సేవాపరాయణులైన వారు ఈ మూడు స్థాయిలలోనుండాలి. వారుకూడా ప్రజల శ్రేయస్సు తమ శ్రేయస్సని భావించి పనిచేయాలి. అదే విధముగా ఈ కార్యక్రమనిర్వహణలో, ప్రజాప్రతినిధులకు మూడు స్థాయిలలోను అండగా నిలబడి సదరు కార్యక్రమాలను సక్రమముగా అమలు పరచడములో తోడ్పడవలసిన ఉద్యోగులైన గ్రామ స్థాయీ కార్యకర్తనుండి విస్తరణాధికారులు, బ్లాక్ అభివృద్ధి అధికారులు, జిల్లా పరిషత్ సెక్రటరీలు ఎక్కువ నిస్వార్థపరులు ప్రజా సేవాపరాయణతంత్రులుగా ఉండి ప్రజా ప్రతినిధులతోను, ప్రజలతోను, కలసి వారి కష్టనిష్ఠూరాలను పంచుకొని గ్రామాభ్యుదయమునకు, గ్రామప్రజల అభ్యున్నతికి తోడ్పడిననాడే, నాడు పూజ్య బాపూజీ, మనదేశ నాయకులు ఆశించిన ప్రజారాజ్యము, రామరాజ్యము స్థాపించుకోటానికి వీలవుతుంది. ఉద్యోగస్థులుగాని ప్రజాప్రతినిధులుగాని ఒకరు యెక్కువ ఒకరు తక్కువ అనే భావమును విడనాడి కలిసికట్టుగా గ్రామాలలోని బీద ప్రజానీకాభివృద్ధికి పాటుపడాలి. ఒక కాడికి గట్టిన రెండు యెద్దులలాంటివారు వీరిరువురు. ఒక బండికిగల రెండు చక్రముల లాంటివారు వీరిద్దరూ. ఏది సక్రమముగా పనిచేయకపోయినా బండిముందుకు సాగదు. ఒకర్నొకరు అర్థంచేసుకుని ప్రజా సేవే, గ్రామాభ్యుదయమే ధ్యేయంగా పెట్టుకుని, ప్రజాప్రతినిధులు, ఉద్యోగబృందం కలిసిమెలిసి, ఇపుడు సాధించిన ప్రగతిని అనతి కాలంలోనే సాధించి, మన భారత జాతిపిత కన్నకలలకు, ఒకనిజరూపం కల్పించగలరని ఆశిస్తూ, ఎదురుచూస్తూ ముందుకు పోదాం.

★

గ్రంథ సమీక్ష

ముక్తకాలు : ఉష ఆగమనం
డా. మాదిరాజు రంగారావు

వెల 2 రూపాయలు. ప్రతులకు — ఆంధ్రసారస్వత
[పరిషత్తు, బొగ్గులకుంట, హైదరాబాదు]

వచనగేయం, కవికీ పాఠకుడికీ ఉన్న దూరాన్ని తొలగించడానికీ, కవిత్వాన్ని సామాజిక చైతన్యంతో ఏకంచెయ్యడానికీ పుట్టిన ప్రక్రియ. ఈ నాడు వచనగేయం ఈ రెండు ప్రయోజనాల్నీ సాధించి, పురోగమిస్తున్నది. కవిత్వమంటే ఈ నాడెవరికీ భయం లేదు. కొన్నివందల మందికవులు, తమ చుట్టూ ఉన్నసమాజాన్ని, సామాజిక సమస్యల్ని గేయాలుగా పరివర్తన చేస్తున్న యుగమిది.

ఇటు వంటి ఈ యుగంలో, వచనగేయం యొక్క రూప సౌలభ్యాన్నిమాత్రం జీర్ణించుకొని, సామాజికచైతన్యానికి దూరంగా, వైయక్తికమైన అనుభూతిని మాత్రమే రూపు దిద్దుతున్న కవులు కొద్దిమంది ఉన్నారు మాదిరాజు రంగారావు, వేగుంట మోహన ప్రసాదు, అరిపిరాల విశ్వం, సుప్రసన్న, సంపత్కుమారాచార్య— ఈతెగకు చెందినవారిలో ప్రముఖులు. వీరందరి కవిత్వము అందరాని ఒక అలౌకికానుభూతిని అందుకునేందుకు మనస్సులోతుల్లో కలిగిన ఒక ఆందోళన. వీరి విభిన్న అలోచనాస్రవంతులు, దైవాన్వేషణ మొదలు అంతశ్చైతన్యాన్వేషణ వరకు విశాలావకాశంలో, పరిభ్రమిస్తూ ఉంటై. మొత్తం మీద ఒక వేదాంత స్పర్శవీరందరికీ సమాన లక్షణం,

వైయక్తికాన్వేషణ మార్గ కవులలో మాదిరాజు రంగారావుకి ఒక విశిష్టమైనఆలోచనధోరణీ, ఒక ప్రత్యేకమైన శైలీఉన్నై. ప్రస్తుతం సమీక్షింపబడుతున్న పుస్తకం, రెండుకావ్యాల సంపుటి ముక్తకాలు ఒకటి. ఉష ఆగమనం— మరొకటి. ముందుగా పాఠకునిలో కవి యొక్క అన్వేషణ మార్గం గూర్చిన అవగాహన ఉంటేగాని సరిగ్గా అర్థం కాకపోవడం, వైయక్తికానుభూతి కవులందరికీ సమాన లక్షణం. ఠాగూరు, కృష్ణశాస్త్రి మొదలైన మహాకవుల నుండి ఈ మార్గం రూపుదిద్దుకుంది. స్థూలంగా మాదిరాజురంగారావు అన్వేషా ధోరణి ఈ విధంగా ఉంటుంది. ''సృష్టియొక్క ప్రత్యణువులో అనంతమైన సౌందర్యం, అనుభూతి, చైత్యనం నిత్య వికాసాభిముఖంగా ఉంటై. అవన్నీ మానవుని అంతశ్చైతన్యంలో పొనుగుపడి ఉన్నై. ఈలోపలి చైతన్యాన్ని మేల్కొలప గలిగినపుడు ప్రత్యణువులోని ఆనందానుభూతినీ మానవుడు పొందగలడు. ఆ అనుభూతి సూర్యుని కాంతివంటిది, ప్రాణంవంటిది. ఆ అనుభూతికిదూరమైన మన నిత్యజీవితం చీకటివంటిది, మృత్యువువంటిది. ఈ చీకటినుండి ఆకాంతికి అన్వేషించడం మన లక్ష్యంకావాలి''. ఇట్లాఅంతశ్చైతన్యాన్నుండి చైతన్యానికి వెదకటమే రంగారావు కవిత్వం. ఈ అన్వేషణ కొందరు కవుల్లో హృదయ ప్రధానంకాగా, కొందరిలో మేధాప్రధానం. ఠాగూరు, కృష్ణశాస్త్రి, మోహనప్రసాదులకి హృదయ మార్గం. రంగారావుది కేవలం ఆలోచనాస్రవంతి. ప్రతి పంక్తిలోనూ సృష్టిని గూర్చి ఆలోచించే ఒక వేదాంతి కనిపిస్తాడీతని కవితలో.

" జాగ్రత్ సుషుప్తి స్వప్నంలో సదా
ఆత్మనంటియుండు ఆనంద రసాకృతి—
ఈ సంకీర్ణ ప్రపంచంలో మసలుతూ
ఏ వర్ణపు దుస్తులూ ఏరాగస్పర్శాఎరుగని
నా నగ్నమనః ప్రకృతిలో
సూక్ష్మాతి సూక్ష్మంగామలగిన
సుందరశివరూపం, నీ ఆకృతి"

" ఉష ఆగమనం" అనే పేరులోనే, జ్ఞానాన్ని ఆనందాన్నిసౌందర్యాన్ని, చైతన్యాన్ని కవి ఆహ్వానించడం స్ఫురిస్తుంది. ఈ భావాలన్నిటతో కూడిన అనంత చైతన్యాన్ని ఉషస్సుతో పోల్చడం ఈ కవికి చాలా యిష్టం. అందుకే అనేకచోట్ల సూర్యునివెలుగు ప్రతీకగా కనిపిస్తు దీయన రచనల్లో. ఈ కవి ఆన్వేషణ, ఆకాశం, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, పూలు, మబ్బులు— మొదలైన విశాల విశ్వ పరివ్యాప్తమై పఋచుకుని ఉండటం ఒక ప్రత్యేకత. వాటితో కూడిన భావచిత్రములు, మనోజ్ఞంగా అడుగడుగునా భాసిల్లుతూఉంటై.

" కను చూపులలో విరిసి నక్షత్రకాంతులు
పెదవి వంపులలో ఒదిగి సంధ్యాలహరులు
చిరునవ్వులలో హసించి వెన్నెల వతులు
చక్షూరమ్యాకృతి మలగిన ప్రకృతి రేఖ"
" నీ కను రెప్పవాలితే ఆరిపోవు సూర్యుడు
చీకటిలో పరిభ్రమించు దారి తప్పి చంద్రుడు"

"ముక్తకాలు"—అనే ప్రక్రియ రంగారావు యొక్క వినూత్న మార్గం ఏ భావానికి ఆ భావంగా విరిగి పోయిన పద్యాలతో శతకాలున్నై. లయబద్ధగేయల్లో ఆట్లాంటి ప్రయత్నం సి. నారాయణ రెడ్డి చేశారు. వచన గేయంలో అట్లాంటి ప్రయత్నమే ఈ ముక్తకాలు ఏ ఖండి కకి ఆ ఖండిక ఒక లోతైన ఆలోచనకి రూప కల్పన. ఉప మానంతో గాని, అర్థాంతరన్యాసతోగాని. ధ్వనితో గాని, యింకా అనేక విధాల, వీటిని రమ్యంగా మలుస్తాడీ కవి కేవలం భావ లయనే పాటిస్తాడుగాని, అనుప్రాసలకి ప్రాకులాడక పోవడం మంచి లక్షణం. ఈ కవి యొక్క ప్రధానమైన అలౌకికాలోచన లన్నిటికీ ఈ "ముక్తకాలు" సంపూర్ణ దర్పణం.

" నీ నాకళ్ళముందు పుట్టిపెరుగు శిశువు
నీ నాకళ్ళముందు పండబారిన వృద్ధు
ఒకరి ఆగమనం, మరొకరి నిష్క్రమణం
ఇరువురిచూపుల కలయిక ఏక్కడో ఒకచోట"
" సృష్టి ఎన్నటికీ ఏమో ఐ ఏమోఅవదు
ఏమో అవనున్నట్లనిపిస్తుందెప్పటికపుడు
జ్ఞానంతో పరాస్తమైపోయి అజ్ఞానం
తిరిగి దానినుండి అవతరించినట్లు"

ఈ "ముక్తకాల" మార్గానికి ఠాగూరు"Stray birds"మొదలైన రచనలు మార్గదర్శకం కావచ్చు. ఏమైనా ఈ మార్గంలో రంగారావు

భావ ధోరణికొక ప్రత్యేకత సిద్ధించిందని చెప్పవచ్చు. ప్రతి ఖండికా గొప్ప ఆలోచనని ధ్వనిస్తుంది.

ఈ కావ్యం మొదట "ఒకమాట"లో సాహితీబంధు బృందం వారు "ఆధునిక మానవజీవితాన్ని మహావిశ్లేషణ ఆధారంగా వివిధ కోణాలనుండి దర్శించి మధురానుభూతుల్ని చిత్రించడం వీరి కవితా లక్షణం"అంటారు. ఇది గెబద్ధం. ఇందులో ఆధునిక మానవ జీవితంగాని, మనోవిశ్లేషణగాని, మధురానుభూతులుగాని లేనేలేవు. రంగారావుగారి ప్రత్యేకతవేరు. ఈ విధంగా తప్పుగా చెప్పడం వల్ల ప్రయోజనం లేదు. వీరుమరొక మాటచెప్పారు. "ఇంచుమించు పదిహేను సంవత్సరాల నుండి ఈ కవితాప్రక్రియలో వ్యాసంగం చేస్తూ, ఈ నాటితరం కవులకు కుందుర్తి తరువాత ప్రేరణ కలిగించినవారనడంలో సందేహంలేదు"—ఇది ఘోరమైన ప్రచారం. కుందుర్తిమార్గానికీ ఈ కవిమార్గానికీ ఏమీ పొంతన లేదు. కుందుర్తి సంపూర్ణంగా సామాజిక చైతన్య కవి. ఈ తరం కవులలో 99 మంది సామాజిక చైతన్యం గల వారు. వారిలో చాలా మందికి కుందుర్తి ప్రేరణ కలిగించే గెవకాశం ఉంది. ఈ కవి ఈ తరంలో చాలా మందికి ప్రేరణ కలిగించ లేదు. తన ప్రత్యేక మార్గంలో భాసిస్తూ ఉంటాడు కవిని గూర్చి ఇట్లా పీఠికలో వ్రాయడం కవికి ఏమీలేని గొప్పతనాన్ని తేదు. అది అసత్య ప్రచారమని అందరికీ తెలిసి పోతుంది—

—అదేపల్లి రామమోహనరావు

భార్గవరామ చరిత్రి

కవి: కీ. శే. అనుముల వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి

కవులెంతటి యూహాలోకమున విహరించు వారైనను సమకాలీన సాంఘిక పరిస్థితులను మరవలేరు. ఆంగ్లేయుల పరిపాలనకు విసిగిన భారతీయులు తమ జాతి స్వాతంత్ర్యమును పొందుటకై మహాత్ముడు మున్నగు నాయకుల నేతృత్వమున కృషిచేయుచున్న రోజులవి. కవులును తమ కావ్యములతో స్వాతంత్ర్య సమర వీరుల కుత్సాహంబు నల్పింపబూనిన కాలమది. తత్ఫలితమే "రాణాప్రతాపసింహ చరిత్ర,, "శివభారతము,, "రాష్ట్రిగానము,, మొదలగు కావ్యములు. అట్టి వానిలో నీ భార్గవ రామచరిత్రము'' ఒకటి.

అధర్మాత్ములగు హైహయ వంశపు నృపులు. వారి అనుయాయులు ప్రజాపీడన మొనరించు చుండగా, వారి గర్వమడంచి సుస్థిరమగు, న్యాయ సమ్మతమగు రాజపాలనమును ప్రజలకు గల్పించుటయే పరశు రామావతార రహస్యము.

భృగురాముని చరితము పురాణ ప్రసిద్ధము, పావనము. విష్ణు భగవానుని యాఱవ యవతారమిది. తత్కథా వర్ణన వాఙ్మయమున దేశీయులకు స్వాతంత్ర్య భావము పెల్లుబుకునట్లు చేసిన శాస్త్రి గారికి రెండు ప్రయోజనములు సమకూరినవి. ఒకటి భగవదవతార చరిత్ర మగుటచే సుకృతము. రెండవది దేశీయులలో నూతనోత్సాహమును గల్పించుట.

ఈ కావ్యమున వీరరసము ప్రధానమైనది. దానికి స్థాయి ఉత్సాహము పరశురాముడు ధర్మవీరుడు. రేణుకా జమదగ్నుల పుత్రుడు. ఈ కావ్యమును రచించుటలో శాస్త్రిగారు వాయు పురాణమును, మహాభారతమును ముఖ్యాధారములుగా గ్రహించిరి. ఈ కావ్యమున సుమారు 2000 గద్య పద్యములున్నవి.

ప్రాచీనాంధ్ర కవులగు తిక్కన, శ్రీనాథాది మహాకవుల శైలి ఈ కవి కబ్బినది. కావ్యమున నచ్చటచ్చట నిది కాన్పించుచున్నది.

ఈ కావ్యమున విష్ణుని దశవతారములను బోలు పదిఆశ్వాసము లున్నవి. పరశురామునకు కార్తవీర్యునితో గల సంబంధమే గాక రామాయణ మహాభారత కథలతో గూడ సంబంధమున్నది. కాన శ్రీ శాస్త్రిగారు భార్గవరామునకు సంబంధముగల కథలన్నియు నిందు పొందు పరచుటకు ప్రయత్నించి కృతకృత్యులైరి.

దత్తాత్త్రేయుడు అర్జునునకుఁ జెప్పిన పురుషార్థతత్వము సర్వులకు సర్వవేళలను నుపయోగపడునదియె.

శాస్త్రిగారి సందర్భమునఁ దమకు గల సంస్కృత సాహిత్య పరిచయమును చక్కగా నుపయోగించుకొనిరి.

పండితుని లక్షణములివి.

''తనుఁ దానెఱుగుట యారం
భ నిరూఢత. ధర్మ్మ ధర్మ పరతంత్రతనా
జనుసీ నాలుగు నెవ్వనిఁ
బని వడి విడకుండు నతడు పండితుడనఘా!

ధర్మమును గుర్తెరుగని వారు వీరు.

''మత్తుడు. నున్మత్తుడు ప్రబ
మత్తుడు శ్రాంతుడు సభయమతి కామ పరా
యత్తుడు లోభియు గ్రోధో
ద్వృత్తుడు క్షుధితుండు ధర్మమెఱుగరు ధాత్రిన్,

ఇట్టి పద్యములెన్నియో ఈ కావ్యమున పరశ్మతము లున్నవి. ఇవి తిక్కన గారి ''విదుర నీతుల''బోలియున్నవి.

పోతనవలె నీ కవి యంత్యప్రాసం గూర్చుటలో సిద్ధహస్తుడు. ఈ క్రింది పద్యము పరిశీలింపుడు.

"కనియెం దన్నికట ప్రదేశమున గంగంజారు లీలాప్రసం
గనిరస్యద్ధృతి సారపుంగవీ రంగదు త్తుంగభం
గని మజ్జజ్జన సంఘ కిల్బిష విభంగన్ మంగళాశీర్విధా
యినిజాపాంగన భంగభూరి కరుణాహృద్యాంత రంగన్ వెసన్

ఇట్లెన్నియేని విశేషము లీ కావ్యమున గలవు.

—వి. హనుమంతరావు.

జిల్లా వార్తలు

విజయవాడలో ఉప రాష్ట్రపతి

విజయవాడ గాంధీ కొండమీద జూన్ 19వ తేదీన భారత ఉప రాష్ట్రపతి శ్రీ జి. యస్. పాఠక్ ఖగోళ పరిశోధనశాలకూ, జమ్నాలాల్ బజాజ్ స్మారక దూరదర్శిని యంత్రానికీ ప్రారంభోత్సవం చేశారు.


ఆయన ఆ సందర్భంలో ప్రసంగిస్తూ, గాంధీజీ విజయవాడ కాంగ్రెసుకు హాజరై తిలక్ స్మారకనిధినీ, చర్ఖాపంపిణీ పథకాన్నీ ప్రారంభించినవిషయాలను ప్రస్తావించారు అనేకమంది స్మృతిచిహ్నాలను స్థాపిస్తున్న గాంధీహిల్ సంఘంవారిని ఆయన అభినందించారు.

అంతకుముందు భారత ప్రభుత్వ యిరిగేషన్, విద్యుచ్ఛక్తి శాఖల స్టేట్‌మంత్రి డా॥ కె. యల్. రావు అతిథులకు స్వాగతం పలికారు. సంఘం కార్యదర్శి శ్రీ యం. నాగభూషణం వందన సమర్పణ చేశారు. అంతకుముందు ఉపరాష్ట్రపతి సూర్యగోళ–ఖగోళ విషయాల ప్రదర్శననూ, ధ్వని–కాంతి ప్రదర్శననూ తిలకించారు.


వరంగల్లులో హరిజన గృహనిర్మాణ కార్యక్రమం

వరంగల్లు జిల్లా కలెక్టరు శ్రీ కె. ఆర్. వేణుగోపాల్ ఈటీవల ములుగు రంగాపూరులలో గిరిజన సభలలో ప్రసంగిస్తూ ప్రభుత్వం గిరిజన, హరిజన, ఇతర బలహీనవర్గాల శ్రేయస్సు కొరకు కల్పించిన సౌకర్యాలను ఈ ప్రజలు సక్రమంగా ఉపయోగించుకోవాలని ఉద్బోధించారు. ప్రభుత్వం హరిజన గృహనిర్మాణం కొరకు శీఘ్రతర కార్యక్రమాన్ని రూపొందించిందని వీరికొరకై వరంగల్లు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో 1,000 ఇండ్లు, హనుమకొండలో 300 ఇండ్లు నిర్మించడం జరుగుతుందని కలెక్టరు తెలిపారు. గత సంవత్సరంలో సేద్యానికి లాయకైన 40,000 ఎకరాల ఏడావా భూమిని హరిజనులకు ఇతర బలహీన వర్గాలకు పంచిపెట్టడం జరిగిందని ఆయన చెప్పారు. 1971 మే నెలలో చేపట్టిన శీఘ్రతర కార్యక్రమాన్ని అనుసరించి 2100మంది పైగా ఇండ్ల స్థలాలు కేటాయించడం జరిగింది. గృహనిర్మాణ సహాయం క్రింద రూ. 2 లక్షలు పంచిపెట్టబడినాయి. ములుగు బ్లాకులో 12 గ్రామాలలో 458 మంది వ్యక్తులకు 43 ఎకరాల మేరకు ఇండ్ల స్థలాలు కేటాయించబడినాయి. గృహనిర్మాణ సహాయ కార్యక్రమం క్రింద వీరికి రూ. 45,800 లు పంచిపెట్టబడినాయి.

ఈ సందర్భంలో ఏర్పాటైన బహిరంగ సభలో జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ బి. జనార్ధనరెడ్డి ప్రసంగిస్తూ ప్రజల శ్రేయస్సుకై జిల్లాలో చేపట్టబడిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వివరించి చెప్పారు.



భారత ఉపరాష్ట్రపతి శ్రీ జి. యస్. పాఠక్ జూన్ 19వ తేదీన విజయవాడ గాంధీకొండ మీద గ్రహ పరిశోధన శాలకు ప్రారంభోత్సవం చేశారు.



గ్రహ పరిశోధన శాల దృశ్యం

కరీంనగర్ జిల్లాలో గిరిజన సంక్షేమానికి నిధుల మంజూరీ

కరీంనగర్ జిల్లా కలక్టరు శ్రీ ఎస్. వి. సుబ్రహ్మణ్యం కరీంనగర్‌లో మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో గిరిజనుల ఉపయోగార్థం చిన్న తరహా నీటి వనరుల మరమ్మత్తులకు గిరిజన సంక్షేమ శాఖ రూ. 75,000 లు మంజూరు చేసిందని అన్నారు.

గిరిజనుల అధిక సంఖ్యలోవున్న మాధవపురం, మంతెన, జగిత్యాల పంచాయతీ సమితులలో యీ మొత్తాన్ని పంపిణీ చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆయన అన్నారు.

ప్రతిజిల్లాలో మంచినీటి సరఫరాకు రు. 50 లక్షలు

పంచాయతీరాజ్ శాఖామంత్రి శ్రీ తోట రామస్వామి ఇటీవల కాకినాడలో జరిగిన కోస్తా జిల్లాల కలెక్టర్లు, జిల్లా పరిషత్తు అధ్యక్షుల సమావేశంలో ప్రసంగిస్తూ ప్రతి జిల్లాలో రు. 50 లక్షల ఖర్చుతోకూడిన మంచినీటి సరఫరా పథకాలను రూపొందిస్తారని అన్నారు. గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని గూర్చి చర్చించడానికి యీ సమావేశం ఏర్పాటు చేయబడింది.

ఈ పథకాల అమలుకు రు. 3.5 కోట్ల మేరకు జీవిత భీమా సంస్థ నుండి ఋణ సహాయం కోరబడుతుందనీ ప్రభుత్వం 1.5 కోట్లు భరిస్తుందని ఆయన వెల్లడించారు. ఇటీవల ప్రభుత్వం చేసిన నిర్ణయానుసారం గ్రామపంచాయతీల సగటు ఆదాయాన్నిబట్టి ప్రభుత్వ గ్రాంట్లు 25 నుండి 87.5 శాతం వరకు ఉంటుందనీ మిగతా మొత్తాన్ని పంచాయతీసంస్థలు, ప్రజలు భరించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పూర్తి చేయబడిన మంచినీటి సరఫరా వసరులను జిల్లా పరిషత్తు యింజనీరింగ్ సిబ్బందికి అప్పగించబడుతుంది. 500 అంతకు ఎక్కువ జనాభాగల గ్రామాలకు ప్రాధాన్యం యిస్తూ 1973 మార్చిలోగా మంచినీటి బావుల త్రవ్వకం పనులను పూర్తిచేయడానికి వీలుగా తీవ్రతర కృషి జరుగుతుందని ఆయన అన్నారు.


ఇదివరకే మంజూరు చేయబడిన పథకాలను దృష్టిలో ఉంచుకుని వివిధ జిల్లాలకు సమానంగా నిధులను కేటాయించడం జరుగుతుందని మంత్రి వెల్లడించారు.

పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి శ్రీ బి. ఆర్. కె. శాస్త్రి, పంచాయతీ చీఫ్ ఇంజనీరు శ్రీ టి. ఎన్. స్వామి, పంచాయతీరాజ్ ఉపకార్యదర్శి శ్రీ బి. నాగేశ్వరరావు, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాపరిషత్తు అధ్యక్షులు, కలెక్టర్లు యీ సమావేశంలో పాల్గొన్నారు.


తూర్పుగోదావరి జిల్లాలో మూడుసంవత్సరాలలో మురుగునీటి పనులు పూర్తి

ఇటీవల కొత్తపేటలో మురుగునీటి విషయాలకు సంబంధించి సమావేశం జరిగింది. తూర్పు గోదావరిజిల్లా కలెక్టరు శ్రీ ఎల్. మాలకొండయ్య యీ సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ, జిల్లాలో మురుగునీటి పారుదలకు సంబంధించిన పనులన్నిటినీ చేపట్టి 2, 3 సంవత్సరాలలో పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు.


పని పూర్తికావడంలో ప్రతిబంధకాలు ఏర్పడకుండా ఉండేందుకు వీలుగా పన్నులను చెల్లించాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు. అంచనావేసిన రు. 6 లక్షలకన్నా తక్కువ ఖర్చుతో అంటే రు. 4.5 లక్షల ఖర్చుతో బలివెల మురుగునీటి పారుదల కాలువలను నిర్మించినందుకు ఆయన యింజనీరింగ్ సిబ్బందిని అభినందించారు. జిల్లాలో మధ్య డెల్టా, తూర్పు డెల్టాలకు విడివిడిగా రెండు ఉపసంఘాలను ఏర్పాటు చేస్తారని ఆయన అన్నారు.



వరంగల్లు జిల్లా నర్సంపేటలో జూన్ 17వ తేదీన హోం మంత్రి శ్రీ జలగం వెంగళరావు హరిజనకాలనీకి ప్రారంభోత్సవం చేశారు



నెల్లూరుజిల్లా పరిషత్ అధ్యక్షులు శ్రీ యం. గోపాలకృష్ణారెడ్డి ఏప్రిల్ 10వ తేదీన నెల్లూరులో జరిగిన సమితి అధ్యక్షులు, బి. డి. ఓ. ల సభలో రక్షిత నీటి సరఫరా పథకాలను గురించి ప్రసంగించారు



నెల్లూరు జిల్లా మక్తాపురం గ్రామంలో ఏప్రిల్ 10వ తేదీన సివిల్ సప్లయిల శాఖమంత్రి శ్రీ ఎ. సంజీవరెడ్డి ప్రాథమిక పాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు

ఖమ్మంలో భూసార పరిశోధనాలయం

ఖమ్మం జిల్లాలో రైతుల అవసరాలను తీర్చేనిమిత్తం ఖమ్మంలో ఇటీవలనే భూసార పరిశోధనాలయం స్థాపించబడింది. భూసారాన్నిబట్టి రసాయనిక ఎరువులను సక్రమంగా లాభసాటిగా ఉపయోగించే విషయంలో రైతులకు తగిన సలహాలు ఇచ్చే వుద్దేశంతో ఈ పరిశోధనాలయం స్థాపించడం జరిగింది. ఇక్కడ సాలీనా 6,000 రకాల భూసార నమూనాలను పరిశీలించేందుకు తగిన సౌకర్యాలు కల్పించబడినాయి.

చేనేత పనివారల సంక్షేమానికై సంస్థ ఏర్పాటు

చేనేత పనివారలకు తగిన సహాయ సౌకర్యాలు కల్పించడానికి ఒక సంక్షేమ సంస్థను స్థాపించే విషయమై రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నదని రాష్ట్ర చేనేత శాఖా మంత్రి శ్రీ ఎ. భగవంతరావు తిరుపతిలో ఇటీవల జరిగిన ఆంధ్ర, హైదరాబాదు కేంద్ర, చేనేత సహకార సంఘాల ఎగ్జిక్యూటివ్ కమిటీల సభ్యుల సమావేశంలో చెప్పారు.

చేనేత పారిశ్రామికులు సమాజంలో బలహీన వర్గాలకు చెందినవారు. వారి ఆర్థిక సాంఘిక పరిస్థితులను గురించి భోగట్టా సేకరించబడుతుంది. చేనేత పరిశ్రమకు సంబంధించి అన్ని విషయాలను కూలంకషంగా చర్చించి తెలుసుకొనడానికి చర్చా గోష్ఠుల ఏర్పాటునేసి ఈ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు సూచించాలని మంత్రి చెప్పారు.,

ఖమ్మంలో సాంఘిక సంక్షేమ కార్యకలాపాలు

సాంఘిక సంక్షేమశాఖ ఖమ్మం జిల్లాలో 1970–71 సం॥నికి షెడ్యూలు కులాలు, వెనుకబడిన తరగతులు హరిజన విద్యార్థులకు స్కాలర్‌షిప్పులక్రింద రూ. 1.36 లక్షలు ఖర్చుపెట్టింది. మొత్తం 4350 మంది విద్యార్థులకు నాన్–రెసిడెన్షియల్ స్కాలరు షిప్పులు ఇవ్వడం జరిగింది. ఈ జిల్లాలో షెడ్యూలు కులాలు వెనుకబడిన తరగతులకొరకై నిర్వహించబడుతున్న 31 ప్రభుత్వ హాస్టళ్ళ, 32 సబ్సిడీ పొందుతున్న హాస్టళ్ళకొరకు రూ. 9.35 లక్షలు ఖర్చు పెట్టబడినాయి. ఈ హాస్టళ్ళలో మొత్తం 2460 మంది విద్యార్థులు వున్నారు. ఖమ్మం, కొత్తగూడెం, పెనుబల్లి, తిరుమలాయపాలెంలలో రూ. 4.62 లక్షల ఖర్చుతో హాస్టల్ భవనాలు నిర్మించబడుతున్నాయి. ఈ జిల్లాలో షెడ్యూలు కులాలకొరకు 13 త్రాగు నీటి బావులు త్రవ్వేందుకుగాను రూ. 0.45 లక్షలు ఖర్చుపెట్టబడినాయి.

బూర్గంపాడు తాలూకాలోని గౌతంపూడిలో చెరువుత్రవ్వించడానికి అక్కడి హరిజనులకు రూ. 7,000లు, హరిజనుల భూమి ఆయకట్టును అభివృద్ధిపరచడానికి రూ. 3 800లు మంజూరు చేయబడినాయి.


ఖమ్మం జిల్లాలో సమాజంలోని బలహీనవర్గాల శ్రేయస్సు కొరకై సాంఘిక సంక్షేమశాఖ కృషి చేస్తున్నది.



మే చివరి వారంలో జరిపిన త్రవ్వకాలలో, ఖమ్మంజిల్లా లక్ష్మీదేవిపల్లిలో 22 రాతి విగ్రహాలు బైటపడ్డాయి



ఖమ్మంజిల్లా పరిషత్ అధ్యక్షులు, యితర అధికార్లు త్రవ్వకాల స్థలం సందర్శించారు.



కీ. శే. కందుకూరి వీరేశలింగంగారి 122వ జయంతి సందర్భంగా కాకినాడలోని అబలా శాంతిభవన్‌లో నిర్మించిన "వీరేశలింగం మహిళా శరణాలయం" దృశ్యం.

కరీంనగరం జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు
రూ. 5 లక్షలు ఖర్చుకాగల పథకాల అమలు

కరీంనగరం జిల్లాలో రూ. 5 లక్షలు ఖర్చుకాగల అభివృద్ధి పథకాలను అమలుపరచడానికి ఆ జిల్లా పరిషత్తు సంకల్పించింది. ప్రభుత్వం జిల్లా పరిషత్తుకు రూ. 1,52,795–39 పైసల అదనపు మొత్తాన్ని కేటాయించింది. ఈ మొత్తం 1972 మార్చి లోగా ఖర్చు కావలసివుంటుంది.

ఈ జిల్లాలో పాఠశాల భవనాల నిర్మాణానికి రూ. 2.75 లక్షలు, గ్రామీణ రవాణా సౌకర్యాల నిమిత్తం రూ. 1.50 లక్షలు సాంఘిక సంక్షేమ పనులకొరకు రూ. 75,000 లు కేటాయించాలని ప్రతిపాదించబడింది.

చిత్తూరు జిల్లాలో అల్పాదాయ వర్గాలకు గృహాలు

చిత్తూరు జిల్లా కలక్టరు శ్రీ బి. వి. రామారావు, ఇటీవల జిల్లా అభివృద్ధి మండలి సమావేశంలో ప్రసంగిస్తూ జిల్లాలో రూ. 12 లక్షల ఖర్చుతో అల్పాదాయ, మధ్య ఆదాయ వర్గాల నిమిత్తం యిండ్లను నిర్మించే 1 పథకాన్ని త్వరలోనే చేపట్టడం జరుగుతుందని అన్నారు.


జిల్లాలోని సంబంధిత గృహ నిర్మాణ సహకార సంఘానికి ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ సహకార సంఘాల ఫెడరేషన్ ఋణం రూపంలో ఆర్థిక సహాయం అందజేస్తుంది. ప్రాథమిక వాటా ధనంగా లక్ష రూపాయలను రాయలసీమ అభివృద్ధి మండలి కేటాయించిందని ఆయన అన్నారు.

9 బ్లాకులలో పౌష్టికాహార కార్యక్రమం అమలు


1971–72 సంవత్సరంనుండి పౌష్టికాహార కార్యక్రమాన్ని అమలు జరపడానికి దిగువ తెల్పిన 9 బ్లాకులను రాష్ట్ర ప్రభుత్వం సెలక్టు చేసింది.

నరసంపేట, వరంగల్లు జిల్లా, సిరిపూర్, ఆదిలాబాద్ జిల్లా, మోత్కూరు, నల్లగొండజిల్లా, నరసారావుపేట, గుంటూరు జిల్లా, మండవల్లి, కృష్ణా జిల్లా, కనిగిరి, ఒంగోలుజిల్లా, బుచ్చిరెడ్డిపాలెం, నెల్లూరు జిల్లా, పోడూరు, పశ్చిమ గోదావరి జిల్లా, కోడూరు, కడప జిల్లా.

వైద్య, ఆరోగ్య శాఖవారు పౌష్టికాహారం, ఆహార విషయాలకు సంబంధించి సర్వే జరుపుతారు. యునిసిఫ్ ఆర్థిక సహాయంతో సంబంధిత అధికారులద్వారా పెరటి తోటలు, కోళ్ళ పెంపకం, మొదలైన వాటితోసహా పౌష్టికాహార కార్యక్రమాలను పంచాయతీ సమితులు నిర్వహిస్తాయి. అంతేకాక పౌష్టికాహార విలువగూర్చి ప్రజలకు ప్రబోధించడం జరుగుతుంది.



ముఖ్యమంత్రి జూన్ 13వ తేదీన మెదక్‌జిల్లా తోకరపల్లిలో పంపుసెట్టుకు ప్రారంభోత్సవం చేశారు



పంచాయతీరాజ్ శాఖామంత్రి శ్రీ తోట రామస్వామి నెల్లూరు జిల్లా మక్తాపురం గ్రామంలో ఏప్రిల్ 10వ తేదీన క్రొత్తగా కట్టిన పంచాయతీ కార్యాలయానికి ప్రారంభోత్సవం చేశారు

పోచంపాడు ప్రాజెక్టుక్రింద నీటిపారుదల సేద్యం 1970 సం. ఖరీఫ్ పంటకు నీటి తీరువ మినహాయింపు

పోచంపాడు ప్రాజెక్టు క్రింద 1970 సం. ఖరీఫ్ పంట కాలంలో నీటిపారుదల సౌకర్యాలు పొందిన పొలాలపైన నీటి తీరువాను మినహాయిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తరువు జారీ చేసింది. తరిమెట్ట పంటలకు అన్నిటికి ఈ మినహాయింపు వర్తిస్తుంది.

నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రిందవున్న పొలాలకు మొదటి సారి ఈ విధమైన రాయితీలు ఇచ్చివున్నందువల్ల, ఇట్టి సౌకర్యాలు

పోచంపాడు ప్రాజెక్టు క్రింద ఉన్న భూములకు కూడా వర్తింప చేయాలని ఆ ప్రాజెక్టుయొక్క ఉన్నతాధికార సంఘం సిఫారసు చేసింది.

ప్రభుత్వం ఈ సిఫారసును పరిశీలించి రెవిన్యూ బోర్డుతో సంప్రదించిన మీదట ఈ విషయమై అవసరమైన ఉత్తరువులు జారీచేసింది.

రాయలసీమలో గొర్రెల పెంపకం

రాయలసీమలో గొర్రెల అభివృద్ధిని సాధించే నిమిత్తం ఈ ప్రాంతంలో రూ. 1 లక్ష ఖరీదుచేయు ఉత్తమజాతి నెల్లూరు, బళ్ళారి పొట్టేళ్లను పంపిణీచేయడానికి పశుపోషణశాఖ ఒక కార్యక్రమం తలపెట్టింది. రాయలసీమ అభివృద్ధి నిధినుంచి ఈ డబ్బు వర్తమాన సంవత్సరానికి కేటాయించబడింది. నెల్లూరు జాతి గొర్రెలు మాంసానికి, బళ్లారిజాతి గొర్రెల ఉన్ని కంబళ్లనేతకు ప్రసిద్ధిచెందినాయి.

ఈ మేలుజాతి గొర్రెలను పంపిణీ చేయడంవల్ల స్థానిక గొర్రెలలో ఉన్ని ఉత్పత్తి మాంసం ఉత్పత్తి హెచ్చుకావడానికి విశేషావకాశాలున్నాయి. రాయలసీమలో గొర్రెల సంపద విస్తారంగా వుంది, గొర్రెల మందలు మేయడానికి తగిన పచ్చిక బయళ్ళుకూడా సమృద్ధిగావున్నాయి.

బెంగుళూరు, మద్రాసువంటి పెద్దపెద్ద నగరాలకు రాయలసీమ నుంచి విశేషంగా ఎగుమతి అవుతున్నాయి. ఈ పరిశ్రమ అభివృద్ధివల్ల ఈ ప్రాంతం ప్రజల ఆదాయంకూడా హెచ్చుకావడానికి అవకాశాలువున్నాయి.

ఈ సంచికలో రచయితలు

శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి, ముఖ్యమంత్రి
శ్రీ వి. రాధాకృష్ణమూర్తి, బి.డి.ఒ., వేటపాలెం
శ్రీ జె. వీరాస్వామి, న్యాయశాఖ కార్యదర్శి, హైదరాబాదు
శ్రీ తాతపూడి బ్రహ్మానందశాస్త్రి, నూజివీడు
శ్రీ అక్కిరాజు రమాపతిరావు. తెలుగు అకాడమీ. హైదరాబాదు
శ్రీ ఎన్. ఎ. రామశాస్త్రి, యస్.ఆర్.ఆర్. అండ్ సి.వి. ఆర్. కాలేజి, విజయవాడ
శ్రీ గుత్తికొండ సీతారామయ్య, తెలుగుపండిట్, కొల్లూరు
శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, హైదరాబాదు
శ్రీ బులుసు రాధాకృష్ణమూర్తి, గాంధీనగర్, కాకినాడ
శ్రీ కశింకోట ప్రభాకరదేవ్, శ్రీకాకుళం
శ్రీ పి.వి.ఎన్.ఎ. ప్రసాద్, అశోక్‌నగర్, ఏలూరు
శ్రీ మైనేని వెంకటరత్నం, ఉపాధ్యాయుడు, గుంటూరుజిల్లా టీచర్స్‌గిల్డు
శ్రీ పి.వి.ఎల్. నరసింహారావు, రాంచీ
శ్రీ పి. వామనరావు, హైదరాబాదు
శ్రీ టి ఎ. పద్మనాభరావు. నెల్లూరు
శ్రీ ముద్దసాని రాంరెడ్డి, ఊటూరు, కరీంనగర్ జిల్లా
శ్రీ ఎస్.ఆర్. కోటేశ్వరశర్మ, నల్లగొండ
శ్రీ పండ్రింగి రాజేశ్వరరావు, ఏలూరు
కుమారి వాసిరెడ్డి సీతాదేవి, హైదరాబాదు.

PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION, PUBLIC RELATIONS & TOURISIM ANDHRA PRADESH, HYDERABAD
PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVT. OF ANDHRA PRADESH, AT THE GOVT. CENTRAL PRESS HYDERABAD

ఆంధ్రప్రదేశ్ గురించి

* 1971 జనాభా లెక్కల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ జనాభా భారతదేశ జనాభాలో 7.93 శాతానికి, ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం భారతదేశ విస్తీర్ణంలో 9 శాతానికి సమానం.

* ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం 2,75,109 చ.కి. మీటర్లు.

* 1971 లో సేకరించిన లెక్కల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ జనాభా, 4,33,94,951 మంది. దేశజనాభా 54,69,55,945.

* 1971 లెక్కల ప్రకారం, రాష్ట్ర జనాభాలో అక్షరాస్యులు 24.56 శాతం మంది వున్నారు. 1971 లో 21.19 శాతం. భారత దేశం మొత్తంమీద వున్న అక్షరాస్యుల శాతం 29.35. 1961 లో 24.03 శాతం.

* మనరాష్ట్రంలో జనాభా సాంద్రత చ.కి.మీ. 1కి 157 మంది హైదరాబాదు జిల్లాలో సాంద్రత చ.కి.మీ. 1కి 362 అన్ని జిల్లాలలోకంటే యిది ఎక్కువ. ఆదిలాబాద్ జిల్లాలో జనాభా సాంద్రత 79 మంది అన్నిటిలోకంటె యిది తక్కువ.

* రాష్ట్రంలో తలసరి సగటు ఆదాయం (1960-61 నాటి ధరలు) మొదటి ప్రణాళిక అంతానికి రూ. 281లు, రెండవ ప్రణాళిక అంతానికి రూ.306లు మూడవ ప్రణాళిక అంతానికి రూ. 333లు చొప్పున ఉంది. నాలుగవ ప్రణాళిక ముగింపు నాటికి తలసరి సగటున ఆదాయం రూ. 430 లకు పెరుగుతుంది.

* రాష్ట్రంలో 1,000 అడుగుల లోతు మేరలో సుమారు 1,000 మిలియన్ టన్నులబొగ్గు నిక్షేపాలు వున్నాయి. 2,000 అడుగుల లోతు మేరలో 1,320 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు లభించగలవని అంచనా.

* భారత దేశంలో, బారైటీస్ వుత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దే అగ్రస్థానం. దేశంలో వుత్పత్తి అయ్యే బారైటీస్ లో 90 శాతం మొదలు 95 శాతం వరకు రాష్ట్రంలో వుత్పత్తి అవుతున్నది.

* అభ్రకం వుత్పత్తిలో బీహారు, రాజస్తాన్ రాష్ట్రాల తరువాతి స్థానం ఆంధ్రప్రదేశ్ ది.

